వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 17 సంచిక : 4 హైదరాబాద్ 213 ఏప్రిల్ 2019 పేజీలు : 68 రు. 25

- పార్లమెంట్ ఎన్నికలు - పరిశీలనాంశాలు
- అటవీ హక్కుల చట్టంపై సుప్రీంకోర్టు తీర్పు
- మోదీ ఐదేళ్ల పాలన మదింపు
- సమాచార చౌర్యంలో దోషులెవరు?
- మధ్యవర్తిత్వం కోర్టుల పనేనా?
- వందేళ్ల జలియన్‌వాలాబాగ్
- వెనిజులాలో అమెరికా జోక్యం

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ – సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రరాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం – ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే	రైతు సేవా సమితి	100
భారతదేశంలో ఉత్పత్తి విధానం– ఉత్పత్తి సంబంధాలు	విరసం	20
ప్రపంచీకరణ ప్రాభవంలో...	విద్యాభూషణ్	120
మార్క్స్ రాసిన పెట్టుబడి	డేవిడ్ స్మిత్, ఫిల్ ఇవాన్స్	200

తెలంగాణ

తెలంగాణార్థం	ఎన్. వేణుగోపాల్	150
లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295
ఎవరికోసం మల్లన్నసాగర్?	తెలంగాణ ఆత్మగౌరవ వేదిక	20
మానని గాయాలు	తెలంగాణ విద్యావంతుల వేదిక	100

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ – పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	120
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	150
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం–మతం

భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
పంచతంత్రం	బొజ్జా తారకం	200
కులం వర్గం	బొజ్జా తారకం	60
చరిత్ర మార్చిన మనిషి	బొజ్జా తారకం	150
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	150
గులాంగిరి	జోతిబా పూలే	60
కుల నిర్మూలన	అంబేద్కర్	60
శూద్రులు – ఆర్యులు	అంబేద్కర్	20
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	30
వెలివాడల వెతలు	కుల నిర్మూలన ప్రచురణ	100

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	విరసం ప్రచురణ	125
మార్క్స్ పెట్టుబడి రచనా క్రమం	విరసం ప్రచురణ	50
మార్క్సిస్టు నిఘంటువు–1	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	350
మార్క్సిస్టు పదకోశం	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	50

చరిత్ర–జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	70
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కొశాంబి	20
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	100
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్సన్	150
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	120
చేగువేరా	కాత్యాయని	120
మహాత్మా జ్యోతిరావ్ పూలే	ధనుంజయ్ కీర్	100
ఛత్రపతి సాహూ మహారాజ్	కాత్యాయని	40
తలపుల తోవ	షౌకత్ కైఫీ	100
ఏడవకు బిడ్డా...	గుగి వా థియాంగో	150
కశ్మీర్‌లో నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	170

సాహిత్య విమర్శ – వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం–1	విరసం ప్రచురణ	270
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ డిటెన్యూ డైరీ	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	170
కెవిఆర్ కవిత్వం	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	200
అల్లంరాజయ్య కథలు పరిశీలన	ఎస్. నీలాదేవి	75
కొలిమి రవ్వలు	గౌరి లంకేశ్ రచనలు	150
సహచరులు	వరవరరావు	100

విప్లవోద్యమం

మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్–1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్–2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
మావో రచనలు – 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు – 2	విరసం ప్రచురణ	220
జనతన రాజ్యం	పాణి	300
30 ఇయర్స్ దండకారణ్య కల్చరల్ మూవ్‌మెంట్	ఎన్.ఎం. చేతనా	250
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
మలుపు తిప్పిన మహా ఉద్యమం	విరసం ప్రచురణ	60
బోల్షివిక్ పార్టీ చరిత్ర	విరసం ప్రచురణ	250
ఆవాజ్	విరసం ప్రచురణ	65
మెరిసే అక్షరాల వెనుక	సృజన ప్రచురణ	30
నక్సల్బరీ ఒక ఊరు మాత్రమే కాదు	విరసం ప్రచురణ	80
పికెఎం ప్రభాకర్ రచనలు	విరసం ప్రచురణ	70
కార్మికవర్గ విప్లవం-విప్లవ ద్రోహి కాట్స్కీ	విరసం ప్రచురణ	60
భీమా కోరేగాం 12 – వివి	స్వేచ్ఛా సాహితి ప్రచురణ	50

కథ – నవల

దండకారణ్య కథలు (2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	150
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి – మూడెద్దులు	బొజ్జా తారకం	25
దళితులు – రాజ్యం	బొజ్జాతారకం	25
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	120
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180
అభాగ్యజీవులు	ఫ్రాంజ్ ఫనాన్	170
నిషిధ	నల్లూరి రుక్మిణి	180
మాటిగరి	గుగి వా థియోంగో	120
మట్టికాళ్ల మహారాక్షసి	గుగి వా థియోంగో	200
బందీ	గుగి వా థియోంగో	200
నేను చావును నిరాకరిస్తున్నాను	జి.ఎన్. సాయిబాబా	125

డివిడి

వీక్షణం (2003 – 2012)	200
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125
'ఓయ్'ద్ధకాండ	100

వీక్షణం, మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

213

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్ 2019
సంపుటి : 17
సంచిక : 4

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

పాఠకుల వీక్షణం

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థికసహాయం అందించిన ఆర్. లక్ష్మి, కాకినాడ - రు. 1000, శ్రేయోభిలాషులు, వరంగల్ - రు. 10,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం మార్చ్ సంచికలో కేశవ్ రాసిన 'రైతుకు ప్రయోజనం లేని రైతు స్కీములు'లో భారతదేశంలో ఉన్న రైతుల దైన్యస్థితిని చక్కగా వివరించారు. అలానే భారత ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ చేపట్టిన రైతు పథకాల ద్వారా రైతుకు ఏం పెద్ద ప్రయోజనం లేదని విశ్లేషించడం బాగుంది. ఈ పథకాల్లో ఉన్న ఇన్స్యూరెన్స్, ఇతర అంశాలు ఎంత మోసపూరితంగా ఉంటాయో తెలియజేయడం బాగుంది. రైతులకు సంబంధించిన ఎన్నో విషయాలు ఈ వ్యాసం పొడువునా కనిపిస్తున్నాయి. అందులో ఆవేదన కనిపిస్తూంది. వ్యవసాయానికీ, ఇతర పరిశ్రమలకూ మధ్య గల బేధాన్ని చూపించడం బాగుంది. వ్యవసాయం కూడా వ్యాపారమైపోయిందని వాపోవడం కనిపిస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతీదీ వ్యాపారమే. సరుకుగా మారని వస్తువంటూ ఏదీ లేదు, సేవ కూడా లేదు. ఎన్నో ఏళ్ల కిందటే ఆ పని జరిగిపోయింది. కాకపోతే, ఇక రెండో మూడో అడుగుగా పెట్టుబడి కేంద్రీకరణ మాత్రమే జరుగుతోంది. ప్రతీదీ – సరుకుగా మారిన ప్రతీదీ బడా పెట్టుబడిదారుడి చేతిల్లోకి చేరవలసిందే. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థకు ఒకానొక లక్షణం.

అలానే, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేయడమంటే, నేటి పెట్టుబడిదారీ ప్రభుత్వ స్వభావం అర్థం చేసుకున్నట్టు లేదు. ఈ రైతు పథకాలన్నీ కేవలం బయటకు చూపించే కపట కంటితుడుపు చర్యలు తప్ప మరేమీ కాదు. సోకాల్డ్ ప్రజాసామ్యంలో ప్రభుత్వాలు అధికారంలో ఉండాలంటే, ప్రజల్ని మభ్యపెట్టడానికి ఇలాంటి చర్యలు తప్పవు. ఈ పథకాలు అనేవి రైతులను, ముఖ్యంగా పేద రైతులను వాటి కోసం చూసే భిక్షగాళ్లుగా చేయడమే. అంతకు మించి మరేమీ లేదు. రైతులు తిరగబడకుండా వారిని శాంతింపజేసి ఉంచడానికే ఈ పథకాలన్నీనూ. ఈ తరుణంలో రైతులు పథకాల కోసం పడిగాపులు పడడం కన్నా, సంఘటితమై తమ హక్కుల కోసం పోరాటం చేయడం అవసరం. 'దున్నేవానిదే భూమి' అన్న నగ్నసత్యం రైతులు అర్థం చేసుకోవాలి. భూమి కోసం, తమ మంచి జీవనం కోసం పోరాడాలి, కుల, మత, జాతి, వర్ణ బేధాలను పక్కన పెట్టి. శ్రామిక రైతు వర్గం ఐక్యమై తమ జీవించే హక్కు కోసం ప్రభుత్వాలను నిలదీయాలి. ఈ క్లిష్ట పరిస్థితుల్లో భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన, ప్రపంచ నలుమూలల్లో జరిగిన రైతు విప్లవాలను రైతులను సంఘటిత పరచడానికీ, ఉద్యమ స్ఫూర్తిని కలిగించడానికీ అందుబాటులోకి తీసుకురావాలి, రైతు మిత్రులంతా.

– ఆర్.కె. వెంకట్
బరోడా

వీక్షణం సంచికలో వస్తున్న రచనలు సమకాలిక రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై లోతైన విశ్లేషణతో కూడి వస్తున్నాయి. మార్చ్ సంచికలో వచ్చిన 'కశ్మీరీలపై దాడులు ఉగ్రవాదానికి దారులు' వ్యాసంలో రచయిత పాలక వర్గాలు ఉగ్రవాదం పేరుతో ఎలాంటి కుట్రాజకీయాలు చేస్తారో సంక్షిప్తంగా తెలియజేశారు. అలాగే 'యజ్ఞాలు, యాగాలు ఎవరి కోసం?' వ్యాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజల సొమ్ముతో తన నమ్మకాలను, విశ్వాసాలను ఏ విధంగా ప్రజల మీద రుద్దుతున్నారో, వాటి వెనుక ఎలాంటి ఓటు బ్యాంకు రాజకీయాలు ఉన్నాయో క్షుణ్ణంగా వివరించారు. అలాగే ఇలాంటి యజ్ఞాలు, యాగాలు ప్రజల సొమ్ముతో చేసే అధికారం కెసిఆర్‌కు కాని, పాలక వర్గాలకు లేదని సూటిగా ప్రశ్నించడం చాలా బాగుంది.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం ఫిబ్రవరి సంచికలో 'బడుగు విద్యార్థులపై కుల, మత వివక్ష' అనే వ్యాసంలో రచయిత రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కుల వివక్షతను, మత వివక్షతను సాంఘిక సంక్షేమ హాస్టళ్లో చదువుకునే విద్యార్థులపై ఎలా అమలు చేస్తున్నారో చాలా వివరంగా వివరించారు. ఓటు బ్యాంకు పథకాలకు పెడుతున్న ఖర్చు, సంక్షేమ హాస్టళ్లకు నిధులు ఎందుకు కేటాయించడం లేదో కారణాలు క్షుణ్ణంగా విశ్లేషించారు. ప్రతి సంవత్సరం ఎంతమంది విద్యార్థులు హాస్టళ్లో వసతులు బాగలేక ఇంటికి పారిపోతున్నారో లెక్కలతో సహా తెలియజేశారు. ప్రభుత్వాల వివక్షత వల్ల బలహీన వర్గాల విద్యార్థులు ఏ విధంగా విద్యకు దూరమవుతున్నారో కూడ తెలియజేశారు.

– సురేష్
నిజామాబాద్

వీక్షణం మార్చ్ సంచికలో అచ్చయిన 'కొనసాగుతున్న కుల హత్యల పరంపర' వ్యాసంలో రచయిత కుల హత్యలను ప్రోత్సహిస్తున్నది అగ్రకుల, బ్రాహ్మణీయ, భూస్వామ్య, పితృస్వామ్య ఆదిపత్య వర్గాలనే వాస్తవాన్ని బహిర్గతపరిచారు. కుల నిర్మూలనను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వ పెద్దలు యజ్ఞాలు, యాగాల ద్వారా కుల వ్యవస్థను నిలిపివుంచుతున్నారు. కులాంతర వివాహాలు జరిగి వారికి ప్రాణ భయం ఉందని చెప్పినా కూడా పోలీసులు అగ్రకుల, ఆస్తిపర వర్గాలకే వంతపాడుతున్నారనే విషయాన్ని సూటిగా చెప్పారు. అట్లాగే 'ఆంధ్రప్రదేశ్‌లో చుక్కల భూముల కబ్జా' వ్యాసంలో రచయిత నాయకులు తమ అధికారాన్ని ఉపయోగించుకొని పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను ఎలా కబ్జా చేస్తున్నారో వివరించారు. ఈ నాడు నూటికి నలభై శాతం భూమిలేని నిరుపేదలున్నారు. వారికి భూమి పంచాల్సింది పోయి అధికారం అడ్డంబెట్టుకొని కబ్జాలకు పాల్పడుతున్న నాయకుల్ని ప్రజల ముందు నిలదీయాలి. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను, కుల హత్యల పట్ల సమాజాన్ని చైతన్య పరిచిన రచయితలిరువురికి, అచ్చువేసిన వీక్షణంకు కృతజ్ఞతలు...

– తిరుపతి
హుస్నాబాద్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

సానుకూల వోటా? ప్రతికూల వోటా? బహిష్కరణా?

రెండు తెలుగు రాష్ట్రాలలోను ఈ పత్రిక అందిన వారంలో పోలింగ్ జరుగుతుంది. తెలంగాణలో లోకసభ సభ్యులను ఎన్నుకునేందుకు, ఆంధ్రప్రదేశ్ లోనైతే లోకసభ సభ్యులతో పాటు శాసనసభ్యులను ఎన్నుకునేందుకు ప్రజలకు అవకాశం వస్తుంది. ఎన్నికల ప్రక్రియ గురించి ఎన్ని అభిప్రాయాలున్నా, ఎన్నికలు తమ బతుకులనేమీ మార్చజాలవని ఏడు దశాబ్దాల అనుభవంతో సంపూర్ణ అవగాహన ఉన్నా వోటు వేయక తప్పని స్థితిలో చాల మంది ఉంటారు. మొహమాటానికో, తప్పించుకోలేని ఆనవాయితీగానో, ప్రలోభాలకో, కుల మత ప్రాంత దురభిమానాలతోనో, ఓటు వేయకపోతే తమకు గుర్తింపు ఉండదనే ఉద్దేశంతోనో, ఏదో ఒక కారణంతో అత్యధిక సంఖ్యాక ప్రజలు వోటు వేస్తూనే ఉన్నారు. వోటు హక్కు ఉన్నవారిలో యాభై అరవై శాతానికి మించి వోట్లు వేస్తున్నారనుకుంటే, అందులోనూ ఇష్టంగా, స్వేచ్ఛగా వోటు వేస్తున్నవారు పావు వంతు కూడ ఉండరు. నిజానికి ఎన్నికల్లో తమను వోట్లు అడగవస్తున్న ప్రతి ఒక్కరూ ఎటువంటి కబ్జాదారులో, ఎంత అవినీతిపరులో, ఎంత నేరచరితులో, ఎంత దుర్మార్గులో, ఎంత ప్రజావ్యతిరేకులో ఆ చరిత్రంతా దాదాపు అందరు వోటర్లకూ తెలిసే ఉంటుంది. అయినా ఒక గజదొంగకు వ్యతిరేకంగా మరొక గజదొంగను, ఒక బందిపోటుకు వ్యతిరేకంగా మరొక బందిపోటును ఎన్నుకోక తప్పని స్థితిలోనే వోటర్లున్నారు. అసలు ఏ ఒక్క అభ్యర్థీ సరైన వారు కాదని, తనకు ఏ ఒక్కరూ నచ్చలేదని అభిప్రాయం (నన్ ఆఫ్ ది అబోవ్ – నోటా) చెప్పే హక్కు కూడ వోటర్‌కు వచ్చింది గాని దానికి కేవలం సైద్ధాంతికమైన విలువే తప్ప ఆచరణాత్మక విలువ లేదు. ఒక నియోజకవర్గంలో నోటాకే అతి ఎక్కువ వోట్లు పడితే ఏమవుతుందో ఇప్పటికి తేలలేదు. పోటీ చేస్తున్న అభ్యర్థులందరికీ తలా పది శాతం కన్న తక్కువ వోట్లు వచ్చినా, వారిలో అందరికన్న ఒక్క వోటు ఎక్కువ వచ్చిన అభ్యర్థి ఎన్నికై ప్రజాప్రతినిధిగా నమోదయ్యే ఎన్నికల ప్రక్రియ మనది. ఇటువంటి ఎన్నికల ప్రక్రియ అమలులో ఉన్నప్పుడు ప్రజల ముందు, వోటర్ల ముందు మూడే అవకాశాలుంటాయి. పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఏ ఒక్కరి పట్లనో సానుకూలంగా వోటు వేయడం ఒక అవకాశం. అధికారపక్ష అభ్యర్థి పట్ల ప్రతికూలత వల్ల మరొక అభ్యర్థికి అనుకూలంగా వోటు వేయడం రెండో అవకాశం. అసలు మొత్తంగా ఎన్నికల ప్రక్రియను బహిష్కరించడం మూడో అవకాశం.

సానుకూల వోటు సందర్భంలో అభ్యర్థి అధికారపక్షానికి చెందినవారూ కావచ్చు, ప్రతిపక్షానికి చెందినవారూ కావచ్చు, స్వతంత్రులూ కావచ్చు. ఈ సానుకూల అవకాశం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజుల్లో ఎక్కువగా ఉండేదేమో గాని, ఎన్నికల అనుభవం గడిస్తున్నకొద్దీ సానుకూల వోటు పాత్ర తగ్గిపోతూ వచ్చింది. అందులోనూ అధికార పక్ష అభ్యర్థి పట్ల సానుకూల వోటు మరింతగా దిగజారుతూ వచ్చి దాదాపు అదృశ్యమయ్యే స్థితికి చేరింది. ఇలా సానుకూల వోటు లేకపోవడానికి, ప్రతికూలత ఉండడానికి ఆంటీ ఇంకంబెన్సీ అనే పారిభాషిక పదం కూడ తయారయింది. ప్రతిపక్ష అభ్యర్థి పట్లనో, అంతకు ముందు ఒకటి రెండు సార్లు ఓడిపోయిన అభ్యర్థి పట్లనో సానుకూల వోటు ఉండవచ్చు గాని మన రాజకీయ పక్షాలన్నిటిలో, రాజకీయ నాయకులలో పెరిగిన అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ప్రజాసేవా దృక్పథం మచ్చుకైనా లేకపోవడం వంటి కారణాల వల్ల ఉండగల సానుకూలత కూడ లేకుండా పోతున్నది.

ఇక ప్రత్యర్థి పట్ల ప్రతికూలతతో ఒక అభ్యర్థికి వోటు వేయడం అనే ప్రతికూల వోటు పాత్ర మన ఎన్నికలలో ఇటీవలి కాలంలో చాల పెరిగిపోతున్నది. గత రెండు మూడు దశాబ్దాలుగా గెలిచిన అభ్యర్థులను, పార్టీలను జాగ్రత్తగా పరిశీలిస్తే వారి గెలుపుకు ప్రధాన కారణం వారి ప్రత్యర్థుల పట్ల ప్రజల్లో ఉన్న ప్రతికూలత మాత్రమేనని అర్థమవుతుంది. అధికారంలో ఉన్నవారి పట్ల తమ ఆగ్రహాన్ని ప్రదర్శించడానికి వచ్చిన ఏకైక అవకాశంగా ప్రజలు ఈ ప్రతికూల వోటును వాడుకుంటున్నారు. కాంగ్రెస్ పట్ల ప్రతికూలతతో భారతీయ జనతా పార్టీని, భారతీయ జనతా పార్టీ పట్ల ప్రతికూలతతో కాంగ్రెస్ ను గెలిపించే పద్ధతి గత ఇరవై ఏళ్లుగా రాష్ట్రాలలోను, కేంద్రంలోను అమలవుతున్నది.

ఈ ఎన్నికల ప్రక్రియ మౌలికంగానే చెల్లదని, ప్రజాప్రయోజనకరమైనది కాదని, ఈ ఎన్నికలను బహిష్కరించి ప్రత్యామ్నాయ వ్యవస్థ నిర్మాణానికి ప్రయత్నించాలని యాభై ఏళ్ల కింద నక్సల్బరీ పంథా ఒక వాదన ముందుకు తెచ్చింది గాని ఆ వాదన బలపడవలసినంత బలపడలేదు. ఎన్నికల బహిష్కరణ నిజానికి ఒంటరి నినాదం కాదు, అది ఒక చైతన్యంగా, అంతకు మించిన ప్రజా సమీకరణ, ఉద్యమ నిర్మాణంతో కలిసి సాగవలసి ఉంటుంది. నిజానికి బహిష్కరణకు ఒక రూపొందవలసిన చైతన్యంగా, అవగాహనగా ఉన్న స్థాయి నిర్దిష్ట ఆచరణగా ఉండదు. బహిష్కరణ జరగకుండా చూడడానికి, ఆ చైతన్యం ప్రజల్లో ఇంకకుండా ఉండడానికి పాలకవర్గాలు సామ, దాన, భేద, దండోపాయాలన్నీ ఉపయోగిస్తాయి. అది పెద్ద ఎత్తున ఆచరణగా వచ్చినచోట్ల, వచ్చిన సందర్భాల్లో కూడ, అస్సాంలో, కశ్మీర్ లో మూడు శాతం పోలింగ్ తో, అంటే తొంబై ఏడు శాతం బహిష్కరణతో కూడ ఎన్నికల ఫలితాలు సజావుగా ప్రకటించారు. కనుక బహిష్కరణ ఎప్పటికైనా, ఎన్నికల ప్రక్రియ కూలిపోయే, అంటే వ్యవస్థ కూలిపోయే చివరి క్షణాల్లోనైనా సంపూర్ణ విజయం సాధిస్తుందని చెప్పడం కుదరదు. అందువల్ల అది ఒక ప్రత్యామ్నాయ ఆలోచనే తప్ప, ఆదర్శమే తప్ప తక్షణ ఆచరణ కావడం కష్టం.

నరేంద్ర మోడీ నాయకత్వంలోని సంఘ్ పరివార్ పాలనలో ఐదు సంవత్సరాల్లో దేశంలో అమలైన దుర్మార్గం వల్ల సానుకూల వోటు ఉండడం అసాధ్యం. దేశభక్తి, పొరుగుదేశంతో యుద్ధం, రామాలయ నిర్మాణం వంటి సెంటిమెంట్లు సానుకూల వోటు దిశగా కొంత పని చేయవచ్చు గాని అవే సంపూర్ణ విజయం సాధిస్తాయని చెప్పలేం. ఈ పాలన మీద ప్రతికూల వోటు కాంగ్రెస్ అనుకూల వోటుగా మారవచ్చు గాని ఎన్‌డిఎ పాలనను వ్యతిరేకించే ఏ ఒక్క ప్రమాణంతో చూసినా యుపిఎ పాలన మెరుగేమీ కాదు. కనుక భారతీయ జనతా పార్టీకి సానుకూల వోటు లేని, కాంగ్రెస్ కు ప్రతికూల వోటు వల్ల లాభం చేకూరని ఈ గందరగోళపు క్లిష్ట స్థితిని సమాజం ఎలా అధిగమిస్తుందో చూడవలసే ఉంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

నిన్ను మించిన హిందువున్నడా?

తాగినోని నోట నిజం తన్నుకుంట వస్తాదన్నా అప్పున్నా తనా మనా అని పాత పాటుండె. తాగితె తలకెట్ల ఎక్కుతదో పెత్తనం చేతులుంటె గుడ గట్లనే తలకెక్కుతదది గద. అంటె తాగుడన్నా సర్కారన్నా ఒకటేనన్న మాట. అట్ల సర్కారు చేతులున్న దొర, అది గుడ రాచరికం అనుకుంటున్న దొర, పూర్తిగ తలకెక్కినట్టు మట్లాడుతున్నడు. ఆయినె నోట్ల నించి నిజాలు తన్నుకుంట వస్తానయి. మొన్ననె వోట్లయిపోయి ఎనబై మంది జమైరా, ఇంకో ఇరవై మందిని గొని బుట్టల కమ్మేశెనా, ఇగ దొరకు ఆగుతలేదు. మల్ల వోట్లు గుడ వచ్చి ఎక్కడబడితె అక్కడ ముచ్చటజెప్పె పని గుడ బడె. పది పదహారు చోట్ల ముచ్చట జెప్పిండు. ఏమాటకామాట జెప్పాలె, మాదండి ముచ్చట జెప్తడు మా దొర. అవన్ని మల్ల చెప్పుటానికి మారె, కుదరది గని, ఒక్క ముచ్చట మాత్రం జెప్త. మా దొర కరినగురంల వోట్ల మీటింగు పెట్టిండు. అబ్బబ్బ ఏం జెప్పిండనుకున్నవు. ఢిల్లి పొయి మోడీ సాబును కలిశిండట. అగ్గి మీద గుగ్గిలమై మాట్లాడిండట. మస్తు కోపానికొచ్చిండట. ఇగ కొట్టలె, అంత కోపానికొచ్చిన అన్నడు. మారె, నేను కల్పిచ్చినవి గాదు, దొర నివ్వద్దిగా అన్నదె. మోడీ సాబు మీద అంత కోపమున్నదా, అదంతా ఉల్లెక్కాల, నేను తిట్టినట్టు జేస్త నువ్వు కోపం జేసినట్టు జెయ్యి అని ఇద్దరు బదులు జెప్పుకున్నరా మీకే తెలుసు బాంచెన్. అక్కడితోటి ఆగలే. మోడీ అట దొరనేదో అన్నడట. ఆయినె యాగాలకు బెట్టినంత టైం ప్రజలకు పెడ్తడా అన్నడట. దాని మీద మా దొర ఇంకొంచెం గుస్స అయిపోయి, బరాబర్ యాగాలు జేస్త. అసల్ నేను జేశినన్ని యాగాలు జేశినోడు ఇంకెవడన్న ఉన్నడా, అసలు నిన్ను మించిన హిందువును నేనే. నికార్సయిన హిందువును నేనే అన్నడు. అబ్బ గుస్సల్లో యాది మరిచో నిజం జెప్పినవు దొరా. నిజంగ మోడీని మించిన మోడీవి నువ్వు. యోగో ఆయినెవరో ముఖ్యమంత్రి అయిండు గద, ఉమా భారతి గుడ ముఖ్యమంత్రి అయింది గద. వాండ్లు గుడ ఇంత హిందూ రాజ్జెం నడుపలేదు బాంచెన్. రాంగనె రాంగనె దొంగ ఎన్ కౌంటర్ల పడుచు పడుచు ముస్లిం పోరల పిడాత జంపితివి. అటు కాంగ్రెస్ గాదు ఇటు మోడీ గాదు అనుకుంటనె మోడీ దిక్కె తిరిగితివి. దేశం మొత్తం మీదనే మోడీ తప్పుడు పనులను అందరికంటె ముందుగాల జైజై అన్నోనివి నువ్వేనైతివి. పెద్ద నోట్ల రద్దు అని ఆయననంగనె, అది జనం కొంప ముంచుతది అని మన గల్లా మంత్రి మాట ఇంక ఎల్లక ముందె, అట్లెట్లయితది, ఇంత మంచి పని ఇంకాడ్నన్న ఉంటదా అని తోడు పోతివి. నోట్లు పోయి జనం అరిగోస పడ్తాంటె పైసలెందుకు దండుగ, మిషిన్లుండంగ అని పెగ్గెలు పలికితివి. ఇగ అదట్లుంచు, అదేందో నాకు నోరు తిర్గది గని, అన్ని సౌదల మీద రకం పెంచుత, పిరం జేస్త అని మోడీ అనంగనె, అందరి కంటె ముందర, ఆదివారం నాడు అసెంబ్లిని కూసోబెట్టి మోడీ చేసిన పని మంచిది అని తీరుమానం జేపిత్తివి. మోడీ సైనికులు ఆవు పేరు జెప్పి మనుషులను జంపుతాంటె నోరిప్పకపోతివి, ఎదురు మాట్లాడినోళ్లను కొడుతాంటె, చంపుతాంటె, జైల్లల్ల నూకుతాంటె నోరిప్పకపోవుడు అట్లపెట్టు, నువు గుడ ఓ చెయ్యేస్తివి. ఎన్నడన్న మోడీ నువ్వు వేరు వేరు అనుకుంటిమా బాంచెన్. హిందువులంటె అవతారాలను నమ్మాలె గద. ఆడ మోడీ అవతారమెత్తినవు, ఈడ మా దొర అవతారమెత్తినవు. గోడమీదున్న, వాడు లేడు, వీడు లేడు, నాకు పదహారిస్తే నూటరవై జేత్త, మనదే ఢిల్లీ సర్కారు అంటానవు గాని, రేపు గోడ అటే దునుకుతవని మాకు తెల్వదా బాంచెన్. ఈ అవతారమైతేంది, ఆ అవతారమైతేంది అంత మాయే గద. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

ఏ రాజైతేమి పళ్లూడగొట్టడానికి...

తమ ప్రతినిధులుగా, శాసనసభ్యులుగా ఎవరు ఉండాలో, రానున్న ఐదేళ్ల కొరకు తమను ఎవరు పాలించాలో నిర్ణయించే అవకాశం ఆంధ్రప్రదేశ్ ప్రజల ముందుకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తొమ్మిది సంవత్సరాలు, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఐదు సంవత్సరాలు పాలన నడిపిన చంద్రబాబు నాయుడు తెలుగుదేశం ఒక పక్కనా, ఒక ముఖ్యమంత్రి కొడుకు అనే అర్హత తప్ప పాలనానుభవం ఏమీలేని జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్‌సిపి ఒక పక్కనా ఎదురుబొదురుగా నిలిచాయి. పవన్ కళ్యాణ్ జనసేన అనే మరొక పక్షమూ దానికి బహుజన్ సమాజ్ పార్టీ, వామపక్షాల మద్దతూ సాగుతున్నది గాని అది చంద్రబాబు నాయుడుకు బేనామీ అని ప్రచారం కూడ ఉంది. చంద్రబాబు పాలనా విధానాల వల్ల అసంతృప్తితో ఉన్న వివిధ ప్రజాసమూహాలు వ్యతిరేక వోటు వేస్తే అది జగన్‌కు లాభిస్తుందని, అయినా ఆ ప్రభుత్వ వ్యతిరేక వోటును చీల్చి, తెలుగుదేశంకు మేలు చేయడానికే పవన్ కళ్యాణ్‌ను రంగం మీద ప్రవేశపెట్టారని కూడ వార్తలు వినబడు తున్నాయి. కొత్తరాష్ట్రంగా కొత్త రాజధాని, హైకోర్టు, మౌలిక సౌకర్యాల నిర్మాణాలకు వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తుండడం వల్ల రియల్ ఎస్టేట్, కాంట్రాక్టర్, కార్పొరేట్, వ్యాపార రంగాల ప్రభావం ఈ ఎన్నికల మీద చాల ఎక్కువగా ఉన్నది. కులం పాత్ర, డబ్బు పాత్ర కూడ ఎక్కువగానే ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ప్రభావాలు ఏమైన ప్పటికీ, చారిత్రకంగా వచ్చిన పాత సమస్యలతోనూ, ఈ ఐదేళ్ల పాలనవల్ల తలెత్తిన కొత్త సమస్యలతోనూ అతలాకుతలమవుతున్న ఆంధ్రప్రదేశ్ సమాజం నిజంగా స్వేచ్ఛగా, సక్రమంగా తన ప్రతినిధులను ఎన్నుకోదలచుకున్నా ఆ అవకాశం ఉందా అనేది అసలు సమస్య. అవినీతికీ, ఆశ్రిత పక్షపాతానికీ, కార్పొరేట్ దళారీతనానికీ, ప్రపంచీకరణ భావజాలంలో ఓలలాడడానికీ మారు పేరు అయిన చంద్రబాబు నాయుడును వద్దని అనుకుంటే ప్రజల ముందు మిగిలే ప్రత్యామ్నాయం జగన్. తండ్రి ముఖ్యమంత్రిత్వాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగేతర శక్తిగా ఎదిగి అప్పటినుంచే తన అవినీతి సామ్రాజ్యం ప్రారంభించి విస్తరించిన ఘన చరిత్ర ఆయనది. ఇక మూడో ప్రత్యామ్నాయంగా కనబడుతున్న పవన్ కళ్యాణ్ మాట, చేత ఇప్పటికైతే అనుమానాస్పదంగానే ఉన్నాయి. అక్రమ వ్యాపార నిలయంగా మారిన సినిమా రంగ అనుభవంతో, రాజకీయ సైద్ధాంతిక దివాళాకోరుతనంతో కనీస ప్రజా ప్రయోజనకర పాలన అందించగలడా అనుమానమే. ఒక్కమాటలో చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ ప్రజల ముందర మూడు రాళ్లున్నాయి, ఏ రాయైతేనేమి పళ్లూడగొట్టుకోవడానికి అనే స్థితి ఉంది. అసలు ఏ రాయైతే అని కూడ కాదు, ఏ రాజైతే అనాలి. ఎందుకంటే, ఇది ప్రజాస్వామ్యమని, తాము ప్రజల ప్రతినిధులుగా పాలన నిర్వహిస్తున్నామని, ప్రజా ప్రయోజనాల కోసమే పాలన సాగించాలని కనీస మౌలిక అవగాహన లేని వ్యక్తులూ పార్టీలూ ఇవాళ పాలకులమవుతామని ప్రజల ముందు నిలబడ్డారు. అటువంటప్పుడు జెండాలు ఏవైనా, పేర్లు ఏవైనా, పలికే నినాదాలేవైనా ప్రజలకు ఒరగబెట్టేదేమీ ఉండదు. ఆ ఎరుకతో నిరంతర జాగరూకత వహించడమే ప్రజలకు మిగిలిన ఏకైక మార్గం. వీ

న్యూజిలాండ్‌లో శ్వేతజాతి ఉన్మాదుల కాల్పులు

- ఎ. నర్సింహారెడ్డి

న్యూజిలాండ్ కాల్పుల ఘాతుకం ప్రపంచంలో విస్తరిస్తున్న విద్వేషానికి నిదర్శనం. ట్రంప్ రేపిన శ్వేత జాత్యహంకార ఉన్మాదానికి పరాకాష్ఠ. ప్రపంచం కుగ్రామంగా మారిందని బాకాలూదిన వారే నేడు వలసల పట్ల వ్యతిరేకతను రెచ్చగొడుతున్న తీరుకు ఒక ప్రతీక. ప్రశాంతతకు మారుపేరైన న్యూజిలాండ్‌లో జనవరి 15న క్రైస్ట్ చర్చ్ నగరంలోని అల్‌నూర్ మసీదులో అస్ట్రేలియాకు చెందిన బ్రెంటన్ టారంట్ కాల్పులకు తెగబడి 30 మంది ప్రాణాలు బలిగొన్నాడు. మరో ఉన్మాది లినేవుడ్ మసీద్‌లో కాల్పులు జరుపగా 9 మంది మరణించారు. రెండు ఘటనల్లో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. బ్రెంటన్ టారంట్ ఈ ఘాతుకాన్ని యావత్ ప్రపంచం చూడాలన్న లక్ష్యంతో వీడియో తీసి ఫేస్‌బుక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం దిగ్భ్రాంతికరం. ఏదో ఆవేశంతోనో, ఉద్రేకంతోనో కాకుండా పక్కా ప్రణాళికతో ఈ దారుణానికి పాల్పడ్డారు. ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు సైతం వలసలు తప్పడం లేదని తెలియజేయడానికే న్యూజిలాండ్‌ను ఎంచుకున్నట్లు తెలిపాడు. ఈ ఘటనలకు వలసవాదులపై గూడుకట్టుకున్న వ్యతిరేకతే కారణమని న్యూజిలాండ్ ప్రధాని జసిండా ఆర్డెర్న్ పేర్కొంది. కాల్పులకు బాధ్యుడుగా ప్రకటించుకున్న బ్రెంటన్ టారంట్ ఘటనకు ముందు 74 పేజీల వలస వ్యతిరేక, జాతి విద్వేష ప్రణాళికను ట్విట్టర్‌లో విడుదల చేశాడు. దానికి 'గ్రేట్ రిప్లేస్‌మెంట్' అని పేరు పెట్టాడు. ప్రణాళికలో ముస్లింలపై విస్మయకరమైన వ్యాఖ్యలున్నాయి. అంతేకాదు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను, నార్వేలో 77 మందిని ఊచకోత కోసిన శ్వేతజాతి దురహంకారి అందర్ బ్రెహినిక్, బోస్నియన్ యుద్ధ నేరస్థుడు రాడోవన్ కారాడ్జిక్‌లు తనకు ఆదర్శమని అందులో ఆకాశానికెత్తారు.


ఆ ప్రణాళిక శ్వేతజాతియేతరులను దండయాత్రికులుగా, శ్వేత జాతి స్థానాన్ని దురాక్రమించే వారిగా చిత్రించింది. దీంతో తనకు ఫాసిస్టులతోనూ, శ్వేతజాత్యహంకారులతోనూ గల సంబంధాలను బయట పెట్టుకున్నాడు. మూడు దశాబ్దాలుగా అమెరికా, పశ్చిమ యూరప్ సామ్రాజ్యవాద దేశాలు పశ్చిమాసియాలో, ఉత్తరాఫ్రికాలో ముడిచమురు దోచుకోవడానికి చేపట్టిన యుద్ధాల మూలానే వలసలు పెరుగుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ లోపాలను కప్పి పుచ్చుకోవడానికి, ప్రపంచాధిపత్యాన్ని కొనసాగించడానికి అమెరికానే తీవ్రవాదాన్ని పెంచి పోషించింది.

ఇవాళ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉంది. నిరుద్యోగం పెరుగుతోంది. ఈ సమస్యకు మూలం వలసలేనని పాలకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జాత్యహంకారాన్ని పెంచుతున్నారు. అమెరికా ఏకపక్ష, ఆధిపత్య నిరంకుశ విధానాలే ప్రపంచంలో జాతి విద్వేషాలు, మత వైషమ్యాలు పెచ్చరిల్లడానికి దారి తీస్తున్నాయి. న్యూజిలాండ్ శాంతియుత దేశమే కావొచ్చుగానీ అది ఏ క్షణంలోనైనా భగ్నమయ్యేందుకు దారితీసే స్థితిగతులు అక్కడున్నాయి. మతం పేరిట ప్రబలుతున్న తీవ్రవాదం ఒకపక్కా, దాన్ని సాకుగా తీసుకుని విస్తరిస్తున్న శ్వేతజాతి దురహంకారం మరోపక్కా చుట్టుముడుతున్నాయి. అది తీవ్రవాదంగా పరిణమిస్తున్న జాడలు కనిపిస్తున్నా చాలా దేశాలు ఇంకా జాగ్రత్తలు తీసుకోవడం లేదు. పై పెచ్చు ట్రంప్ వంటివారు తమ రాజకీయ స్వప్రయోజనాలను ఆశించి అసహనాన్ని వ్యాప్తి చేస్తున్నారు. విద్వేష పూరితంగా మాట్లాడుతున్నారు. ఈ ఉన్మాదానికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని సంఘటితం చేయవలసి ఉంది. వీ

***

"కోడికి, పురుగుకి మధ్య ఐక్యత
కోడి కడుపులోనే జరుగుతుంది."


- హైతీ సామెత




మధ్యతరగతి ప్రజలకు ప్రాథమిక శత్రువు పెట్టుబడి .
పెట్టుబడితో రాజీ పడితే అది ఎప్పటికీ విముక్తికి దారిచూపదు.




❖ **అల్లరి అవంతిక** – ప్రశాంత్ పింగే – అనువాదం జి.వి.జి.కె. వేణు – మంచి పుస్తకం ప్రచురణలు – 96 పేజీలు, 1/8 డెమీ, రు. 60,




❖ **దోస్తులు చెప్పిన కథలు** – పెండెం జగదీశ్వర్ – బొమ్మలు కూరెళ్ళ శ్రీనివాస్ – మంచి పుస్తకం ప్రచురణలు – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 40,




❖ **చిన్ని–మిన్ను** – సంయుక్త అక్షరాలు లేని బాలల నవల – డా.యం. హరికిషన్ – బొమ్మలు చైతన్య – మంచి పుస్తకం ప్రచురణలు – 56 పేజీలు, 1/8 డెమీ, రు. 40, పై మూడు ప్రతులకు: మంచి పుస్తకం, ఇ.నెం. 12–13–439, స్ట్రీట్ నెం. 1, తార్నాక, సికిందరాబాద్ – 500017, ఫోన్: 9490746614




❖ **హిందూత్వ ఫాసిజం పుట్టుక, పెరుగుదల ఈ దేశ ప్రజలపై దాని ప్రభావం** – కుల నిర్మూలనా పోరాట సమితి (కెవిన్‌పిఎస్) ఆంధ్రప్రదేశ్ ప్రచురణ – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: దుడ్డు ప్రభాకర్, అజిత్ సింగ్ నగర్, 7వ లైను, విజయవాడ – 520 015, సెల్ : 99595 67818



❖ **పద్యభారతి** – ముత్యాల సరాల కవితా సంకలనం – పొరనంది శోభాదేవి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 222 పేజీలు, 1/8 డెమీ, రు. 99, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఫ్లాట్ నెం. 2, బ్లాక్–6, ఎంఐజి–11. ఎపిఎచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500044, ఫోన్ 040–27678430




❖ **నా రాజు కతలు** – జనపద గేయాలు – కమలేకర్ దాగోజీరావు – పాలమూరు కళావేదిక ప్రచురణ – 60 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: కమలేకర్ దాగోజీరావు, ఇ. నె. 4–80, రోడ్డు నెం. 6, భగీరథ కాలనీ, మహబూబ్‌నగర్ – 509001




❖ **పరామర్శ** – నక్క హరిక్రిష్ణ – రచనల చెరువు సాహిత్య వేదిక ప్రచురణ – 119 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: నక్క హరిక్రిష్ణ, ఇ.నెం. 1–37/2, గ్రామం: సింగన్నగూడ, మండలం : మలుగు, జిల్లా : సిద్దిపేట – 502336, ఫోన్ : 9948877662




❖ **లయతప్పిన గుండె** – కథల సంపుటి – యస్.డి.వి. అజీజ్ – యస్. అబ్దుల్ అజీజ్ ప్రచురణ – 108 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: యస్. అబ్దుల్ అజీజ్, ఇ. నెం. 46/634, బుధవారపేట, కర్నూలు – 518002, ఆంధ్రప్రదేశ్




❖ **తెలంగాణ** – సంపాదకులు ఆచార్య జి. అరుణకుమారి, డా. మల్లేగోడ గంగాప్రసాద్, కాకతీయుల నుండి అసఫ్ జాహిల వరకు – (చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం) – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 480 పేజీలు, 1/8 డెమీ, రు. 250,




❖ **చన్న బసవేశ్వరుని వచనములు** – షట్‌స్థల చక్రవర్తి – అనువాదం మఠం వీరయ్య – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 109 పేజీలు, 1/8 డెమీ, రు.45



❖ **తపతీ సంవరణము** – అద్దంకి గంగాధరకవి ప్రణీతము డా. పాటిబండ మాధవశర్మ – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 182 పేజీలు, 1/8 డెమీ, రు.80



❖ **గజల్ గీతికలు** – ప్రసిద్ధ ఉర్దూ కవుల గజళ్లకు తెలుగు అనువాదం – పటేలు అనంతయ్య – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 68 పేజీలు, 1/8 డెమీ, రు.30



❖ **ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రము** – సంపాదకులు: డా. సి.వి. రామచంద్రరావు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 132 పేజీలు, 1/8 డెమీ, రు.55 పై ఐదు ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్ – 500 004, ఫోన్: 040–29703142



❖ **గురి** – కథలు – మల్లిపురం జగదీశ్ – స్నేహకళా సాహితి ప్రచురణ – 196 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: మల్లిపురం జగదీశ్, ఎస్.ఎన్.పి. కాలనీ, రామాలయం లాస్ట్ లైన్, పార్వతీపురం, విజయనగరం – 535501, సెల్ : 9440104737



❖ **పగలే వెన్నెల** – నవల – చింతపట్ల సుదర్శన్ – హైదరాబాద్ పాతనగర రచయితల సంఘం ప్రచురణ – 112 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: చింతపట్ల సుదర్శన్, ఇ.నెం. 1–5–168, న్యూ మారుతీ నగర్, హైదరాబాద్ – 500060,



❖ **మార్క్సిజం మార్గం 3** – అక్కినేని చంద్రరావు – 104 పేజీలు, 1/8 డెమీ, రు. అమూల్యం, ప్రతులకు: అక్కినేని చంద్రరావు, ఇ. నెం. 40–6–3/2, రెండవ అతస్తు, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ రోడ్డు ఎదురుగా, మొగల్‌రాజపురం, విజయవాడ – 520 010, ఫోన్: 9441406331

2019 ఎన్నికలు - సాధారణాంశాలూ ప్రత్యేకాంశాలూ

రానున్న ఎన్నికల సందర్భంగా మొత్తంగా పార్లమెంటరీ ఎన్నికల సాధారణాంశాలు, 2019 ప్రత్యేకతలనూ వివరిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

పదిహేడో లోకసభకు 543 మంది సభ్యులను ఎన్నుకోవడానికి 2019 ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు విడతలుగా సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా పది లక్షల పోలింగ్ స్టేషన్లలో, ఇరవై నాలుగు లక్షల ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్లలో, తొంబై కోట్ల మంది వోటర్లు వోట్లు వేస్తారని అంచనా వేస్తున్నారు. అయితే, సాధారణంగా 50 శాతం నుంచి 70 శాతం పోలింగ్ మాత్రమే జరుగుతున్నది గనుక నలబై ఐదు కోట్ల నుంచి అరవై మూడు కోట్ల కంటె ఎక్కువ మంది ఎన్నికల్లో పాల్గొనకపోవచ్చు. మే 23న వోట్ల లెక్కింపు మొదలై ఆ రోజు సాయంత్రానికి ఏ పార్టీ, ఏ కూటమి ఎక్కువ స్థానాలు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పరచనున్నదో తేలిపోతుంది. ఈ పార్లమెంటు ఎన్నికలతో పాటే ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల శాసనసభలకు కూడ ఎన్నికలు జరుగుతున్నాయి.

"దేశం కోసం పోరాటం జరుగుతున్న ఈ 2019 ఎన్నికల్లో మోడీ సునామి సంభవిస్తుంద"ని, "ఇక ఆ తర్వాత దేశంలో ఎన్నికలే జరగవ"ని, "అందువల్ల ఇవి దేశంలో జరగనున్న చిట్టచివరి ఎన్నికలు" అని భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యుడు సాక్షి మహరాజ్ బహిరంగ ప్రకటన చేసిన సందర్భంలో జరుగుతున్న ఈ ఎన్నికలకు చాల ప్రాధాన్యం ఉంది. ఎన్నికల్లో పాల్గొనేవారూ, ఎన్నికల వ్యవస్థను వ్యతిరేకించే వారూ, సాధారణంగా పార్లమెంటరీ ఎన్నికల రాజకీయాలను అంగీకరించని వారూ, తటస్థంగా ఉన్నామనుకునే వారూ కూడ ఈ ఎన్నికల గురించి ఆలోచించవలసిన అంశాలున్నాయి. మామూలుగా ఏ ఎన్నికల్లోనైనా, అసలు ఏ పరిణామంలోనైనా ఉన్నట్టుగానే ఈ ఎన్నికల్లో కూడ తప్పనిసరిగా గుర్తించవలసిన సాధారణాంశాలూ ఉన్నాయి, ప్రత్యేకాంశాలూ ఉన్నాయి. ఆ సాధారణాంశాల గురించీ, ప్రత్యేకాంశాల గురించీ కూడ వివరంగా చర్చించుకోవలసి ఉంది.

ఈ ఎన్నికల గురించి మాట్లాడుకునే సందర్భంలో అసలు మొత్తంగా మన సమాజ స్థితి గురించీ, అందులో ఎన్నికల గురించీ కొన్ని సాధారణాంశాలను చర్చించుకోవాలి. అవి ఒకటి, మన పార్లమెంటరీ ఎన్నికలు ప్రజాస్వామికంగా జరుగుతున్నాయా? రెండు, ఈ పార్లమెంటరీ ఎన్నికల్లో వ్యక్తమవుతున్నది, వ్యక్తమయ్యేది నిజమైన ప్రజాభిప్రాయమేనా? మూడు, పార్లమెంటరీ ఎన్నికలు పాలనను మారుస్తాయా? నాలుగు, అసలు వర్గ సమాజంలో ఎన్నికలకు అర్థం ఏమిటి?

భారతదేశంలో అమలవుతున్న పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఎన్నికల పద్ధతి గురించి ప్రజల్లో, ఆలోచనాపరుల్లో కూడ చాల తప్పుడు అభిప్రాయాలున్నాయి. భారత పాలకవర్గాలు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసిన, పాఠ్యపుస్తకాల్లోకి ఎక్కించి విద్యార్థుల మెదళ్లను విషపూరితం చేసిన, నిత్యం ప్రచారసాధనాల్లో వ్యక్తం అవుతూ సమాజంలో పునరుత్పత్తి అవుతున్న అభిప్రాయాలవి. భారతదేశంలో ప్రజాస్వామ్యం అమలవుతున్నదనీ, అందుకు సాక్ష్యం క్రమబద్ధంగా జరిగే ఎన్నికలేనని చాల మంది ఉన్నత విద్యావంతులు కూడ అనుకుంటారు. కాని ఇక్కడ రెండు గుర్తించవలసిన విషయాలున్నాయి. ఎక్కడైనా ఎన్నికలు క్రమం తప్పకుండా జరగడం మాత్రమే ప్రజాస్వామ్యం ఉనికికి చిహ్నం కాదనేది ఒక అంశమైతే, భారతదేశంలో జరుగుతున్న ఎన్నికలు ప్రజాస్వామికంగా జరగడం లేదనేది మరొక అంశం.

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల పద్ధతి మాత్రమే కాదు, అది ఒక పాలనా విధానం, అది ఒక సంస్కృతి, అది ఒక జీవన విధానం. అది సమాజాన్ని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పునాదిగా నిర్మించే పద్ధతి. సమాజంలో వ్యక్తులందరి మధ్య సమానత్వం, ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, ఎంతటి భిన్నాభిప్రాయాన్నైనా సహించడం, చర్చ, సంభాషణ జరపడం ప్రజాస్వామ్యానికి కీలకం. సహజంగా భిన్నాభిప్రాయాలు ఉండే సమాజంలో సౌలభ్యం కోసం, పనులు జరగడం కోసం అత్యధికుల అభిప్రాయాన్నే ప్రామాణికంగా తీసుకున్నప్పటికీ, భిన్నాభిప్రాయాలన్నిటికీ, వందమందిలో ఒకే ఒక్కరు ప్రకటించే అభిప్రాయమైనా సరే, దాన్ని గౌరవించడం ప్రజాస్వామ్యానికి మూల సూత్రం. వందల ఏళ్ల రాచరిక భూస్వామ్య పాలన తర్వాత, భిన్నాభిప్రాయాలు ప్రకటించిన వ్యక్తుల శిరచ్ఛేదాలు వేలాదిగా జరిగిన తర్వాత, బూర్జువా ప్రజాస్వామిక విప్లవాల తర్వాత రూపొందిన ప్రజాస్వామ్యం మౌలిక స్ఫూర్తి ఏమిటో ఫ్రెంచి తత్వవేత్త వోల్టేర్ విస్పష్టంగా ప్రకటించాడు. "నీ అభిప్రాయంతో నాకు ఏకీభావం లేకపోవచ్చు. కాని నీకు నీ అభిప్రాయం చెప్పుకునే హక్కు ఉన్నదని, దాన్ని కాపాడేందుకు నా ప్రాణమైనా అడ్డుపెడతాను" అన్నాడు. ఈ స్ఫూర్తి జనజీవనంలో, పాలనలో మిళితం కావడమే ప్రజాస్వామ్యం. అంటే అది ఒక సంస్కృతి కావాలి, జీవన విధానం కావాలి, నిత్యం పాటించే విలువలు కావాలి. భారతదేశంలో ప్రజాస్వామిక ఎన్నికలనబడేవి దశాబ్దాలుగా జరుగుతున్నప్పటికీ ఆ సంస్కృతి కనీసంగా కూడ నెలకొనలేదు. సమాజం ప్రజాస్వామికం కానప్పుడు ఎన్నికలు ప్రజాస్వామికంగా జరిగే అవకాశం లేదు.

ప్రజాస్వామిక ఎన్నికలలో మరొక మౌలికాంశం అవి 'ఒక వ్యక్తికి ఒక వోటు' అనే సమానత్వ సూత్రం మీద ఉనికిలోకి వచ్చినవి. భారత సమాజం ఇంకా తన భూస్వామ్య స్వభావాన్ని, పోషక-ఆశ్రిత సంబంధాలను, మంద మనస్తత్వాన్ని వదుల్చుకోలేదు గనుక ఇక్కడ

మనిషి వ్యక్తిగా ఎదగనే లేదు, ఇంకా మందలో ఒకరిగానే ఉన్నారు. కనుక డెబ్బై ఏళ్ల ఎన్నికల ప్రక్రియ తర్వాత కూడ స్వేచ్ఛగా, తన ఇష్టప్రకారం వోటు వేసే వ్యక్తి ఆవిర్భవించలేదు. వోటు బ్యాంకులు, వోటు మందలు మాత్రమే ఉన్నాయి. అటువంటప్పుడు ఈ ఎన్నికలకు అర్థమే లేదు.

ఇక ఈ ఎన్నికల్లో నిజమైన ప్రజాభిప్రాయం వ్యక్తమవుతున్నదా అనేది అనేకానేక పరిమితులకు లోబడిన అంశం. వ్యక్తిగా తన అభిప్రాయాన్ని చెప్పడానికి, ఆ అభిప్రాయం ప్రకారం వోటు వేయడానికి వోటరుకు అవకాశమే లేనప్పుడు ఎన్నికల ఫలితాల్లో వెలువడేది సక్రమమైన, స్వేచ్ఛాయుతమైన ప్రజాభిప్రాయం, లేదా అత్యధిక ప్రజాభిప్రాయం కాజాలదు. డబ్బుకు, మద్యానికి, కులానికి, మతానికి, ప్రాంతానికి, ప్రలోభాలకు, బెదిరింపులకు లోబడి రూపొందిన "ప్రజాభిప్రాయం" మాత్రమే అవుతుంది. నిజానికి ఎన్నికల చట్టంలో కూడ తాత్కాలిక ఆకర్షణలకు లోబడిన ప్రజాభిప్రాయం నిజమైన ప్రజాభిప్రాయం కాజాలదనే ఎరుక ఉంది. అందువల్లనే ఎన్నికల రోజున మద్యం దుకాణాలు తెరవగూడదని, వోటర్లను ఆకర్షించే ప్రలోభాలు చూపగూడదని, అలా చూపడం అవినీతికర చర్యలని చట్టం నిర్దేశించింది. మన ఎన్నికల్లో వోటింగ్ సరళిని ప్రధానంగా ప్రభావితం చేస్తున్నవి ఆ అవినీతికర చర్యలే కాబట్టి చట్టప్రకారం చూసినా ఇప్పుడు ఎన్నికల్లో వ్యక్తమవుతున్నది ప్రజాభిప్రాయం కాజాలదు.

ఎన్నికలు ప్రజాస్వామికంగా జరుగుతున్నాయా లేదా, ఈ ఎన్నికల్లో వ్యక్తమయ్యేది ప్రజాభిప్రాయమేనా కాదా అనే ప్రశ్నల కన్న కీలకమైనది ఇటువంటి ఎన్నికలు పాలనను మారుస్తాయా అనేది. అసలు ప్రజలందరూ తమ ప్రతినిధులకు ఎన్నుకోవాలనే అవగాహనకు మూలం ఏమంటే, కొనసాగుతున్న పాలన నచ్చనప్పుడు, లేదా ఆ పాలనలో కొన్ని అంశాలు నచ్చనప్పుడు ఎన్నికలు ప్రజలకు ఆ పాలన మార్చుకునే హక్కును ఇస్తాయి. సైద్ధాంతికంగా సవ్యమైన పద్ధతిగా కనబడే ఈ పద్ధతి వాస్తవంలోకి వచ్చేసరికి భారతదేశంలో తలకిందులుగా అమలవుతున్నది. ఈ ఎన్నికలు ప్రజలకు పాలనను మార్చుకునే అవకాశం ఎంతమాత్రమూ ఇవ్వడం లేదు. ఎక్కువలో ఎక్కువ పాలకులను మార్చుకునే అవకాశం మాత్రమే ఇస్తున్నాయి. ప్రజలు తమ ప్రతినిధిని మార్చుదామని అనుకున్నా, ఓడించి మార్చినా కూడ రాజకీయ పక్షాల ఆధిపత్య పద్ధతి వల్ల ఆ రాజకీయపక్షమే తిరిగి అధికారంలోకి రావచ్చు. అంటే పాత పాలనా పద్ధతే కొనసాగవచ్చు. లేదా అన్ని నియోజకవర్గాల ప్రజల్లో కూడ అదే అభిప్రాయం వ్యక్తమై, భిన్నమైన రాజకీయ పక్షం, అప్పటిదాకా ప్రతిపక్షంగా ఉన్న రాజకీయ పక్షం అధికారానికి వచ్చినా పాలనా విధానాలు మారే అవకాశమేమీ లేదు. మన చరిత్రలోనే చూస్తే పాలకులు, పార్టీలు ఎంత మారినా పాలనా విధానాలు మారలేదని తేటతెల్లమవుతుంది. 1992లో మొదలైన ప్రపంచీకరణ విధానాల పాలన, ఆ తర్వాత రాష్ట్రాల్లోను, కేంద్రం లోను మూడు నాలుగు భిన్నమైన రాజకీయ పక్షాల పాలన వచ్చినప్పటికీ, రాష్ట్రాల్లో వామపక్షాలు కూడ అధికారం లోకి వచ్చినప్పటికీ మారలేదు. ప్రజల మీద హింస, ప్రజల హక్కుల హననం అనే పాలనా విధానం బ్రిటిష్ వలస వాదుల పాలనలో ఎట్లా ఉన్నదో కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీతో సహా అన్ని పార్లమెంటరీ రాజకీయ పక్షాల పాలనలో కూడ అదే విధంగా ఉన్నది. నిజానికి ప్రజలు కోరుకుంటున్నది పాలనలో మార్పు. మారవలసింది పాలన. అంతేతప్ప పాలకులు, పాలకుల ముఠాలు కాదు. మారవలసింది వ్యవస్థ తప్ప ప్రభుత్వాలు కాదు. ఎన్నికల ద్వారా పాలకులను, ప్రభుత్వాలను మార్చవచ్చునేమో గాని పాలనను, వ్యవస్థను మార్చడం సాధ్యం కాదు.

పై మూడు ప్రశ్నల కన్న మరింత మౌలికమైనది మనం ఉంటున్నది ఒక వర్గ సమాజం అనే అవగాహన. వర్గ సమాజం అన్నప్పుడే పాలకవర్గ ముఠాలు ఎన్నికల ద్వారా ఒకరి తర్వాత ఒకరు అధికారానికి రావడానికే ప్రయత్నిస్తారు గాని మొత్తంగా వ్యవస్థ మారడానికి అనుమతించరు. ఈ సమాజంలో ఎన్నెన్ని విభజనలూ, అంతరాలూ ఉన్నప్పటికీ మూలంలో తమ శ్రమ ఆధారంగా బతికే వర్గమూ, ఉత్పత్తి సాధనాలను తన గుత్తాధిపత్యం కింద ఉంచుకుని ఇతరుల శ్రమను దోపిడీ చేసే వర్గమూ మౌలికమైనవి. శ్రమ, ఉత్పత్తి లేకపోతే సమాజ మనుగడే, అభివృద్ధే అసాధ్యం గనుక ఈ వర్గ విభజన మౌలికమైనది. ఈ వర్గ విభజనకు అనుబంధంగా, దాన్ని పరిరక్షించడానికి మరెన్నో విభజనలూ భావజాలాలూ సిద్ధాంతాలూ వాదాలూ రాజకీయ పక్షాలూ తయారవుతాయి. దోపిడీ పీడనలను కనబడకుండా చేయడానికి, వాటి మీద అనేక మేలి ముసుగులు కప్పుతాయి. అటువంటి మేలి ముసుగుల్లో ఒకానొకటే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. ఆ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఒకానొక అంగం ఎన్నికలు. అంటే ఎన్నికలు వర్గపాలనను, వర్గ దోపిడీ పీడనలను సజావుగా కొనసాగించడానికే ఉపయోగపడతాయి గాని వాటిని మార్చడానికి ఎప్పటికీ ఉపయోగపడవు.

భారత పార్లమెంటరీ ఎన్నికలకు సంబంధించి ఈ సాధారణ స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుంటూనే, 2019 ఎన్నికల ప్రత్యేక అంశాలను పరిశీలించవలసి ఉంది. నిజానికి ఈ 2019 ఎన్నికలు గతంలో జరిగిన ఎన్నికల కంటె క్లిష్టమైనవి. గత ఎన్నికల గురించి చేసినటువంటి సులభమైన నిర్ధారణలు చేయడం కష్టసాధ్యం చేస్తున్నవి. నరేంద్ర మోడీ – అమిత్ షా – అజిత్ దోవల్ దుష్టత్రయం నాయకత్వంలో, సంఘ్ పరివార్ భావజాలంతో విరుచుకుపడుతున్న హిందూ బ్రాహ్మణీయ ఫాసిజం ఒకవైపు, తమను తాము లౌకికవాదులుగా, ప్రజాస్వామికవాదులుగా, సంఘ్ పరివార్ వ్యతిరేకులుగా చెప్పుకుంటూ అవకాశం కోసం ప్రయత్నిస్తున్న దివాళాకోరు, దగాకోరు, ప్రచ్ఛన్న హిందుత్వ పాలకవర్గ ముఠాలు మరొకవైపు నిలబడిన ఈ రణరంగంలో ప్రజలు ఎవరిని ఎంచుకోవడమైనా కష్టమే. పెనంలో వేగడమా, మంటల్లో మండి పోవడమా, ఆత్మహత్య చేసుకునేది ఉరిపోసుకునా, విషం మింగా అనే విచికిత్స తప్ప ఈ ఎన్నికల్లో ఏమీ లేదు. అయినప్పటికీ, ఆ విశాల అవగాహన ఉంచుకుంటూనే, ప్రస్తుత సందర్భపు ప్రత్యేకతలను కూడ నిర్దిష్టంగా పరిశీలించడం శాస్త్రీయ పద్ధతి.

ఆ ప్రత్యేకాంశాలలో 1. రాజకీయ పక్షాల కూటములు, ప్రచ్ఛన్న కూటములు, అవకాశవాద రాజకీయ పక్షాలు, 2. మితిమీరిన డబ్బు ప్రాధాన్యత, 3. రాజ్యాంగ వ్యవస్థల దుర్వినియోగం, 4. నిర్దిష్టమైన ఎన్నికల అంశాలు – అందులో పాలకవర్గాలు సృష్టిస్తున్న కుహనా అంశాలు, నిజమైన ప్రజా సమస్యలు, 5. ఐదేళ్ల మోడీ పాలన అంచనా, 6. పెచ్చరిల్లుతున్న సంఘ్ పరివార్ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేక

ఐక్య సంఘటన అనే ఆరు అంశాలు ఉన్నాయి.

భారత ఎన్నికల రాజకీయాలలో ఎన్నికలకు ముందు ఏర్పడే కూటమి, ఎన్నికల తర్వాత ఏర్పడే కూటమి అనే రెండు రకాల కూటములు ఉన్నాయి. అయితే ఎన్నికలకు ముందు ఏర్పడిన కూటమి ఓడిపోతే దాని నుంచి బైటికి వచ్చే పార్టీలూ, ఎన్నికల తర్వాత గెలిచిన పార్టీని చూసుకుని, లాభసాటి మంత్రి పదవుల కోసం బేరమాడి అధికార కూటమిలో చేరే అవకాశవాద పార్టీలూ ఉన్నాయి. ఒక కూటమిలో ఉంటూనే మరొక కూటమి వైపు చూసే పార్టీలూ ఉన్నాయి. మొత్తం మీద భారత ఎన్నికల రాజకీయాలలో సూత్రబద్ధంగా, సిద్ధాంతపరంగా ప్రవర్తించే పార్టీలు చాల తక్కువనీ, అధికారం కోసం ఎవరితోనైనా, తాము ప్రకటించే సిద్ధాంతానికి పచ్చి వ్యతిరేకులతోనైనా పొత్తు కలుస్తాయనీ గత ఏడు దశాబ్దాల చరిత్ర చెపుతున్నది.

ఇప్పుడు రానున్న ఎన్నికలలో ఐదు ప్రధాన కూటములు వినబడు తున్నాయి. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని పందొమ్మిది పార్టీల కూటమి నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ), భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలోని ఇరవై ఐదు పార్టీల కూటమి యునైటెడ్ ప్రొగ్రెసివ్ అలయన్స్ (యుపిఎ), బహుజన్ సమాజ్ పార్టీ నాయకత్వంలోని పన్నెండు పార్టీల మహా ఘట్ బంధన్, ఐదు వామపక్ష పార్టీల లెఫ్ట్ ఫ్రంట్, ఎవరితోనూ కలవకుండానే ఫెడరల్ ఫ్రంట్ అని చెప్పుకుంటున్న ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్. ఇవి కాక ఏ ఎన్నికల ముందస్తు కూటమిలోనూ చేరలేదని చెప్పుకుంటున్న పదిహేను పార్టీలున్నాయి. అయితే ఈ కూటములలో ఉన్న పార్టీలలో కొన్ని తాము ఆయా ప్రత్యేక రాష్ట్ర పరిధిలో మాత్రమే కూటమిలో ఉంటామని, ఇతర చోట్ల పోటీకి దిగుతామని కూడ అంటున్నాయి. స్వతంత్రంగా, తటస్థంగా ఉన్నామంటున్న పార్టీలు భారతీయ జనతా పార్టీకో, కాంగ్రెస్‌కో లోపాయకారీ మద్దతు ఇస్తున్నాయి. కనుక కూటముల ద్వారా, రాజకీయ పార్టీల ద్వారా 2019 ఎన్నికల చిత్రాన్ని అర్థం చేసుకోవడం క్లిష్టమైన వ్యవహారం. ఆ క్లిష్టతతోనే అర్థమయ్యే ఏకైక విషయం అన్ని పార్టీలకూ ఉమ్మడిగా ఉన్న అవకాశవాదం. భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ అనే రెండు ఎదురు బొదురు పార్టీలు మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు అటయినా ఇటయినా చేరడానికి ఎటువంటి అభ్యంతరాలు లేనివే. కాకపోతే వామపక్షాలు భారతీయ జనతా పార్టీతో చేరకపోవచ్చు.

ఈ ఎన్నికలలో మరొక ప్రత్యేకాంశం మితిమీరిన డబ్బు ప్రాధాన్యత. దేశంలో మొదటి ఎన్నికల నుంచి గడిచిన ఎన్నికలన్నిటిలో ప్రతిసారీ డబ్బు పాత్ర ఉంది. కాని డబ్బు మాత్రమే గెలవలేదు. డబ్బుతో పాటు ఇతర అనేక అంశాలు పని చేసేవి. ప్రపంచీకరణ తర్వాత ఎన్నికలలో కార్పొరేట్ల జోక్యం పెరుగుతూ వచ్చి అది ఈ 2019 ఎన్నికల నాటికి మితిమీరిన స్థాయికి చేరింది. తలలు లెక్కపెట్టి ఒక కుటుంబానికో, కులానికో తలా వంద, రెండు వందలు, ఐదు వందల రూపాయల చొప్పున పంచిపెట్టడంగా సాగిన గత ఎన్నికల స్థానంలో ప్రస్తుత ఎన్నికలలో తలా ఐదు వేల రూపాయలు పలుకుతున్నాయని అంటున్నారు. అంటే ఎన్నికలలో వ్యయం ఒక్కొక్క పార్టీకి వందల కోట్లు, వేల కోట్ల రూపాయల వ్యవహారంగా మారింది. ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి, కార్పొరేట్లకు అనుకూల, లాభదాయకమైన పనులు చేసిపెట్టి వేల కోట్ల రూపాయలు ముడుపులు పొందిన రాజకీయ పార్టీలు మాత్రమే అందులోనుంచి కొన్ని వందల కోట్లనో, కొన్ని వేల కోట్లనో ఎన్నికల పెట్టుబడిగా పెట్టగలుగుతున్నాయి. ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం, ప్రజాసేవ చేయడం అనే పాత విలువలు మచ్చుకైనా కనబడడం లేదు. అదానీ, అంబానీలకూ, బహుళ జాతి సంస్థలకూ వేల కోట్ల రూపాయలు దోచిపెట్టిన భారతీయ జనతా పార్టీ తనకు వారి నుంచి అందిన ముడుపుల్లో కొంత భాగాన్ని ఎన్నికల్లో పెట్టుబడిగా పెడుతున్నది. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, ప్రజాధనం దోపిడీలో తమకు భాగం దక్కని, లేదా కోరుకున్నంత భాగం దక్కని కార్పొరేట్లు కాంగ్రెస్‌కు పెట్టుబడి పెడుతున్నారు. ఇలా పెట్టుబడులు పెట్టే కార్పొరేట్లు తప్పనిసరిగా తమ పెట్టుబడి మీద ప్రతిఫలం (రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్) ఆశిస్తారు. రానున్న ప్రభుత్వం మరింతగా కార్పొరేట్ల సేవ చేయవలసి వస్తుంది. అంటే ఎన్నికలు తమ ప్రజా ప్రాతినిధ్య, ప్రజాసేవ స్వభావాన్ని సంపూర్ణంగా వదుల్చుకుని కార్పొరేట్లకు ప్రాతినిధ్యం, కార్పొరేట్ల సేవ చేయడానికి సాధనాలుగా మారుతున్నాయి.

ప్రస్తుత ఎన్నికలలో మరొక ప్రధానాంశం రాజ్యాంగ వ్యవస్థల విధ్వంసం, దుర్వినియోగం. మోడీ–షా–దోవల్ పాలన ఐదు సంవత్సరా లలో ఈ విధ్వంసం, దుర్వినియోగం అతి ఎక్కువగా జరిగిన మాట నిజమే గాని, అధికారంలోకి వచ్చిన ప్రతి భారత పాలకవర్గ ముఠా ఆ పనిచేసింది. ఇందిరాగాంధీ హయాం నుంచి అది మరింత విస్తరించింది. ఇక గత ఐదేళ్ల పాలనలో న్యాయవ్యవస్థ, నిఘా, పరిశోధనా యంత్రాంగా లు, విద్యావ్యవస్థ, అధికార యంత్రాంగం, రిజర్వ్ బ్యాంక్ వంటి ప్రతి ఒక్క రాజ్యాంగ వ్యవస్థనూ సంఘపరివార్ శక్తులతో నింపడం, వాటి చట్టబద్ధమైన విధులు కూడ నిర్వర్తించకుండా అడ్డుకోవడం, వాటిని ప్రత్యర్థుల మీద కుట్రలకూ కుహకాలకూ వాడుకోవడం విచ్చలవిడిగా జరిగింది.

ఈ ఎన్నికల సందర్భంలోనే చూస్తే, ఎన్నికల సంఘాన్ని, ఐఎఎస్ – ఐపిఎస్ అధికార యంత్రాంగాన్ని అటు కేంద్ర ప్రభుత్వంలో భారతీయ జనతా పార్టీ, ఇటు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు దారుణంగా స్వప్రయోజనాలకు వాడుకుంటున్నాయి. వాటి చట్టబద్ధ, నామమాత్ర స్వాతంత్ర్యాన్ని, తటస్థతను భగ్నం చేస్తున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రవర్తించిన, ప్రవర్తిస్తున్న తీరు చూస్తే ఇది మరింతగా అర్థమవుతుంది. ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్న, శాసనసభ ఎన్నికలు జరగవలసి ఉన్న జమ్ము–కశ్మీర్‌లో మాత్రం శాసనసభ ఎన్నికలు జరపడానికి భద్రతాకారణాలు అడ్డువస్తున్నాయని కారణం చెప్పిన ఎన్నికల సంఘం అక్కడ పార్లమెంటు ఎన్నికలను మాత్రం జరుపుతున్నది! ఒక ఎన్నికకు అడ్డువచ్చే ఉద్రిక్త పరిస్థితులు మరొక ఎన్నిక జరగడానికి ఎలా అవకాశం ఇస్తాయో ఎన్నికల సంఘానికే తెలియాలి. అసలు ఈ ఒక్క అంశం మాత్రమే కాదు, ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం ఎన్ని అవకతవకలకు పాల్పడుతున్నదో చూస్తే జరగనున్నవి సక్రమమైన, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు కావనే అనుమానం బలపడుతుంది. మార్చ్ 4న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి సిద్ధపడిన ఎన్నికల సంఘం, సరిగ్గా ఆ నాలుగు రోజుల్లో నరేంద్ర మోడీ ప్రారంభోత్స వాలకు, బహిరంగ సభలకు వెసులుబాటు ఇవ్వడానికి తన ప్రకటనను

మార్చ్ 10కి వాయిదా వేసింది. అలాగే, ముస్లింలు అత్యధిక సంఖ్యాక వోటర్లుగా ఉన్న ఉత్తర ప్రదేశ్, బిహార్, బెంగాల్ లలో సరిగ్గా రంజాన్ సందర్భంగా రోజంతా ఉపవాసం ఉండి ఎన్నికల్లో పాల్గొనడానికి తక్కువ అవకాశం ఉండేలా ఏడు విడతల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. నియోజకవర్గాల సంఖ్య సమానంగా ఉన్న రెండు ప్రాంతాలలో ఒక ప్రాంతంలో ఒకే విడత ఎన్నికలకు, మరొక ప్రాంతంలో మూడు, ఐదు, ఏడు విడతల ఎన్నికలకు ఏర్పాట్లు చేసింది. అంతకన్న విచిత్రంగా 14 స్థానాలున్న అసోంలో మూడు విడతలు, 13 స్థానాలున్న పంజాబ్ లో ఒక విడత, 25 స్థానాలున్న ఆంధ్రప్రదేశ్ లో, 26 స్థానాలున్న గుజరాత్ లో ఒక విడత, 25 స్థానాలున్న రాజస్థాన్ లో రెండు విడతలు, 39 స్థానాలున్న తమిళనాడు లో ఒక్క విడత, 40 స్థానాలున్న బిహార్ లో ఏడు విడతలు, 80 స్థానాలున్న ఉత్తర ప్రదేశ్ లో ఏడు విడతలు వంటి తారతమ్యాలు చూస్తే, ఎన్నికల నిర్వహణలో సాధ్యాసాధ్యాలు, అవకాశాలు, వాతావరణ పరిస్థితులు వంటి అంశాలు కాక, అధికార పక్షమైన భారతీయ జనతా పార్టీకి అనుకూలించే అంశాలు, ప్రతిపక్షాలకు సహకరించని అంశాలు ఎన్నికల షెడ్యూల్ తయారీలో ప్రధాన పాత్ర నిర్వహించినట్టు కనబడుతున్నది.

అలాగే అధికారపక్షపు అవినీతిని అరికట్టడానికి ఏ చర్యలూ తీసుకోక పోవడం, కోట్లాది రూపాయలు తరలిస్తున్న అధికారపక్ష వాహనాలను తనిఖీ చేయకపోవడం, ప్రతిపక్షాల వాహనాలమీద మాత్రం స్వల్ప కారణాలతోనే ఆంక్షలు విధించడం వంటి ఎన్నో పక్షపాత వైఖరులను ఎన్నికల సంఘం అధికారులు, ఇతర అధికారులు చూపుతున్నారు.

అధికారపక్ష ఆదేశాల మేరకు వోటర్ల జాబితాల సవరింపులు, అర్హులైన వోటర్లను జాబితాల నుంచి తొలగించడం వంటి అక్రమాలకు కూడ ఎన్నికల సంఘం పాల్పడుతున్నది. ఈసారి వోటర్ జాబితాల సవరింపులో భాగంగా దేశవ్యాప్తంగా పన్నెండు కోట్ల మంది వోటర్లను జాబితా నుంచి తొలగించి, వోటు వేయడానికి అనర్హులుగా మార్చడం జరిగిందని పరిశీలకులు చెపుతున్నారు. మహారాష్ట్రలో ఉద్దేశపూర్వకంగా నలభై లక్షల వోటర్లను జాబితా నుంచి తొలగించడం జరిగిందని, అందులో పదిహేడు లక్షల మంది దళితులు, పదిలక్షల మంది ముస్లింలు ఉన్నారని, జనతాదళ్ (ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి, జస్టిస్ బిజి కోల్సె పాటిల్ ఆరోపించారు. ఇటువంటి వోటర్ల గల్లంతు ఆరోపణలు దేశవ్యాప్తంగా వెలువడుతున్నాయి.

ఇక ఈ ఎన్నికల్లో రాజకీయ నాయకుల ఉపన్యాసాలలో, ఎన్నికల ప్రచారంలో, చర్చల్లో వెలికి వస్తున్న అంశాలను చూస్తే ఇందులో ఆయా పాలకవర్గ ముఠాలు సృష్టిస్తున్న కుహనా అంశాలు ఎన్నో ఉన్నాయి. అసలైన ప్రజా సమస్యలు ఎన్నికల అంశాలుగా మారకుండా పక్కదారి పట్టించడానికి ఎన్నో ప్రయత్నాలు సాగుతున్నాయి. పుల్వామా దాడి పేరుతో దేశభక్తి సెంటిమెంటును, పాకిస్తాన్ పట్ల, ముస్లింల పట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టి దాన్ని ఎన్నికల అంశంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. బాబ్రీ మసీదు – రామజన్మభూమి వివాదానికి మరొకసారి ఆజ్యం పోసి దాన్ని ఎన్నికల అంశంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. కుల మత విద్వేషాలను, గోసంరక్షణ వంటి అనవసరపు అంశాలను ఎన్నికల అంశాలుగా మారుస్తున్నారు. ప్రజాధనాన్నంతా కార్పొరేట్లకు, ఆశ్రితులకు పందారం చేస్తూ, పైకి చూపడానికి అతి స్వల్పమైన నిధులను మాత్రం సంక్షేమ పథకాల పేరు మీద ఖర్చు పెడుతూ, ఆ సంక్షేమ పథకాలను ఎన్నికల అంశంగా ముందుకు తెస్తున్నారు. ప్రతిపక్షాలకు, ప్రత్యర్థులకు బలమైన నాయకులు లేరని అంటూ, ఆ నాయకులను అవహేళన చేస్తూ, తమదే బలమైన నాయకత్వం అని ప్రగల్భాలు పలుకుతూ దాన్ని ఎన్నికల అంశంగా మారుస్తున్నారు.

నిజానికి ఇవేవీ నిజమైన ప్రజా సమస్యలు కావు. ఇవన్నీ కూడ నిజమైన ప్రజాసమస్యలు ఎన్నికల అంశాలుగా మారకుండా ఉండడానికి చేస్తున్న కుటిల ప్రయత్నాలే. విపరీతమైన ధరల పెరుగుదల, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, అసంఖ్యాక ఆత్మహత్యలకు కారణమవుతున్న గ్రామీణ – వ్యవసాయ సంక్షోభం, ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను, సమాజంలో విషబీజాలు నాటుతున్న, హింసావిద్వేషాలు రెచ్చగొడుతున్న సంఘ్‌పరివార్ అసహన ఫాసిస్టు సంస్కృతి, సంఘ్‌పరివార్ సాగిస్తున్న హత్యా రాజకీయాలు, పెరిగిపోతున్న కార్పొరేట్ ప్రాబల్యం, ప్రజల కనీసావసరాలు తీరని దుస్థితి, అవిద్య, అనారోగ్యం వంటి ప్రజాసమస్యలు ఎన్నికల అంశాలు కావాలి. ఆ సమస్యలు తీర్చడానికి తాము ఏ పరిష్కారాలు సూచిస్తున్నారో, ఎలా అమలు చేయనున్నారో రాజకీయ పక్షాలు తమ తమ వ్యూహాలను ప్రజల ముందుంచి, వాటి ఆధారంగా వోట్లు అడగడానికి రావాలి. కాని ఏ ఎన్నికల ప్రచార కార్యక్రమంలోనూ ఆ సమస్యల ప్రస్తావనైనా ఉండడం లేదు.

ఐదేళ్ల మోడీ పాలనలో సంఘ్ పరివార్ ఫాసిజం ఎంతగా పెచ్చరిల్లి, దేశ ప్రజలమీద, ముఖ్యంగా ఆదివాసుల మీద, దళితుల మీద, ముస్లింల మీద, మహిళల మీద, బహుజనుల మీద, ప్రత్యామ్నాయ వ్యవస్థ గురించి ఆలోచించేవారి మీద ఎలా విరుచుకుపడుతున్నదో ఎన్నికల అంశం కావలసి ఉంది. మధ్యభారత అరణ్యాల నుంచి ఖనిజ వనరులను తవ్వుకు పోవడానికి బహుళజాతి సంస్థలకు సంపూర్ణ అధికారం ఇస్తూ, అవరోధంగా ఉన్న విప్లవోద్యమాన్ని, ఆదివాసులను నిర్మూలించడానికి సంఘ్ పరివార్ ప్రభుత్వం ఎన్నెన్ని కుతంత్రాలు పన్నుతున్నదో, ఎంత హింసకు పాల్పడుతున్నదో ఎన్నికల అంశంగా చర్చించాలి. కాని తమను తాము భారతీయ జనతా పార్టీకి, సంఘ్‌పరివార్‌కు ప్రతిపక్షాలమని చెప్పుకుంటున్న రాజకీయ పక్షాలకు కూడ ఇవి ఎన్నికల అంశాలు కావడంలేదు.

ఈ ఎన్నికల్లో మోడీ తిరిగి అధికారానికి వస్తే ఇక దేశంలో కనీస ప్రజాస్వామ్యం మిగలదని, అందువల్ల ఈ స్థితిలో సంఘ్ పరివార్ దుర్మార్గ రాజ్యాన్ని ఓడించడమే ఏకైక లక్ష్యంగా ఉండాలని, ఆ లక్ష్యంతో ఒక ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటనను రూపొందించి ఎన్నికల్లో ఆ దిశగా కృషి చేయాలని కూడ ఆలోచనలు వస్తున్నాయి. ప్రజావ్యతిరేక స్వభావంలో, విధానాలలో, ఆచరణలో మన దేశంలోని పాలకవర్గ ముఠాల మధ్య ఎటువంటి తేడాలు లేవు. అందరూ ఒకే తానులోని ముక్కలే. సరిగ్గా గత ఐదు సంవత్సరాలలో మోడీ ఏ విధానాలను అమలు చేశాడో, అంతకు ముందు పది సంవత్సరాలలో మన్మోహన్ సింగ్ అవే విధానాలను అమలు చేశాడు. ఎన్‌డిఎ, యుపిఎ ల మధ్య ప్రజల వైపు నుంచి చూసినప్పుడు గుణాత్మకమైన తేడా ఏమీ లేదు. వారిద్దరూ సామ్రాజ్యవాద దళారీలే. వారిద్దరూ సమాజంలో భూస్వామ్య బ్రాహ్మణీయ హిందుత్వ విలువల ప్రతినిధులే. కాకపోతే ఒకరు ప్రత్యక్ష హిందుత్వ వాదులుగా,

మోడీ ఐదేళ్ల నిరంకుశ పాలన

ఆర్థిక రంగంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడికి లొంగిపోయిందనీ, రాజకీయ రంగంలో ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ మతతత్వ జాత్యహంకార ఎజెండాను అమలు చేస్తోందనీ, రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలను క్రమంగా బలహీనం చేసిందనీ అంటున్నారు **సంతోష్**

కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడిచే ఎన్‌డిఎ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్ని రంగాలు, వ్యవస్థలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరించిన అనాలోచిత, అవివేక ఆర్థిక విధానాల కారణంగానే నూతన ఉపాధి కల్పన జరగకపోగా ఉన్న ఉద్యోగాలే ఊడిపోయిన పరిస్థితి. 2016 నవంబర్ 8న అనాలోచితంగా తీసుకున్న పెద్దనోట్ల రద్దు నిర్ణయం, ఆ తర్వాత తొందరపాటుతో తీసుకున్న వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) అమలు నిర్ణయం ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. దీనికి తోడు బడా పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి కోట్లాది రూపాయలు అప్పు తీసుకుని వాటిని ఎగ్గొట్టి పాలకుల ఆశీస్సులతో విదేశాలకు పారిపోయారు. మోదీ పాలనా కాలంలో ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగాయి. పారిశ్రామిక ఉత్పత్తుల సూచీ (ఐఐపి) పడిపోయింది. వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినప్పటికీ రైతాంగానికి గిట్టుబాటు తగ్గిపోవడంతో ఆర్థిక దుస్థితిలో కూరుకుపోయారు.

మోదీ ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో బడా భూస్వామ్య, బడా బుర్జువా వర్గాలకు, సామ్రాజ్యవాదులకు పూర్తి విధేయతతో ఊడిగం చేసింది. అదే సమయంలో బ్రాహ్మణీయ హిందూత్వ పేరిట ఫాసిస్టు తరహా పద్ధతులను బిజెపి, సంఘపరివార్ శక్తులు దూకుడుగా అమలు జరిపాయి. దేశంలో హిందూ మతోన్మాద, అభివృద్ధి నిరోధక, అరాచక శక్తులు స్వైరవిహారం చేశాయి. దేశంలోని అనేక ప్రాంతాలలో శాస్త్రీయ, ప్రగతిశీల, హేతువాద, ప్రజాతంత్ర, లౌకిక భావాలుగల అనేకులపై హంతకదాడులు జరిగాయి. భిన్నమైన సిద్ధాంతాలను, అభిప్రాయాలను సహించకపోవడం, వారిపై భౌతికదాడులకు పాల్పడడం లాంటి ఫాసిస్టు ధోరణిని ఒక విధానంగా, సంస్కృతిగా బిజెపి, సంఘపరివార్ శక్తులు అమలు జరిపాయి. గోరక్షణ పేరిట దళితులపైన, ముస్లిం ప్రజలపైన విచ్చలవిడిగా వీరు దాడులు చేశారు. ప్రజల వేషభాషలను, ఆహార అలవాట్లను, జీవన శైలులను దౌర్జన్య పూరితంగా నియంత్రించడానికి, తలవంచని వారిని తామెంచుకున్న పద్ధతుల్లో శిక్షించడానికి పూనుకున్నారు.

మరోవైపు రాజ్యాంగం ద్వారా ఏర్పడ్డ సంస్థలు ఆర్‌బిఐ, సిబిఐ, సివిసి, యుజిసి, ఐటి, ఇడి, ఎన్నికల సంఘం వంటి సంస్థలు స్వతంత్రను విశ్వసనీయతను కోల్పోయాయి. చివరికి న్యాయ వ్యవస్థ కూడా ప్రభుత్వ ప్రభావానికి గురవుతుంది. ఇటీవల వెలువరించిన తీర్పుల వల్ల అలాంటి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పై సంస్థలన్ని అధికార పార్టీ కనుసన్నల్లో విధులు నిర్వర్తిస్తున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం క్రమంగా

మరొకరు ప్రచ్ఛన్న హిందుత్వ వాదులుగా ఉండవచ్చు. ఆ విషయం గమనంలో ఉంచుకుంటూనే సంఘ్ పరివార్ బ్రాహ్మణీయ హింసా పాలన హిట్లర్, ముస్సోలినీల ఫాసిజంతో దగ్గరి పోలికలు కలిగినదనీ, హిట్లర్, ముస్సోలినీలకు వ్యతిరేకంగా 1930లలో, 40లలో ఏర్పడిన ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటన వంటిది ఏర్పడవలసిన చారిత్రక సన్నివేశంలో ఉన్నామనీ కొందరు హెచ్చరిస్తున్నారు.

అయితే గత ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటన సందర్భంలో తలెత్తిన కొన్ని సమస్యలను ఇప్పుడు మరింత నిశితంగా పరిగణనలోకి తీసుకోవలసి ఉన్నది. ఫాసిజానికి వ్యతిరేకంగా "తక్కువ ప్రమాదకారి" (నెసెసరీ ఇవిల్ అని అప్పటి మాట) తో ఐక్యత అవసరమేమో గాని, ఆ పదబంధంలో మొదటి మాట మీది కన్న రెండో మాట మీద ఎక్కువ శ్రద్ధ పెట్టవలసి ఉన్నది. వారు "తక్కువ" కావచ్చుగాని "ప్రమాదకారులు" కాకుండా పోరు. వారు ఎంత ప్రమాదకారులో నిరంతర జాగరూకతతో ఉంటూ, ఆ చైతన్యాన్ని ప్రచారం చేస్తూ, అవసరమైన అన్ని సందర్భాల లోను వారి దుర్మార్గాలను బహిర్గతం చేస్తూ ఉండకపోతే, "ఎక్కువ ప్రమాదకారులను" సాకుగా పెట్టుకుని "తక్కువ ప్రమాదకారులకు" తోకలుగా మారిపోయే ప్రమాదం ఉంటుంది.

ప్రత్యర్థులుగా కనబడుతున్న రెండు పాలకవర్గ ముఠాలూ వాస్తవంగా ప్రజావ్యతిరేకులనే, దుర్మార్గులనే, అంతిమంగా కూలదోయవలసిన వాళ్లనే అవగాహననూ చైతన్యాన్నీ ప్రజలకు అందించడం ఇవాళ్టి చారిత్రక అవసరం. అనేకానేక కారణాల వల్ల ప్రజలు ఇంకా ఎన్నికల రాజకీయాల్లో ఉండవచ్చు, ఎన్నికల ద్వారా తమ బతుకు మారలేదనీ, మారదనీ తెలిసినప్పటికీ ఏవో తాత్కాలిక భ్రమలు, భయాలు వారిని ఆ పరిధికే పరిమితం చేసి ఉండవచ్చు. ఎన్నికల వ్యవస్థ గురించి నిజమైన చైతన్యం ఇవాళ అతి తక్కువ మందికే ఉండవచ్చు. ఎన్నికల్లో పాల్గొనడం, ఎవరో ఒకరికి అనుకూల వైఖరి తీసుకోవడం అనివార్యమైన సందర్భంలో కూడ, నిజంగా సమాజ పరివర్తనకు అవసరమైన చైతన్యాన్ని ప్రచారం చేయడం, సంఘటితం చేయడం, ఎక్కడ వీలైతే అక్కడ ఎన్నికల వ్యవస్థకు ప్రత్యామ్నాయాలు అన్వేషించడం ఇవాళ బుద్ధిజీవుల కర్తవ్యం కావాలి.

(రచయిత వీక్షణం సంపాదకుడు)

అధ్యక్షతరహా విధానంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం జరుగుతోంది. రాజ్య సమాఖ్య స్వభావం కుచించుకుపోయింది. మీడియా అధికార పార్టీ బాకాలూదుతోంది. ప్రతిపక్షం గొంతు నొక్కివేయబడింది. మన విదేశాంగ విధానం అమెరికాకు అనుకూలంగా మారింది. మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను మరింత వేగంగా అమలుచేయడంతో దేశ ఆర్థిక వ్యవస్థ కునారిల్లింది.

విత్తు ఒకటి నాటితే మొక్క మరొకటి మొలకెత్తదన్న నానుడి నరేంద్ర మోదీ విషయంలో రుజువవుతోంది. ఆయన మనువాదుల విత్తనం, మతం ఆయన ఆయుధం, దాన్ని ఉపయోగించి మెజార్టీ మతస్తులను సమీకరించడం, అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం ఆయన ప్రధాన అజెండా. ఆ అధికారాన్ని ప్రయోగించి హిందూ మతంలోని నిచ్చెనమెట్ల కులవ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా అణగారిన కులాలు, వర్గాలు, మైనార్టీలపై ఆధిపత్యం చలాయించడం మనువాద సిద్ధాంతం. దీనికను గుణంగానే హిందూత్వ శక్తులు మోదీని సృష్టించాయి. ఆ భావజాలంతోనే ఆయన పాలన సాగిస్తున్నారు. తనతో పాటు నడిచే నేతలను రాష్ట్రాల్లో ఆయన తయారు చేసుకున్నారు. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల బతుకుకూ, భవితకూ ఏ మాత్రం పొంతనలేని సమస్యలను సృష్టించి, ఆ సమస్యల సుడిగుండంలో జనం కొట్టుకు పోయేలా చేసే విషపుటెత్తుగడలకు తెరతీశారు. కులం, మతం, ఆచారం, ఆహారం, అలవాట్లను అడ్డం పెట్టుకొని ప్రజలను నిలువునా చీల్చే కుయుక్తులు, కుట్రలు పన్నుతున్నారు.

మోదీ ప్రభుత్వం ప్రజల ప్రజాతంత్ర హక్కులను కాలరాయడానికి మరింత కఠినమైన నిర్బంధ చట్టాలు తెచ్చింది. పాశవిక అణచివేత పద్ధతులను అమలు జరిపింది.. 'మేక్ ఇన్ ఇండియా' పేరుతో, పెట్టుబడులను ఆకర్షించడం అనే పేరుతో భారతదేశ గేట్లను విదేశీ కార్పొరేట్లకు పూర్తిగా ఎత్తివేశారు. 'మా దేశానికి పెట్టుబడులతో రారండహో' అంటూ స్వయంగా ప్రధానియే దేశదేశాల్లో ప్రచారం సాగించాడు. కూలీలను, నిపుణులను, ఇంధనాలను, భూమి, నీరు, మార్కెట్ తదితర వనరులను కారుచవగ్గా, పుష్కలంగా అందిస్తామంటూ విదేశీ పెట్టుబడిదారుల నోరూరించే రీతిలో ఒక సాధారణ విక్రేత స్థాయికి దిగి వివరించడానికి పూనుకొన్నాడు.

హిందూ మతోన్మాద ఫాసిస్టు దాడులు

ముస్సోలినీ, హిట్లర్ ఫాసిస్టు సిద్ధాంతానికి, భావజాలానికి ప్రభావితమై పని చేసే ఆర్.ఎస్.ఎస్ మానస పుత్రులైన నరేంద్రమోదీ, అమిత్ షాల ప్రభుత్వం గో రక్షణ, ఘర్‌వాపసీ, లవ్ జిహాద్ లాంటి నెపంతో మైనార్టీలు, దళితులు, ఆదివాసులు, వెనుకబడిన కులాలు, బుద్ధిజీవులు, హేతువాదులు, విద్యార్థులు, మహిళలు, హక్కుల కార్యకర్తలు, స్వేచ్ఛా ఆలోచన పరులపై దాడులు కొనసాగిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల ఆత్మహత్య యూనివర్సిటీలలోని పెరుగుతున్న నియంతృత్వ వాతావరణానికి చిహ్నం. జెఎన్‌యుకు చెందిన కన్హయ్య కుమార్‌పై తప్పుడు అభియోగాలు, కేసులు పెట్టడమే కాకుండా న్యాయస్థానంలో దాడి చేయడం పెచ్చరిల్లుతున్న ఫాసిస్టు చర్యలకు పరాకాష్ట. సామాజిక మాధ్యమాలలోకి హిందూత్వ శక్తులను ప్రవేశింప చేసి ఫేస్‌బుక్‌లోనూ, ట్విట్టర్‌లోనూ లౌకిక భావాలు కలిగిన వారిపై ప్రణాళికాబద్ధంగా దాడులు చేస్తున్నారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై సైబర్ ట్రోలింగ్‌తో విరుచుకుపడుతున్నారు. హత్యా బెదిరింపులు జరుగుతున్నాయి. అశ్లీలపద ప్రయోగాలతో స్త్రీల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారు.

ఉద్యమకారులు, మేధావులు ప్రజా సమస్యలపై చురుకుగా పని చేయడాన్ని హిందూత్వ మూకలు జీర్ణించుకోలేకపోతున్నాయి. హేతువాదులైన ధబోల్కర్, కల్బుర్గి, పన్సారే, గౌరీ లంకేశ్ లాంటి మేధావుల హత్యలు ఆర్ఎస్ఎస్, బిజెపి హిందుత్వ విధానాలను విమర్శించే వారిపై అమలు చేసే హింసా ధోరణికి సాక్ష్యంగా నిలుస్తాయి. ఉత్తర ప్రదేశ్‌లోని దాద్రిలో ఆవు మాంసం తిన్నాడనే ఆరోపణతో మహ్మద్ అక్లాక్‌ను, హర్యానాలో పశువులను రవాణా చేశారని మస్తాన్ అబ్బాస్‌ను సంఘ్ పరివార్ శక్తులు కొట్టి చంపేశారు.

బులంద్ షహర్‌లో హిందూ ఫాసిస్టు మూకలు సుబోధ్ కుమార్ సింగ్ అనే స్టేషన్ హౌస్ ఆఫీసరును చంపివేశారు. జమ్మూలోని కథువాలో హిందూ దేవాలయంలో ఆసిఫా అనే 8 సంవత్సరాల బాలికను సామూహిక అత్యాచారం చేసి చంపేశారు. గుజరాత్‌లోని ఊనాలో చనిపోయిన ఆవు కళేబరం తోలు తీస్తున్న దళిత యువకులను కొట్టి జీపుకు కట్టి ఈడ్చుకెళ్లారు.

పెద్దనోట్ల రద్దు ఓ వికృత చర్య

2016 నవంబర్ 8న రాత్రి ప్రధాని మోదీ ఏకపక్షంగా పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రకటించారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన మార్పు తీసుకొస్తుందని, కలుగులో దాగివున్న నల్లధనం బయటకు వస్తుందని, నకిలీ నోట్లు, ఉగ్రవాదులకు నిధులు అరికట్టబడతాయని మోదీ వాగ్దానం చేశారు. కానీ భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బిఐ) వెల్లడించిన అంకెలను బట్టి చూస్తే గడిచిన రెండేళ్లలో సాధించింది ఏమీలేదని వెల్లడైంది. అధిక నిరుద్యోగిత, ఉపాధి లేమికి దారితీసే విధంగా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ ఛిద్రమయ్యే ఉంది. గతేడాది ఆగస్టులో నల్లధనంపై ఆర్‌బిఐ ఒక స్పష్టతనిచ్చింది. అప్పటి వరకూ రద్దయిన నోట్లలో 99 శాతం బ్యాంకుల్లో జమయినట్టు ఆర్‌బిఐ ప్రకటించింది. అప్పటికి కేవలం రు.16 వేల కోట్ల పెద్ద నోట్లు బ్యాంకుల్లో జమ కాలేదు. కేవలం రు.10 వేల కోట్ల నల్లధనం మిగిలిపోయిందని, రద్దయిన వాటిలో 99.3 శాతం రద్దయిన పెద్దనోట్లన్నీ బ్యాంకులకు తిరిగి వచ్చింది. దీంతో నోట్ల రద్దు చేస్తూ మోదీ చేసిన వాగ్దానంలోని డొల్లతనం బహిర్గతమైంది.

నోట్ల రద్దు తరువాత సంభవించిన పరిణామాల సమాచారాన్ని సమాచార హక్కు చట్టం (ఆర్‌బిఐ) పరిధిలో అడిగినా కేంద్ర ప్రభుత్వం సమాచారం ఇవ్వకుండా దాటవేసింది. దీన్ని బట్టి మోదీ పారదర్శకత, జవాబుదారీలోని డొల్లతనం వెల్లడవుతుంది.

అంతా కుంభకోణాల మయం

మోదీ ప్రభుత్వ ప్రథమ వార్షికోత్సవాల సందర్భంగా 2015 మే 25న మధురలో ప్రసంగిస్తూ "నేను ప్రధాన సేవకుణ్ణి, ఈ దేశ ఆస్తులకు ముఖ్యమైన ట్రస్టీని. ఈ సొమ్మును ఎవరు కాజేయకుండా కాపాడుతాను.

దేశ సంపదను అక్రమంగా కొల్లగొట్టే దగాకోరులకు 'చెడ్డ రోజులొచ్చా యని' డాంబికంగా బల్లగుద్ది మరీ చెప్పారు. ఆ తంతు అంతటితో ముగిసింది. దాని తర్వాత కుంభకోణాలు, షరామామూలే.

కేంద్రంతో పాటు బిజెపి అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో స్కామ్‌ల పరంపర కొనసాగుతూనే ఉంది. రాఫేల్ స్కామ్, స్పెక్ట్రం స్కామ్, జయ్‌షా స్కామ్, నీరవ్ మోదీ స్కామ్, ఐఎల్&ఎఫ్ఎస్ స్కామ్, వ్యాపమ్, విద్యుత్ – అడ్వర్‌టైజ్‌మెంట్ స్కామ్ (మధ్యప్రదేశ్), బజ్రీ, బహ్మాషా హెల్త్ ఇన్సూరెన్స్ స్కామ్‌లు (రాజస్థాన్), అదానీ ల్యాండ్ స్కామ్, అహ్మదాబాద్ కో–ఆపరేటివ్ బ్యాంక్ స్కామ్ (గుజరాత్), హౌసింగ్ స్కామ్ (ఉత్తరప్రదేశ్) చిక్కీ స్కామ్ (మహారాష్ట్ర) చిటురాగ్యా స్కాం (ఉత్తరాఖండ్), బడ్జెట్ స్కామ్, ఇ–టెండర్ స్కాం(చత్తీస్‌గఢ్), అస్సాం సివిల్ సర్వీస్ ఎగ్జామ్ స్కామ్, బిల్డింగ్ స్కామ్(గోవా), బొగ్గు స్కామ్(జార్ఖండ్). కామెంగ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ స్కామ్ – సంఘపరివార్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అనేక స్కాముల్లో ఇవి మచ్చుకి కొన్ని మాత్రమే. మోదీ పాలనలో భారతదేశం అత్యంత అవినీతికర, అరాచక రాజ్యంగా మారిపోయింది.

సర్కారీ విద్యకు గ్రహణం

మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థను భుజానికెత్తుకోవడంతో, దేశంలో విద్యారంగం పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోంది. క్రమంగా ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలు, యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రైవేట్ రంగానికి ఇస్తున్నంత ప్రాధాన్యం ప్రభుత్వ సంస్థలకు ఇవ్వడం లేదనేది స్పష్టంగా తెలుస్తోంది. బిజెపి పాలనలో దేశంలోని ప్రభుత్వ కళాశాలల సంఖ్య 22 శాతం పడిపోయింది. ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీలలో చేరే విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.

2013–14 విద్యా సంవత్సరంతో పోల్చితే, 2017–18లో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 35 శాతం పడిపోయింది. అదే సమయంలో ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య 67.30 శాతంగా ఉంది. ఈ విషయాన్ని అఖిల భారత ఉన్నత విద్యా సర్వే (ఏఐఎస్‌హెచ్ఇ) తెలియజేసింది.

2018–19కి సంబంధించిన సర్వే నివేదికను ఇటీవలే కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న కాలేజీల్లో 78 శాతం ప్రైవేట్ రంగంలోనే ఉన్నట్లు సర్వే నివేదిక వెల్లడించింది. దేశంలో మొత్తం 903 విశ్వవిద్యాలయాలు ఉండగా, 560 వర్సిటీలకు ప్రభుత్వ నిధులు అందుతున్నాయి. మోదీ సర్కార్ ఒక పథకం ప్రకారమే ప్రభుత్వ విద్యను బలహీనం చేసేందుకు ప్రయత్నిస్తోందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో వందల్లో ఖర్చవుతుండగా, కార్పొరేట్‌లో ఉన్నత విద్యకు లక్షలాది రూపాయ లను ఫీజుగా చెల్లించాల్సి వస్తోందని విద్యార్థి సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

ప్రభుత్వ విద్యను బాధ్యతగా అభివృద్ధి చేయాల్సిన కేంద్రం, కార్పొరేట్ రంగాన్ని బాగు చేసేందుకు ప్రయత్నిస్తోంది. మోదీ పాలనకాలంలో ప్రైవేట్ యూనివర్సిటీలు భారీగా పెరిగాయి. నాలుగేళ్ల క్రితం పలు రాష్ట్రాల్లో స్టేట్ వర్సిటీలు 153 ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 262కు పెరిగాయి. వీటిలో అత్యధికం ప్రైవేట్ రంగానికి చెందినవే ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో వర్సిటీలు పెరిగినంతగా, ప్రభుత్వ వర్సిటీల సంఖ్య పెరగడం లేదు. సెంట్రల్ వర్సిటీలు గతంలో 42 ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 45కు చేరింది. ప్రభుత్వ వర్సిటీలు 309 నుంచి 351కి చేరగా, డీమ్డ్ యూనివర్సిటీల (ప్రభుత్వ ఎయిడెడ్) సంఖ్య 47 నుంచి 43కు తగ్గడం గమనార్హం.

అట్టడుగు సమూహాలపై పరివార్ మూకల దాడులు

మోదీ పాలనలో హిందూమతోన్మాద శక్తుల అసహనానికి అట్టడుగు వర్గాలకు చెందిన దళితులు సమిధలవుతున్నారని ఆమ్నెస్టీ ఇండియా సంస్థ వెల్లడించిన నివేదిక దిగ్భ్రాంతి కలిగిస్తోంది. దేశ వ్యాప్తంగా నిరుడు చోటు చేసుకున్న విద్వేష దాడుల్లో 65 శాతం దళితులపైనే జరిగాయని ఆ సంస్థ పేర్కొన్న దాన్ని బట్టి ఈ దేశంలో దళితులు ఎంతటి భయానక వాతావరణంలో బతుకుతున్నారో తెలుస్తుంది. ఆమ్నెస్టీ పరిశీలన ప్రకారం ఒక్క 2018 సంవత్సరంలో 248 విద్వేష దాడులు జరగగా 87 మంది అమాయకులు మరణించారు. మొత్తం దాడుల్లో 142 దళితులపై జరగ్గా, ముస్లింలపై 50 దాడులు జరిగాయి.

ఆదివాసీలు, క్రైస్తవులు, చివరికి ట్రాన్స్‌జెండర్లను సైతం మతోన్మాద మూక వదిలి పెట్టలేదు. దాడుల్లో 40 కేసులు లైంగిక వేధింపులకు సంబంధించినవి కాగా వాటిలో 33 దళిత మహిళలపై సాగించినవి. విద్వేష దాడుల్లో అత్యధికం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే చోటు చేసుకోవడం గమనార్హం.

ఆర్ఎస్ఎస్ మానసపుత్రుడు, మోదీ అనుంగు శిష్యుడు యోగి ఆదిత్యనాథ్ పాలనలోని ఉత్తరప్రదేశ్ వరుసగా మూడవ ఏట కూడా విద్వేష దాడుల్లో అగ్రస్థానంలో ఉంది. నిరుడు ఆ రాష్ట్రంలో అత్యధికంగా 57 దాడులు జరిగాయి. రెండవ స్థానం దక్కించుకున్న గుజరాత్‌లో 22, మూడవ స్థానంలో ఉన్న రాజస్థాన్‌లో 18 విద్వేష దాడులు జరిగాయి. దళితులు, ఆదివాసీలకు బిజెపి ప్రభుత్వం బద్ధ వ్యతిరేకి అని నిరూపించడానికి ఈ ఉదంతాలు సరిపోతాయి.

ప్రత్యర్థులపై దాడులు, సోదాలు, కేసులు

ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పనితీరును, ప్రజలను చీల్చి ఘర్షణలను రెచ్చగొడుతున్న విధానాలను, మతోన్మాద అజెండాను, కార్పొరేట్లకు గులాంగిరిగా మారిన వైనాన్ని ఎవరు ప్రశ్నించినా భరించలేని స్థితికి మోదీ ప్రభుత్వం చేరింది. ప్రశ్నించే వారిపై దాడులు చేయడం, భౌతికంగా నిర్మూలించేందుకు ప్రయత్నించడం, పోలీసుల చేత తప్పుడు కేసులు బనాయించడం, అలా సాధ్యం కాకపోతే సిబిఐ, ఇడి, ఐటిలను ఉపయోగించి వేధించడం వంటి చర్యలు మోదీ పాలనలో సాధారణ అంశాలుగా మారాయి. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధించడమే లక్ష్యంగా రాజ్యాంగబద్ధ సంస్థలను, దర్యాప్తు ఏజెన్సీలను నరేంద్ర మోదీ సర్కారు ఉసిగొల్పుతున్న తీరు విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, చివరకు మీడియా సంస్థలను కూడా వదలడం లేదు. ప్రజల గొంతును నిర్దాక్షిణ్యంగా నొక్కుతున్నారు. మోదీ పాలన కాస్తా దాడుల, సోదాల రాజ్యంగా మారిపోయింది.

సామాజిక మేధావులు, హక్కుల నేతలపై కుట్ర కేసులు

సమాజంలో సమస్యలున్నప్పుడు... వాటికి మూలాలేమిటీ, కారణాలేమిటీ, పరిష్కారాలేమిటీ, ప్రత్యామ్నాయాలేమిటీ అనే అన్వేషణ సహజంగానే మొదలవుతుంది. ఆ పని మేధావులు చేస్తారు. భావాల సంఘర్షణ నుంచే నవోదయం ప్రారంభమవుతుంది. ఇది చారిత్రక వాస్తవం. నేడు మనదేశంలో సంఘ్‌పరివార్ భావజాలం తప్ప ఏ ఇతర భావజాలాలు, ప్రత్యామ్నాయాలను సహించలేని పాలక పాశవికత రాజ్యమేలుతోంది. విశ్వవిద్యాలయాల్లో భావ సంఘర్షణకు అవకాశమే లేకుండా చేసి సంఘ్‌పరివార్ భావజాలమే విద్యార్థుల బుర్రకెక్కించేందుకు విఫలయత్నం చేస్తోంది. ఈ క్రమంలో ప్రగతిశీల భావజాలం వైపు నిలిచిన కొందరు విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేసింది.. దాడులకు తెగబడింది. ఢిల్లీలోని జెఎన్‌యు విద్యార్థి నేత కన్హయ్య కుమార్‌పై దేశద్రోహం కేసు పెట్టి నానా ఇబ్బందులకు గురిచేసింది.

భావ ప్రకటనా స్వేచ్ఛతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడమే దేశద్రోహంగా మోదీ కాషాయదళం భావిస్తోంది. కేంద్రంలోని మోదీ సర్కారే కాదు, ఈశాన్య రాష్ట్రం అస్సోంలోని బిజెపి ప్రభుత్వం.. మేధావులు, రచయితలు, జర్నలిస్టులపై దేశద్రోహ నేరం కేసులు బనాయిస్తున్నది. 2019 జనవరి 10న అస్సాం సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత హిరేన్ గోహైన్, కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి నేత అఖిల్ గొగోయ్, ప్రముఖ జర్నలిస్టు మంజిత్ మహంతాలను దేశద్రోహ నేరం కింద ప్రభుత్వం అరెస్టు చేయడం హిందూత్వ ఫాసిస్టు విధానాలకు పరాకాష్ఠ. వారిపై 124ఏ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారన్న ఆరోపణలతో (121,123)పలు సెక్షన్‌లపై కేసులు నమోదు చేసి జైలులో పెట్టింది.

ప్రజా నాయకులపై, మేధావులపై ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్రపన్నారనే అభియోగం మోపడాన్ని సుప్రీంకోర్టు గతంలోనే తీవ్రంగా తప్పు పట్టింది. అయినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆ తరహా కేసులు మోపుతూనే ఉన్నాయి. మణిపూర్ ముఖ్యమంత్రిని సోషల్ మీడియాలో విమర్శించినందుకు జర్నలిస్టు కిశోర్ చంద్రవాంగ్ ఖేమ్‌పై దేశద్రోహ నేరం మోపి నిర్బంధం లోనే ఉంచారు. ఇంఫాల్ కోర్టు ఆయనను నిర్దోషిగా విడుదల చేసింది.

ఆదివాసీల హక్కుల కోసం బస్తర్‌లో పోరాడుతున్న హక్కుల కార్యకర్త సోని సోరి, ఆమె అల్లుడు లింగారం కొడొపి, జర్నలిస్టు మాలిని సుబ్రమణ్యంలపై అక్రమ కేసులు పెట్టారు. 2018 జూలై 17న జార్ఖండ్ రాష్ట్రంలో పకురా ప్రాంతంలో 75 ఏండ్ల స్వామి అగ్నివేశ్ పైన బిజెవైఎం, ఎబివిపి కార్యకర్తలు భౌతికదాడి చేశారు. ఆయన బట్టలు చించి అవమాన పరిచారు.

మహారాష్ట్రకు చెందిన ఉమర్ ఖలీద్‌పై న్యూఢిల్లీలోని పార్లమెంట్ వీధిలో 2018 ఆగస్టు 14న హత్యాయత్నం జరిగింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఒమర్ ఖలీద్, కన్హయ కుమార్, షీలా రషీద్‌లపై అక్రమకేసు పెట్టారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొ. సాయిబాబా (90 శాతం వైకల్యం)ను తప్పుడు సాక్ష్యాలతో శిక్ష పడేలా చేశారు.

బిజెపి సర్కారు కొత్తగా అర్బన్ నక్సల్స్ పేరిట కొందర్ని జైళ్లల్లో పెడుతున్నది. భీమా కోరేగాం హింసాకాండలో సంబంధాలున్నాయన్న కృత్రిమ ఆరోపణలతో 2018 జూన్ 6న సుధీర్ ధావ్లే, షోమాసేన్, సురేంద్ర గాడ్లింగ్, రోనా విల్సన్, మహేశ్ రౌత్‌లను, ఆగస్టు 28న సుధా భరద్వాజ్, గౌతం నవ్లాఖా, వరవరరావు, అరుణ్ ఫరేరా, వర్నన్ గోంజాల్వేస్ లను అరెస్టు చేశారు.

ఇటీవల ఆనంద్ తేల్ తుంబ్డేను మోదీ సర్కారు టార్గెట్ చేసింది. ఆయన చేసిన నేరం ఏమిటి? అత్యంత ప్రతిభావంతుడైన ఆయన సమాజంలోని అసమానతలు, అన్యాయాలపై, దళితుల సమస్యపై, ఖైర్లాంజీ దురాగతాలపై రచనలు వెలువరించారు. సామాజిక అసమానతలపై, కుల వ్యవస్థ దుర్మార్గాలపై 'రిపబ్లిక్ ఆఫ్ క్యాస్ట్' పుస్తకాన్ని రచించారు. భీమా కోరేగాం ఘటన 'కుట్ర'లో ఆయనను పాలకులు భాగస్వామిగా చిత్రిస్తున్నారు. వాస్తవానికి ఆయన భీమా కోరేగాం ఘటనతో విభేదించి అనేకమంది ఆగ్రహానికి గురయ్యారు.

ప్రశ్నించడం, సామాజిక అసమానతలను ఎత్తిచూపడం, పాలక విధానాలను, చర్యలను నిలదీయడం, భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడం నేరంగా పరిగణించి శిక్షలు వేసిన నియంతలు ఎందరో చరిత్ర కాల గర్భంలో కలిసిపోయారు. మోదీ సర్కారు కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. నిజానికి ప్రతిపక్షం, విమర్శ లేకుంటే ప్రజాస్వామ్యానికి అర్థమే లేదు.

భావ ప్రకటన స్వేచ్ఛను భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఇచ్చింది. దాన్ని ఒక ప్రాథమిక హక్కుగా గుర్తించింది. దాన్ని కాపాడటానికి చట్టబద్ధ పాలనను ఒక మౌలిక ప్రమాణంగా అందించింది. ఆ పాలనే నిరంకుశంగా వ్యవహరిస్తే... పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తే... ప్రజా తిరుగుబాటు అనివార్యమవుతుంది.

కశ్మీర్‌లో మంటలు రేపుతున్న మోదీ ప్రభుత్వం

కశ్మీర్ ప్రజల న్యాయమైన స్వయం నిర్ణయాధికార ఆకాంక్షను అత్యంత పాశవికంగా మోదీ ప్రభుత్వం అణచివేస్తుంది. ఆర్టికల్ 370, 35–ఎలను అమలు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న రాజ్యహింసను వెలుగులోకి రాకుండా చేసి అబద్ధాలతో దేశంలో కశ్మీరీ ఆకాంక్షల పట్ల, ముస్లింల పట్ల వ్యతిరేకతను, ద్వేషాన్ని రెచ్చగొడుతున్నది. కశ్మీర్‌లో ఏడు లక్షల సైన్యాన్ని మోహరించింది. ఇప్పటివరకు సైన్యం చేతిలో 80 వేల మంది చనిపోయారు. 8 వేలకు పైగా కనిపించడం లేదు. స్త్రీలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలకు అంతే లేదు. ఏ నేరం చేసినా, ఎంత ఘోరం చేసినా శిక్షపడదన్న ధీమాతో సైన్యం అకృత్యాలు పెచ్చరిల్లిపోతున్నాయి. మోదీ ప్రభుత్వ వైఫల్యానికి కశ్మీర్ పరిస్థితి అద్దం పడుతున్నది. మరోవైపు పిడిపి, నేషనల్ ఫ్రంట్, కాంగ్రెస్ కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత ప్రకటించిన ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించకుండా రాష్ట్రపతి పాలన విధించారు. ఇప్పుడు పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం లేదు.

కశ్మీర్ సమస్యను కశ్మీర్ ప్రజల హక్కుల సమస్యగా గుర్తించక కశ్మీర్ భూభాగాన్నే గుర్తించి, సమస్యను చర్చల ద్వారా కాకుండా అణచివేత ద్వారా పరిష్కరించాలని భావిస్తోంది. దీనిని రాజకీయ సమస్యగా భావించి ప్రజలలోని వివిధ తరగతులను కలుపుకుపోవడం లేదు. కశ్మీర్ వ్యవహారంలో సైనిక, రక్షణ బలగాలను వినియోగించడాన్ని ఒకే ఒక్క

'మార్గంగా' భావించడం వలన వినాశకర పరిస్థితి చోటు చేసుకున్నది. కశ్మీరీయులందరిని తీవ్రవాదులుగా, వేర్పాటువాదులుగా బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు ముద్ర వేస్తున్నాయి. ఈ పరిణామం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అణిచివేతను వ్యతిరేకిస్తున్న వారిని జాతి వ్యతిరేకులుగా ముద్ర వేస్తూ బిజెపి కపట దేశభక్తిని చాటుకుంటుంది. కశ్మీర్ సమస్యను హిందూ ముస్లింల మధ్య లేదా పాకిస్తాన్ భారత్‌ల మధ్య సమస్యగా చిత్రీకరిస్తూ రాబోయే సార్వత్రిక ఎన్నికలకు వనరుగా వాడుకుంటుంది.

జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో జైషే మహ్మద్‌కు చెందిన అదిల్ అహ్మద్ దార్ అనే 20 సంవత్సరాల తీవ్రవాది మానవ బాంబుగా మారి ఫిబ్రవరి 24న భారత సైన్యంపై ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో సుమారు 40 మంది సైనికులు మరణించారు. దీనికి ప్రతీకారంగా భారత వైమానిక దళం 12 మిరాజ్ 2000 యుద్ధ విమానాలు సరిహద్దు దాటి పాక్ భూభాగంలో ప్రవేశించి జైషే తీవ్రవాద స్థావరాలపై బాంబులు కురిపించాయి. వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ పాక్ సైనికులకు చిక్కాడు. తదుపరి భారత్‌కు అప్పగించారు. దేశంలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. మోదీ వ్యవహరించే తీరు మొత్తం కశ్మీరీలను దోషులుగా నిలబెట్టింది. ప్రధానే పదేపదే ప్రతీకార భాషా వాడుతుండడంతో పరివార శక్తులు అత్యుత్సాహంతో అమాయక కశ్మీరీ ప్రజలపై దాడులకు దిగారు. మీడియా కూడా అత్యుత్సాహాన్ని ప్రదర్శించింది. ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులు అర్థాంతరంగా సొంత రాష్ట్రానికి వెళ్లాల్సి వచ్చింది. మత ద్వేషాన్ని నిలువెల్ల నింపుకున్న సంఘ్ కూటమి సంస్థలే కాదు, బాధ్యత కలిగిన అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు మూర్ఖంగా వ్యవహరించడం శోచనీయం.

రాజస్థాన్‌లోని బికనూర్ జిల్లా కలెక్టర్ పాకిస్తానీయులందరిని 24 గంటలలో రాష్ట్రం విడిచి వెళ్లాలని ఆదేశించడం బాధకరం. మేఘాలయ గవర్నర్ మరో అడుగు ముందుకేసి కశ్మీరీయులను బహిష్కరించాలని కశ్మీరీల వస్తువులు కొనకూడదని పిలుపునిచ్చాడు.

ఈ ఉద్రిక్తతలను మోదీ ఎన్నికల ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నాడు. బిజెపి నాయకుల మాటలు కోటలు దాడుతున్నాయి. భారత వైమానిక దళ దాడులను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటోంది. వైమానిక దళం సాధించిన విజయాన్ని తమ పార్టీ సాధించిన ఘనతలా బిజెపి ప్రచారం చేసుకుంటోంది. 2016లో మెరుపు దాడుల రీతిలోనే పాక్ ప్రేరేపిత తీవ్రవాదంపై 'ప్రతీకారం' తీర్చుకున్నది తామేనని, ఇదివరకెప్పుడూ ఇలాంటిది లేదని ఊదరగొడ్తున్నారు. తద్వారా దేశ భద్రతకు పాటుపడేది తాము మాత్రమేనని ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడితే చర్చల ద్వారా శాంతిని సాధించాలి. కానీ, మోదీ ప్రభుత్వం యుద్ధ వాతావరణాన్ని పెంచుతున్నది.

స్వావలంబన వదిలి-విదేశీ పెట్టుబడులకు రెడ్ కార్పెట్

ద్రవ్య పెట్టుబడి, హిందూత్వ భావజాలం కలయికతో కూడిన ఫాసిస్టు ధోరణుల రూపమే మోదీ ప్రభుత్వం. ఆర్థిక రంగంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడికి లొంగిపోయింది. రాజకీయ రంగంలో ఆర్ఎస్ఎస్ హిందూత్వ మతతత్వ జాత్యహంకార ఎజెండాను అమలు చేస్తోంది. రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలను క్రమంగా ఒక్కొక్క దానిలో మితిమీరిన జోక్యంతో నిర్వీర్యం చేశారు. ప్రణాళిక సంఘం, సిబిఐ, సివిసి, ఇడి, ఆర్‌బిఐ, చివరికి న్యాయవ్యవస్థ వంటి సంస్థలపై పట్టుబిగించి వాటి స్వతంత్రతను దెబ్బ తీశారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ల పెట్టుబడులను స్వాగతిస్తూ దేశీయ వనరులను, శ్రమశక్తిని కొల్లగొట్టడానికి అనుమతిస్తున్నారు. ఈ విధానాలు ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించజాలవు సరికదా మరింతగా పేదరికాన్ని, నిరుద్యోగాన్ని విస్తృతం చేస్తాయి. విదేశీ పెట్టుబడులతో దేశీయ అభివృద్ధి సాధించడం వట్టి భ్రమే. స్వంత ఉత్పత్తి, స్వంత పెట్టుబడి, స్వంత మార్కెట్‌పై ఆధారపడితేనే స్వావలంబన సాధ్యమవుతుంది. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారమవుతాయి.

చిన్న తరహా పరిశ్రమలకు నూతన టెక్నాలజీని అందిస్తూ, సహకారమిస్తే, అనతికాలంలోనే అవి అంతర్జాతీయ స్థాయికి ఎదగగలవు. దేశాభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించాలన్నా ఈ విదేశీ పెట్టుబడి అనే ఎండమావిని పక్కన పెట్టి మనదేశంలోని నల్లధనాన్ని బయటకు తీసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం ఒక్కటే పరిష్కారం. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక నమూనా పథకాలతో దేశాభివృద్ధి అసాధ్యం, నిరుద్యోగ సమస్య పరిష్కారం అసలే కాదు. ఇటువంటి తప్పుడు పద్ధతుల్ని విడనాడి నిజాయితీతో ప్రజాసంక్షేమం కోసం మన దేశ ఆర్థిక విధానాలలో సమూలమైన మార్పులు తీసుకు రావాలి. దేశాభివృద్ధికి ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక విధానం అవసరం ఉంది. ధనిక వర్గాల లాభాల వృద్ధి కాకుండా, ప్రజలందరి సర్వతోముఖ వికాసం ప్రాతిపదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయవలసి ఉంది. అందుకు పాలకులపై ఒత్తిడి తీసుకు రావడానికి ప్రజా ఉద్యమమే పరిష్కారం.

భారతదేశంతో సహా ప్రపంచ దేశాలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక అభివృద్ధి నమూనాను అమలుజరిపే అన్నిచోట్లా రెండు పరిణామాలు సంభవిస్తాయి. మొదటిది, ప్రజల మధ్య అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయి. సంపదలు సృష్టించే వారి చేతిలో సంపద నిలవడం లేదు. అది కొద్ది మంది బడా పెట్టుబడిదారుల వద్ద పోగవుతోంది. అందువల్ల విస్తారమైన ప్రజానీకం పేదరికంలోకి నెట్టబడుతున్నారు. రెండోది, ఈ విధానాలు అనుసరించే ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విడనాడి పెట్టుబడిదారుల సేవలో, వారి వద్దకు ప్రజల సంపదను చేరవేసే పనిలో నిమగ్నమైనాయి. ప్రజల సంక్షేమ బాధ్యతల నుండి ప్రభుత్వాలు ఉపసంహరించుకుంటున్న కొద్దీ ప్రైవేట్ పెట్టుబడులు, కార్పొరేట్ లాభాపేక్ష ఆ స్థానాన్ని ఆక్రమించుకుని ప్రజలపై విపరీతమైన భారాలు పడుతున్నాయి. ఈ భారాల పర్యవసానంగా ప్రజలలో పెరిగే అసంతృప్తి సంఘటితం కాకుండా ప్రజల మధ్య కులం, మతం పేరిట విభజన తెస్తున్నారు.

నరేంద్ర మోదీ ఐదేళ్ల పాలనలో పేదరికం, నిరుద్యోగం, మూక హత్యలు, మతపరమైన దాడులు పెరిగాయి. కార్పొరేట్ వర్గాలు అపారమైన సంపదను కూడబెట్టుకున్నాయి. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం పెరిగింది. అవినీతి పెరిగింది. కని విని ఎరుగని రీతిలో అసమానతలు పెరిగాయి. వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పేదరికం, నిరుద్యోగం పెరిగింది. మోదీ పాలన కాలంలో 50 వేల మంది రైతులు

నిర్బంధాలు తెలంగాణకు కొత్త కాదు

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పరిష్కరించకుండా ప్రకటించిన వారిని నిర్బంధించడం ద్వారా సమస్యకు పరిష్కారం కాదనీ, నిర్బంధాలను ఎదిరించి పోరాడిన చరిత్ర ఈ నేలకు ఉందనీ అంటున్నారు **వంగాల సంపత్ రెడ్డి**

తెలంగాణలో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా హక్కు నిరాకరించబడుతుంది. సభా హక్కు నిరాకరించబడుతుంది. పాలకులు ఎందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులను నిరాకరిస్తున్నారు?

నిజాం కాలంలో 1945 అక్టోబర్‌లో తెలంగాణలో గాంధీ జయంతి జరుపుకోవడానికి నిజాం ప్రభుత్వం నిరాకరించింది. సభలు జరుపుకునే హక్కును పాలకులు నిరాకరించినపుడు ప్రజలు ఏ విధంగా సభలు జరుపుకుంటారో 'ప్రజల మనిషి' నవలలో వట్టికోట ఆళ్వారు స్వామి వివరించాడు.

1921లో కాకినాడలో కాంగ్రెస్ పార్టీ మహాసభలకు హాజరుకావడానికి వచ్చిన ప్రజలను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించిందో 'కొల్లాయి గట్టితేనేమి' నవలలో రచయిత వివరించారు. అయితే ఆ సభలకు ప్రజలను రాకుండా అడ్డుకోగలిగిందా? ప్రజలలో నెలకొని ఉన్న స్వాతంత్ర్య ఆకాంక్షను అడ్డుకోగలిగిందా?

సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన ప్రజలపై నిర్బంధం ప్రజలలో బ్రిటిష్ ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడే విధంగా చేసిందా? 1917లో నీలి తోటల రైతుల సమస్యలపై గాంధీ స్పందించి చంపారన్‌కు వెళితే గాంధీకి బ్రిటిష్ ప్రభుత్వం అడుగడుగునా అవాంతరాలు కల్పించింది? అంతమాత్రం చేత రైతుల సమస్యల గురించి మాట్లాడకుండా గాంధీని నిలువరించాయా?.

హోం రూల్ ఉద్యమాన్ని నడిపినందుకు తిలక్‌ను బంధిస్తే అతనిలోని స్వరాజ్య కాంక్షను పాలకులు ఆపగలిగారా?

జలియన్ వాలాబాగ్‌లో రక్తపుటేరులు పారించినా ప్రజా ఉద్యమాల నిర్మాణం జరుగకుండా పాలకులు చేయగలిగారా?

ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన విద్యార్థులను దారుణంగా చంపితే ఏం జరిగింది? తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష చల్లారిందా? విచ్చలవిడిగా ఎన్‌కౌంటర్లతో ప్రజల సమస్యలను ఎంతకాలం వాయిదా వేయగలరు? విద్యార్థులు సభలు జరుపుకుంటామంటే నిరాకరించిన ఎన్‌టిఆర్ విద్యార్థి ఉద్యమాలను ఏం చేయగలిగాడు? సారా వ్యతిరేక ఉద్యమాన్ని నడిపిన తెలంగాణ సింగరేణి కార్మికులపై రాజ్యం చేసిన దారుణాలను ఎలా మరిచిపోగలం. అయినా సారా వ్యతిరేక ఉద్యమాన్ని పాలకులు అడ్డుకోగలిగారా? తెలంగాణ ఉద్యమ పాటైన బెల్లి లలితను ముక్కలుగా నరికి రాజ్యం ఏం సాధించగలిగింది? తెలంగాణ పాటై ప్రవహించలేదా? ప్రశ్నించే మేధావులపై దాడులు చేస్తూ, హత్యలు చేస్తూ రాజ్యం ఏ సాధించగలిగింది? ప్రశ్నించడాన్ని అడ్డుకోగలిగారా?

ఆత్మహత్యలు చేసుకున్నారు. మోదీ వాగాడంబరం పట్ల ఆకర్షణ తగ్గింది. ఈ పరిస్థితులలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. మోదీ నిరంకుశ దుష్టపాలనకు పాతరేయాలని చూస్తున్నారు. ప్రజలపై నిర్బంధం ఎంత పెరిగితే, ప్రతిఘటన అంతగా పెరుగుతుంది. అందుకు తీవ్రమవుతున్న కార్మిక, రైతాంగ, విద్యార్థి, ఆదివాసీల ఉద్యమాలే నిదర్శనం. అందువల్ల ప్రజాస్వామ్యాన్ని, లౌకిక విలువల్ని, ప్రజల హక్కుల్ని పరిరక్షించటానికి అవసరమైన ప్రత్యామ్నాయ రాజకీయార్థిక విధానాలను ప్రజలు కోరుకుంటున్నారు. బిజెపి ప్రభుత్వం–కార్మికులు, రైతాంగం, గిరిజనులు, యువకులు, మహిళలు, దళితులు, మైనారిటీలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదు. మొదట కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించి, నిరుద్యోగ సమస్యను తుద ముట్టిస్తామంది. కొద్దిరోజుల్లోనే మాటమార్చి, నిపుణుల తయారీకి శిక్షణ ఇస్తాననీ, విదేశాల్లో వారికోసం ఉద్యోగాలు కాచుకొని ఉన్నాయని ఊరించడం మొదలెట్టింది. ఇప్పుడేమో ఉద్యోగాలెందుకు, స్వయం ఉపాధికోసం ప్రయత్నించవచ్చు కదా అంటూ కోట్లాది నిరుద్యోగ యువకుల ఆశలపై నీళ్లు చల్లింది. యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యతను తప్పించుకొనే ప్రయత్నమిది. ఇవాళ కేంద్ర ప్రభుత్వంలో 60 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిరుద్యోగ సమస్య గత 45 సంవత్సరాల్లో లేనంతగా 6.7 శాతంగా నమోదయింది.

ఐదేళ్ల కాలంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు జరిపిన ఆర్థిక, రాజకీయ విధానాలు, దూకుడుగా అమలుజరిపిన హిందూత్వవాద, ఫాసిస్టు తరహా చర్యలు బిజెపి ప్రభుత్వం పట్ల ప్రజల అసంతృప్తిని పెంచాయి. అనేకచోట్ల బిజెపి, సంఘ పరివార్ శక్తుల చర్యలు ప్రజల నిరసనను చవిచూశాయి. కొందరు హిందూమతోన్మాదులు చేస్తున్న ప్రేలాపనలు గట్టిగానే నిరసించబడుతున్నాయి. కార్మికులు, రైతాంగం, గిరిజనులు, దళితులు, విద్యార్థి – యువకులు, మహిళలు, ఉద్యోగులు, ప్రజాతంత్రవాదులు, మేధావులు, కళాకారులు తమ సమస్యలపై ఆందోళనలకు దిగారు. ప్రత్యేకించి, రైతాంగం లక్షల సంఖ్యలో ఆందోళనలు సాగించారు.

దేశ ప్రజల ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు అమ్మివేస్తున్న, ప్రజాస్వామిక హక్కులను, విలువలను, సంప్రదాయాలను ధ్వంసం చేస్తూ దేశాన్ని మతపరంగా, సాంస్కృతికంగా చీల్చడానికి ప్రయత్నిస్తున్న నేటి పాలకులకు వ్యతిరేకంగా శక్తివంతమైన, నిశ్చయాత్మకమైన ఐక్యపోరాటం సాగించాలన్నది దేశంలో బలంగా వ్యక్తమవుతున్న ఆకాంక్ష.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

జగిత్యాల, సిరిసిల్లాలను కల్లోలిత ప్రాంతాలని ప్రకటించినంత మాత్రాన దున్నేవానిదే భూమి అని నినదించి రైతాంగ పోరాటాలను రాజ్యం అడ్డుకోగలిగిందా? ఇంద్రవెల్లిలో కాల్పులు జరిపి గిరిజనులను చంపినంత మాత్రాన గిరిజనోద్యమాలను నిలువరించగలిగారా? యువకులను మిస్సింగ్ చేసి ఎన్‌టిఆర్ ఏం చేయగలిగిందు? ప్రజా ఉద్యమాలలో యువకులను మమేకం కాకుండా ఆపగలిగిందా?

తెలంగాణ పదాన్ని ఉచ్చరించడాన్ని నిషేధించిన పాలకవర్గం చివరకు ఏమి చేయగలిగింది? ప్రజా ఉద్యమాలను అడ్డుకోగలిగిందా? ప్రజా ఆకాంక్షలను నిలువరించగలిగిందా? చివరకు ప్రజా ఉద్యమాలకు తలొగ్గి అనివార్యంగా ఆ పాలక వర్గమే చివరకు జై తెలంగాణ నినాదాన్ని ఎత్తుకుంది కదా. పాలకులు ఎవరైనా ప్రజల ముందు, ప్రజల ఆకాంక్షలకు తల దించుకోవల్సిందేనని తెలంగాణ నిరూపించింది కదా! అయినా పాలకులు చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోవట్లేదు కదా!

తెలంగాణ వచ్చేదా చచ్చేదా అని ఉద్యమకాలంలో మాట్లాడిన వారే ప్రజల ఒత్తిళ్లకు తలొగ్గి తెలంగాణ జెండాను ఎత్తుకున్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రే తెలంగాణ సాధ్యం కాదన్నాడు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఉద్యమ ద్రోహులే చివరకు తెలంగాణ ఏర్పడిన తరువాత రాజ్యంలో భాగమైనప్పుడే తెలంగాణ ప్రస్థానం ఎటు వైపు పోతుందో పసిగట్టిన బుద్ధిజీవులు ప్రశ్నించడం మొదలుపెట్టారు. ప్రశ్నించడం మొదలు పెట్టగానే బుద్ధిజీవుల మీద నిర్బంధం మొదలయింది. బుద్ధిజీవులను ప్రజా ద్రోహులుగా చిత్రించే ప్రయత్నం చేశారు. తెలంగాణ అభివృద్ధిని బుద్ధిజీవులు అడ్డుకుంటున్నారని ప్రచారం మొదలుపెట్టారు. ఆ ప్రచారాన్ని తమ ప్రసార సాధనాల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. ఆ క్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక మీద రాజ్యం దుర్మార్గమైన నిర్బంధాన్ని ప్రయోగించింది.

తెలంగాణ భావజాల ప్రచారంలో తెలంగాణ విద్యావంతుల వేదికది అత్యంత క్రియాశీలక పాత్ర. అలాంటి తెలంగాణ విద్యావంతుల వేదిక మహాసభలు వరంగల్‌లోని నిట్ కళాశాలలో జరుగుతాయని ప్రకటించారు. అందుకు అనుగుణంగా అనుమతులు తీసుకున్నారు. రేపు సభలు జరుగుతాయనగా నిట్ యాజమాన్యం సభకు ఇచ్చిన అనుమతిని రద్దుచేసింది. సభలు జరగకూడదని అదేశాలిచ్చింది. అప్పటికప్పుడు విద్యావంతుల వేదిక బాధ్యులు తమ సభా స్థలాన్ని మార్చుకున్నారు. సాఫీగా సభలు జరుగుతాయని అనుకుంటుండగానే సభా స్థలాన్ని తెల్లవారి మళ్లీ మార్చుకోవలసి వచ్చింది. రాజ్యం, పోలీసులు ఏకమై తెలంగాణ విద్యావంతుల వేదిక మహాసభలను అడ్డుకున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ విద్యావంతుల వేదిక సభలను అడ్డుకొని పాలకులు ఏం సాధించారు? తమ నగ్నత్వాన్ని ప్రకటించుకున్నారు. తెలంగాణ విద్యావంతుల వేదికకు ప్రత్యామ్నాయంగా మరొక జేబు సంస్థను రాజ్యం ప్రారంభించింది. అయినా ఏం సాధించగలిగింది? నిరుద్యోగుల ఆకాంక్షలను వ్యక్తపరచడానికి కోదండరాం ప్రయత్నిస్తే రాత్రికి రాత్రి కోదండరాం ఇంటిపై దాడిచేసి తలుపులు పగులగొట్టి కోదండరాంను అరెస్టు చేయడం ఏ ప్రజాస్వామిక సూత్రం? దీని కోసమేనా తెలంగాణ కోసం ఉద్యమించింది?

ఇందిరాపార్కు ధర్నాచౌక్ తెలంగాణ ప్రజల ఉద్యమ ఆకాంక్షలకు ప్రతిబింబం. ప్రజలు తమ నిరసనలను పాలక వర్గాలకు వినిపించడానికి చేసే ప్రయత్నాల కూడలి ఇందిరాపార్క్ ధర్నాచౌక్. అలాంటి ధర్నాచౌక్ ఎత్తివేసి ప్రజల ఆందోళనలను నిలువరించే ప్రయత్నం ఏ విలువలకు తార్కాణం?

ఇసుక లారీల కిందపడి మనుషులు చనిపోతే ప్రజలు ఏకమై లారీలను తగులబెడితే, లారీలను ఎలా తగులబెడుతారని, అందుకు బాధ్యులని అనుమానించిన వారిని పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసల పాలుచేయడం ఏ విలువలను ప్రవచిస్తుంది?

మల్లన్నసాగర్ ప్రాజెక్టు కింద తమ భూములు కోల్పోతున్న ప్రజలు ఉద్యమిస్తే పాలక వర్గం వ్యవహరించిన తీరు ఎంత అప్రజాస్వామికం?

తెలంగాణ వస్తే ఓపెన్ కాస్టులు ఉండవని ప్రకటించిన ముఖ్యమంత్రి ఉద్యమించిన ప్రజలపై వ్యవహరించిన తీరు తెలంగాణ ఉద్యమ తీరుతెన్నులను వ్యక్తపరిచే విధంగా ఉందా?

తలసాని, తుమ్మల, కడియం, నామా మొదలైన వారు తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలతో కలిసిరాలేదు. కాని తెలంగాణ ఏర్పడిన తరువాత పాలక వర్గంలో భాగస్వాములైన తీరు తెలంగాణ ఆకాంక్షలకు భిన్నం. తనకు తానే తెలంగాణ ఉద్యమ రథ సారథిగా భావించుకున్న వ్యక్తి దీనికి ఏం సమాధానం చెప్పగలడు?

విద్యార్థులు వరంగల్‌లో కాకతీయ విశ్వవిద్యాలయంలో సభలు పెట్టుకోవాలంటే ఉన్నత న్యాయస్థానాలను అడుక్కోవలసి వచ్చింది. అయితే తెలంగాణలో కూడా అదే పరిస్థితి తలెత్తుతుందని ఎవరనుకున్నారు?

వరంగల్‌లో పుస్తకావిష్కరణ సభకు అనుమతిని నిరాకరించడం వల్ల ప్రజాస్వామిక విలువలు వికసిస్తాయా? భిన్నాభిప్రాయాలను అంగీకరించని పాలక వర్గాలు భిన్నాభిప్రాయాలను వ్యక్తపరిచే సమూహాలను నియంత్రించే ప్రయత్నం చేస్తాయి. ఆ ప్రయత్నాలు తాత్కాలికంగా సఫలమయినట్టుగా కనిపిస్తాయి. కాని అంతిమంగా ఆ ప్రయత్నాలు ఏంత అప్రజాస్వామికమో ప్రజలు నిర్ధారిస్తారు.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడగానే శాంతిభద్రతల పేరుతో పోలీసులకు ఆధునిక ఆయుధాలు, ఆధునిక వసతులు, ఆధునిక వాహనాలు సమకూర్చడం పాలక వర్గాల ప్రాధాన్యతలు ఏమిటో స్పష్టం చేశాయి. పోలీసు కమాండ్‌ను ఏర్పరచి రాష్ట్రంలో ఏ మూల ఏం జరిగినా పర్యవేక్షించే విధానాలు పాలక వర్గాలు ఎంత అభద్రతతో ఉన్నాయో తెలుస్తుంది.

సమాజంలో అసమానతలు ఉన్నంత కాలం, అసమానతలకు కారణమైన మూలాలను విశ్లేషించకుండా, సమస్యలకు పరిష్కారాలను వెతకకుండా ఎన్ని పోలీసు కమాండ్‌లను ఏర్పాటు చేసినా కూడా ప్రజల అసంతృప్తులను అడ్డుకోలేవు. ఎన్ని సిసి కెమెరాలు ఉన్నా, ఎన్ని పోలీసు బలగాలను మోహరించినా, సైన్యాన్ని దింపినా ప్రజలు తిరగబడినపుడు పూచిక పుల్లతో సమానం.

ప్రజా ఆకాంక్షలను ఎవరూ నియంత్రించలేరు. నియంత్రించాలని అనుకుంటే న్యూటన్ మూడవ గమన నియమమే సమాధానమవుతుంది. నిర్బంధాలు తెలంగాణకు కొత్తేం కాదు. ఆ నిర్బంధాలలోనే ఉద్యమాలను నిర్మించుకున్న చరిత్ర తెలంగాణ ప్రజలకు ఉంది.

(రచయిత అధ్యాపకుడు) వీ

పాలకులు చేస్తున్నది, ప్రజలు కోరుకుంటున్నది

***ప్రజలకు మౌలిక అవసరాలైన ఉపాధి, భూమి, మద్యపాన నిషేధం వంటివి కల్పించలేని పాలకులు, మరోవైపు దళితులు, ముస్లింలు, స్త్రీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలను పెంచి పోషిస్తున్నారని అంటున్నారు* డా. కత్తి పద్మారావు**

భారతదేశంలో ఈనాడు ఎన్నికల సమరం ప్రారంభమైంది. మతవాద శక్తులు 2014-19 వరకు విజృంభించాయి. మోదీ నాయకత్వంలో మానవ హననం జరిగింది. దళితుల్ని వెంటబడి వేటాడారు. స్త్రీలను హింసించారు. అత్యాచారాలు చేశారు. హేతువాదుల నాలుకలకు ఉక్కు తాళాలు వేశారు. రామరాజ్యం పేరుతో మనుస్మృతి రాజ్యాన్ని పాలించారు. ముఖ్యంగా రాముడు శంభూకుని చంపాడు కాబట్టి శూద్ర అతిశూద్రులకు విద్యలేకుండా చేయాలని పట్టుపట్టాడు. అన్ని విశ్వవిద్యాలయాల పునాదులు తవ్వేశారు. మోదీ మానవతా రహితంగా వ్యవహరించారు. మానవ హక్కుల్ని కాలరాశాడు. సీతను అనుమానించిన రాముని మార్గంలో ఎందరో స్త్రీల వ్యవస్థల్ని భగ్నం చేశారు. భ్రూణ హత్యలు విపరీతంగా చేసి స్త్రీ జనాభాను బాగా తగ్గించారు. దశాబ్దాల తరబడి ఆడపిల్లల పట్ల సమాజంలో వేళ్లూనుకున్న చిన్నచూపు, నేటికీ దేశంలో పలుచోట్ల భ్రూణ హత్యల్ని ప్రజ్వరిల్లజేస్తూనే ఉంది.

ఆంగ్ల పాలకుల చెరవీడిన ఇన్నేళ్ల తరువాత 'బేటీ బచావో-బేటీ పఢావో' తరహా పథకాల్ని పట్టాలకు ఎక్కించాల్సి రావడం, మునుపటి ప్రభుత్వాల ప్రాథమ్యాలు గాడి తప్పాయనడానికి ప్రబల నిదర్శనం. బాలల హక్కుల పరిరక్షణ జాతీయ సంఘం ఆ మధ్య వెల్లడించిన గణాంకాల ప్రకారం, 15-18 ఏళ్ల మధ్య వయస్కుల్లో 39 శాతానికి పైగా ఆడపిల్లలు ఏ చదువులకూ నోచుకోవడం లేదు. వారిలో అత్యధికులు ఇంటిపనుల్లోనో, బిచ్చమెత్తుకుంటూనో గడుపుతున్నారు. బేటీ పఢావో వంటి పథకాలూ వారి జీవితాల్లో వెలుగులు ప్రసరించలేక పోతున్నాయి! మహిళగా పరిపూర్ణత్వం సంతరించుకోకుండానే బిడ్డలకు జన్మనిస్తున్న చిట్టితల్లుల ఉదంతాలు, పేరు గొప్ప మాతాశిశు సంరక్షణ యోజనల అసమర్థతకు రుజువుగా పెచ్చరిల్లుతున్న ప్రసవ మరణాలు, పౌష్టికాహార లోపాలు - ప్రభుత్వాలు వడివడిగా పూడ్చాల్సిన కంతలెన్నో ఉన్నాయని ఎప్పటికప్పుడు చాటుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ పోషకాహార నివేదికల్ని పరికిస్తే-ప్రజా ప్రభుత్వాల ఉదాసీన వైఖరులు, పర్యవేక్షణ లోపాల కారణంగా ఎందరెందరు అనారోగ్యకర భారతావనికి ప్రతినిధులవుతున్నారో బోధపడుతుంది. ఈ గడ్డమీద కన్ను తెరచిన ప్రతి ఆడపిల్లకూ కనీసం పద్దెనిమిదేళ్లదాకా ఉచిత, నిర్బంధ, ప్రయోజనకర విద్య అందించడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయి.

స్త్రీ అణచివేత

కారణం స్త్రీ వ్యతిరేకత. సీతలాగా, సావిత్రిలాగా, సుమతిలాగా భర్తకు లోబడి ఉండే స్వభావాన్ని భారతదేశంలో బి.జె.పి. పెంచాలని చూస్తుంది. ప్రపంచ స్త్రీల అభ్యున్నతి సూచిలో భారతదేశం గణనీయంగా పడిపోయే స్థాయికి తెచ్చింది. అన్ని విశ్వవిద్యాలయాల్లో స్త్రీల విద్య మీద గొడ్డలివేటు వేసింది. సామాజిక, సాంస్కృతిక, సాంకేతిక రంగాల్లో స్త్రీలను ఒక్క అడుగు కూడా వేయకుండా బి.జె.పి. నిరోధించింది. ప్రపంచ ఆర్థిక వేదిక కూర్చిన లింగ వ్యత్యాస సూచీకన్నా ముందే దేశంలో మహిళల సామాజికార్థిక స్థితిగతులపై పలు సంస్థలు, ఎందరో నిపుణుల విశ్లేషణలు క్షేత్రస్థాయి వాస్తవాలకు అద్దంపట్టాయి. హింస, వేధింపులు, లింగ నిష్పత్తి క్షీణత ఆర్థిక స్వావలంబన లేమిని అవి ప్రధానంగా వేలెత్తి చూపాయి. బి.జె.పి. స్త్రీల మీద, దళితుల మీద కక్ష గట్టింది. అంబేడ్కర్ ఇచ్చిన చైతన్యంతో దళితులు, స్త్రీలు బి.జె.పి.కి వ్యతిరేకంగా ఆలోచించడం ప్రారంభించారు. మోదీ గుండెల్లో దాగిన రాముడనే హంతకుణ్ణి దళితులు, స్త్రీలు గుర్తించారు. అందుకే రాజకీయ చిత్రం మారుతూ వస్తుంది. దళితులు, స్త్రీలు, వ్యవసాయ దారులు హిందూ మతం ఉచ్చుల నుండి నమ్మకాల నుండి మూఢ విశ్వాసాల నుండి బయటపడి తమ చైతన్యాన్ని చాటి చెప్పే వేదికగా ఎన్నికలను బడుగులు గుర్తించడం ఈనాటి ఎన్నికల్లో ప్రధానాంశం. ఓటునుకొన్నా, ఓటును దోపిడి చేసినా, ఓటును సెంటిమెంటుకు భిన్నంగా ప్రజలు ఓటు వేస్తున్నారు. 2013 నాటి చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, అసెంబ్లీ ఎన్నికల్లో బి.జె.పి. విజయం 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభంజనాన్ని ముందే సూచించింది. 2013లో ఈ మూడు రాష్ట్రాల్లోని 65 లోక్‌సభ సీట్లకు 62 సీట్లను ఆ పార్టీ సొంతం చేసుకొంది. ఇప్పుడు అవే రాష్ట్రాల్లో పోలైన ఓట్ల శాతాన్ని చూస్తే 2019లో 30 సీట్లతో సరిపెట్టుకోవలసి వచ్చింది. 2013లో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 80 శాతం పట్టణ ఓట్లను చేజిక్కించుకున్న బి.జె.పి. ఈసారి 46 శాతంతో తృప్తిపడాల్సి వచ్చింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బి.జె.పి. చాలా తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిందని విశ్లేషకులు వాదిస్తున్నా, 2014 ఎన్నికలకన్నా ఇప్పుడు ఆ పార్టీ ఓట్ల శాతం తగ్గిపోయిందని గమనించాలి. దీనికి కారణాలు అందరికీ తెలిసినవే.

ఆర్థికంగా తిరోగమనం

ఇకపోతే ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఆర్థిక శాస్త్ర విశ్లేషకులుగా భారతదేశం పరిస్థితి మరింతగా దిగజారుతున్నట్టు అంచనా వేస్తున్నారు. గడిచిన సంవత్సరంలో అందర్నీ కుదిపేసిన రెండు అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు - చైనా, అమెరికాల మధ్య రగిలిన వాణిజ్య యుద్ధం, చమురు ధరల పెరుగుదల. అంతర్జాతీయ విపణిలో చమురు ధరలు పెరిగినప్పుడు భారతీయ వినియోగదారులు పెట్రోలు, డీజిల్‌కు ఎక్కువ ధరలు చెల్లించక తప్పడం లేదు. అదే అంతర్జాతీయంగా చమురు ధరలు దిగివచ్చినప్పుడు స్వదేశ మార్కెట్‌లో వినియోగదారులకు మాత్రం ఆ మేర ఉపశమనం దక్కడం లేదు. పెట్రో ధరల పెరుగుదల ఎరువుల ధరలనూ పెంచుతుంది. రైతాంగ ఉద్యమాలు ఈ ఏడాది దేశ ప్రజల

దృష్టిని ప్రముఖంగా ఆకర్షించి ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయి. వస్తుసేవల పన్ను (జీఎస్‌టి) తీరును గాడిన పెట్టే పని ఇంతవరకు పూర్తికాలేదు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ దివాలా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను (ఎన్‌బిఎఫ్‌సి) బెంబేలెత్తించింది. పాత బాకీల వల్ల బ్యాంకులు సంక్షోభంలో పడడంతో పాటు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ దివాలా వచ్చిపడింది. ఈ పరిణామాల వల్ల భారత ఆర్థికాభివృద్ధి మందగిస్తోంది. వచ్చే ఏడాది ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం చుట్టుముట్టడం కాయం. వ్యవసాయ ధరలు పడిపోతూనే ఉండడం రైతుల ఆదాయాలను, తద్వారా గ్రామీణ ఆర్థిక స్థితిగతులను దెబ్బతీస్తుంది. తాజాగా ఉల్లిపాయల ధరలు పడిపోవడం పెద్ద హెచ్చరిక సంకేతం. వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం వద్ద పకడ్బందీ వ్యూహమేదీ లేకపోవడం విచారకరం. 2022 కల్లా రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చి సంవత్సరం గడచిపోయినా, ఇంతవరకు అడుగు ముందుకుపడలేదు. ఈ లక్ష్య సాధనకు ప్రభుత్వం వద్ద ప్రణాళిక లేదు. వ్యవసాయ ఎగుమతులను పెంచితే రైతుల ఆదాయాలూ ఇనుమడిస్తాయి. ఆ దిశగా ప్రభుత్వం దీక్షాదక్షతలు కనబరచడం లేదు. కొన్ని రకాల వ్యవసాయ సరకుల ఎగుమతులను హఠాత్తుగా నిషేధించడం. అంతే ఆకస్మికంగా విదేశాల నుంచి వ్యవసాయోత్పత్తుల దిగుమతిని అనుమతించడం ప్రభుత్వానికీ అలవాటైపోయింది. దీనివల్ల రైతులు అయోమయానికి గురవుతూ పంటల ప్రణాళికను చేపట్టలేకపోతున్నారు.

ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల వెనకబాటు

ఇకపోతే ప్రాథమిక వ్యవసాయ సంఘాల పనితీరు అదృశ్యంగా ఉంది. అగ్రకుల ఆధిపత్యం రాజకీయ సామాజిక ఆర్థిక దోపిడీ ఇందులోను ప్రతిఫలించింది. భారతదేశ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఈ వ్యవస్థల్లో కులాధిపత్యం రాజ్యం ఏలుతూ ఉంది. వ్యవసాయ అభివృద్ధిని నాశనం చేసిన ఆయా రాష్ట్రాల అగ్రకుల నాయకుల నాయకత్వంలో ఇవి ఉంటున్నాయి. మోదీ భూస్వామ్య పెట్టుబడిదారీ మత, సామ్రాజ్యవాద తత్వం ఉన్నవాడు. ప్రధానమంత్రికి అభివృద్ధి భావజాలం ఏకోశాన లేదు. కునారిల్లుతున్న ప్రాథమిక వ్యవసాయ సంఘాల దుస్థితి దారుణం. దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో పనితీరు అంతంత మాత్రంగా ఉంది. దేశంలో గల మొత్తం 95,595 ప్యాక్స్‌ల్లో 13.12 కోట్ల మంది సభ్యులుగా ఉన్నారు. వీటిలో 18,101 సంఘాలు మాత్రమే ఆర్థికంగా బలంగా ఉన్నట్లు జాతీయ సహకార బ్యాంకుల సమాఖ్య (నాఫ్స్‌కాబ్) తాజా నివేదిక వెల్లడించింది. మొత్తం సంఘాల్లో 98,036 నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రతి సంఘం వద్ద కనీసం కోటి రూపాయల మూలధనం ఉందనుకున్నా, మొత్తం నిధులు సుమారు రూ. 95 వేలకోట్ల వరకు ఉండాలి. కానీ వాటివద్ద రూ. 14,121 కోట్లే ఉన్నాయి. అంటే దేశవ్యాప్తంగా ఉన్న 13.12 కోట్ల మంది సభ్యుల తరపున సగటున కేవలం రూ. 1,076 మూలధనం ఉందని అర్థం. దీన్నిబట్టి రైతులను ఆదుకోవాల్సిన సహకార సంఘాల ఆర్థిక సత్తువెంతో అర్థం చేసుకోవచ్చు. ఇక సంఘాల్లో డిపాజిట్లు లక్షా 15 వేల కోట్ల రూపాయలు ఉంటే, సంఘాలు చెల్లించాల్సిన అప్పులు మరో తొమ్మిది వేలకోట్ల రూపాయలు అధికంగా ఉన్నట్లు తేలింది. ఈ డిపాజిట్లలో సైతం కేవలం రెండు రాష్ట్రాలు కేరళలో రూ. 83,193కోట్లు, తమిళనాడులో మరో రూ. 9,460 కోట్లున్నాయి. అంటే మొత్తం డిపాజిట్ల సొమ్ములో ఈ రెండు రాష్ట్రాల్లోని 5,150 సంఘాల్లోనే 80 శాతం ఉంది. మిగిలిన దేశమంతా 90 వేల ప్యాక్స్‌ల్లో 20 శాతం నిధులుండడం గమనార్హం. సహకార రుణాల పంపిణీ తీరు మరింత దయనీయంగా ఉంది. వాస్తవానికి సభ్యులుగా ఉన్నవారిలో కేవలం 39.63 శాతానికే (5.20 కోట్ల మందికే) అప్పులిచ్చారు. వీరిలోనూ చిన్న రైతులు కేవలం 1.96 కోట్లమంది. వాణిజ్య బ్యాంకుల రైతులకు సరిగ్గా రుణాలివ్వవనే విమర్శ తరచూ వినబడుతుంది. కానీ ప్యాక్స్‌లోనూ రైతులకు రుణాలిచ్చే తీరు ఏమంత గొప్పగా లేదు. 2009-10లో దేశవ్యాప్తంగా 5.78 కోట్లమంది సభ్యులకు ప్యాక్స్ రుణాలిస్తే 2016-17 నాటికి 5.20 కోట్ల మందికే ఇచ్చినట్లు తేలింది. అంటే ఏడేళ్లలో రుణాలు తీసుకునే సభ్యుల సంఖ్య 58 లక్షల దాకా తగ్గడం ఏ ప్రగతికి సంకేతం అనేది పాలకులకే తెలియాలి. పైగా సంఘాలిచ్చే రుణాల సొమ్మంతా రైతులకు, వ్యవసాయావసరాలకే వెళ్తుందా అన్నదీ అనుమానమే. ఉదాహరణకు 2016-17లో రెండు లక్షల కోట్ల రూపాయలను ప్యాక్స్ రుణాలుగా మంజూరు చేస్తే అందులో వాస్తవంగా వ్యవసాయావసరాలకు అందజేసింది రూ. 89,478 కోట్లేనని తేలింది. మొత్తం రుణాల్లో 55 శాతం వ్యవసాయేతర అవసరాలకు ఇస్తుండగా అందులో 58 శాతం తిరిగి సకాలంలో వసూలే కావడం లేదు. నరేంద్రమోదీ భారతదేశపు జీవన వ్యవస్థలన్నింటినీ కుళ్లపొడిచాడు.

దళిత ద్వేషం

ముఖ్యంగా ఆయనకు దళితుల మీద ఉన్న ద్వేషం వల్ల పునాది అంశాలన్ని చీలికలైనాయి. మనిషిని మనిషి ద్వేషించే మనుస్మృతి భావాలు రాజ్యాంగ స్ఫూర్తి లేకుండా విచ్ఛినం చేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిలేని ఏ నాయకుడు అయినా భారతదేశానికి శత్రువే అని చెప్పాడు. రాజ్యాంగం మనకు ఒక మార్గదర్శి. రాజ్యాంగం భారతదేశపు సమానతకు దిక్సూచి. రాజ్యాంగం మీద ప్రేమలేనివాడు ప్రధానమంత్రిగా, ముఖ్యమంత్రిగా పనికిరాడు. పాలించేవాడికి నీతి, నిజాయితీ, నిక్కచ్చితనం అవసరం. కరుణ ప్రేమ మానవత అవసరం. మోదీ ముఖంలో గాని, కె.సి.ఆర్. ముఖంలో గాని, చంద్రబాబు ముఖంలో గాని ఎక్కడా మానవత్వం కనిపించదు. అందుకే వాళ్లు నిరంతరం తమ ఫోటోలు పేపర్‌లో పడడానికి ఆరాటపడతారు. వ్యక్తిత్వం లేనివారికి ముఖచిత్రం నిర్జీవ ప్రతిమలా మనల్ని భయపెడుతుంది. వీరు ముగ్గురు కూడా భూస్వామ్య పెట్టుబడిదారులకు బానిసలుగా వ్యవహరించడం వల్ల ప్రజల యొక్క తీవ్రమైన వ్యతిరేకతకు ఈ రోజు గురి అవుతున్నారు. ప్రజలు ఈ రోజు భూమిని పంచమని అడుగుతున్నారు. వీరేమో ఒక్క ఎకరం భూమిని కూడా పంచలేదు. ముఖ్యంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థకు రిజర్వ్‌బ్యాంక్ మూలమైంది. ఆ వ్యవస్థనే దెబ్బతీయడానికి మోదీ ప్రయత్నం చేశాడు.

బ్యాంకుల అస్తవ్యస్తత

1957లో బెనెగల్ రామారావ్ ఆర్‌బిఐ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. తరువాతా పలువురు గవర్నర్లు ప్రభుత్వంతో వివాదాల కారణంగా రాజీనామా చేశారు. ఏదీ ఏమైనా విభేదాలు, ఒత్తిళ్ల కారణంగా ఆర్‌బిఐ గవర్నర్ రాజీనామా చేయడం చరిత్రలో అరుదైన సంఘటనగానే చెప్పుకోవాలి. ఉర్జిత్ స్థానే ఆర్థిక సంఘం సభ్యుడు, మాజీ ఆర్థిక కార్యదర్శి శక్తికాంత దాస్ ఆర్‌బిఐ పగ్గాలు చేపట్టడం తాజా పరిణామం. గత

కొంతకాలంగా రిజర్వు బ్యాంకు వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకొంటూ, ఆ సంస్థ స్వయం ప్రతిపత్తికి భంగం వాటిల్లే రీతిలో వ్యవహరించడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. గతంలో ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య సంస్థ స్వయం ప్రతిపత్తిపై చేసిన వ్యాఖ్యలు, ప్రభుత్వం, రిజర్వు బ్యాంకుల మధ్య దూరాన్ని మరింత పెంచి విభేదాలకు ఆజ్యం పోశాయి.

గత ఫిబ్రవరిలో నిరర్ధక ఆస్తుల నిబంధనలకు కఠినతరం చేస్తూ, ఆర్‌బిఐ జారీచేసిన ఆదేశాలు పెద్ద దుమారాన్ని రేపాయి. ఈ నిబంధనలను కొంతమేర సడలించాలని ప్రభుత్వం ఆర్‌బిఐ పై ఒత్తిడి పెంచింది. అదే విధంగా సత్వర దిద్దుబాటు చర్య (పిసిఎ– ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్) పరిధిలో ఉన్న 11 ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఊరట కల్పించేందుకు పిసిఎ నిబంధనలను సడలించాలని ప్రభుత్వం పట్టుబడుతోంది. నిధుల కొరత సమస్య ఎదుర్కొంటున్న బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు చేయూత ఇవ్వడానికి ఆర్‌బిఐ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం కోరుకుంటోంది. అత్యంత కీలకమైన, వివాదాస్పదమైన అంశం. ఆర్‌బిఐ మిగులు నిధుల నిర్వహణ వీటితోపాటు మరికొన్నింటిపై పరిశీలనకై పలు కమిటీలను నియమించాలని బోర్డు నిర్ణయించింది. పిసిఎ పరిధిలో ఉన్న బ్యాంకులపై ఉన్న ఆంక్షలను పాక్షికంగా ఎత్తివేసే దిశలో ముందడుగు పడింది. పిసిఎ నిబంధనల సడలింపు అంశాన్ని బోర్డ్ ఫర్ ఫైనాన్షియల్ సూపర్‌విజన్ (బీఎఫ్‌ఎస్) కు అప్పగించాలని ఆ సమావేశంలో నిర్ణయించారు.

ఆర్‌బిఐ వద్ద ఉండాల్సిన మూలధన నిధుల నిల్వలపై ఒక అత్యున్నత స్థాయి కమిటీ వేయాలని బోర్డు నిర్ణయించింది. అదే విధంగా రు.25 కోట్ల వరకు సూక్ష్మ చిన్న, మధ్యతరహా సంస్థ (ఎమ్ఎస్ఎమ్ఈ) లకు రుణ పునర్వ్యవస్థీకరణ వెసులుబాటు కల్పించే దిశలో ఆర్‌బిఐ చర్యలు చేపట్టేందుకు అంగీకారం తెలిపింది. బ్యాంకుల కనీస మూలధన నిష్పత్తి (సిఎఆర్) లో ఎటువంటి మార్పులు చేయకుండా తొమ్మిది శాతం వద్దే ఉంచాలని బోర్డు నిర్ణయించింది. గత బోర్డు సమావేశాల్లో పలు వివాదాస్పద అంశాలపై కొంత సయోధ్య కుదిరినట్లు కనపడినా, ప్రభుత్వ ఒత్తిళ్లకు రిజర్వుబ్యాంకు తలొగ్గక తప్పని పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో ఉర్జిత్ పటేల్ రాజీనామా అస్త్రాన్ని సంధించారు. ఈ నెల 14న జరగనున్న రిజర్వు బ్యాంకు బోర్డు సమావేశంలో కొన్ని కీలక అంశాలపై సభ్యుల నుంచి ఒత్తిడిని ఎదుర్కొనవలసి వస్తుందన్న సంకేతాలు ఇప్పటికే అందుతున్నాయి. అంతేకాక రిజర్వు బ్యాంకు బోర్డును బలోపేతం చేసి గవర్నర్ అధికారాలను కుదించే దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న సంకేతాలూ అందుతున్న నేపథ్యంలో ఉర్జిత్ పటేల్ రాజీనామా వైపు మొగ్గుచూపారు.

దళితుల అణచివేత

లోక్‌సభ ఎన్నికల్లోనూ భాజపా వ్యతిరేక ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రాల అధికార వికేంద్రీకరణే ధ్యేయంగా ఏకమయ్యే పరిస్థితి వచ్చింది. దక్షిణాది రాష్ట్రాల్ని అణగదొక్కుతున్నారు. వాటికి ఒక ఐడెంటిటీ లేకుండా చేస్తున్నారు. అగ్రకుల ఆధిపత్యం అన్ని రాష్ట్రాల్లో పెరగడం వల్ల వారి చేతిలో పోలీస్ స్టేషన్, వారి చేతిలో ఎంఆర్ఓ ఆఫీసు, వారి చేతిలో ఎండిఒ ఆఫీసు, వారి చేతిలో కలెక్టర్ ఆఫీసు ఇవన్నీ ఉండడం వల్ల ఇప్పటికీ దళితుల్ని వేధిస్తూనే ఉన్నారు. ఈ విషయాన్ని అంబేద్కర్ ముందే పసిగట్టి రాబోయేది అగ్రకుల రాజ్యాధికారమే, దానిలో అంటరానివారు ఎదుర్కోవలసిన సమస్య అతి ఉగ్రమైనది. అది అంటరానివారి పట్ల ద్వేషభావం కలిగిన విస్తృత హిందూజన సమూహం అంటరాని వారి చుట్టూ ఉంది. అది వారిపై అత్యాచారాలు చేయడానికి, వారి పట్ల అసమానత పాటించడానికి ఏ మాత్రమూ సిగ్గుపడదు. నిత్యకృత్యాలుగా ఉండే ఈ అత్యాచారాల నుంచి రక్షణ పొందడానికి, ఈ అన్యాయాల నుంచి న్యాయం పొందడానికి అంటరానివారు పాలనా యంత్రాంగ సహాయాన్ని పొందవలసి వస్తూ ఉంటుంది.

ఈ పాలనా యంత్రాంగం మార్పు, స్వభావం ఏమిటి? క్లుప్తంగా చెప్పాలంటే, భారతదేశంలో పాలనా యంత్రాంగం పూర్తిగా హిందువుల చేతిలో ఉంది. అది వారి గుత్తస్వామ్యం పై నుండి కింది వరకూ అది వారి నియంత్రణలో ఉంటుంది. వారి ఆధిపత్యం లేని ప్రభుత్వ శాఖ ఒకటి కూడా లేదు. పోలీసు శాఖ వారి ఆధిపత్యంలోనే ఉంటుంది. న్యాయశాఖ, రెవిన్యూశాఖ, ఒకటేమిటి, పాలనా యంత్రాంగంలోని ప్రతి శాఖలోనూ వారిదే ఆధిక్యత. గుర్తుంచుకోవాల్సిన మరో అంశమేమంటే, పాలనా యంత్రాంగం వెలుపల ఉన్న హిందువులకు, అంటరానివారిపట్ల ఏ రకమైన ద్వేషభావమూ, సాంఘిక అసమానతా భావమూ ఉన్నాయో పాలనా యంత్రాంగంలో ఉన్న హిందువులకు కూడా అదే దృక్పథం ఉంది. అంటరానివారికి వ్యతిరేకంగా వివక్షత పాటిస్తూ, చట్టం ఇచ్చే ప్రయోజనాలనూ, లాభాలనూ నిరోధించడమే కాకుండా, అణచివేత నుంచి, నిరంకుశత్వం నుంచి చట్టం కల్పించే రక్షణలు కూడా అంటరానివారికి దక్కకుండా చేయడమే వారి లక్ష్యం. తత్ఫలితంగా హిందూ జనాభాకూ హిందూజన సామాన్యం, అంటరాని వారికి అన్యాయాలు చేసేవారయితే – ఆ విధంగా అన్యాయాలకు గురైనవారికి హిందూ పాలనా యంత్రాంగం, ఆ బాధితులకు సహాయాన్ని అందించే బదులు, నేరస్థులకు రక్షణ కల్పిస్తుంది. మోదీ పాలనలో భారతదేశ వ్యాప్తంగా దళితులపై దమనకాండ జరుగుతుంది. డా బి.ఆర్. అంబేద్కర్ ఈ విషయాన్ని ముందే గమనించి దళితులకు రాజ్యాధికారమే ప్రధానమైన కీ అని చెప్పాడు. ఆ తాళం చేతిలో లేనపుడు మనం ఏ కార్యం నిర్వహించలేమని అంబేద్కర్ చెప్పారు.

చంద్రబాబు పాలనా దౌష్ట్యం

అంతేకాకుండా ఆంధ్ర రాష్ట్రంలో చంద్రబాబు పాలనా దళితుల్ని అణచివేసేదిలా ఉంది. అగ్రకులాలు దారుణంగా వ్యవహరిస్తున్నాయి. అది నిజం కాదనేది కూడా స్పష్టం అవుతుంది. కులాన్ని, మతాన్ని, దోపిడీని కొనసాగించడంలో చంద్రబాబు అందివేసిన చెయ్యి. అందుకనే దళితులు ఈసారి మేల్కొన్నారు. చంద్రబాబు అన్ని వ్యవస్థల్ని సొంత సామాజిక వర్గానికి దారాదత్తం చేస్తున్నారని తెలుసుకొన్నారు. నీతి, నిజాయితీని పక్కకు నెట్టి లక్షల కోట్ల రూపాయలు దండుకొని పితృస్వామ్య ఆధిపత్యానికి పట్టంగట్టి భూమిని పంచకుండా అనేక పేర్లతో ప్రజల చేతుల్లోకి తాయిలాలు పెడుతున్నాడు. కానీ ఆంధ్రుల భూమి మల్టీనేషనల్‌కు అమ్ముకొంటూ ఆంధ్రులుగా పుట్టిన ప్రజలకు ఒక ఎకరం భూమి ఇవ్వకపోవడం ఆయన భావ దారిద్ర్యానికి, ఆయన కులాధిపత్య భావానికి అర్థం పుడుతుంది. చంద్రబాబు ఈ రోజు ఇస్తున్న ఉపన్యాసాలు చూస్తుంటే ఎవరికైనా నవ్వుపుట్టక తప్పదు. ఆయన స్థిరత్వాన్ని కోల్పోయాడు. చంద్రబాబు మానసిక వైకల్యానికి గురైయ్యాడని అందరూ

చెప్పుకొంటున్నారు. ఆయన పుత్ర ప్రేమే ఆయనకు రాజకీయ దారిద్ర్యాన్ని తీసుకొచ్చిందని ఆయన తెలుసుకోలేకపోయాడు. పుత్ర ప్రేమ అనేది ఒక ఊబి. పుత్ర ప్రేమ అనేది ఒక వ్యసనం. అది చంద్రబాబులో ఉన్నంత మరెవ్వరికీ కనిపించదు.

దళితుల పట్ల చంద్రబాబు వ్యతిరేకత

ముఖ్యంగా దళితుల పట్ల ఉన్న వ్యతిరేకతను బడ్జెట్‌లో చూపించాడు. ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్ కేటాయింపుల్లోనూ ప్రభుత్వం అంకెల గారడీ చూపించింది. ఈ బడ్జెట్‌లో ఎస్.సి. సబ్‌ప్లాన్‌కు 27.96 శాతం పెంచి రు.14,367 కోట్లు, ఎస్.టి. సబ్‌ప్లాన్‌కు 28.97 శాతం పెంచి రు.5,385 కోట్లు, బి.సి. సబ్‌ప్లాన్‌కు 33 శాతం పెంచి రు.16,226 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి 18.57 శాతం పెంచి రు.1304 కోట్లు కేటాయించారు. అయితే గడిచిన నాలుగేళ్లలో ఎస్.సి./ఎస్.టి./బి.సి. సబ్‌ప్లాన్‌ల నిధులు ఖర్చు చేసింది చాలా తక్కువేనని ఆర్థిక మంత్రే రాష్ట్ర శాసన సభలో ప్రకటించారు. గత బడ్జెట్‌లోని కేటాయింపుల్లో దాదాపు రు.5 వేల కోట్లు మిగిలి ఉన్నాయనేది ఒక వాస్తవం. కాబట్టి ఈ బడ్జెట్‌లోని కేటాయింపులంతా ఆయా వర్గాలను మభ్యపెట్టడానికి తప్ప వారి సంక్షేమానికి కాదనేది స్పష్టమవుతున్నది. ప్రతీ కులానికి కార్పొరేషన్ అంటూ ప్రకటించారే తప్ప ఆయా కార్పొరేషన్ల మూల నిధి బడ్జెట్‌లో కేటాయింపులు జరుగలేదు. ఈ రోజు చంద్రబాబు పతనావస్థకు రావడానికి కారణం దళితుల ధనాన్ని వాడుకోవడం. దళితులను అపహాస్యం చేసిన చంద్రబాబు.

దళితులపై దాడులు చేసిన వారికి సీట్లు

దళితులపై దాడిచేసిన చింతమనేని ప్రభాకర్, కరణం బలరామ్ వంటి వారికి టికెట్లు ఇవ్వడమే కాక తమ సొంత ఊరు హైస్కూల్లో అస్పృశ్యులను వేరుగా కూర్చోపెట్టి అన్నం పెట్టిస్తున్న కోడల శివప్రసాద్‌కు టికెట్టు ఇవ్వడం, పొన్నూరు నడిబొడ్డులో మందు షాపు పెట్టిన ధూళిపాళ్ల నరేంద్రకు టికెట్టు ఇవ్వడం, నీరు – చెట్టు పేరుతో దళితుల భూములు ఆక్రమించిన ప్రత్తిపాటి పుల్లారావుకు తమ సొంత కులాన్ని అందలం ఎక్కించడం వంటి కులాధిపత్య భావాలు కూడా ఆయనలో ఉన్న సంకుచిత మనస్తత్వాన్ని బయటకు తీస్తున్నాయి. బి.సి. పార్టీ అని ప్రచారం చేసుకొంటూ సుమారు 70 సీట్లు రావాల్సిన బి.సి.లకు 26 కట్టబెట్టి అది బి.సి.ల్లో ఆధిపత్యం ఉన్న కులాలకు ఆ సీట్లు ఇచ్చి నిజమైన వృత్తికారుల్ని, సామాజిక తరగతుల్ని నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు వారి ఓట్లను పొందే పరిస్థితుల్లో లేడు. చంద్రబాబు తన సామాజిక వర్గం తక్కువ ఉన్న జిల్లాల్లో కూడా ముఖ్యంగా దెందులూరు చింతమనేని ప్రభాకర్ రౌడీ షీటర్ ఎంతో మంది దళితుల మీద, స్త్రీల మీద స్వయంగా దాడిచేసినటువంటి వాడు. ఆయనకి చంద్రబాబు సీటు ఇవ్వడంతో రౌడీలను ప్రోత్సహిస్తున్నాడనే భావం భయటపడింది.

తణుకు రాధాకృష్ణ ఎంతో మంది దళితుల్ని వేధించాడు. ఎస్.సి., బి.సి. పోలీసుల్ని వేధించాడు. నిడదవోలు శేషరావు, సామాజిక వర్గంవాడు. జిల్లా పరిషత్ ఛైర్మన్ బాపిరాజు చంద్రబాబు సామాజిక వర్గం వాడే. నిజానికి మనం జనాభాకు గాని మనం వెస్ట్‌గోదావరిని పరిశీలిస్తే కాపులు, శెట్టిబలిజలు, ఎస్.సిలు, అగ్నికుల క్షత్రియులు, మిగిలిన బి.సి. వర్గాలు ఎక్కువగా ఉంటారు. కానీ కీలకమైన ప్రాంతాలంతా కమ్మవారికి సీట్లు ఇవ్వడం ఆశ్చర్యం. పక్కా నేరస్త చరిత్ర ఉన్న కరణం బలరామ్‌కు చేనేత వృతులు ఎస్.సి. లైన చీరాల ఇవ్వడం, బాంబుల సంస్కృతిని విస్తరించడానికే అనేది అర్థం అవుతుంది. మరొక చేనేత మంగళగిరిలో తన కొడుకును నిలబెట్టాడు. లోకేష్ అంటే అవినీతిలో అగ్రగణ్యుడు. మంగళగిరిలో పాగా వేసి అమరావతిని ఆక్రమించాలనేది వాళ్ల వ్యూహం. కానీ గుంటూరు జిల్లా కమ్మవారు అంత సుముఖంగా లేరు. ఇక్కడ అంతర్గత సంక్షోభం నడుస్తుంది. చంద్రబాబు బి.సి.లకు రావాల్సిన సీట్లు కమ్మవారిని ఎందుకు నిలబెడుతున్నారనే చర్చ బాగా జరుగుతుంది.

ఆంధ్రదేశాన్ని అంతా సొంత కుల జాగీరుగా మార్చాలని చూస్తున్నాడు. పోలీసు, రెవెన్యూ, అధికారుల్ని ఎన్నికల్లో వాడాలని చూస్తున్నారు. దానికి వ్యూహాలు పొందుతున్నారు. ఇంటింటికి డబ్బు, మందు సరఫరా చేసే ముఠాల్ని సిద్ధం చేస్తున్నారు. స్త్రీల ఓట్లు కొల్లకొట్టడానికి వృద్ధాప్య ఫించన్ పెంచామని, పసుపు కుంకుమతో డబ్బు ఇచ్చామని చెప్తున్నా మద్యపాన విషయంలో స్త్రీలు చైతన్యంతో ఉన్నారు. చంద్రబాబు ఊరురు బెల్ట్ షాపులు పెట్టి కుటుంబాల్ని, విద్యని ధ్వంసం చేశాడనేది అర్థం చేసుకొంటున్నారు. ఇక చంద్రబాబు వస్తే ఊళ్లన్ని మద్యపానం వాసన వస్తాయని, చనిపోయే మగవాళ్ల సంఖ్య పెరిగి వితంతువులు, ఒంటరి మహిళలు పెరిగిపోతారని స్త్రీలు మాట్లాడుకొంటున్నారు. ఇప్పటికే తాగుడుకు భయపడి చాలామంది యువతులు పెండ్లిళ్లు చేసుకోవడం లేదు. పెండ్లిళ్లకు సంబంధించి సామాజిక సంస్కృతి కొరవడింది. మరోపక్క బిసిలను సామాజిక, సాంస్కృతిక దేశ నిర్మాత శక్తులుగా చంద్రబాబు గమనించడం లేదు.

ఆంధ్రులు ఎలాంటి పాలన కోరుకొంటున్నారు?

అందువల్లే 2019 ఎన్నికలతో చంద్రబాబు ఓటమి భయంతో ఊగిసలాడుతున్నాడు. అటు రాయలసీమలో దీవాకర్ రెడ్డి కొడుక్కు కోట్ల విజయ్‌బాస్కర్ రెడ్డి కొడుక్కి ఇటు కాంగ్రెస్ నుంచి వచ్చిన వారికి రాత్రికి రాత్రి సీట్లు ఇవ్వడంతో సొంత పార్టీల వాళ్లే ఎం.పి.లుగా నిలబడడానికి వెనకాడారని అర్థమౌతుంది. చంద్రబాబు సామాజిక అస్తవ్యస్థకు గురిచేశారు. ఇవాళ్ల ఆంధ్ర ప్రజలు కోరుకొంటుంది ఏమిటంటే రెండు కోట్ల ఎకరాలకు భూమి ఉంది, దాన్ని భూమిలేని పేద ప్రజలకు పంచాలనేది. రెండు మద్యపాన నిషేధాన్ని నిక్కచ్చిగా ప్రకటించాలని, మూడు ప్రతి మండలంలోనూ ఒక ఉపాధి పరిశ్రమను పెట్టి యువతకు ఉద్యోగ వసతి కల్పించాలి. నాలుగు ప్రతి మండలంలోను వృద్ధాశ్రమాలను నిర్వహించాలని, ఐదు అన్ని హాస్టల్స్‌ను రెసిడెన్షియల్‌గా మార్చాలని. అధికార పక్షం గాని, ప్రతిపక్షం గాని కేవలం సంక్షేమ పథకాలే కాకుండా మానవ శ్రమకు మానవ వనరులకు అనుసంధానం కలిగించి ఆంధ్ర రాష్ట్రాన్ని ఉత్పత్తి కేంద్రంగా మలచాలనేది ముఖ్యమైన విషయం. ఓడరేవు లన్నింటిని కూడా విస్తృత స్థాయిలో అభివృద్ధి చేసి 4 లక్షల కోట్ల బడ్జెట్ వచ్చే స్థితికి ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆశిస్తున్నారు. ఏది ఏమైనా చంద్రబాబు దిగిపోవడం తథ్యం అనుకున్న సందర్భంలో చంద్రబాబుకు ప్రత్యామ్నాయమైన ఎజెండా, ప్రత్యామ్నాయమైన పరిపాలనా విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు కోరుకొంటున్నారు. ఈ దిశగా లౌకిక ప్రజాస్వామ్య సామ్యావాద శక్తులన్ని ఓటును సాధనంగా మలచుకొని నూతన సామాజిక, రాజకీయ విప్లవానికి పునాది వేస్తారని ఆశిద్దాం.

(రచయిత సామాజిక తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ) వీ

అటవీ హక్కుల చట్టం - సుప్రీంకోర్టు తీర్పు

***అటవీ హక్కుల చట్టం 2006 స్ఫూర్తికి భిన్నంగా గిరిజనులనులకు జీవనాధారమైన అటవీ ప్రాంతం నుంచి వెళ్లగొట్టి అభయారణ్యాలను ఏర్పాటు చేయాలనేది సాకు మాత్రమేననీ, అసలు ఉద్దేశ్యం కార్పొరేట్లకు అప్పగించడమేననీ అంటున్నారు* కె. రమ**

అటవీ హక్కుల చట్టం 2006 స్ఫూర్తికి భిన్నమైన, అసమంజసమైన, అన్యాయమైన తీర్పును సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చింది. దీని వలన దేశంలో ఉన్న సుమారు పది లక్షల మందికి పైగా గిరిజన ప్రజల జీవితాలు ప్రశ్నార్థకం కాబోతున్నాయి.

అటవీ హక్కుల చట్టం అమలు జరిపితే అటవీ ప్రాంతం ధ్వంసమై పోతుందనీ, వన్యప్రాణులు నశిస్తాయనీ, అటవీ సంపదకూ, పర్యావరణానికీ తీవ్ర ముప్పు వాటిల్లుతుందని వైల్డ్ లైఫ్ అనే స్వచ్ఛంద సంస్థ 2008లో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై ఆధారపడి 2019 ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టు ఒక తీర్పునిచ్చింది. దాని ప్రకారం వివిధ రాష్ట్రాల అఫిడవిట్‌ల ఆధారంగా అటవీ హక్కుల చట్టం ద్వారా తిరస్కరించబడిన దరఖాస్తుదారులను జూలై 27 కల్లా తొలగించాలని ఆదేశాన్ని ఇచ్చింది.

సుప్రీంకోర్టు తీర్పుపై, కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. అందులో గిరిజనులు నివసిస్తున్న ప్రాంతం నుండి వెళ్లగొట్టాలని లేదని, కేవలం పరిశీలించమని మాత్రమే ఉన్నదని కేంద్రం పేర్కొంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రా నాయకత్వంలోని ద్విసభ్య ధర్మాసనం జూలై 27 లోగా తిరస్కరణలకు గురైన వారిని పంపించివేయాలన్న ఉత్తర్వుపై ఫిబ్రవరి 28న స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌పై స్పందిస్తూ ఇప్పటి వరకు కేంద్రం ఎందుకు స్పందించలేదని, ఆర్డర్ ఇచ్చిన తరువాత ఎందుకు స్పందిస్తున్నారని మండిపడింది. అయితే దానికి సంబంధించిన పూర్తి వివరాలు తమకు సమర్పించాలని రాష్ట్ర కార్యదర్శులకు సూచించింది.

సుప్రీంకోర్టు 'స్టే' ఉత్తర్వుతో తాత్కాలికంగా గండం గడిచి గట్టెక్కినా, ఊపిరి పీల్చుకునే అవకాశం దొరికినా ప్రమాదం మాత్రం పొంచే ఉంది. ఎన్నికల సమయం గనుక కేంద్ర ప్రభుత్వం స్టే కోసం అఫిడవిట్ దాఖలు చేసిందనే వాస్తవాన్ని గుర్తించాలి.

మన దేశంలో పది కోట్ల మంది గిరిజనులుండగా, వారిలో 40 లక్షల మంది రక్షిత అటవీ ప్రాంతంలో ఉంటున్నారు. వీరు నాగరిక సమాజానికి దూరంగా అడవిలో పోడు వ్యవసాయం చేసుకుంటూ, అడవిలో దొరికే దుంపలూ, వెదురు పిలకలూ, కల్లూ మామిడి టెంకలూ, చింతగింజలూ, తదితర సాంప్రదాయ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తూ వచ్చారు. గతంలో వారికి తమ గ్రామాలకు సమీపంలో జరిగే వారాంతపు సంతలకు కాలినడకన వచ్చి తమ అటవీ ఉత్పత్తులైన తేనే, అడ్డాకులు, చీపుర్లు చింతకాయలు, జిగురులను అమ్ముకొని తమకు కావలసిన సరుకులు తీసుకు వెళ్లేవారు. గత 50 సంవత్సరాల్లో వారిలో మార్పు వచ్చింది. తమ పిల్లలను చదివించుకోవడం పెరిగింది. పోడు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకున్నారు. క్రమంగా బోర్లు వేసుకున్నారు. సంప్రదాయ పంటల సాగు నుండి వ్యాపార పంటలు పండించే స్థాయికి ఎదిగారు. దానితో వారి ఆదాయమూ కొంత మేరకు పెరుగుతూ వచ్చింది.

ప్రభుత్వం వారి అభివృద్ధి గురించి పట్టించుకోకపోయినా, ఉద్యమకారుల అండతో, సహకారంతో, తోడ్పాటుతో తమ కాళ్ల మీద తాము నిలబడ్డారు. ఇంతలో పులి మీద పుట్రలా 2002లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దానిపై ఆధారపడి అడవిలో హక్కులు క్రమబద్దీకరించకుండా నివసిస్తున్న ప్రజలను తొలగించాలనే సర్క్యులర్‌ను ప్రభుత్వం ఇచ్చింది. అటవీ ఆక్రమణలు తొలగించే పేరిట సుమారు మూడు లక్షల మందిని బలవంతంగా అడవుల నుండి ఖాళీ చేయించారు. ఈ సమయంలో ఎన్నో ఆకృత్యాలు జరిగాయనీ, ఇళ్లను తగులబెట్టారనీ, మహిళలపై అత్యాచారాలు జరిగాయనీ, పంటలను ధ్వంసం చేశారనీ, పోలీసు కాల్పుల్లో అనేక మంది చనిపోయారనీ ఆ విషయంపై అధ్యయనం చేసిన సి.ఆర్. బిజోయ్ పేర్కొనడం గమనార్హం. ఆ తరువాత అడవులలో నివసిస్తున్న గిరిజనుల అటవీ హక్కులను గుర్తించాలంటూ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం ముందుకు వచ్చింది. ప్రజా ఉద్యమాల ఫలితంగా ఆనాడు అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం 'అటవీ హక్కుల చట్టం 2006'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకుంది.

అటవీ హక్కుల చట్టం ఏం చెపుతోంది?

దీని ప్రకారం రక్షిత అడవులైనా, రిజర్వు ఫారెస్టు అయినా, అభయారణ్యాలు అయినా 2005 డిసెంబర్ కన్నా ముందు నుండి పది ఎకరాల లోపు వ్యవసాయం చేసుకుంటున్న వారికి పూర్తి హక్కులు ఇవ్వాలని ఈ చట్టం చెబుతోంది. అంతేకాదు నివాస హక్కులు, ఉమ్మడి వనరులపై హక్కులు, సాగుచేసుకునే హక్కులు లాంటి 13 రకాల హక్కులను ఈ చట్టం ద్వారా గిరిజనులు పొందారు. అయితే అడవి ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనేతరులు, సాంప్రదాయ తెగలు మాత్రం 2005కు పూర్వం మూడు తరాలు అంటే 75 సంవత్సరాలు అక్కడ నివసిస్తున్నట్లు ఆధారాలు చూపాల్సి ఉంటుంది.

అడవి ప్రాంతంలో చెట్టూ పుట్టా నరికి గిరిజనులు భూములను సాగుచేసుకుంటూ వస్తున్నారు. అటవీ హక్కుల చట్టం 2006 రాకతో తమ భూములకు పట్టాలు వస్తాయనీ, హక్కులు లభిస్తాయనీ, ఇక ముందు బ్యాంకులలో క్రాప్ లోన్లు లాంటివి పొందవచ్చనీ గంపెడాశతో దరఖాస్తు చేసుకున్నారు. కానీ వాటిలో సగానికి పైగా తిరస్కరణకు గురి కావడం గమనార్హం. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖే స్వయంగా వెల్లడించిన వివరాల ప్రకారం 42 లక్షల దరఖాస్తులు వచ్చాయనీ, వాటిలో 18 లక్షల 90 వేల మందికి పట్టాలు ఇచ్చారనీ, 19 లక్షల 40 వేల మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయనీ, తక్కినవింకా పరిశీలన

దశలోనే ఉన్నాయనీ స్పష్టమవుతోంది. దాదాపు 14 లక్షల 78 వేల దరఖాస్తులు గ్రామ సభ పరిశీలన దశలోనే తిరస్కరణకు గురయ్యాయి.

అటవీ హక్కుల చట్టం ప్రకారం తిరస్కరణకు గురైన దరఖాస్తు దారులకు ఆ విషయం తెలిపి, మరోసారి అప్పీలుకు అవకాశం కల్పించాలి. అంతేగాక తిరస్కరణకు కారణాలు ఏమిటో సబ్ డివిజన్ కమిటీ, జిల్లా కమిటీలను గ్రామ సభ వివరాలు కోరవచ్చు, తెలుసుకోవచ్చు. 2005 కన్నా ముందు నుండీ ఆ ప్రాంతంలో ఉంటున్నట్లు ఆధారాలుంటే మళ్లీ క్లెయిమ్స్ వేసుకోవాలి. ఫారెస్టు డిపార్టుమెంట్ తిరిగి సర్వే చేయాల్సి ఉంటుంది. అలాగే అటవీ హక్కుల చట్టం 4(5) ప్రకారం హక్కుల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎవరినీ భూముల నుండి తొలగించకూడదు. అటవీ హక్కుల చట్టంలో తిరస్కరణకు గురైన వారిని తొలగించమని ఎక్కడా పేర్కొనలేదు. అంతేకాదు సర్వే ప్రక్రియ, తిరిగి దరఖాస్తు, రీసర్వే ఈ ప్రక్రియ అంతా పూర్తయిన తరువాత దరఖాస్తుదారు రెండవసారి కూడా సరైన ఆధారాలు చూపలేకపోతే ఆ నివేదికను తిరస్కరణకు కారణాలనూ గ్రామ సభకూ, ఆయా దరఖాస్తుదారులకూ తెలియజేయాల్సి ఉంటుంది.

అంతేకాదు, దేశంలో ఎక్కడా ఈ ప్రక్రియ పూర్తవకుండానే, పూర్తి చేయకుండానే గిరిజన ప్రజల అమాయకత్వాన్ని, అటవీ హక్కుల చట్టంపై సరైన అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని వారి భూములను బలవంతంగా స్వాధీనం చేసుకొని మొక్కల పెంపకాన్ని చేస్తున్నారు. పైగా గిరిజనులు అడవులను ధ్వంసం చేస్తున్నారనీ, పర్యావరణానికి నష్టం చేస్తున్నారనీ తప్పుడు లెక్కలు చెపుతూ కాకిగోల చేస్తున్నారు.

అంటే సమగ్ర సర్వే చేయకుండా, తగిన కారణాలు చూపకుండా దరఖాస్తును తిరస్కరించకూడదు. యుపిఎ హయాంలో ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం అటవీ హక్కుల చట్టం అమలు తీరుపై మూడు నివేదికలను సమర్పించింది. చట్టం అమలు తీరు గిరిజనుల ఆశలను నెరవేర్చే విధంగా లేదనీ, క్షేత్రస్థాయిలో అమలు తీరు ఘోరంగా ఉన్నదనీ నివేదించడం గమనార్హం.

అచ్ఛేదిన్ ఎవరికి?

రాష్ట్రంలో 2.40 కోట్ల ఎకరాల భౌగోళిక విస్తీర్ణం ఉండగా అందులో 70.18 లక్షల ఎకరాలు మాత్రమే అడవులున్నాయి. అదీగాక ప్రస్తుతమున్న అడవులలో చెట్లు ఉన్న అడవులు 20 శాతం మించిలేవు. ఎనభై శాతం అడవులను అటవీ శాఖ సహకారంతో పాలక వర్గాలకు చెందినవారు, గాలి జనార్ధన్ రెడ్డి లాంటి వారు ఆక్రమించి బయలు ప్రాంతాలుగా మార్చారు. కర్ణాటక రాష్ట్రంలో మైనింగ్ మాఫియా అయిన గాలి సోదరులకు బిజెపి గొడుగు పడుతున్న వైనం బహిరంగ రహస్యమే.

బిజెపి అధికారానికి వచ్చాక అటవీ భూములను అడ్డగోలుగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టింది. ల్యాండ్ కాన్‌ఫ్లిక్ట్ వాచ్ (ఎల్‌సిడబ్ల్యు) అనే సంస్థ వెల్లడించిన గణాంకాల ప్రకారం గత సంవత్సరం జనవరి నాటికి పదకొండు రాష్ట్ర ప్రభుత్వాలు, 26 కేసుల్లో గ్రామ సభల అభిప్రాయాలనూ, నిర్ణయాలనూ, కొన్ని చోట్ల గ్రామ సభలు జరపకుండానే అడ్డగోలుగా అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశాయి. జార్ఖండ్‌లో గ్రామ సభల అనుమతి లేకుండానే ఐదు లక్షల ఎకరాల అటవీ భూమిని ఒక కార్పొరేట్ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. అటవీ భూమిని ఇతర అవసరాలకు ఉపయోగించాలంటే చట్టపరంగా గ్రామ సభల అనుమతి తప్పనిసరి. ఇదే విషయాన్ని మోడీ ఆధ్వర్యంలోనే

2018 నవంబర్ 30 నాటికి తిరస్కరణకు గురైన దరఖాస్తులు వివరాలు

ఎ.పి.	75,927	తెలంగాణ	83,757
ఛత్తీస్‌గడ్	4,62,403	ఒరిస్సా	1,48,525
పశ్చిమ బెంగాల్	96,587	బీహార్	4,215
మహారాష్ట్ర	2,20,116	మధ్యప్రదేశ్	3,62,024
ఉత్తరప్రదేశ్	74,945	తమిళనాడు	11,742
కర్నాటక	1,80,956	కేరళ	7,889
త్రిపుర	68,610	రాజస్థాన్	36,299
గుజరాత్	64,769	గోవా	47
ఉత్తరాఖండ్	96,587	జార్ఖండ్	29,521

(ఆధారం కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ నివేదిక)

ఏర్పాటైన ట్రైబల్ అఫైర్స్ మినిస్ట్రీ కమిటీ నొక్కి చెప్పినా మోడీ దానిని ఖాతర్ చేయలేదు.

వడ్డించేవాడు మనవాడైతే కడబంతిలో కూర్చున్నా పరవాలేదనట్లు పరిస్థితి ఉంది. స్మగ్లర్లు అటవీ సంపదను అక్రమంగా దోచుకెళుతుంటే, అడవులను ధ్వంసం చేస్తుంటే అటవీ శాఖలోని అధికారులూ, రాజకీయ నాయకులూ నోరు మెదపడం లేదు. కానీ గిరిజన ప్రజలు బతుకు కోసం, మెతుకు కోసం పోడు నరుక్కుంటే మాత్రం గగ్గోలు పెడుతున్నారు.

ఇప్పటికే రాష్ట్రంలో హరితహారం పేరుతో, అభయారణ్యాల పేరుతో టిఆర్ఎస్ ప్రభుత్వం లక్షల ఎకరాలను సేకరిస్తున్నది. గ్రామాలను సైతం తరలిస్తున్నది. ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ అడవి 2.2 లక్షల ఎకరాలను, ప్రాణహిత 34 వేల ఎకరాలను శిర్వారం అభయారణ్యం పేరుతో 7500 ఎకరాలు, వరంగల్ జిల్లా ఏటూరు నాగారంలో 2 లక్షల ఎకరాలు, పాకాల అభయారణ్యం 2.21 లక్షల ఎకరాలు, ఖమ్మం జిల్లా కిన్నెరసాని అడవులు 1.75 లక్షల ఎకరాలు, మెదక్ జిల్లా మంజీర వన్యప్రాణుల కోసం 49 వేల ఎకరాలను, పోచారం అడవులు 34 వేల ఎకరాలు, మహబూబ్‌నగర్ రాజీవ్ గాంధీ వన్యప్రాణి సంరక్షణ కోసం 5.35 లక్షల ఎకరాలను సేకరించబోతున్నారు. అంటే వీరికి మనుషుల కంటే వన్యప్రాణుల సంరక్షణే ముఖ్యమన్న మాట. అడవుల రక్షణ, వన్యప్రాణుల రక్షణకు వ్యతిరేకం కాదు. కానీ అడవులను నిజంగా ధ్వంసం చేస్తున్నది ఎవరో చూడాలి. అంతేగాక చెట్లను పెంచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం అన్వేషించాలి.

రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అడవుల రక్షణ పేరిట నూతన అటవీ చట్టాన్ని తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ అస్త్రం ఎవరి మీదకీ? దీని వలన ఎవరు బలికానున్నారనేది స్పష్టమే. హరితహారం పేరుతో పోడు భూముల స్వాధీనానికీ, పోడు రైతులపై నిర్బంధానికీ, అరెస్టులకూ, కేసులు పెట్టడానికీ ప్రభుత్వం పూనుకొంది. దీనిని మరింత దూకుడుగా సాగించడం కోసమే నూతన అటవీ చట్టం అనేవి తేటతెల్లమే.

అటవీ శాఖ కనుసన్నల్లోనే అనేక మంది మైదాన ప్రాంత ధనిక రైతులూ, వ్యాపారస్తులూ అటవీ భూమిని ఆక్రమించి తోటలు వేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని క్రిష్ణా జిల్లాలో వేలాది ఎకరాలు అటవీ భూములు అన్యుల అన్యాక్రాంతమయ్యాయి. నూజివీడు, విస్సన్నపేట, ఎ. కొండూరు తదితర ప్రాంతాలలో వేలాది అటవీ భూముల్లో ఏకంగా మామిడి తోటలు వేశారు. ఈ విషయం అక్కడ బహిరంగ రహస్యం. వీరికి అటవీ శాఖ, పోలీసు, రెవెన్యూ శాఖ అండదండలుంటాయి. ఆ ప్రాంతంలోని

ఆదివాసుల హక్కులను హరిస్తున్న సుప్రీం కోర్టు తీర్పు

***అడవిపై ఆదివాసుల హక్కులను హరించే సుప్రీం కోర్టు తీర్పును ఎన్నికల సందర్భంగా వాయిదా వేశారనీ, దీన్ని ఎదిరించి పోరాడకపోతే పాలకులు అడవులను పెట్టుబడిదారులకు కట్టబెడుతారనీ అంటున్నారు* ఆశాలత**

అటవీ హక్కుల చట్టం ఆదివాసులకు అటవీ భూములపై హక్కులు కల్పించడాన్ని సవాలు చేస్తూ వరల్డ్ లైఫ్ ఫారెస్ట్ తదితర వన్యప్రాణి సంరక్షక సంస్థలు వేసిన పిటిషన్ కేసులో సుప్రీం కోర్టు ఫిబ్రవరి 13న ఒక తీర్పు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గడ్, గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మణిపూర్ (మొత్తం 21) రాష్ట్రాలు అటవీ హక్కుల చట్టం అమలు గురించి సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు సుప్రీం కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. ఈ రాష్ట్రాలలో అటవీ భూముల కోసం పెట్టుకున్న అర్జీలు తిరస్కరించబడిన భూములలో ఉన్నవారిని ఆక్రమణదారులుగా పరిగణిస్తూ వారిని 2019 జూలై 27 కల్లా అడవుల నుండి తొలగించాలని ఆ తీర్పు సారాంశం. వివిధ రాష్ట్రాలు సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం 16 రాష్ట్రాలలో 11,90,433 అర్జీలు తిరస్కరించబడినాయి (ఐదు రాష్ట్రాలు తిరస్కరించబడిన వివరాలు సమర్పించలేదు). అంటే తిరస్కరించబడిన అర్జీల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుంది. తిరస్కరించబడిన ప్రక్రియ పూర్తయినప్పుడు అక్రమంగా అడవులలో ఆక్రమణదారులుగా ఉన్న వారిని ఎందుకు తొలగించలేదు అని సుప్రీం కోర్టు ఆయా రాష్ట్రాలను ప్రశ్నించి 2019 జూలై 27 లోపు వారందరినీ తొలగించమని ఉత్తర్వులు ఇచ్చింది.

అయితే 2019 జనవరి 19న మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ (ట్రైబల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ) 2018 నవంబర్ 30 వరకు అటవీ హక్కుల చట్టం అమలుపై సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌లో పేర్కొన్న తిరస్కరించబడిన అర్జీలు సంఖ్యకు సుప్రీం కోర్టు తీర్పు ఉత్తర్వులో పేర్కొన్న సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉంది. ఈ నివేదిక ప్రకారం అటవీ భూముల కోసం మొత్తం 40,76,606 అర్జీలు పెట్టుకోగా 19,39,231 అర్జీలు తిరస్కరించ బడ్డాయి. ఈ సంఖ్య సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొన్న సంఖ్య కంటే (11.9 లక్షలు) చాలా ఎక్కువగా ఉంది. ఈ రిపోర్ట్ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 75,927 (సుప్రీం కోర్టు తీర్పులో 66,351) అర్జీలు, తెలంగాణలో 83,757 అర్జీలు తిరస్కరించబడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించిన అఫిడవిట్ సమాచారానికి ట్రైబల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రిపోర్టులో సంఖ్యకూ ఇంత పెద్ద తేడా ఉండడం కూడా గమనించదగ్గ విషయం. నిజానికి వాటిని తిరస్కరించబడిన అర్జీలుగా పేర్కొనడం చాలా తప్పుదోవ పట్టిస్తుంది, అవి సెటిల్ చేయబడని అర్జీలు మాత్రమే. ఎందుకంటే ఒకసారి తిరస్కరించబడితే వారు గ్రామ సభల ద్వారా మళ్లీ అర్జీలు పెట్టుకుని, తిరస్కరించబడడానికి కారణాలను చర్చించి, మళ్లీ పైకి అర్జీలను పంపుకోవాలని చట్టం చెబుతున్నది. వారికి న్యాయం జరిగే వరకు ఈ ప్రక్రియ కొనసాగాలి. కానీ అటువంటిదేమీ జరగకుండా ఏకపక్షంగా అర్జీలు తిరస్కరించబడినట్లు ప్రకటించడం ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేయడమే తప్ప మరొకటి కాదు.

ఫిబ్రవరి 13న సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వు అటవీ భూములపై ఆదివాసులకున్న హక్కులను ప్రమాదంలో పడవేసింది, దానితో పాటు అనేక ప్రశ్నలను లేవనెత్తింది. అసలు అడవులపై ఆధారపడి బతుకుతున్న ఆదివాసులందరూ అర్జీలు చేసుకున్నారా? ప్రతి గ్రామంలో అటవీ హక్కుల కమిటీల నియామకం జరిగిందా? గ్రామ సభలు నిర్వహించబడి అర్జీలను చర్చించాయా? చేసుకున్న వారిలో సగానికి పైగా అర్జీలు ఎందుకు తిరస్కరించబడ్డాయి? అర్జీలను ఆమోదించే ప్రక్రియ సక్రమంగా జరిగిందా? అర్జీలు తిరస్కారించడానికి గల కారణాలు ఏమిటి? అర్జీలు తిరస్కరించబడినట్లు దరఖాస్తుదారులకు రాతపూర్వకంగా తెలియచేయడం జరిగిందా? ఒకవేళ జరిగితే నియమాల ప్రకారం వాళ్లు తిరిగి క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించారా? ఇవన్నీ ప్రశ్నలు గానే ఉన్నాయి, వాటికి జవాబులు లేవు. అటవీ హక్కుల చట్టం అమలు సక్రమంగా లేదనీ, దాని అమలు, పర్యవేక్షణ సరిగ్గా లేదనీ ప్రజా సంఘాలు చెబుతూనే వచ్చాయి. చట్టం నియమాలలో పొందుపరచిన ఈ సుదీర్ఘ ప్రక్రియ సక్రమంగా అమలు జరగకుండానే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టుకు తప్పులతడకగా సమాచారాన్ని సమర్పించాయని అర్థమవుతున్నది. అర్జీలు తిరస్కరించబడడం అంటే అటువంటి వారిని అడవుల నుండి తొలగించడంతో సామానం కాదు అని ఇక్కడ అందరూ గుర్తించాలి.

2006లో భారత ప్రభుత్వం ఆదివాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని గుర్తిస్తూ అటవీ హక్కుల గుర్తింపు చట్టం, 2006ను పార్లమెంటు ద్వారా ఆమోదించి ప్రకటించింది. 2005 డిసెంబర్‌కు ముందు వరకు అడవులలో నివసిస్తూ, అటవీ భూములను సాగుచేసుకుంటున్న వారికి నివాస హక్కులు, సాగుచేసుకునే హక్కులు,

---

గిరిజనులు ఆ భూములు తమకే చెందాలని మాట్లాడితే, ఆ భూముల్లోకి వెళితే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆక్రమణదారులకే వత్తాసు పలకడం జరుగుతున్నది. న్యాయంగా అటవీ భూముల్లోని అన్యాక్రాంత భూములను ఆ ప్రాంతంలోని భూమిలేని గిరిజనులకు ఇవ్వాలి. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములే వారికి ఇవ్వని పరిస్థితుల్లో అన్యాక్రాంత భూములు పంచుతారనుకోవడం అత్యాశే.

కనుక అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు లభించిన హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలి. ఆ చట్టాన్ని అమలు చేయించు కోవడం కోసం దృఢంగా పోరాడాలి. గిరిజనుల హక్కుల్ని కాలరాయాలనీ, చట్టం స్ఫూర్తిని నీరుగార్చాలనీ చూస్తున్న ప్రభుత్వ చర్యలను ఎండగట్టాలి. దీనికి ఉద్యమం తప్ప మరో దగ్గర దారి లేదు.

(రచయిత పిడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు) వీ

ఉమ్మడి వనరులపై హక్కులు వంటి 13 రకాల హక్కులను గుర్తించి, ఆమోదించి, దఖలు పరచాలని ఈ చట్టం పేర్కొన్నది. 2008 నుండి అమలులోకి వచ్చిన ఈ చట్టం అమలును పర్యవేక్షించవలసిన ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ చట్టం గురించి విస్తృతంగా ప్రచారం చేయడం లేక అమలు జరిగేటట్లు చూడడం అనేవి చిత్తశుద్ధితో చేయలేదు. చట్టం అమలులో ముఖ్య పాత్ర వహించాల్సిన గ్రామ సభలకు దానిలో పాత్ర లేకుండా చేయడానికి అధికారులు ప్రయత్నం చేశారు.

2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో షెడ్యూల్డు తెగల జనాభా 10.4 కోట్లు (దేశ జనాభాలో 8.6 శాతం). వీరిలో లంబాడాలతో సహా మైదాన ప్రాంత షెడ్యూల్డు తెగలవారు కూడా ఉన్నారు. మొత్తం ఎస్టి జనాభాలో సుమారు 6 కోట్ల మంది అటవీ ప్రాంతాలలో జీవిస్తూ అడవులపై ఆధారపడి బ్రతుకుతున్నారని ఒక అంచనా. ఇప్పటివరకు 40 వేల అర్జీలు మాత్రమే రికార్డు అయ్యాయంటే వారిలో చాలా మంది ఇప్పటికీ తమ నివాస హక్కులు, సాగుభూమి హక్కుల అర్జీలు పెట్టుకోనేలేదు. వ్యక్తిగత హక్కుల పరిస్థితి ఇట్లా ఉంటే ఇక ఉమ్మడి వనరులపై ఆదివాసులకు అధికారాలను కల్పించే సాముదాయక హక్కుల స్థితి మరీ దారుణంగా ఉంది. ట్రైబల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రిపోర్టు ప్రకారం ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కేవలం 1,48,345 సాముదాయక అర్జీలు మాత్రమే రిజిస్టర్ అయ్యాయి, వాటిలో సగం కంటే తక్కువ, 72,064 మాత్రమే ఆమోదించి పట్టాలు ఇవ్వడం జరిగింది. సాముదాయక హక్కుల అర్జీలు పెట్టుకోవడం లేక ఆమోదించడం అనే ప్రక్రియను అధికారులు పెద్ద ఎత్తున నిరోదిస్తూ వచ్చారు. నిజానికి సాముదాయక హక్కులు ఆదివాసులకు ముఖ్యంగా ఆదివాసీ మహిళలకు అడవి నుండి ఫలసాయం సేకరించడానికి ఇంకా అనేక రకాలుగా ఉపయోగపడతాయి. అంటే అటవీ హక్కుల చట్టం సక్రమంగా అమలు జరగలేదు అని అర్థమవుతున్నది. దీనిని అటవీ శాఖ తనకు అనుకూలంగా చేసుకుని ఆదివాసులు అడవులను నాశనం చేస్తున్నారని ఆరోపించి వారిని అడవుల నుండి వెళ్లగొట్టడానికి అనేక అటవీ సంరక్షణ కార్యక్రమాలు తీసుకొచ్చింది. కంపెనీలకు వందలాది ఎకరాల అటవీ భూములను లీజుకిచ్చింది. వీటికి వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాలు పోరాటాలు చేస్తున్నాయి.

ఫిబ్రవరి 13న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆదివాసుల తరఫున పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావడం, కోర్టులో పిటిషన్లు వేయడం ఫలితంగా కేంద్ర ప్రభుత్వం మేల్కొని (ప్రధానంగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని) ఆదివాసుల తరఫున సుప్రీం కోర్టులో వాదించింది. దీనికి స్పందనగా ఫిబ్రవరి 28న సుప్రీం కోర్టు ఫిబ్రవరి13న ఇచ్చిన ఉత్తర్వులను నాలుగు నెలల పాటు నిలుపుదల చేస్తూ మళ్లీ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులో సుప్రీం కోర్టు అర్జీలు తిరస్కరించబడడం వరకు జరిగిన ప్రక్రియ వివరాలతో 2019, ఫిబ్రవరి 13 వరకు గల సమాచారంతో వివరమైన అఫిడవిట్లు జూలై 10 లోపు సమర్పించమని కేంద్ర ప్రభుత్వం తరపు సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది. 'ఇంతవరకు దీర్ఘ నిద్రలో ఎందుకున్నారు, ఎందుకు వాదించలేదు' అని సొలిసిటర్ జనరల్‌ను సుప్రీం కోర్టు అధిక్షేపించింది.

తిరస్కరణకు గురైన అటవీ హక్కుల దరఖాస్తు భూముల నుంచి దరఖాస్తుదారులను తొలగించాలని ఆదేశిస్తూ, విశ్రాంత అటవీ శాఖాధికార్లు, జమీందార్లు, వన్యప్రాణి హక్కుల కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు దాఖలు చేసిన కేసులో సుప్రీం కోర్టు ఫిబ్రవరి 13న ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాపితంగా ఆదివాసీలలో వ్యక్తమైన ఆందోళన తరువాత ఆ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తూ ఫిబ్రవరి 28న సుప్రీం కోర్టు జారీ చేసిన ఉత్తర్వు తాత్కాలిక ఉపశమనం కలిగించింది. అయితే సుప్రీం కోర్టు అటవీ భూమి హక్కు 'తిరస్కరణలను', 'ఆక్రమణలు'గా పేర్కొనడం అటవీ హక్కుల గుర్తింపు చట్టం మౌలిక లక్ష్యానికి విరుద్ధం. ఈ సమస్యపై తొందరలో మనం దృష్టి సారించకపోతే, అటవీ భూముల నుంచి తొలగింపులు నివారించేందుకు ఉద్దేశించిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006, గిరిజనులను తొలగించడానికి, గ్రామ సభల అధికారాలను నిర్వీర్యం చేయడానికి ఉపకరించే పరికరంగా మారే ప్రమాదం ఉంది.

అటవీ భూముల నుండి తొలగింపులకు ఆదేశించిన సుప్రీం కోర్టు ఉత్తర్వులపై న్యాయ సమాచారం

ఫిబ్రవరి 13న జారీ చేసిన సుప్రీం కోర్టు ఉత్తర్వులు

1. అంతిమంగా తిరస్కరణకు గురైన దరఖాస్తు విషయంలో, దరఖాస్తుదార్లను అటవీ భూముల నుంచి తొలగింపుల పై తీసుకున్న చర్యలు తెలియజేస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రమాణ పత్రం దాఖలు చేయాలి.
2. ఆ తొలగింపులను 2019 జూలై 24 లోపు పూర్తి చేయాలి.
3. తిరస్కరణకు గురైన దరఖాస్తుల పునఃసమీక్ష ప్రక్రియను ఒక వేళ ప్రభుత్వం ప్రారంభిస్తే ఆ ప్రక్రియను నాలుగు మాసాల్లో పూర్తి చేయాలి.
4. తొలగింపులకు ముందు, తర్వాత స్థితిపై ఉపగ్రహ సర్వేను భారత అటవీ సర్వే (ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా) సంస్థ చేపట్టాలి.

ఫిబ్రవరి 28న జారీ చేసిన సుప్రీం కోర్టు ఉత్తర్వులు

1. దరఖాస్తు తిరస్కరణలో అవలంభించిన ప్రక్రియను తెలియజేస్తూ ప్రభుత్వం ప్రమాణ పత్రం దాఖలు చేయాలి.
2. ఏ చట్టం కింద తొలగింపులు చేయవచ్చునో వివరిస్తూ ప్రభుత్వం ప్రమాణ పత్రం దాఖలు చేయాలి.
3. తదుపరి నోటీసులు జారీ చేసేంత వరకు ఫిబ్రవరి 13న జారీ చేసిన ఉత్తర్వుల అమలు నిలుపుదల చేయడమైనది.
4. భారత అటవీ సర్వే (ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా) సంస్థ ఉపగ్రహ సర్వే చేపట్టాలి.

ఫిబ్రవరి 13న జారీ చేసిన సుప్రీం కోర్టు తొలగింపుల ఉత్తర్వులు నిలుపుదల అయినందున సుప్రీం కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు అటవీ భూముల నుంచి గిరిజనులను తొలగించరాదు.

ఈ ఉత్తర్వులు ఎవరికి వర్తిస్తాయి?

1. గిరిజనులకు, అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ఇతర సాంప్రదాయ అటవీ నివాసులకు.
2. అటవీ భూమి హక్కు గుర్తింపు కోరుతూ దాఖలు చేసుకున్న దరఖాస్తుదారులకు.
3. చట్ట ప్రక్రియ ద్వారా అంతిమంగా తిరస్కరణకు గురికాబడిన దరఖాస్తుదార్లకు.

ఈ ఉత్తర్వులు కేవలం చట్ట ప్రక్రియ ద్వారా అంతిమంగా తిరస్కరణకు గురికాబడిన దరఖాస్తు దారులకు మాత్రమే వర్తిస్తాయి. అంటే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల విషయంలో వర్తించవు.

అటవీ హక్కుల గుర్తింపు దరఖాస్తు అంతిమ తిరస్కరణకు ఎప్పుడు వస్తుంది?

గ్రామ సభ స్థాయిలో తిరస్కరించబడిన దరఖాస్తులు

1. తిరస్కరణకు గురికాబడిన దరఖాస్తులపై నిర్ణయం గ్రామసభ వ్యక్తిగతంగా దరఖాస్తు దారునకు తెలియజేసినప్పుడు.
2. గ్రామ సభ నిర్ణయం పై 60 రోజుల్లో, లేదా తదుపరి అవకాశం పొందిన 30 రోజుల్లో సబ్‌డివిజన్ కమిటీకి అప్పీల్ చేసుకున్నప్పుడు.
3. అప్పీల్ విచారణలో సహేతుక అవకాశం సబ్ డివిజన్ కమిటీ దరఖాస్తుదారునకు ఇచ్చినప్పుడు.
4. తిరస్కరణ సిఫార్సులకు గల కారణాలు వివరిస్తూ ఉత్తర్వులు ఇచ్చినప్పుడు లేదా పునఃపరిశీలనకు గ్రామసభకు తిరిగి పంపినప్పుడు.
5. సబ్ డివిజనల్ కమిటీ తీర్మానాన్ని విభేదిస్తూ జిల్లా స్థాయి కమిటీకి తదుపరి అప్పీల్ దాఖలు చేసినప్పుడు.

అటవీ భూమిపై హక్కు కోరుతూ దాఖలైన పిటిషన్ పై విచారణ,, అంగీకరించడం లేదా తిరస్కరించే అధికారం అటవీ హక్కుల గుర్తింపు చట్టం సెక్షన్ 6, నియమం 12 కింద గ్రామ సభకు ఉంది.

జిల్లా స్థాయి కమిటీ స్థాయిలో
తిరస్కరణకు గురైన దరఖాస్తులు

1. తిరస్కరణకు గల కారణాలను జిల్లా స్థాయి కమిటీ పేర్కొనాలి.
2. జిల్లా స్థాయి కమిటీ తిరస్కరణ ఉత్తర్వుల కాపీలు దరఖాస్తుదారుకు / గ్రామ సభకు అందజేయాలి.

ఆగస్టు 3, 2009న పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సంపూర్ణ అటవీ హక్కుల నిర్ధారణ ప్రక్రియ ధృవీకరణ విషయంలో గ్రామసభకే అధికారం ఉంటుంది.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద అంతిమంగా దరఖాస్తుపై నిర్ణయం తనకు వ్యతిరేకంగా వచ్చిన తర్వాత కావాలనుకుంటే దరఖాస్తుదారులు రాజ్యాంగ అధికరణ 226 కింద హైకోర్టుకు వెళ్లవచ్చు. తదుపరి సుప్రీం కోర్టుకు అధికరణ 136 లేదా 32 కింద పిటిషన్ దాఖలు చేయవచ్చు.

అటవీ భూముల హక్కుల నిర్ణయ ప్రక్రియలో గ్రామసభనే కేంద్ర బిందువుగా గుర్తిస్తూ నియంగిరి కేసులో సుప్రీం కోర్టు 2013లో రాజ్యాంగ అధికరణ 141 కింద తీర్పు ఇచ్చింది. అందువల్ల ఆ తీర్పును చట్టంగా పరిగణించాలి. అందువల్ల తిరస్కరణల ప్రక్రియ అంతిమ స్థితిని గ్రామసభ ధృవీకరించాల్సి ఉంటుంది.

అటవీ హక్కుల దరఖాస్తుల పై అంతిమంగా హక్కుల నిర్ధారణ ధృవీకరణ అయ్యేంత వరకు దరఖాస్తుదార్లను అటవీ భూముల తొలగింపు నుంచి అటవీ హక్కుల గుర్తింపు చట్టం సెక్షన్ 4(5) కింద రక్షణ లభిస్తుంది.

తిరస్కరణకు గురైన దరఖాస్తు, భూమి నుంచి తొలగింపుకు దారి తీస్తుందా?

దారి తీయదు. దరఖాస్తు తిరస్కరణకు గురైనంత మాత్రాన దరఖాస్తు దారులను ఆక్రమణదారులుగా భావించరాదు. చారిత్రకంగా అన్యాయానికి గురైన ఆదివాసీలు, ఇతర అటవీ నివాసితులకు తిరిగి న్యాయం చేసేందుకు, వారి హక్కులు గ్రామసభల ద్వారా గుర్తింపుకు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 ఉద్దేశించబడింది.

1. తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో తొలగింపులకు ఉద్దేశించిన నియమాలు అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006లో ఎక్కడా పేర్కొన లేదు. ఇంకా చెప్పాలంటే అటవీ హక్కులు నిర్ధారణ ప్రక్రియ పూర్తయ్యే వరకూ దరఖాస్తు భూముల నుంచి తొలగింపు జరగకుండా రక్షణ కోరే నియమాలు కూడా ఉన్నాయి.
2. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 అనేక హక్కులు గుర్తిస్తుంది. పోడు భూమి హక్కు అనేక హక్కుల్లో ఒక హక్కు. అందువల్ల పోడు భూమి హక్కు తిరస్కరించినంత మాత్రాన మిగిలిన హక్కులు కోరడానికి వీలు లేదని భావించరాదు.
3. చాలా దరఖాస్తులు సహేతుక కారణాలు లేకుండానే తిరస్కరణకు గురయ్యాయి. అందువల్లనే దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరణకు గురైన దరఖాస్తుల పునఃవిచారణ ప్రారంభించాయి.
4. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 కింద హక్కులు పొందలేని వారు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ చట్టాల కింద హక్కులు పొందే అవకాశం కూడా లేకపోలేదు.

భూముల నుంచి తొలగింపులకు సంబంధించిన అనేక కేంద్ర, రాష్ట్ర చట్టాలు ఉన్నాయి. తొలగింపుల ప్రక్రియ నియమాలు కూడా భిన్నంగానే ఉంటాయి. అయితే కనీసం పాటించవలసిన న్యాయ సూత్రాలు కొన్ని సాధారణంగా ఉంటాయి.

1. సంబంధిత వ్యక్తులకు తొలగింపు విషయంలో తగు నోటీసులు జారీ చేయడం.
2. నోటీసు అందుకున్న వ్యక్తి విచారణలో పాల్గొని, తన వాదన చెప్పేందుకు వీలుగా కారణాలు చూపుతూ అవకాశం ఇవ్వడం.
3. తొలగింపుకు కారణాలు రాతపూర్వకంగా తెలియజేస్తూ, ఆ కాపీని విచారణలో పాల్గొన్న వ్యక్తికి అందజేయడం.
4. భూములు కోల్పోతున్న వ్యక్తులకు తగు పునరావాసం / ప్రత్యామ్నాయ భూమి / తగు నష్టపరిహారం ఇవ్వడం.
5. తొలగింపు నిర్ణయాలపై అప్పీల్ / పునర్విచారణ కోరుతూ ఉన్నత న్యాయస్థానాలలో పిటిషన్ దాఖలు చేసుకునేందుకు వీలు కల్పించడం.

మనం ఏమి చేయవచ్చు?

అడవుల సంరక్షణ, అభివృద్ధి పేరిట గిరిజనులను అటవీ భూముల నుంచి తొలగించేందుకు కేసుల్లో పిటిషనర్లు చూస్తున్నారు. అయితే అడవుల నాశనానికి వ్యతిరేకంగా పోరాడుతూనే, అడవులపై గల నిర్ణయాధికారాన్ని గిరిజనులకు కొనసాగించడం చాలా ముఖ్యం.

1. అడవుల నిర్వహణ, సంరక్షణ కోసం సెక్షన్ 5 ఎ కింద గ్రామ సభకు గల అధికారం కోసం, అటవీ భూమి వనరులపై గల హక్కులు కోరుతూ సెక్షన్ 3(1)(ఐ) కింద దరఖాస్తులు దాఖలు చెయ్యాలి. గ్రామ సభ అటవీ భూమి వనరుల నిర్వహణ కమిటీలను సెక్షన్ 4(1)(ఇ) కింద నియమించాలి.
2. అడవుల నాశనానికి పూనుకుంటున్న అడవుల నరికివేత, ఇతర చట్ట వ్యతిరేక చర్యలను ప్రతిఘటించాలి.
3. అటవీ భూమి హక్కుల నిర్ధారణ ఇంకా పూర్తి కాని దరఖాస్తుల విషయంలో అటవీ హక్కుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా, అక్రమ పద్ధతుల్లో ఎవరినీ అటవీ భూముల నుంచి తొలగింపులు చేపట్టరాదని గ్రామ సభలు తీర్మానం చేయవచ్చు.
4 తిరస్కరణకు గురి కాబడిన దరఖాస్తుల విషయంలో గ్రామసభ

పునఃవిచారణ చేపడితే ఆ విషయాన్ని ధృవీకరిస్తూ ఒక తీర్మానం చేయవచ్చు.

5. తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో తిరిగి పునఃవిచారణ తనంతట తానే ప్రభుత్వం చేపట్టాలని కోరవచ్చు.
6. సుప్రీం కోర్టు కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేస్తున్న ప్రమాణ పత్రం సమాచారాన్ని ప్రభుత్వం నుంచి కోరవచ్చు.
7. మీ ప్రాంతం అటవీ భూమి హక్కుల దరఖాస్తు విషయంలో గల ఈ క్రింది ప్రశ్నల సమాచారాన్ని ఇతర వివరాలను ప్రభుత్వానికి అందజేస్తూ ప్రమాణ పత్రంలో పొందుపరచమని కోరవచ్చు.

- గిరిజనులు దాఖలు చేసిన దరఖాస్తుల సంఖ్య, కోరిన అటవీ భూమి విస్తీర్ణం వివరాలు.
- దరఖాస్తుల ప్రస్తుత స్థితి (హక్కుల గుర్తింపు / పెండింగ్ / తిరస్కరణ (ఏ స్థాయిలో ఉంది?)
- ఎప్పటి నుంచి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి ఏ స్థితిలో ఉన్నాయి?
- దరఖాస్తులు తిరస్కరణకు గురిచేసినప్పుడు చట్ట ప్రక్రియ జరిగినదా?
- దరఖాస్తుల తిరస్కరణకు గల కారణాలు ఏమిటి?
- మీ ప్రాంతంలో ముఖ్యంగా షెడ్యూల్డ్ ప్రాంతంలో అటవీ హక్కుల కమిటీలు, గ్రామ సభలు క్రమపద్ధతిలో ఏర్పాటు అయ్యాయా?
- గ్రామ సభల నిర్వహణ క్రమపద్ధతిలో జరుగుతున్నదా?

తొలగింపుకు ప్రయత్నాలు జరుగుతుంటే?

1. దరఖాస్తుల తిరస్కరణ అంతిమంగా పూర్తి అయ్యిందా లేదా తెలుసుకోవాలి.
2. తొలగింపులకు సంబంధించిన చట్ట ప్రక్రియ పూర్తి అయ్యిందా లేదా తెలుసుకోవాలి.
3. తొలగింపుల ప్రయత్నాలు జరిగితే గ్రామసభ / ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి / జిల్లా కలెక్టర్‌కు తెలియజేయండి.
4. ఒక వేళ తొలగింపును విభేదిస్తే రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ / రాష్ట్ర హైకోర్టుకు విజ్ఞప్తి జేయండి.
5. అవసరమైన న్యాయ సహాయాన్ని తాలూకా లేదా జిల్లా న్యాయసేవ అధికార సంస్థ నుంచి పొందండి.

(రచయిత సామాజిక కార్యకర్త)
(రైతు స్వరాజ్య వేదిక, మహిళా రైతుల హక్కుల వేదిక) వీ

మార్పు కోసం మహిళల మార్చ్

హింస విద్వేషాలకు వ్యతిరేకంగా ఎగుస్తున్న మహిళల గొంతులు ప్రస్తుతం దేశంలో నెలకొని ఉన్న హింస, ద్వేషంతో కూడిన వాతావరణాన్ని తిరస్కరిస్తూ, ఒక ప్రజాస్వామిక గణతంత్రంలో పౌరులుగా తమ రాజ్యాంగ హక్కులను ఎలుగెత్తి చాటుతూ 2019 ఏప్రిల్ 4న దేశవ్యాప్తంగా మహిళలు మార్చి వేస్తున్నారు. భారతదేశంలో మహిళల రాజ్యాంగ హక్కులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అసమ్మతిని తెలుపుతూ మహిళా గొంతుకలను ఐక్యం చేయడమే 'మహిళల మార్చ్ – ఇండియా' ఉద్దేశం.

దేశంలో ఫాసిస్టు నయా ఉదారవాద శక్తులు పెరిగిన ఫలితంగా సమాజంలో పెరుగుతున్న హింస మహిళల జీవితాలను లోతుగా ప్రభావితం చేస్తున్నది. మైనారిటీల పైన, ప్రత్యేకించి ముస్లింలు, దళితులు, క్రిస్టియన్ల పైనా దాడులు అనేక రూపాలు తీసుకున్నాయి – బూటకపు ఎంకౌంటర్లలో చంపటం, గోరక్షకుల చేత గుంపు హత్యలు గావించబడడం దేశంలో భయాందోళనలు, అభద్రత కలసిన వాతావరణాన్ని సృష్టించాయి.

చట్టబద్ధమైన పాలన, సమానత్వానికి కట్టుబడతామన్న మౌలిక రాజ్యాంగ వాగ్దానం క్రమంగా దిగజారుతున్నాయి. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం మహిళలను మొత్తంగానూ, ప్రత్యేకించి దళిత, ఆదివాసీ ఇతర అంచులకు నెట్టివేయబడిన సమూహాల మహిళలపై దారుణ ప్రభావాన్ని కలుగజేసింది. వారి బలహీనమైన ఆర్థిక పునాది ఆదాయ వనరులు నాశనం చేయబడ్డాయి. పెద్ద ఎత్తున జరుగుతున్న పర్యావరణ విధ్వంసం వారిని తీవ్రంగా ప్రభావితం చేసింది.

గత కొద్ది సంవత్సరాలలో రాజ్యాంగంపై జరిగిన దాడులు, ప్రత్యేకించి భావప్రకటనా స్వేచ్ఛపైనా, నచ్చిన బట్టలు వేసుకునే హక్కు, మాట్లాడే హక్కు, రాసే హక్కు, ఇష్టమైంది తినే హక్కులపై దాడులు పురుషుల కంటే మహిళలపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తున్నాయి.

అసమ్మతి గొంతుకలను ఒక పద్ధతి ప్రకారం నొక్కేస్తున్నారు. తమ ప్రాథమిక స్వేచ్ఛ అయిన మాట్లాడే హక్కు, భావప్రకటనా హక్కు కోసం నిలబడినందుకు సుధా భరద్వాజ్, షోమాసేన్ ఇంకా అనేకమంది జైళ్లలో మగ్గుతుండగా గౌరీ లంకేశ్ తన ప్రాణాన్నే పోగొట్టుకోవలసి వచ్చింది.

2019 సాధారణ ఎన్నికలకు దగ్గరవుతున్న కొద్దీ, మన దేశానికి ప్రమాదంగా మారిన కులతత్వ, మతతత్వ, విభజన శక్తులను ఓడించడానికి మనందరం ఐక్యం కావలసిన అవసరం ప్రతిరోజూ మనకు గుర్తు చేయబడుతోంది. మన భవిష్యత్తును నిర్ణయించడానికి మన ఓటు కీలకమైనది. అన్నిరంగాలలోని మహిళలు, ట్రాన్సజెండర్లు. ప్రతిరంగంలోనూ – విద్యార్థులు, ఉద్యమకారులు, వృత్తినిపుణులు, గృహకార్మికులు, కళాకారులు, విద్యావేత్తలు, అధికారులు, జర్నలిస్టులు, లాయర్లు, సెక్స్ వర్కర్లు, రైతులు, కూలీలు, అటవీ నివాసులు – ఫాసిజానికీ, హింసకూ, ద్వేషానికీ, వివక్షకూ, యుద్ధానికీ వ్యతిరేకంగా సమిష్టిగా గొంతెత్తాలి. రాజ్యాంగం మనకు హామీ ఇచ్చిన హక్కులను తిరిగి సాధించడానికి ప్రజాస్వామిక వ్యవస్థల విధ్వంసానికి వ్యతిరేకంగా నిలబడాలి. కుంచించుకుపోతున్న ప్రజాస్వామిక అవకాశాలను నిలబెట్టుకోవడం కోసం, అసమ్మతిపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి.

'మహిళల మార్చ్ – ఇండియా' అనేది ప్రస్తుత అణచివేత స్వభావం గల పాలనను ధ్వంసం చేయాలనుకునే, న్యాయమైన, శాంతియుతమైన భవిష్యత్తును కోరుకునే వివిధ సమూహాలకు చెందిన మహిళలందరినీ కలుపుకుని వెళ్లే ఒక వేదిక. ఈ ప్రయాణంలో మాతో కలసి నడవాలని మీ అందరినీ ఆహ్వానిస్తున్నాం. ఏప్రిల్ 4న మాతో చేరండి. దేశవ్యాప్తంగా నగరాలూ, పట్టణాలూ, మండలాలూ, గ్రామాలలో మహిళల మార్చ్‌ను నిర్వహించడానికి ఇది ఒక జాతీయ పిలుపు.

(ఈ ప్రకటనపై దేశవ్యాప్తంగా అనేక రంగాలకు చెందిన వందలాది మంది మహిళా హక్కుల ఉద్యమకారులు సంతకం చేసి విడుదల చేశారు) వీ

పోడు భూముల కోసం పోరు చేద్దాం

ఆదివాసీలు సాగుచేసుకుంటున్న పోడు భూములను కార్పొరేట్‌లకు కట్టబెట్టడంలో భాగంగా వచ్చిందే సుప్రీం కోర్టు తీర్పనీ, భూముల్ని కాపాడుకోవడం కోసం పోరాటమొక్కటే మార్గమనీ అంటున్నారు **వూకె రామకృష్ణ దొర**

ఆదివాసీలు అడవి తల్లి ముద్దుబిడ్డలు. అడవే జీవనాధారంగా జీవించే ఆదివాసీలు ....అరణ్యంలో క్రూర మృగాలతో సైతం స్నేహంగా జీవించే ఆదివాసీలు జనారణ్యంలో మానవ మృగాలతో తట్టుకోలేక ఈ సామ్రాజ్యవాద అభివృద్ధి ముసుగులో అంతమైపోతున్నారు. అటవీ హక్కుల చట్టాన్ని అపహాస్యం చేస్తూ సవాలు చేస్తూ వన్య ప్రాణి సంరక్షులు సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై ఫిబ్రవరి 13న ఒక అప్రజాస్వామిక తీర్పు వచ్చింది. పోడు భూములపై సరైన హక్కు పత్రాలు లేని ఆదివాసీల గూడేలను ఖాళీ చేయాలని ఒక నిరంకుశమైన తీర్పును ఇచ్చి ఆదివాసీ సమాజాన్ని ఆందోళనకు గురిచేసింది.

అసలు అటవీ హక్కుల చట్టంలోనే ఎన్నో లొసుగులు ఉన్నాయని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. 75 సంవత్సరాలుగా అడవిలో జీవిస్తున్నట్టుగా ఆధారాలు చూపాలని ఆదివాసీలపై ఒత్తిడి తెస్తున్నారు. లిఖిత పూర్వకమైన ఆధారాలను ఆదివాసులు ఎక్కడి నుండి తేగలరు. ఇప్పటికే విద్యుత్ ప్రాజెక్ట్‌లు సామ్రాజ్యవాద అభివృద్ధి నమూన, పారిశ్రామికరణ పేరుతో ఈ దేశంలో సగం ఆదివాసీలు నిర్వాసితులు అయి అంతం అయ్యారు. 2002, 2004 మధ్య అటవీ ఆక్రమణలు నిరోధించే పేరిట సుమారుగా 3 లక్షల ఆదివాసీలను అడవుల నుండి బలవంతంగా ఖాళీ చేశారు. ఆ సమయంలో ఎన్నో ఆకృత్యాలు, వేధింపులు, మారణహోమాలు ఆదివాసీలపై జరిగినాయి.

సుప్రీంకోర్టు తీర్పును అడ్డు పెట్టుకొని పాలకవర్గాలు, మైనింగ్ మాఫియా కనీవినీ ఎరగని రీతిలో ఆదివాసీలపై మారణహోమాన్ని, నిర్బంధాన్ని పెంచి ఆదివాసీ ప్రాంతాలలో ఉన్న ఖనిజ సంపదను అక్రమంగా దోచుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. చెరువులను కబ్జా చేయాలంటే ముందు నీళ్లను తోడెయ్యాలి. ఆ తర్వాత కబ్జా చేయడం సులభం అవుతుంది. అడవిని, అడవిలో ఉన్న సహజ వనరులు ఖనిజ సంపదను దోచుకోవాలన్నా ఇదే సుత్రాన్ని అమలు చేస్తున్నారు. ఖనిజ సంపదను తోడేస్తునారు.

నక్సలైట్ల పేరుతో ఆదివాసీలను ఏరేస్తున్నారు. ఇక మిగిలిన అడవిని కబ్జా చేయడమే అవుతుంది. అందుకే ఈ బూర్జువా బూటకపు ప్రజాస్వామ్యంలో ఒక భాగమైన సుప్రీంకోర్టు కూడ దోపిడీదారులకు దారులన్నీ క్లియర్ చేస్తున్నది. అడవులు నరకడం అనేది రాజ్యాంగంలో ఆర్టికల్ 48 ప్రకారం నేరమనే నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది.

గిరిజనేతరులు ఏజన్సీలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవడం 19(1)డి,ఇ ప్రకారం నేరం కదా ఈ విషయాన్ని కోర్టు ఎందుకు మరచిపోయింది. ఆర్టికల్ 19(1)డి.ఇ ప్రకారం గిరిజనేతరులను అడవి నుండి ఏజెన్సీ నుండి పంపిస్తే ఆదివాసీలకు వేరే పని తెలవదు. తరతరాలుగా ఆదివాసీలు అడవితో మమేకం అయిపోయి అవినాభావ సంబంధంలో జీవనాన్ని గడుపుతున్నారు. అడవుల నుండి పండ్లు, దుంపలు, తేనే, మూలికలు, ఇతర ఆహార పదార్థాలు సమకూర్చు కుంటున్నారు. ఆదివాసీల సాంస్కృతిక, ఆర్థిక వ్యవస్థ అడవులతోనే ఆధారపడి ఉంటుంది. ఆదివాసీల సాంస్కృతిక, సామాజిక సాంప్రదాయ జీవన విధానం కూడ అడవులతోనే ముడిపడి ఉంటుంది. భూమి ఆదివాసీలకు జీవనాధారం. అడవులు క్రమంగా మైదాన ప్రాంతాలుగా మారిపోతున్నాయి.

భూమి ఆస్తిగా మారక ముందు అన్ని మైదాన ప్రాంత ప్రజలకు జీవనాధారంగా ఉండేది. ఆదివాసీలు భూమి సాగు చేసుకొనే క్రమంలో కొన్ని జీవనాధారం నుండి బలమైన పెత్తనశక్తులు స్థిరపడడానికి కొన్ని గిరిజనేతర సముదాయ శక్తులు స్థిరపడడానికి అటవీ షెడ్యుల్ ప్రాంతాలలో నిర్దిష్టమైన సంబంధాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వాలకు అవసరం అయింది. దీంతో ఏజెన్సీలోకి పెద్దఎత్తున గిరిజనేతర వలసలు ప్రోత్సహించింది. వనరుల వినియోగం కూడ పెంచబడింది. దీని మూలంగా ఆదివాసీల భూములపై ఒత్తిడి పెరిగింది.

మరోవైపు ప్రపంచీకరణలో భాగంగా బహుళజాతి సంస్థలు తీవ్రవేగంతో వస్తున్న నూతన ఆర్థిక సరళీకరణ విధానాలలో భాగంగా అడవులతో సహా సహజ వనరులు ఖనిజ సంపదలన్నీ కూడ ప్రైవేటీక రించేందుకు పాలకవర్గాలు పూనుకున్నాయి. ఇందుకోసం ఒక పథకం ప్రకారం పనిచేస్తూ అడవులనూ ప్రైవేటీకరించేందుకు పాలకులు పన్నాగాలు పన్నుతున్నారు. ఇందుకోసం అడవులను ప్రైవేటీకరించే పనిలో భాగంగానే ప్రపంచబ్యాంకు మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో సాముదాయక అటవీ యాజమాన్య పథకం వియస్యస్ ఏర్పాటు చేసి అడవి నుండి ఆదివాసీలను దూరం చేస్తున్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం నియమించిన అనేక కమిటీల నివేదికలు ఉన్నా ఆచరణలో అమలుకాక ఆదివాసీలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అడవిలో ఆదివాసీలకు మాత్రమే హక్కులు కల్పించే రాజ్యాంగ రక్షణలు చట్టాలు జిఓలు అనేకం ఉన్నా గిరిజనేతర పాలకవర్గం వాటిని కాలరాస్తున్నది.

ఈ పాలకుల ఎస్ఆర్ఓ చట్టాన్ని సమర్థిస్తూ, ఆదివాసీలకు మద్దతుగా సాక్ష్యాధారాలతో సర్వోన్నత న్యాయస్థానానికి సమర్పించడంలో విఫలం కావడం వెనుక మైనింగ్ మాఫియా కుట్ర దాగి ఉందేమోననీ ఆదివాసీలకు అనుమానం కూడ ఉంది.

2018 నవంబర్ నాటికి దేశవ్యాప్తంగా 19.39 లక్షల మంది భూమిహక్కు పత్రాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తిరస్కరించినట్లు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ దగ్గర సమాచారం ఉంది. దీని మూలంగా దేశ వ్యాప్తంగా 20 లక్షల ఆదివాసీల అస్థిత్వం ప్రమాదంలో పడనుంది.

ఆదివాసీల భూహక్కు పత్రాల కోసం పెట్టుకున్న దరఖాస్తులను ప్రభుత్వం తిరస్కరించినంత మాత్రాన కనీసం పరిశీలించకుండా ఏకపక్షంగా ఉన్నఫళంగా తిరస్కృతి దరఖాస్తులను రెండు వారాలలోపు వెంటనే ఖాళీ చేయాలనడం అప్రజాస్వామికమైనది. సామాజిక న్యాయాన్ని సమాధి చేయడమే అవుతుంది. ఆదివాసీ హక్కు పత్రాల కోసం పెట్టుకున్న అభ్యర్థననూ ప్రభుత్వం తిరస్కరించినంత మాత్రాన ఏకపక్షంగా విచారణ చేయకుండా ఆదేశాలు ఇవ్వడం నియంతృత్వం కిందకు వస్తుంది. నియంతృత్వపు ముసుగులో ఉన్న న్యాయస్థానాలను ఏం చేయాలో ప్రజలే నిర్ణయించుకుంటారు. ఆదివాసీల అర్జీలు తిరస్కరించినప్పటికిని, 90 రోజులలో సంబంధిత రాజ్యాంగ సంస్థలకు తమ తిరస్కృతి అర్జీలను పునః పరిశీలించాలని కోరే హక్కు అభ్యర్థులకు ఉంటుందనే విషయాన్ని సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకోకపోవడం చాల దారుణం మోసం.

అటవీ హక్కుల చట్టంపై రాజ్యాంగబద్ధతపై ఏలాంటి స్పష్టత ఇవ్వకుండానే ఆదివాసీలను నిర్వాసితులు చేస్తున్నా సుప్రీం ఆదేశాలపై ఆదివాసీ సమాజానికి చాల సందేహాలు ఉన్నాయి. ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు చట్టాలు చేసినా ప్రభుత్వాలే వాటిని కార్పొరేట్ మాఫియాకు బలిచేస్తున్నాయి. ఆదివాసీలు సాగుచేస్తున్న పోడు భూముల వల్ల అడవులు నాశనం అవుతున్నాయా, లేక కార్పొరేట్ కంపెనీల వల్ల అవుతున్నాయా అనేది పరిశీలిస్తే ఈ గిరిజనేతర నాగరిక సమాజం, పాలకులు కలిసి అడవులను ఎంత ధ్వంసం చేస్తున్నారో స్పష్టంగా అర్థం అవుతుంది.

ఈ రోజు ఏజెన్సీ ప్రాంతాలలో మైనింగ్ మాఫియా, కోల్ మాఫియా, ఇసుక మాఫియా, సింగరేణి ఓపెన్ కాస్టు, విద్యుత్ ప్రాజెక్టుకు అటవీ భూములు కొన్ని వందల ఎకరాలు, వేల ఏకరాలు కేటాయిస్తే, 170 చట్టానికి విరుద్ధంగా భూములు బహుళజాతి కంపెనీలకు కేటాయిస్తే పట్టించుకోని వన్యప్రాణి సంరక్షణ సంస్థలు కేవలం ఆదివాసీలు సాగు చేస్తున్న భూములను లాక్కోవడం, ఆదివాసీల వల్లనే అడవులు ధ్వంసం అవుతున్నాయనే కారణంతో కోర్టులో కేసులు వేయడం వెనుకాల గిరిజనేతర పాలకవర్గం, మైనింగ్ మాఫియా ఉన్నదని ఆదివాసీ సమూహం బలంగా నమ్ముతున్నది.

పోలవరం ప్రాజెక్ట్ వస్తే పర్యావరణం, అడవి జీవవైవిధ్యం నాశనం అవుతాయని ఉద్యమించింది ఆదివాసీలే. వేదాంత పోస్కో కంపెనీలకు, బయ్యారం ఉక్కు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమించింది ఆదివాసీలే. అలాంటి ఆదివాసీలను అడవి నుండి దూరం చేయాలని సర్వోన్నతమైన న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం దేనికి నిదర్శనమో వన్యప్రాణి సంరక్షణ సంస్థ ఆదివాసీలకు సమాధానం చెప్పాలి. సుప్రీం కోర్టు అలాంటి తీర్పు ఇవ్వడానికి దారితీసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్ఏ చట్టాన్ని సమర్థించడంలో తన వాదనను కుట్రపూరితంగా నీరు గార్చింది.

సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పును కూడ ప్రభావితం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కార్పొరేట్ సామ్రాజ్యవాద నమూనాను ముందుకు తీసుకువెళ్లుతున్న నేపథ్యంలో భాగంగానే ఆదివాసీలకు వ్యతిరేఖంగా సుప్రీంకోర్టు ఒక అప్రజాస్వామికమైన తీర్పును ఇచ్చింది. దేశ ఆర్థికవ్యవస్థ పరిరక్షణకు కారణమైన మైనింగ్ దాని వ్యతిరేక ఆదివాసీల త్యాగపూరిత పోరాటాలను నీరుగార్చినట్లు అవుతుంది.

ఈ నేపథ్యంలో దండకారణ్యం వంటి విశాలమైన ప్రాంతంలోని సహజ వనరులు మైనింగ్ మాఫియా వశం అయి ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థ ఉంటుందో ఊహించుకోవచ్చు. తమ రక్తంతో ప్రాణత్యాగలతో దేశ ఆర్థిక వ్యవస్థను, సహజ వనరులను, ఖనిజ సంపదను కాపాడుతూ వస్తున్న ఆదివాసీ సమాజాన్ని ఈ గిరిజనేతర నాగరిక సమాజం, ఈ న్యాయవ్యవస్థ కలిసి అంతం చేయాలనుకోవడం చాల అన్యాయం. ఆదివాసీలది ఆశ్రయమిచ్చి, ఆదరించే స్వభావమే తప్ప ఆక్రమించే స్వభావంలేని ఆదివాసీలని ఈ భూస్వామ్య దోపిడీ పాలకవర్గ రాజకీయాలు గిరిజనేతరులు, బ్రిటిష్ పాలన యంత్రాంగంలో భాగమైన కోర్టులు, పోలీసులు, రెవెన్యూ పోలీసు చట్టాలను తమకు అనుకూలంగా వాడుకొని ఆదివాసీలకు చెందవలసిన హక్కులను, ఫలాలను వారి దరికి చేరనీయకుండా దోపిడీ చేస్తున్నారు. అందుకే నేడు ఆదివాసీలను పట్టిపీడిస్తున్న అనేక కష్టాల నుండి విముక్తి పొంది అటవి హక్కులు సాధించాలంటే కదం కదం కలిపి, ఐక్యంగా ఉద్యమాలు చేసి, అటవీ భూములపై హక్కులు సాధించాల్సి ఉంది.

భారతదేశ అడవులలో నివసించే ఆదివాసీల ఏకైక జీవిత వనరులు అడవులు మాత్రమే. అదే వారీ బ్రతుకుదెరువు. ఆదివాసీలకు ఆహారాన్ని, ఆశ్రాయాన్ని ఇచ్చేవీ అడవులే. శతాబ్దాలుగా ఆదివాసీలు అడవులను వాడుకొనే స్వేచ్ఛను అనుభవించడం ఆదివాసీల సాంస్కృతిక జీవనాన్ని అతి దగ్గరగా పరిశీలిస్తే తప్ప, అడవులతో పెనవేసుకున్న జీవితానుబంధం ఎంత బలీయమైందో అర్థం కాదు.

చరిత్రలో అడవులను దోచుకోవాలనుకున్న ప్రతివాడు తాను చేసే ప్రతి చర్య ఆదివాసీ అభివృద్ధి అని చెప్పాడు. అయితే ఇవాళ్టి ఆదివాసీ అభివృద్ధి అంటే ఆదివాసీలను అడవి నుండి వేరు చేయడమేనా...వాళ్ల హక్కులు కాలరాసి, వారీ స్వేచ్ఛను హరించి అడవి సంపదను ఆటవికంగా దోచుకోనే నాగరికుల దోపిడీని విష రక్కసుల కుట్రగానే భావించాలి. చేపలను నీటి నుండి వేరుచేస్తే ఎట్లా బతకలేవో అట్లాగే ఆదివాసీలను అడవుల నుండి వేరు చేస్తే బ్రతకలేరు.

ఈ బూర్జువా బూటకపు న్యాయస్థానాల తీర్పులకు వ్యతిరేకంగా కొమురం భీం, రాంజీగోండ్ సోయం గంగూల్, బీర్సముండా, సమ్మక్క సారలమ్మ విప్లవ పోరాట స్ఫూర్తితో జల్ జంగిల్ జమీన్ కోసం ఏజెన్సీలో స్వయం పాలన కోసం త్యాగలకు సిద్ధం కావల్సిన సమయం ఆసన్నమైంది. మన భూములను కబ్జా చేయడానికి వచ్చే అటవి పోలీసు అధికారులను తన్ని తరమాలి. అడవి ఆదివాసీలదే అని ప్రకటించాలి. అడవి నుండి ఆదివాసీలను వెళ్లగొట్టే ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఆదివాసీకి భూమి హక్కు పత్రాలు ఇవ్వాలి. ఏజెన్సీలో గిరిజనేతరుల వలసలు అరికట్టాలి. ఏజెన్సీలో గిరిజనేతరుల ఓటు హక్కు రద్దు చేయాలి. లేని పక్షంలో ఏజెన్సీలో ఆదివాసీలకు పాలకుల మధ్య అంతర్యుద్ధం జరుగుతుంది. ఈ మారణహోమానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆదివాసీ మేలుకో-ఏజెన్సీ ఏలుకో...

(రచయిత ఆదివాసీ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు-తెలంగాణ) వీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 'డేటా' చౌర్యం

***అన్నిటికీ 'ఆధార్' అనే పాలకులు ప్రజల వ్యక్తిగత వివరాలకు భద్రత కల్పించకుండా ఆ సమాచారాన్ని రాజకీయ నాయకుల, బహుళజాతి కంపెనీల స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటూ పౌరుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 3 కోట్ల 70 లక్షల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇది గత నెలలో ఎన్నికల సంఘం అధికారిక లెక్కల అంచనా. అయితే ఫామ్ (6) ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ (మార్చ్ 18 – 25 వరకు నామినేషన్ల స్వీకరణ) లోపుగా సమర్పించుకునే వారు ఓటర్లుగా నమోదు కావడానికి మార్చి 15 వరకు గడవు ఉంటుంది. ఈ అవకాశాన్ని ఎన్నికల సంఘం మార్చి 10 వరకు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 59.18 లక్షల దొంగ ఓట్లు నమోదై ఉన్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. అయితే అదే వైకాపా ఓట్ల తొలగింపునకు లక్షల సంఖ్యలో ధరఖాస్తులు పెట్టడం, తప్పుడు పేర్లతో ఎన్నికల సంఘాన్నే తప్పుదోవపట్టించాలని చూడడం, వారి అక్రమ కార్యకలాపాలకు అద్దం పడుతోంది. ఓట్ల తొలగింపుపై దాదాపు 8.72 లక్షల ధరఖాస్తులు వస్తే అందులో దాదాపు అన్నీ కూడా వైకాపా వారు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారని బయటపడింది. అది కేవలం ప్రత్యర్థి పార్టీలను ఎదుర్కోవడానికి, వారికి వ్యతిరేకంగా ఓట్లు వేసేవారి ఓట్లను గల్లంతు చేశారనేదానికి ఇదొక మచ్చుతునక. అయితే బోగస్ ఓట్ల తొలగింపునకు క్షేత్రస్థాయి పరిశీలనకు ఎన్నికల సంఘం దగ్గర సరియైన సిబ్బందిలేక దిక్కుతోచని పరిస్థితి నెలకొని ఉంది. గత సంవత్సరంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికలలో ఇదే పద్ధతి అధికార పార్టీవారు అవలంభించారని, వారి సలహాతోనే ఇక్కడ వైకాపా కూడా ఇదే పద్ధతి అవలంభించడానికి ప్రయత్నిస్తున్నదని అధికార తెలుగుదేశం పార్టీ ఆరోపణ. అయితే తెలుగుదేశం పార్టీ ఒక ఆకు ఎక్కువ తిన్నట్లు ముందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజల సమాచారాన్ని అనగా తెల్ల రేషన్‌కార్డు దారులు, ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులు, చంద్రన్న బీమా, పెళ్లి కానుకలు తదితర కార్యక్రమాలలో లబ్ధిదారుల జాబితా నొకదానిని ఒక 'గ్రిడ్' సంస్థకు బదిలీ చేసి, అవి కాకుండా మిగతా వారి ఓటర్ల జాబితాను అనగా తమకు 'ఓటు వేయరేమో?' అనే అనుమానమున్నవారి సంఖ్యను, జాబితాను తయారు చేయడానికి అశోక్ అనేవ్యక్తి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సంస్థకు బదలాయించడం జరిగింది. ఒక రాష్ట్ర ప్రజల జాబితాను ప్రభుత్వం ఒక ప్రైవేట్ సంస్థకు బదలాయించడం జరిగింది. అది తప్పా? కాదా? అనేది ఇంకో అంశం. అయితే, ఆ డాటాను తెలంగాణ ప్రభుత్వ సహకారంతో, టిఆర్ఎస్ పార్టీ మద్దతుతో వైకాపా వారు తమ పార్టీవారి ఓట్లను తొలగిస్తున్నారనే నెపంతో దీనిపై ఒక ఫిర్యాదును ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి ద్వారా పోలీసులకు ఇప్పించారు. స్థానిక స్టేషన్‌లో లోకేశ్వర్‌రెడ్డి ఫిర్యాదుదారునిగా ఉన్నారు. దీని ద్వారా ఆ సంస్థలో పనిచేసే నలుగురు యువకులపై కేసు నమోదు చేసి నిర్బంధించారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించి, నలుగురు యువకులను తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా నిర్బంధించిందని హైకోర్టు (హైదరాబాద్) ను ఆశ్రయించగా, (హెబియస్ కార్పస్ రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు) ఆ నలుగురు సిబ్బందిని హైకోర్టు ఎదుట హాజరు పరిచారు. అయితే అప్పటికే వారు తమను ఎవరూ నిర్బంధించలేదని, తాము క్షేమంగా ఉన్నామని, వారితో ఒక ప్రమాణ పత్రాన్ని తెలంగాణ పోలీసులు తెలంగాణ హైకోర్టు ఎదుట రాతమూలకంగా ఇచ్చారు. అంతే కాకుండా ఈ కేసులో ఈ నలుగురిని కూడా సాక్షులుగా తీసుకున్నామంటూ మాట మార్చేశారు. అంతేకాకుండా ఈ నలుగురి నివాసాలకు సంబంధించిన 4 గ్రామ పరిపాలనాధికారుల (విఆర్ఒ) సంతకాలను ఖాళీ తెల్ల కాగితాలపై తీసుకొని వాటిని కూడా హైకోర్టు ఎదుట ప్రవేశపెట్టారు. దీనిని చూసి హైకోర్టు 'ఖాళీ కాగితాలపై విఆర్ఒల సంతకాలు తీసుకోవడం ఎందుకు?' అంటూ పోలీసులను చివాట్లు పెట్టింది. ఈ మొత్తం కేసుపై సైబరాబాద్ కమిషనర్ వి.కె. సజ్జన్నార్ మీడియా సమావేశం నిర్వహించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలపై కూడా అవసరమైతే నోటీసులిస్తూ, విచారిస్తామని కొంత ఘాటుగానే స్పందించారు. మొత్తం ఒక పథకం ప్రకారం ఈ వ్యవహారం అంతా నడిచినట్లు అనిపిస్తుంది.

తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలకు సంబంధించిన 'సేవా మిత్ర' యాప్‌ను తయారు చేస్తున్న 'ఐటి గ్రిడ్స్' సంస్థపై దాడిచేసి తెలంగాణ పోలీసులు డిస్కులు, డేటా అపహరించుకుపోయారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు గుంటూరు రూరల్ ఎస్.పి. ఎదుట ఫిర్యాదు చేశారు. అసలు పాలనను గాలికొదిలేసి ఒక వారం రోజుల పాటు ప్రజలంతా సిగ్గుపడేటట్లు మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంతా దీనిపైననే దృష్టి పెట్టింది. కొంతమంది మంత్రుల పేర్లు కూడా ఓటర్ల లిస్టులో లేవని, తొలగించారని, దీనికంతటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం (టిఆర్ఎస్ పార్టీ), వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బాధ్యులంటూ తెలుగుదేశం పార్టీ దుమ్మెత్తి పోసింది. రాష్ట్రంలోని ప్రజలంతా తమ ఓట్లు ఉన్నాయో లేవో అంటూ ఆందోళన చెందారు. భారత ఎన్నికల సంఘాన్ని కలిసి వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి, తదితరులు ఫిర్యాదు కూడా చేశారు. ఎన్నికల సంఘం కేవలం ప్రేక్షక పాత్ర తప్ప, ఏమీ చేయలేకపోయింది. అంతే కాకుండా తమ ఓట్లు ఉన్నాయో లేవో ప్రజలు చూసుకోవాలని ఒక ఉచిత సలహా కూడా ఇచ్చింది. ఇది పూర్తిగా అప్రజాస్వామ్యం, రాజ్యాంగ విరుద్ధం.

హైదరాబాద్‌లో నివసిస్తున్న, వ్యాపారాలున్న వ్యాపార వేత్తలను, పారిశ్రామిక వేత్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ, తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని తెలుగుదేశం పార్టీని వీడేటట్లు చేస్తూ వైకాపాకు సహకరించాలని లేదా వైకాపాలో చేరాలని టిఆర్ఎస్ బలవంత పెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించాడు. టిఆర్ఎస్ పార్టీ వైకాపాకు వేయి కోట్ల రూపాయలు ఎన్నికల ఖర్చు ఇచ్చినట్లు కూడా బహిరంగంగానే వ్యాఖ్యానించాడు ఏపి ముఖ్యమంత్రి. 2019లో జరుగుతున్న ఏపి శాసన సభ ఎన్నికలు, దేశవ్యాప్త లోక్‌సభ ఎన్నికలు ఒక పెద్ద ప్రహసనం లాగా తయారయింది. ఏపి డేటాతో మేమేం చేసుకుంటామని, 'ఓటుకు నోటు కేసు' తరహాలో చంద్రబాబును అవహేళన చేస్తూ హైదరాబాద్‌లో టిఆర్ఎస్ నాయకత్వం మాట్లాడుతున్నది. వాస్తవానికి 'సాధికార మిత్ర' అనే ప్రభుత్వ సహాయ పొదుపు మహిళల డేటా, ప్రభుత్వ పథకాల లబ్దిదారుల మొత్తం సమాచారం చౌర్యం కాలేదని, క్షేమంగానే ఉన్నదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ విజయానంద్ ప్రకటించాడు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకత్వం పూర్తిగా ఆందోళనలో ఉన్నారు.

తెలుగుదేశం పార్టీవారు డబ్బులిస్తే తీసుకోవాలి కానీ ఓటు మాత్రం ఫ్యాన్ గుర్తుకు వేయాలని వైకాపా అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించినందుకు, జగన్ మోహన్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ మరో ఫిర్యాదు దాఖలు చేసింది. దీనిపై ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 59 లక్షల దొంగ ఓట్లు టిడిపి చేర్పించిందని వైకాపా ఆరోపించింది. దీనిపైన కూడా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ (తాత్కాలిక) సంస్థ బ్లూఫ్రాగ్ విశాఖపట్టణం కేంద్రంగా ఉన్నది. టిడిపి ఐటి ప్రొవైడర్ 'ఐటి గ్రిడ్స్' హైదరాబాద్ కేంద్రంగా ఉన్నది. మార్చి 3 అర్ధరాత్రి హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీ కాలనీలోని ఐటి గ్రిడ్స్ కంపెనీలో తెలంగాణ (హైదరాబాద్) పోలీసులు ప్రవేశించి, అక్కడ పనిచేసే నలుగురు ఉద్యోగులను విచారణ పేరుతో అరెస్ట్ చేయడంతో ఈ సమస్య జటిలమైంది. మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్రజల, ఓటర్ల వివరాలన్నీ దొంగిలించ బడుతున్నాయనే పెద్ద ప్రచారం జరిగి, దేశ వ్యాప్త చర్చకు దారితీసింది. ఇది వైకాపా, తెలుగుదేశం పార్టీల సమస్య కాదు. ఇది ఈ దేశ పౌరుల రాజ్యాంగ హక్కులకు సంబంధించిన విషయం. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా రాజ్యాంగ హక్కులను కాపాడవలసిన బాధ్యత ఆయా ప్రభుత్వాల పైన ఉన్నది. ఇప్పుడు భారతదేశంలో స్వతంత్ర సంస్థలైన ఎన్నికల సంఘం, ఆర్‌బిఐ, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సిఎజి), సిబిఐ అన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నవే. వీటిని భారతీయ జనతా పార్టీ తమ ప్రత్యర్థులపై ప్రయోగిస్తూ, బెదిరించడం పరిపాటిగా మారింది.

ఎన్నికల సంఘం పూర్తిగా స్వతంత్ర సంస్థ, రాజ్యాంగం సర్వ హక్కులూ దానికి కల్పించింది. భారతదేశ వ్యాప్తంగా కొత్తగా నమోదైన కోటీ 60 లక్షల మందితో కలిపి ఏకా ఏకీన 90 కోట్లకు విస్తరించిన ఓటర్ల సంఖ్య రీత్యా దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ఒక పెద్ద అద్భుతంగా మారింది. ఓటర్ల జాబితానే సరిగా రూపొందించుకోలేని బలహీనతలతో భారత ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నది. ఇది 'మేడి పండుచూడ మేలిమై ఉండు, పొట్టవిప్పి చూడ పురుగులుండు' మాదిరే. దేశంలో ఓటర్ల జాబితాలో ఎనిమిదిన్నర కోట్ల బోగస్ ఓట్లు నమోదయి ఉన్నాయని గతంలోని భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ బహిరంగంగానే వ్యాఖ్యానించాడు. మొత్తం ఓటర్లలో 12 శాతం ఓట్లు బోగస్‌గానే ఉన్నాయనేది బహిరంగ రహస్యమే. దక్షిణాది రాష్ట్రాలలోని ఒక ప్రధాన నగరంలో 40 శాతం ఓట్లు బోగస్ అనేది 2015 లోనే భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలియజేశాడు. దీనిని నివారించడానికి ఓటర్ల పేర్లను ఆధార్ నంబర్‌తో అనుసంధానిస్తే సరియైన ఓట్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంటుదనేది నగ్నసత్యం. ఈ లక్ష్య సాధన కోసం జాతీయ ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రారంభించిన రెండు నెలలకే 32 కోట్ల మంది ఓటర్లను ఆధార్‌తో అనుసంధానించారు. అదే సమయంలో అన్నింటినీ ఆధార్‌తో అనుసంధానించడం అవసరం లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో మధ్యలోనే ఆపివేయడం జరిగింది. అయితే ఇటీవల మద్రాస్ హైకోర్టు తీర్పు ఆధారంగా, (ఒక ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలయినది) ఎన్నికల సంఘం ఆధార్ అనుసంధానానికి తాము అనుకూలమేనంటూ ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇటీవల తెలంగాణలో దాదాపుగా 23 లక్షల ఓట్లు గల్లంతు కావడం జరిగింది.

కేవలం 'నిర్ణీత సమయానికి ఎన్నికలు జరపడం మాత్రమే తమ విధి' అంటూ ఎన్నికల సంఘం భావించడం తర్వాత జరిగే ఓటర్ల నమోదు ప్రక్రియ, సరియైన ఓటర్లు నమోదు కావడం అనేది రాజకీయ పార్టీలు చూసుకుంటాయనేది భారత ప్రజాస్వామ్య వ్యవస్థను అప్రతిష్టపాలు చేయడమే అవుతుంది. 2014 ఎన్నికలలో సొంత ఊర్లలో నివాసం లేని కారణంగా దాదాపు 28 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారనేది ఒక సర్వే చెపుతున్నది. అనగా జీవనం కోసం వలస వెళ్లే ప్రజలకు ఓటు హక్కు నిరాకరించబడుతున్నదనేది అర్థమవుతున్నది. దీనిపై ఎన్నికలం సంఘం ఏ విధమైన చర్యలు భవిష్యత్తులో తీసుకుంటుందో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉండాలి. భారతదేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరిగిన సందర్భాలు ఎప్పుడూ లేవు. డబ్బు – మద్యం నీళ్లవలే ఖర్చు అవుతున్నది. దీనిని పూర్తిగా నివారించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఒత్తిడికి లోనయ్యే పరిస్థితిని రాజకీయ పార్టీలు కల్పిస్తున్నాయి. దీనిని ఎదుర్కోవాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు 'ఎన్నికలు' అనేవి ఒక సాధనంగా వాడుకుంటున్నారు కానీ అది వాస్తవం కాదు.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు) వీ

పాఠకులు ఫిర్యాదులు, సమాచారం కోసం వీక్షణం కార్యాలయానికి పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 6.00 గంటలలోగా స్వయంగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. మిగతా సమయాల్లో ఫోన్ చేస్తే అది ఫ్యాక్స్‌లోకి వెళ్లి మీకు జవాబు రాదు. అప్పుడు మీరు ఫోన్ ఎత్తికూడా మాట్లడడంలేదని అనుకునే అవకాశం ఉంది. ఇది గమనించగలరు. – సం.

చెంచుల బతుకు ఛిద్రం చేస్తున్న అధికారులు

అటవీ సంపదలేక మత్స్యకారులుగా మారి జీవితం సాగిస్తున్న చెంచులను అధికారుల, పోలీసుల అండదండలతో దళారులు, భూస్వాములు కలిసి జీవిక లేకుండా చేస్తున్నారని అంటున్నారు డా. లక్ష్మణ్ గడ్డం

అప్పటి నిజాం నవాబు లక్ష ఎకరాల అడవిని ఆదివాసీ చెంచుల హక్కుగా గెజిట్లో రాసిచ్చాడు. ఇప్పటి స్వతంత్ర భారత పాలకులు మాత్రం వారిని అడవి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా అడవిలో జీవించలేని దుర్భర పరిస్థితులు కల్పిస్తున్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రవాణ, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాల కోసం పోరుబాట పట్టాల్సి వస్తున్నది. నల్లమల అడవిని ప్రభుత్వం దక్షిణాఫ్రికాకు చెందిన 'డిబీర్' అనే బహుళజాతి సంస్థకు అప్పగించింది. జీవనం భారంకావడంతో అక్కడి చెంచులు బతకడం కోసం ప్రత్యామ్నాయ మార్గాలు వెతకక తప్పడం లేదు. మరోవైపు ప్రకృతి సహజసిద్ధంగా లభించే కాయలు, పండ్లు, గడ్డలు, తేనె, బంక మొదలగు పదార్థాలు ఇటీవలి కాలంలో దొరకడం లేదు. కొంతమంది చెంచులు గత్యంతరం లేక బతుకుదెరువు కోసం మత్స్యకారులుగా మారారు. నల్లమల అడవిలోని శ్రీశైలం బ్యాక్ వాటర్ వాళ్లకు గొప్ప జీవన వనరుగా ఉంది. చాలా ఏళ్లుగా చేపలు పడుతూ జీవిస్తున్నారు. చేపలు పట్టడం వారి సాంప్రదాయ వృత్తి కాకపోయినా, జీవించడం కోసం నేర్చుకుని చేపలు పడుతూ జీవితాలను నెట్టుకొస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల నుండి కర్నూలు జిల్లా పాతాళగంగ వరకు దాదాపు 120 కిలోమీటర్ల కృష్ణా పరివాహక ప్రాంతం ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తు పెంచడంతో బ్యాక్ వాటర్ కొల్లాపూర్ వరకు చేరుకుని నివాసాలను, వ్యవసాయ భూములను ముంచేసింది. (ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం, పునరావాసం కల్పించి, ప్రభుత్వం కొద్దిగా ఆదుకుంది.)

దట్టమైన నల్లమల అభయారణ్యంలోని శ్రీశైలం బ్యాక్ వాటర్ కొల్లాపూర్ వరకు వెనక్కి ప్రవహిస్తూ వచ్చి అమరగిరి చెంచుగూడెం అంచుకు తాకాయి. ఈ గూడెంలో నివసిస్తున్న 61 కుటుంబాలు ఈ పరిణామాన్ని గొప్ప అవకాశంగా తీసుకొని మత్స్యకారులుగా మారారు. చేపల వేట చేసుకుంటూ జీవిస్తున్నారు. ప్రభుత్వపరమైన ఎలాంటి సహాయం అందకున్నా స్వయంగా చేపలను పట్టి విక్రయించుకుని కుటుంబాలను పోషించుకునేవారు.

ఈ క్రమంలో ఇక్కడ అపార మత్స్య సంపద ఉందని తెలుసుకున్న కొంతమంది దళారులు మత్స్య సంపదపై కన్నేశారు. ఈ మత్స్యకారుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకోవాలనుకున్నారు. మోసపూరితంగా జాలరులను చేరుకుని మచ్చిక చేసుకున్నారు. మీరు నిశ్చింతగా చేపలు పట్టండి, వాటిని మీరు దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించాల్సిన ప్రయాస అవసరం లేదు. మేమే మీ దగ్గరికి వచ్చి కొంటాం. పైగా మీకు కావాల్సిన సామాగ్రి, పనిముట్లు మేమే అందజేస్తామని, మీరు పట్టిన చేపలు వెంట వెంటనే అమ్ముడుపోతాయి కనుక మీ చేతిలో నిత్యం డబ్బులుంటాయని సుందర స్వప్నాలను కలిగించారు. అరచేతిలో స్వర్గాన్ని చూపెట్టారు. దళారుల కుట్ర తెలియని మత్స్యకారులైన చెంచులు వెంటనే ఒప్పేసుకున్నారు.

కాలక్రమేణ ఈ చెంచులకు దళారులు అప్పు కింద పుట్టీలు, వలలు, తట్టలు, ఇతరత్రా అవసరాలు సమకూర్చడం మొదలు పెట్టారు. క్రమేపి చెంచుల ప్రతి ఆర్థిక అవసరానికి దళారుల దగ్గర వడ్డీకి అప్పులు చేయడం మొదలు పెట్టారు. జంటకు రు. 10 వేల నుంచి 50 వేల చొప్పున అడ్వాన్సు చెల్లించి చేపల వేటకు పంపేవరకు చేరుకున్నది పరిస్థితి. విషయం అర్థం కాకుండానే విషవలయంలో చిక్కుకున్నారు. ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని కోల్పోవడానికి, ఇంకో వ్యక్తికి బానిసగా మారడానికి ఆర్థిక అవసరాలే దారులు వేస్తాయి. చేపల వేట వలన వచ్చిన ఆదాయం దళారులిచ్చిన అప్పుల వడ్డీలు, చక్రవడ్డీలకే సరిపోని పరిస్థితి ఏర్పడింది. అసలు ఎన్నటికీ తేరనంతగా పేరుకుపోయింది. ఆరుగాలం శ్రమించి చేసిన కష్టమంతా వెట్టిచాకిరిగా మారింది.

ఈ పరిస్థితిని గుర్తించిన చెంచు సేవా సంఘం ప్రభుత్వం దృష్టికి తేవడంతో 2016 జూలై 1న అమరగిరిలో 61 కుటుంబాలకు వెట్టి నుంచి విముక్తి చేస్తున్నట్లు ప్రభుత్వం పత్రాలు జారీ చేసింది. తట్టలు, పుట్టీలు, వలలు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదు. చేపల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్న హామికి కూడా కట్టుబడలేదు. దళారి వ్యవస్థను రద్దు చేయలేదు. ఫలితంగా పరిస్థితి ఎప్పటిలాగే కొనసాగుతోంది. చెంచులు రెక్కలు ముక్కలు చేసుకుని సేకరించిన మత్స్య సంపదంతా దళారుల పరం అవుతున్నది. శ్రమ దోపిడీకి పాల్పడుతున్న దళారులు కోట్లకు పడగలెత్తుతున్నారు. చెంచుల అమాయకత్వం దళారులకు కాసులపంట కురిపిస్తుంది. చెంచుల వద్ద చేపలను దళారీ వ్యాపారస్తులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్‌లో పదొంతుల ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. అన్ని రకాలుగా దోచుకుని లెక్కగట్టిన రాబడిని వడ్డీల కింద జమకట్టి పూటగడవని స్థితికి నెట్టుతున్నారు. చెంచులు ఈ అప్పుల ఊబి నుంచి బయటపడలేక రెక్కలు విరిగిన పక్షుల్లా విలవిల్లాడుతున్నారు.

నిజానికి ఈ దళారీ వ్యాపారుల కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం నుంచి చేపలు కొనుగోలు చేయడానికి ఎలాంటి అనుమతులు లేవు. కాని అధికారుల, రాజకీయ నాయకుల, పోలీసు అధికారుల అండదండలు మెండుగా ఉన్నాయి. కనుక యథేచ్ఛగా చేపల కొనుగోలు కేంద్రాన్ని

అమరగిరిలో ఏర్పాటు చేసుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అమరగిరి, కొల్లాపూర్, పెంట్లవెల్లి, సోమశిల కేంద్రంగా మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు. బ్యాక్ వాటర్‌లో లభించే బొచ్చ, రవులు, వాలుగ, కొర్రమేను, చందమామ మొదలైన చేపలను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్, మద్రాస్, బొంబాయి, కలకత్తా లాంటి నగరాలకు ఎగుమతి చేస్తూ బ్రోకర్లు కోట్లు గడిస్తుంటే, వాటిని సేకరించిన మత్స్యకారులు బికారులవుతున్నారు. ఈ వైనం గమనిస్తున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లున్నారు.

ఇటీవలి కాలంలో దళారులకు ధనదాహం మరీ పెరిగిపోయింది. కృష్ణా నది బ్యాక్ వాటర్‌లోని మత్స్య సంపదనంతా అనతి కాలంలోనే కొల్లగొడదామని దురాలోచన కలిగింది. వెంటనే ప్రకాశం, గుంటూరు జిల్లాల నుండి వృత్తి మత్స్యకారులను పిలిపించి అమరగిరి బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు దించారు. వారు వెంట తెచ్చుకున్న వలల పేర్లు 'అలివి' వలలు, అవి వలలు కావు జీవితాలను ఛిద్రం చేసే మత్స్యకుహరాలు. అది విసిరామంటే చాలు విస్తారమైన నోరు తెరుస్తుంది. పాతాళానికి చేరుకుని అట్టడుగున ఉన్న సన్నటి ముక్కుపచ్చలారని చేప పిల్లలను సైతం లాక్కొస్తుంది. అతి సన్నటి రంధ్రాలతో దాన్ని డిజైన్ చేశారు. వీటిని వినియోగిస్తే మత్స్య సంపద కనుమరుగవుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ వలల వినియోగాన్ని 16 ఏళ్ల క్రితమే నిషేధించింది. అయినా వీటి వినియోగం యథేచ్ఛగా కొనసాగుతుందంటే ఎవరి మామూళ్లు వాళ్లకు అందుతున్నాయి. ప్రభుత్వం మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే మత్స్య సంపద మొత్తం కొద్ది కాలంలోనే హరించుకుపోతుంది. మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటుంది. ప్రజలకు భవిష్యత్తులో చేపలనేవే దొరకవు. చిన్న చేప పిల్లలు వలలోంచి బయటకి తీసిన మరుక్షణమే చనిపోవడం వలన వాటిని కుప్పలు తెప్పలుగా అడవిలో పారబోస్తున్నారు. దానివల్ల అమరగిరి గ్రామం మొత్తంగా కాలుష్యంతో నిండిపోయింది.

ఇదిలా ఉండగా అమరగిరి చెంచులు భూస్వాముల నుండి, పోలీసుల నుండి తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారు. కృష్ణానది బ్యాక్ వాటర్‌లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి పలు విధంగా ఆదుకుంది. అయినప్పటికీ ఎప్పుడో భూములు కోల్పోయిన రైతులు ఇప్పుడు మళ్లీ రంగ ప్రవేశం చేసి నీళ్లలో మునిగిన భూములు చూపెడుతూ ఈ భూములు మావి, ఈ భూమిలో నిలిచిన నీరు మాది కనుక ఈ నీటిలోకి వచ్చిన చేపలు మాకే చెందుతాయి అనే వింత వాదన మొదలుపెట్టి ఆ నీటిలోకి దిగకుండా అడ్డుకుంటున్నారు. రైతులు కక్షగట్టి చెంచుల పొట్టమీద కొడుతున్నారు. పోలీసులు వీరికి అండగా నిలిచారు.

వాస్తవానికి అమరగిరి చెంచుగూడెం నుండి బయలుదేరి బ్యాక్ వాటర్ నదీ తీరాన ఉన్న కిన్నెరగుంటు ప్రాంతానికి చేరుకుని చేపల వేట కొనసాగిస్తారు. ఈ ప్రాంతంలోనే తాత్కాలికంగా టెంటులు ఏర్పాటు చేసుకుని అక్కడే నివసిస్తూ చేపలు పట్టి దళారులకు అమ్ముకుని జీవిస్తున్నారు. అక్కడే వారం రోజుల నుండి చేపలు పట్టి దళారులకు అమ్మితే వడ్డీలు పోను వచ్చిన ఆ కొద్ది డబ్బుతో మళ్లీ ఊరికెళితే ఆ ఇళ్లల్లో ఆనందంగా పొయ్యిలు వెలుగుతాయి. పిల్లా పాపలు, ముసలి వాళ్ల మొఖాల్లో వెలుగు కొద్ది రోజులే వెదజల్లుతుంది. మళ్లీ కొద్ది రోజుల తర్వాత పిల్లలను ముసలివాళ్లకు అప్పజెప్పి, చంటి పిల్లలను చంకనేసుకుని, పొట్టచేతపట్టుకుని పుట్టినెక్కాల్సిందే. ఈ జీవనయానం నిరంతరం కొనసాగుతుంది. ఈ కిన్నెరగుండు చేరుకోవడానికి గంటసేపు నడిచి, అర్ధగంటసేపు పడవలో ప్రయాణం చేసి చేరుకోవాలి. పడవ ప్రయాణం చేస్తున్న సందర్భంలో బీభత్సమైన గాలులు, తుఫాను, కుండపోత వర్షాలు మొదలైతే ప్రాణాలు కోల్పోవాల్సిందే. కిన్నెరగుండు సమీపంలోని టెంటుల్లో నివసిస్తున్నప్పుడు కూడా రాత్రిపూట పాములు, తేళ్లు మొదలగు విషపూరిత జంతువులతో ప్రాణాపాయం ఏర్పడుతుంది. ఏ కారణం చేత ప్రాణాలు కోల్పోయినా పిల్లలు అనాథలుగా మారాల్సిందే. భూస్వాముల పక్షం వహించిన పోలీసులు ఆశ్చర్యంగా ఇంత ప్రయాసకోర్చి కిన్నెరగుండు చుట్టు నివసిస్తున్న చెంచుల దగ్గరకు చేరుకుని వారిమీద దాడులు చేస్తున్నారు. ఈ భూములు భూస్వాములవి, ఈ నీళ్లు వారివి, ఈ చేపలు వాళ్లవి అని భూస్వాముల పక్షం వహించి, ఇందులో మీకు హక్కులు లేవంటూ దుర్భాషలాడుతూ చెంచులను విపరీతంగా కొడుతున్నారు. టెంటులు నేలమట్టం చేస్తున్నారు. కొంతమందిని పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారు. వంట సామాగ్రి, తిండిగింజలు చిందరవందర చేశారు. పడవలు, బుట్టలు, పుట్టీలు, వలలు ఎత్తుకుపోయారు. నానా బీభత్సం సృష్టించి ఈ ప్రాంతం ఖాళీ చేయకుంటే మహిళా పోలీసులను తీసుకొచ్చి కొడతామంటూ పోలీసులు చెంచు మహిళలను బెదిరిస్తున్నారు. ఇప్పుడు చెంచుల బతుకులు అగమ్యగోచరంగా మారాయి. వారికి రక్షణగా నిలవాల్సిన పోలీసుల నుండే ప్రమాదం ఏర్పడింది. ఎవరికి చెప్పుకోవాలో తెలియక బిత్తర చూపులు చూస్తున్నారు. అటవీ హక్కుల చట్టాన్నే పోలీసులు అపహాస్యం చేస్తున్నారు. అడవి పైన, అడవి సంపద పైన ఆధారపడి జీవించే సాంప్రదాయిక హక్కును పోలీసులు మామూళ్లకు మరిగి కాలరాస్తున్నారు.

రాజకీయ నాయకులు అమరగిరి చెంచుల దీనగాథల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ప్రజలను ఓటర్లుగా మాత్రమే చూడడం అలవడిన వీరు ఎలక్షన్ల సందర్భంలో తప్ప మళ్లీ అక్కడికెళ్లరు. అమరగిరిలో నివసిస్తున్న 61 చెంచు కుటుంబాలకు ఇప్పటికీ కనీస అవసరాలు కల్పించలేదు. కనీస వసతులైన మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్య, వైద్యం అందని ద్రాక్ష అయింది. పక్కా ఇళ్లు అనేవి పగటికల అయింది. ఇవేవీ లేకున్నా చేపలు పట్టుకుని జీవిద్దామంటే దళారులు, పాత భూ యాజమానులు, పోలీసులు, అలివి వల, అప్పుల కొలిమి అన్నీ కలిపి చెంచుల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కనీస వసతులు కల్పించడంతో పాటు జల సంపదపైన హక్కు దళారుల నుండి రుణవిముక్తి కల్పించాలి. నిషేధించిన అలివి వలలు ఉపయోగించే వారిని కఠినంగా శిక్షించాలి. దాడులకు పాల్పడుతున్న పోలీసులను కఠినంగా శిక్షించాలి. వారు సేకరించిన చేపలను వారే విక్రయించే విధంగా సహకార వ్యవస్థను ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో పోరాటం చేస్తున్న అమరగిరి చెంచులకు ప్రజలు, ఆలోచనాపరులు, ప్రజా సంఘాలు అండగా నిలవాలి.

(రచయిత అధ్యక్షులు, పౌరహక్కుల సంఘం) వీ

గిట్టుబాటు ధరల కోసం పసుపు, ఎర్రజొన్న ఉద్యమాలు

***తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వివిధ రూపాల్లో పసుపు, ఎర్రజొన్న రైతులు చేస్తున్న ఆందోళన భగ్నం చేయడంతో రైతులు చివరికి పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్ వేసి తమ నిరసనను తెలియజేస్తున్నారని అంటున్నారు* వై. రామచంద్రం**

దేశ జనాభాలో అత్యధికుల జీవనాధారం వ్యవసాయం. ఆ ఉద్దేశ్యంతోనే మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. పరిణామ క్రమంలో పాలకులు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత తగ్గించారు. ఆ క్రమంలో వచ్చిన ప్రపంచీకరణ వల్ల విదేశీ ఉత్పత్తుల పోటీని తట్టుకోలేక, వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడికి సరయిన పంటరాక, వచ్చిన పంటకు గిట్టుబాటు ధరలు లేక, మధ్య దళారుల వల్ల మోసపోతూ రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయింది. ఈ సంక్షోభం నుండి రైతాంగం గట్టెక్కడానికి పాలకులు తెచ్చిన రుణ మాఫీ, ఫసల్ భీమా, విత్తన సబ్సిడీలు, ఎన్నికల సందర్భంలో తెచ్చిన రైతుబంధు పథకం, కిసాన్ సమ్మాన్, ఈనామ్ పథకం లాంటి పథకాలన్నీ తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు ఒక ఉపశమనాన్ని ఇచ్చాయి. అయితే ఇవన్నీ రైతుకు శాశ్వత పరిష్కారాన్ని చూపలేక పోతున్నాయి. అప్పులు తీర్చే మార్గంలేక ప్రతి రోజు ఏదో ఒక మూలన అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పాలకులు రైతాంగం కోసం తెచ్చిన పథకాలు రైతును బతికిస్తలేవు కాని పాలక పార్టీలకు మాత్రం ఓట్ల పంట పండిస్తున్నాయి. పథకాలు మాత్రమే రైతుల సమస్యకు పరిష్కారం కాదని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ తెలంగాణలో ఎర్రజొన్న, పసుపు, మిర్చి రైతుల ఆందోళనలు, అట్లాగే దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలు తెలియ జేస్తున్నాయి.

భూమిని నమ్ముకొని రైతు బతుకుతూ సమాజాన్ని బతికిస్తున్నాడు. కాని రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో చిక్కుతున్నారు. గత రెండు నెలలుగా నిజామాబాద్, ఆర్మూర్, జగిత్యాల ప్రాంతాలలో ఎర్రజొన్న, పసుపు పండిస్తున్న రైతులు గిట్టుబాటు ధరల కోసం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంత రైతుల పిలుపు మేరకు రైతులంతా 44వ జాతీయ రహదారిపై ధర్నాలు, రాస్తా రోకోలు, పాదయాత్రలతో తమ నిరసనను తెలియజేశారు. కిలోమీటర్ల మేర పాదయాత్రలు చేశారు. ప్రభుత్వం రైతుల నిరసనను శాంతి భద్రతల సమస్యగా భావించి పోలీసులకు అప్పగించింది. పోలీసులు రోడ్లపై బైఠాయించిన రైతులను అరెస్టుచేసి కేసులు పెట్టారు. ఇదీ పోరాడి తెచ్చుకున్న తెలంగాణలోని రైతుల పరిస్థితి.

ప్రతి సంవత్సరం వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది కాని మార్కెట్‌లో పంట ధర మాత్రం తగ్గుతూ వస్తోంది. ఎకరాకు ఎర్రజొన్నకు రు. 20 నుంచి 25 వేల పెట్టుబడి అవుతుంది. ఎకరాకు 15 నుంచి 17 క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో క్వింటాల్‌కు రు. 1700 నుంచి 2100 వరకు ఉంది. ఈ ధరలతో

గత నాలుగేళ్లుగా నిజామాబాద్‌లో మార్కెట్‌లో ఉన్న పసుపు ధరలు

సంవత్సరం	ఫిబ్రవరి క్వింటాల్ ధర (రు.)	సగటు ధర క్వింటాల్‌కు (రు.)
2015-16	7,850	8,100
2016-17	6,855	5,850
2017-18	5,855	5,858
2018-19	5,200	5,400

రైతులకు మిగులుతున్నది ఏమిలేదు అప్పులు తప్ప.

ఖమ్మం మార్కెట్‌కి మిర్చి తీసుకెళ్లిన రైతులు వ్యాపారుల మోసాలకు గురవుతున్నారు. పంట చేతికి వచ్చిన కొత్తలో ఒకటి రెండు రోజులు క్వింటాల్ ధర పెంచారు. తీరా మార్కెట్‌కు పెద్దఎత్తున సరుకు రాగానే ధరలు పూర్తిగ తగ్గించారు. సరుకు నాణ్యతలేదని చెపుతున్నారు. కమీషన్ కూడా ఇష్టానుసారంగా తీసుకోవడంతో రైతులు అన్ని విధాల నష్టపోతున్నారు. మార్కెట్ పాలకమండలి లేకపోవడంతో కూడా వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారు. రోజుల తరబడి మార్కెట్‌లో ఉండే వసతులు లేక లాడ్జీల్లో ఉండే స్తోమత లేక సరుకును తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితికి రైతుల్ని నెట్టేస్తున్నారు.

పాలక పార్టీలు ఎన్నికలకు ముందు రైతాంగాన్ని రుణ విముక్తుల్ని చేస్తామని వాగ్దానాలు ఇస్తున్నాయి. తీరా అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు గడిచినా రుణమాఫీ ఒకేసారి చేయకపోవడం వల్ల వడ్డీ పెరిగి అసలు అలాగే ఉంది. దీంతో వాగ్దానాలు కాగితాలకే పరిమితమై రైతుల్ని రుణాలు నీడలా వెంటాడుతూనే ఉన్నాయి. పంట అమ్ముకొని రైతు పైసల కోసం బ్యాంకుకు వెళితే బ్యాంకులో అప్పున్నావని వచ్చిన పైసలు అప్పు కిందనే జమకట్టుకుంటున్నారు.

వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పెట్టుబడి, పండించిన పంట అమ్మకం కోసం మార్కెట్‌పై ఆధారపడేలా చేశారు పాలకులు. దీంతో ప్రైవేట్ రంగం రైతుల నుంచి దొరికినంత దోచుకొని అప్పులపాలు చేస్తోంది. రైతుల రుణాలు మాఫీ చేయడంలో, పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో దిక్కుతోచని స్థితికి నెట్టబడ్డ రైతులు ఆత్మహత్యలవైపు మళ్లుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సహాయం కోసం తెచ్చిన రైతుబంధు పథకం అమలు జరిగిన తీరును పరిశీలిస్తే రైతు అర్థాన్నే మార్చేసింది ఈ పథకం. ఈ పథకానికి ఒక పరిమితంటూ లేదు. ఎకరం

రెండెకరాలు ఉన్నవారికన్నా ఎక్కువగా భూస్వాములకే ఈ పథకం లబ్ధి చేకూర్చింది. వ్యవసాయానికి పనికిరాని భూమయినా పట్టా కలిగి ఎన్ని ఎకరాలున్నా ఈ పథకం వర్తింపచేశారు. వ్యవసాయం చేయకుండా కౌలుకు ఇచ్చి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న వాళ్లు, ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో స్థిరపడ్డ వాళ్లు కూడా ఈ పథకం వల్ల లబ్ధి పొందారు. సొంత భూమి లేక కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసిన కౌలు రైతు మాత్రం తెలంగాణ ప్రభుత్వం దృష్టిలో రైతు కాకుండా పోయాడు.

భూప్రక్షాళన కార్యక్రమం సుదీర్ఘకాలంగా కొనసాగుతూనే ఉంది. దీంతో ప్రజలు భూమి పట్టా కోసం మండల ఆఫీసుల చుట్టు తిరుగుతూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ పథకం వల్ల గ్రామంలోని దళారులు, అధికారులు ప్రజల నుంచి లక్షల రూపాయలు సంపాదించు కున్నారు. ఎన్నికల ముందే ఈ పథకం అమలుచేయడంతో అధికార పార్టీకి ఓట్లు రాల్చుకోవడానికి ఉపయోగపడింది. ప్రజలు మాత్రం అధికారుల చుట్టూ పట్టాపాసు పుస్తకం కోసం తిరుగుతూనే ఉన్నారు.

తెలంగాణలో హరితహారం పేరుతో తెచ్చిన పథకం వల్ల నాటిన మొక్కల్లో ఎన్ని దక్కి చిగురించాయో, ఎంత పచ్చదనం వచ్చిందో కాని అడివిని నమ్ముకొని పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసులను మాత్రం నిర్వాసితుల్ని చేసింది. పోడు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న ఆదివాసుల్ని అడివి నరుకుతున్నారనే పేరుతో చెట్లకు కట్టేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేసి, ఇండ్లను కూల్చేసి నిలువనీడలేకుండా చేసింది తెలంగాణ ప్రభుత్వం.

ఇప్పుడు ఏకంగా అడవుల నుంచి ఆదివాసుల్ని వెళ్లగొట్టాలనే ఉద్దేశ్యంతో ఆదివాసులకు రక్షణ కల్పిస్తున్న చట్టాల్నే రద్దుచేయాలని ఫిబ్రవరి 13న సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఇదంతా ఆదివాసులను అడవి నుంచి తరలించి కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే కుట్రలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన 2014 జూన్ 2 నుండి 2019 ఫిబ్రవరి వరకు 4,200 మంది రైతులు వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చేమార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడినట్లు రైతు స్వరాజ్యవేదిక, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ కలిసి నిర్వహించిన పరిశోధనలో తేలింది. ఇవన్నీ కూడా చట్టప్రకారం నమోదుచేసినవే.

ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల్లో 700 మంది నేపథ్యం కోసం చేసిన పరిశోధనలో వెల్లడయిన అంశాలు-93 శాతం మంది సన్నకారు రైతులని, వీరిలో 529 మంది కౌలు రైతులేనని వెల్లడయింది. కౌలు రైతుకు రైతుబంధు పథకం వర్తించదు. బ్యాంకులు అప్పులు ఇవ్వవు. కౌలు రైతులే లేరంటోంది తెలంగాణ ప్రభుత్వం.

పాలకులు తమ అధికారం నిలుపుకోవడం కోసం ప్రజల్ని మభ్యపెట్టడానికి వివిధ రకాల పథకాలను ప్రవేశపెడుతున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మారేది పార్టీలే కాని మనుషులు వాళ్లే, విధానాలు అవే. ప్రభుత్వాలు నిరంతరం ప్రజల్ని తాము అమలుచేస్తున్న పథకాల చుట్టూ తిప్పే పథకాన్ని అమలు చేస్తున్నాయి. పాలకులు వేసే భిక్షకోసం ప్రజలు ఎదురుచూసేలా చేస్తున్నారు.

రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి దళారీ వ్యవస్థను రద్దుచేయాలని కోరుతూ ఉద్యమిస్తున్న రైతాంగాన్ని పాలకులు పట్టించుకోలేదు. తమ సమస్యలను జిల్లాలకు పరిమితం చేస్తే పరిష్కారం అవుతలేదని చెప్పి నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి 245 మంది నామినేషన్లు వేయగా అందులో 230 మంది పసుపు, ఎర్రజొన్న, చెరుకు రైతులున్నారు. ఈ నామినేషన్‌తో తమ సమస్యను దేశం ముందుంచారు. అలాగే తమిళనాడు రైతులు తమ సమస్యల కోసం 100 రోజులకు పైగా దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేసినా ప్రధాని పట్టించుకోలేదు. దీనికి నిరసనగా వారనాసి పార్లమెంట్ స్థానం నుంచి తమిళనాడుకు చెందిన 111 మంది రైతులు నామినేషన్‌లు వేయాలనుకుంటున్నారు. గతంలో నల్లగొండకు చెందిన ప్రజలు తమ జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించి మంచినీరు అందించమని ఎదురయిన నాయకున్ని అడిగినా సమస్య పరిష్కారం కాలేదు. చివరికి పార్లమెంట్ స్థానానికి పెద్దమొత్తంలో ఫ్లోరైడ్ బాధితులు పోటీచేసి తమ నిరసనను వ్యక్తం చేసి చివరికి సమస్యను కొంత మేరకు పరిష్కరించుకున్నారు.

ఒకవైపు రైతులను ఏవో పథకాలతో మభ్యపెడుతున్న ప్రభుత్వాలు, మరోవైపు నిలువున దోచుకుంటున్న విత్తనాల, పురుగుమందుల, ఎరువుల కంపెనీలు. ఈ సందర్భంలో రైతులు పాలకులు ప్రవేశపెడుతున్న ఉపశమన పథకాల కోసం పడిగాపులు పడడం కన్నా, సంఘటితమై తమ హక్కుల కోసం పాలకులను నిలదీయాలి. ఉత్పత్తిలో పాల్గొంటూ సమాజానికి బతుకునిస్తున్న రైతుల బతుకు ప్రశ్నార్థకం అవుతున్న సందర్భంలో ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనేది తేలిపోయింది.

రక్తాన్ని చెమటగా మార్చి పంటకు ప్రాణం పోస్తున్న రైతు ఈ రోజు నడిబజారులో నిలబడ్డాడు. ప్రభుత్వ విధానాల వల్ల బతకలేకపోతున్నాడు. తన గోడు వినిపించడానికి పార్లమెంట్‌కు పోటీ చేస్తున్నాడు. అది అధికారం కోసం కాదు, తమ సమస్యకు పరిష్కారం సమాజం ఆలోచించడం కోసం మాత్రమే. ఇప్పటికైనా నెర్రెలుబారి రక్తమోదుతున్న పాదాలతో పాదయాత్ర చేస్తూ బతుకునిస్తున్న రైతును బతికించుకోవడానికి కదలాల్సిన సమయం వచ్చింది.

(రచయిత వీక్షణం సహాయ సంపాదకులు) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

జలియన్‌వాలాబాగ్ మారణకాండ తరువాత!

***జలియన్‌వాలాబాగ్ మారణకాండ జరిగి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రాణత్యాగానికి ప్రతీక అయిన ఆ చారిత్రాత్మక కట్టడాన్ని కాపాడుకుని, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం ఉందని అంటున్నారు* కిమ్ ఎ వాగ్నర్**

మొక్కలూ, పూలూ అన్నీ వాడిపోయాయి, మాడిపోయాయి
వాసన కోల్పోయిన పుప్పొడి నేలమీద మరక లాగా చెల్లాచెదరై పడి ఉంది
అయ్యో! ఈ అందమైన తోట రక్తంతో తడిసిపోయింది
కాలాలలో రాజువైన వసంతమా, రా, మెల్లగా రా
ఇది శోక ప్రదేశం, సవ్వడి చెయ్యొద్దు

– సుభద్రా కుమారి చౌహాన్,
'జలియన్‌వాలాబాగ్ మే బసంత్' (జలియన్‌వాలాబాగ్‌లో వసంతం) (1929)

హత్యాకాండ జరిగిన సంవత్సరం లోపు, దాని అసలైన పరిణామాలు గుర్తించడానికి చాలా ముందు, ప్రజల నుంచి చందాలు పోగుచేసి జలియన్‌వాలా బాగ్‌ని కొని దానిని ఒక స్మృతి వనంగా మలిచారు. మొదట్లో దీనికి కొంత వ్యతిరేకత ఉండింది. 'సిపాయి తిరుగుబాటు'కి కాన్పూర్‌లో బ్రిటిష్ ఏర్పాటు చేసిన స్మారక స్థూపంలాగా అమృత్‌సర్‌లోని స్మృతి చిహ్నం పొరపొచ్చాలను, చేదు జ్ఞాపకాలను మిగులుస్తుందని భావించారు. చందాలు పోగు చెయ్యడానికి పూనుకున్నవాళ్లల్లో ఒకడైన గాంధీ ఇలా స్పందించాడు –

'నైతికంగా, చట్టపరంగా ఏ తప్పూ చెయ్యని ఆ అయిదు వందలకు పైగా మనుషులను మరిచిపోవచ్చా? తెలిసీ, కావాలనీ చనిపోతే, తాము నిర్దోషులమని నమ్మి ఆ యాభై తుపాకుల గుండ్లను ఎదుర్కొని ఉంటే వాళ్లు చరిత్రలో దేశభక్తులుగా, వీరులుగా, మహాత్ములుగా మిగిలిపోయే వాళ్లు. కానీ, అది ఒక జాతీయ ప్రాముఖ్యతను సంతరించుకున్న విషాదం అయ్యింది. (...) మన దేశ ప్రజలను నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నప్పుడు, నిస్సహాయులుగా ఉన్న వాళ్లను మనం కాపాడలేకపోయాం. ఈ అన్యాయాన్ని సరిదిద్దటానికి మనం పూనుకోకపోవచ్చు. అయినా దేశానికి ఏమీ నష్టం జరగదు. కానీ వాళ్ల జ్ఞాపకాన్ని కూడా మిగుల్చుకోవద్దా, మిగుల్చుకోకుండా ఉండగలమా? ఒక జాతీయ స్మారక స్థూపాన్ని కట్టి చనిపోయినవాళ్ల కుటుంబ సభ్యుల బాధను మనమూ పంచుకుంటున్నామని, మనం కూడా ప్రియమైన బంధువులను కోల్పోయామని ప్రపంచానికి తెలియచేయకుండా ఉండగలమా?'

అమృత్‌సర్‌లో పెరిగిన కవి హసన్ మంటోకి వలసపాలనకు వ్యతిరేక ఉద్యమాలకు జలియన్‌వాలాబాగ్ కేంద్ర బిందువుగా గుర్తుండిపోతుంది. 1919 ఏప్రిల్ 13 నాటి జ్ఞాపకాలు, కల్పితాలు వేరుచెయ్యలేనంతగా కలిసిపోయాయి. 'స్వాతంత్రం కోసం' అన్న చిన్న కథలో మిత్రుడు ఘులామ్ అలీతో కలిసి గంటలు గంటలు జలియన్‌వాలాబాగ్‌లో ఎలా గడిపేవారో వివరించాడు:

'కాల్పులలో చనిపోయిన శవాలతో ఈ బావి ఒకప్పుడు పైకల్లా నిండి ఉందన్న సంగతి నీకు తెలుసు కదూ, ఘులామ్ అలీ? ఈ రోజు అందరూ ఆ బావి నీళ్లు తాగుతున్నారు. ఈ తోటలోని ప్రతి మొక్కకి ఈ బావే నీళ్లందించింది. ఇక్కడికి వచ్చిన వాళ్లు ఈ పూలు కోసుకుంటారు. ఒక్క నీటి బొట్టుకి కూడా రక్తపు ఉప్పదనం రాకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. ఏ పువ్వులోనూ, ఏ రేకులోనూ రక్తపు ఎర్రదనం లేదు. ఎందుకనంటావ్?

మాట్లాడుతున్నప్పుడు పక్క ఇంటి కిటికీ వైపుకి చూడటం నాకు స్పష్టంగా గుర్తుంది. ఆ కిటికీ గుండా హత్యాకాండను చూస్తూ ఉన్న ఒక అమ్మాయిని జనరల్ డయ్యర్ కాల్చి చంపాడని చెపుతారు. ఆ కిటికీ వెనక సున్నపు గోడ మీద రక్తపు మరక పాలిపోతూ ఉంది. రక్తం చిందిస్తే ఒకప్పటిలాగా ఇప్పుడు ప్రజలను ప్రభావితం చెయ్యనంతగారక్తం విలువ తగ్గిపోయింది. నేను మూడవ తరగతో, నాల్గవ తరగతో చదువుతున్నట్టు గుర్తు. ఆ దారుణ మారణకాండ జరగిన ఆరు నెలలకో, ఏడు నెలలకో జలియన్‌వాలాబాగ్ చూడడానికి మా టీచరు మమ్మల్ని తీసుకుని వెళ్లారు. అప్పుడు అది ఒక తోట లాగా లేదు. మనుషులు ఎవ్వరూ లేకుండా అది బావురుమంటోంది. మట్టిగడ్డలతో నేల ఎగుడు దిగుడుగా ఉంది. కిళ్లీ ఉమ్ముతో ఎర్రగా ఉన్న మట్టి గడ్డను తీసుకుని, 'అమరవీరుల రక్తంతో ఇది ఇంకా ఎర్రగా ఉంది చూడండి!' అని టీచరు అనటం నాకు ఇంకా గుర్తు ఉంది.'

దగ్గరలోనే వైభవోపేతమైన స్వర్ణ దేవాలయానికి భిన్నంగా ఉండే జలియన్‌వాలాబాగ్‌లోని బీడు భూమి కూడా సందర్శకులు చూడవలసిన ప్రదేశంగా మారిపోయింది.

1921లో ఈ ప్రదేశాన్ని ఒక అమెరికన్ యాత్రికుడికి చూపిస్తూ ఒక స్థానికుడు భారతీయులకు జలియన్‌వాలాబాగ్ అంటే ఏమిటో ఇలా వివరించాడు: 'ఇక్కడ ఈ అకృత్యాలకు బ్రిటిష్ అధికారులు కానీ, బ్రిటిష్ ప్రజలు కానీ గతాన్ని 'మరిచిపో, మన్నించు' అని అడగటం తప్పించి ఇంకేమీ చెయ్యలేదు. మా చరిత్రలోని దారుణమైన ఈ అధ్యాయాన్ని మూసెయ్యటానికి సిద్ధపడిన ప్రతిసారీ రక్తమోడిన ఈ బావి గోడలనుంచి అరుపులు మా చెవుల్లో స్పష్టంగా, పెద్దగా మారుమోగుతుంటాయి.'

1919 చివరి నాటికి బ్రిటిష్ అనుసరించిన రాజీ ప్రయత్నాలలో భాగంగా ఒ'డయ్యర్ తరవాత పంజాబ్‌కి లెఫ్టనెంట్ గవర్నర్‌గా వచ్చిన ఇ.డి. మాక్‌లాగన్, 'జలియన్‌వాలాబాగ్ కాల్పుల కారణంగా సంపాదన పరుడిని కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలి' అని

ప్రతిపాదించాడు. అప్పటిదాకా అమృత్‌సర్‌లో సహాయం అందిస్తున్న భారతీయ దాతృత్వ సంస్థ అయిన సేవా సమితి వద్ద నిధులు అంతరించి పోతుండటంతో బ్రిటిష్ ప్రభుత్వం సహాయం చేస్తే రాజకీయంగా లబ్ధి చేకూరుతుందని మాక్‌లాగన్ వాదించాడు. దీనికి భారత ప్రభుత్వం మొదట్లో అంత సుముఖంగా లేదు. వైస్రాయ్ కార్యనిర్వాహక బృందంలోని సి.డబ్ల్యు. గ్రైవన్ ఇది వృథా ప్రయాస అవుతుందని హెచ్చరించాడు:

'మానవత్వం దృష్ట్యా కాకుండా రాజకీయ లబ్ధి కోసం ఈ ప్రతిపాదన చేశారు. ఆ కోణం నుంచి చూస్తే ఈ విషయంలో ప్రభుత్వం ఏం చేసినా ప్రజల నుంచి వ్యతిరేకతే ఉంటుంది. అటు తిప్పి, ఇటు తిప్పి చివరికి దానిని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలుస్తారు. నోరు నొక్కెయ్యటానికి, రక్తపు మరకలు కడిగేసుకోటానికి పెన్షన్లు ఇస్తున్నారని పేర్కొంటారు. ఆ డబ్బు తీసుకున్న వాళ్లని వెలివేస్తారు, దానిని తిరిగి ఇచ్చెయ్యమని ప్రోత్సహిస్తారు. ప్రభుత్వమే పెన్షన్లు ఇవ్వడమంటే అది తన తప్పును ఒప్పుకున్నట్టని భావిస్తారు. ఈ రకమైన ప్రతిఫలం కోసం డబ్బు ఖర్చు చెయ్యటం సమర్థనీయం కాదు.'

నష్టపరిహారం అన్న భావనకి భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి అయిన విలియం మారిస్ మరింత సుముఖంగా ఉన్నాడు కానీ గ్రైవన్ లాగా దానివల్ల ప్రతికూలత ఉంటుందని ఆందోళనపడ్డాడు: 'రక్తమంటిన డబ్బుతో నోరు మెదపకుండా చేశారన్న నింద పడటం నాకు ఇష్టం లేదు.' అయినప్పటికీ నష్ట పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దరఖాస్తులను పరిశీలించి 1921, 1922లో నిధుల పంపిణీ చేపట్టడానికి ఇండియన్ సివిల్ సర్వీస్‌కి చెందిన ఎ లాంగ్లీ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పరిచింది. ఈ ఖర్చు ఎవరు భరించాలన్నదాని మీద పంజాబ్, భారత ప్రభుత్వాల మధ్య కొంత వివాదం ఏర్పడింది. పంజాబు ఉద్యమకారులపై జరిపిన కాల్పులలో గాయపడినవారికి, చనిపోయినవారి బంధువులకు నష్టపరిహంగా చివరికి 20 లక్షల రూపాయలు చెల్లించారు. జలియన్ వాలాబాగ్ కాల్పులలో చనిపోయినవారి బంధువులకు సగటున రు.8700 లభించాయి. అలయన్స్ బ్యాంకు జి.ఎం. థామ్సన్ విధవరాలికి ఇచ్చిన రు.1,35,000 లతో దీనిని పోలిస్తే తేడా తెలుస్తుంది.

డయ్యర్ కోసం మార్నింగ్ పోస్ట్ సేకరించిన విరాళాలతో పోలిస్తే ఈ మొత్తాలు అసలు లెక్కలోకే రావు.

1921లో హత్యాకాండ జరిగి సంవత్సరం అయిన సందర్భంగా కొత్త వైస్రాయ్ అయిన లార్డ్ రీడింగ్ జలియన్‌వాలాబాగ్‌ని సందర్శించాడు. ఇక్కడికి వచ్చిన మొదటి బ్రిటిష్ అధికారి అతడు. భారతీయులకు, యూరోపియన్లకు చెల్లించిన నష్టపరిహారం మధ్య వ్యత్యాసాన్ని ఈ సందర్భంగా అతడి దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిని పరిశీలిస్తానని రీడింగ్ మాట ఇచ్చాడు కానీ ఏమీ జరగలేదు.

జలియన్‌వాలాబాగ్ కాల్పులలో చనిపోయిన బంధువుల పేర్లు ఇమ్మని అధికారులు మొదట ప్రకటించినప్పుడు, స్పందించినవాళ్లలో 38 సంవత్సరాల పళ్ల డాక్టరు మణి రామ్ ఉన్నాడు:

'ప్రభుత్వ ప్రకటనలో కోరిన విధంగా ఏప్రిల్ 13న జలియన్‌వాలాబాగ్‌లో నా కొడుకు మదన్ మోహన్ విషాద మరణం గురించి క్లుప్తంగా పేర్కొంటున్నాను. నేను ముస్సోరి వెళ్లినందున ఈ సమాచారాన్ని ఆలస్యంగా అందచేస్తున్నాను. మా ఇంటి నుంచి జలియన్‌వాలాబాగ్ మూడు నిమిషాల నడక దూరంలో ఉంది. క్లాక్‌టవర్‌కి ఎదురుగా ఉన్న ఇది ఒక్కటే మాకు దగ్గరలోని ఖాళీ ప్రదేశం. 13 సంవత్సరాల మా అబ్బాయి ఇతర స్నేహితులతో కలిసి దాదాపు రోజూ ఆడుకోటానికి అక్కడికి వెళ్లేవాడు. ఎప్పటిలాగే ఏప్రిల్ 13న అక్కడికి వెళ్లిన అతడికి తలమీద తుపాకి గుండు తగిలి, రక్తస్రావం అయ్యి వెంటనే చనిపోయాడు. గుట్టలుగా పడి ఉన్న వందలాది శవాలలో అతడి కోసం ఎనిమిది, తొమ్మిది మందితో నేను అరగంటపాటు వెదకవలసివచ్చింది. న్యాయం, శాంతి భద్రతల పేరుతో చర్యలు తీసుకున్న వాళ్ల చేతులలో అమాయకుడైన నా కొడుకు లేత వయస్సులో చంపబడ్డాడు...'

కొడుకు చనిపోయినందుకు మణిరామ్‌కి 8,362 రూపాయల నష్టపరిహారం లభించింది. నష్టపరిహారానికి అర్హులైనవారందరూ దరఖాస్తు చేసుకోలేకపోయారు. 46 సంవత్సరాల వ్యాపారి అయిన లాలా రూప్ లాల్ పూరి అమృత్‌సర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు. జలియన్‌వాలా బాగ్‌లో ఆ రోజు ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన వాళ్లల్లో అతడు కూడా ఒకడు. పరిగెత్తుతున్న అతడిని వెనక నుంచి కాల్చారు. అయితే అతడు ప్రాణాలతో బయటపడ్డాడు. 'దరఖాస్తు చేసుకొమన్నారు కానీ నష్టపరిహారం తీసుకోవటం నాకు ఇష్టంలేదు కాబట్టి దరఖాస్తు ఇవ్వలేదు. గుండు దిగిన గుర్తు ఈనాటికీ నా వంటి మీద ఉంది' అని అతడు పేర్కొన్నాడు.

జలియన్‌వాలాబాగ్ స్మారక స్థూపం వద్ద ఈ రోజు అసలు ఘటనకి సంబంధించిన ఆనవాళ్లు ఏమీ మిగలలేదు. స్వాతంత్రం వచ్చిన తరవాత జాతీయ నాయకులు, విప్లవకారుల సేవలను, త్యాగాలను కొనియాడే కథనాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

సందర్శకులు డయ్యర్ లాగానే సన్నని దారి గుండా లోపలికి వెళతారు. ఎర్ర రాయి స్థూపం, దారులు, మొక్కలతో మలచిన సిపాయిలు, గుంపులు గుంపులుగా సందర్శకులతో పచ్చగా ఉన్న ఇప్పటి తోటని శతాబ్దం క్రితం నాటి ఖాళీగా ఉన్న మరణ రంగంగా ఊహించుకోవడం కష్టం. దీనిని భారత జాతీయతకు మందిరంగా పేర్కొనే శిలా ఫలకం తోట లోపల ఉంది:

'బ్రిటిష్ పాలన నుంచి భారత దేశాన్ని విముక్తం చెయ్యడానికి శాంతియుతంగా పోరాడుతున్న వేలాది దేశభక్తుల రక్తంతో ఈ ప్రదేశం నిండిపోయింది. నిరాయుధులైన ప్రజల మీద బ్రటిష్ సైన్యానికి చెందిన జనరల్ డయ్యర్ కాల్పులు జరిపించాడు. భారత స్వాతంత్రానికి చేపట్టిన అహింసాత్మక, శాంతియుత ఉద్యమానికి జలియన్‌వాలాబాగ్ ఒక ప్రతీకగా చిరకాలం నిలిచిపోతుంది.'

ప్రవేశ ద్వారం వద్ద ఉన్న పోర్టికో స్థంభాలు డయ్యర్ సైనికులకు ప్రతీకలుగాను, తోట మధ్యలో ఉన్న చిన్న నీటి గుమ్మటం ఆనాటికి లేని మెషిన్ గన్‌కి ప్రతీకగాను ఏర్పాటు చేశారంట. మధ్యలో ఉన్న పైలాన్ 'స్వేచ్ఛా జ్వాల'ను సూచిస్తుంది. ఇది కాకుండా 'అమరవీరుల బావి' చుట్టూ ఒక పెద్ద నిర్మాణం ఉంది. హత్యోదంతం తరవాత ఈ బావి నుంచి 120 శవాలను వెలికి తీశారని అక్కడ ఉన్న ఒక ఫలకం తెలియ చేస్తోంది.

ఈ కథనాలకీ మోతీలాల్, జవహర్‌లాల్ నెహ్రూలు పేర్కొన్నదానికీ పొంతన లేదు. 1857లో బీబీగఢ్ హత్యాకండలో యూరోపియన్

మహిళలు, బాలుల శవాలు పడేసిన కాన్పూర్ బావితో దీనిని పోల్చడం సరికాదు.

దగ్గరలోనే ఉన్న 'అమరవీరుల గ్యాలరీ'లో చివరి గోడ మీద ప్రముఖంగా ఉన్న హత్యాకాండ చిత్రంపై సందర్శకుల దృష్టి పడుతుంది. ఈ చిత్రంలో జలియన్‌వాలాబాగ్‌లో కుప్పలుగా పడి ఉన్న శవాలు, పరిగెత్తుతూ, చుట్టూ ఉన్న గోడలను కరుచుకుని ఉన్న మనుషులు కనపడతారు. ఈ చిత్రంలో మొదట మరణ దృశ్యమే ఉంది. ఆ తరవాత ఎప్పుడో చిత్రానికి ఎడమ వైపు కింద గూర్ఖా సైనికులను జోడించారు.

ఈ హత్యాకాండ చిత్రానికి రెండు వైపులా జాతీయ వీరుల చిత్రాలు ఉన్నాయి. వీళ్లల్లో కొంతమందికి అమృత్‌సర్ ఘటనతో సంబంధం ఉంది– కిచ్‌ల్యూ, సత్యపాల్, రత్తో, బుగ్గా. హత్యాకాండ తరవాత భర్త శవాన్ని విడవకుండా అక్కడే ఉండిపోయిన రతన్ దేవి చిత్రం కూడా ఉంది. 1909లో లండన్‌లో బ్రిటిష్ అధికారిని చంపిన మదన్ లాల్ ధింగ్రా చిత్రం పంజాబ్‌కి చెందినవాడు అయినందుకు జోడించారని అనిపిస్తుంది.

జలియన్‌వాలాబాగ్ అసలు వీరుడు ఉద్ధమ్ సింగ్. పంజాబ్‌కి చెందిన భగత్ సింగ్, ఇతడూ అత్యంత ఆరాధ్యులైన స్వాతంత్ర పోరాట వీరులు. ఓ'డయ్యర్ హత్య తరువాత బ్రిటిష్ పాలకులు ఉద్ధమ్ సింగ్‌ని ఉరితీశారు. అమరవీరుడుగా దేశప్రజల నీరాజనాలను అందుకున్నాడు.

జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ సమయంలో ఉద్ధమ్‌సింగ్ ఉన్నాడనీ, అతడి చేతికి గాయం అయ్యిందని అంటారు కానీ అందుకు నిదర్శనాలు లేవు. అయితే ప్రజల దృష్టిలో ఎటువంటి సందేహాలు లేవు. అందుకే అతడి చితాభస్మాన్ని జలియన్‌వాలాబాగ్ స్మారక స్థూపం వద్ద ఉంచారు. 1919 ఏప్రిల్ 13న చనిపోయిన వాళ్ల చిత్రాలు ఏవీ 'అమరవీరుల గ్యాలరీ'లో లేవు. కానీ ఉద్ధమ్‌సింగ్‌వి రెండు చిత్రాలు ఉన్నాయి.

జలియన్‌వాలాబాగ్‌ని చూడటానికి రోజూ వచ్చే వందలాది విద్యార్థులు భగత్‌సింగ్‌తో పాటు ఉద్ధమ్‌సింగ్ బొమ్మ కూడా వేస్తూ ఉంటారు. ఇంకా మిగిలి ఉన్న అనుమానాలను తొలగించటానికి అన్నట్టు జలియన్‌వాలాబాగ్ ప్రవేశ ద్వారం దగ్గరలో 2018లో ఉద్ధమ్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

జలియన్‌వాలా బాగ్ స్మారక స్థలం వద్ద ఒక ఉద్దేశంతో చేసిన కథనమే ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కథనంలో ఇతరులకు ప్రేరణగా నిలిపేటందుకే ఆ హత్యాకాండను ఉపయోగించుకున్నారు. చారిత్రికంగా దానంతట దానికే ప్రాధాన్యతను ఇవ్వకుండా స్వతంత్ర పోరాటానికి ఉత్ప్రేరకంగా పని చేసి, భారత దేశానికి స్వాతంత్రం సమకూర్చిన ఘటనగా అమృత్‌సర్ హత్యాకాండకు గుర్తింపునిచ్చారు.

ఆ ఘటనలో చనిపోయిన 379 మంది పేర్లు ఎక్కడా లేవు. తన యాభై మంది సైనికులతో డయ్యర్ దాడి చేసి వంద ఏళ్లు గడిచిపోయాయి. కానీ గాంధీ ఆశించినట్టుగా చనిపోయినవాళ్లను స్మరించుకునే స్థలంగా అది మారలేదు. ఒక జాతీయ మిథ్యను అక్కడ ఆకాశానికి ఎత్తుతున్నారు.

జలియన్‌వాలాబాగ్‌లో ముందు నుంచి ఉన్నవాటిల్లో చిన్న సమాధి ఒక్కటే మిగిలింది. దాని కప్పు గుండ్రంగా ఉండి, చుట్టూ గోడలకు కమానులు ఉంటాయి. ఈ స్మారక స్థలంలో ఇరవయ్యవ శతాబ్దంలో కట్టిన ఇతర కట్టడాల మధ్య ఒంటరిగా, దిక్కులేనిదానిలాగా ఉంటుంది. ఈ సమాధి ఉత్తర ముఖం మీద, గోడల మీద మరో రెండు చోట్ల డయ్యర్ సైనికులు కాల్చిన 92 తూటాల గుర్తులు ఇంకా మిగిలి ఉన్నాయి.

ఈ గుర్తుల చుట్టూ చతురస్రాలు గీసి ఉండకపోతే కాల ప్రభావానికి ఇటుకలు శిధిలమౌతున్న గోడలో వాటిని గుర్తు పట్టటం కష్టం. వంద సంవత్సరాల కాలంలో వేలాది సందర్శకులు తాకటంతో ఈ గుర్తులు చెరిగిపోతున్నాయి. హత్యాకాండకు మిగిలిన కొద్ది గుర్తులు తుడుచుకు పోతుంటే, దాని చరిత్రను మళ్లీ మళ్లీ తిరగ రాస్తూ ఉంటే చివరకు మిగిలేది పేరు మాత్రమే.

(పెంగ్విన్ ప్రచురించిన 'An Empire of Fear and the Making of the Amritsar Massacre' అన్న కిమ్ ఎ వాగ్నర్ పుస్తకంలోని భాగాలు.)

(అనువాదం: కె. సురేష్) వీ

మధ్యవర్తిత్వాలు కోర్టుల పనేనా?

***కోర్టులు రాజకీయ పక్షాలకు, చట్టసభలకు అతీతంగా కచ్చితమైన న్యాయం అందించేలా ఉండాలే తప్ప తీర్పులను వాయిదా వేస్తూ, మధ్యవర్తిత్వాలను ప్రోత్సహిస్తే అవి రాజ్యాంగ ఆదర్శాలకే విరుద్ధమని అంటున్నారు* లోకే రాజ్ పవన్**

అయోధ్య వివాదంలో శాశ్వత పరిష్కారం సాధించడానికంటూ సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యుల బృందాన్ని మధ్యవర్తులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాలలో తాత్కాలిక నివేదికను అందజేస్తూ 8 వారాలలో ప్రక్రియను పూర్తిచేసి నివేదిక సమర్పించాలని చెప్పింది. రంజన్ గొగోయ్, బొబ్డె, డి వై చంద్రచూడ్, అశోక్ భూషణ్, ఎస్ ఎ నజీర్‌ల ధర్మాసనం మధ్యవర్తులుగా జస్టిస్ ఫకీర్ అహ్మద్ ఇబ్రహిం ఖలీఫుల్లా నేతృత్వంలో సీనియర్ న్యాయవాది శ్రీరామ్ పంచు, ఆధ్యాత్మికవేత్త శ్రీ శ్రీ రవిశంకర్‌లను నియమించింది. వీరిలో ఖలీఫుల్లా ఎన్నో మంచి తీర్పులు వెలువరించిన న్యాయమూర్తి. శ్రీరామ్ పంచు మీడియేషన్‌లో నిపుణుడు. భారతీయ న్యాయవ్యవస్థలో మీడియేషన్ ఒక భాగంగా ఉండాలని కృషిచేశాడు. గతంలో అస్సాం, నాగాలాండ్ మధ్య 500 కిలోమీటర్ల భూవివాదాన్ని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు ఆయనను మధ్యవర్తిగా నియమించింది. రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు. గతంలో అయోధ్య వివాదంలో చర్చలకు ప్రయత్నించాడు గానీ ఫలితం సాధించలేకపోయాడు.

ఈ మధ్య న్యాయ స్థానాలలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ఆల్టర్‌నేటివ్ డిస్‌ప్యూట్ రెసల్యూషన్ (ఎడిఆర్) మెకానిజంలో భాగంగా మధ్యవర్తిత్వం అనే మార్గాన్ని న్యాయస్థానాలు ఆశ్రయిస్తున్నాయి. ఈ తరహా ప్రక్రియలో తటస్థమైన వ్యక్తులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ కక్షిదారుల మధ్య ఒక సానుకూల రాజీని నెలకొల్పి సమస్యను పరిష్కరించే పని చేస్తారు. వారి అవసరాలు, హక్కులు, ఆసక్తులను దృష్టిలో ఉంచుకుని మధ్యవర్తులు పని చేస్తారు. అయితే మధ్యవర్తి కేవలం ఫెసిలిటేటర్‌గా మాత్రమే పనిచేస్తాడు. ఆర్బిట్రేటర్ లాగా నిర్ణయాలు తీసుకోలేడు. ఈ మధ్యవర్తుల విషయంలో ముఖ్యమైనదేమిటంటే వాళ్లు ఏ వర్గానికీ చెందని తటస్థమైన వాళ్లు అయి ఉండాలి.

కానీ సుప్రీంకోర్టు నియమించిన మధ్యవర్తులలో ఈ తటస్థత లోపించింది. మిగతా ఇద్దరితో పేచీ లేదు గానీ రవిశంకర్ విషయంలోనే సమస్యంతా. ఆయన పూర్తిగా ఏకపక్షమైన మనిషి. అట్లా ఆయనే తాను హిందు మతపక్షం వాడినని గతంలో ఎన్నోసార్లు బహిరంగంగా ప్రకటించుకున్నాడు కూడా. ఆయన నరేంద్రమోదీకి ఎంత సన్నిహితమైన వ్యక్తో అందరికీ తెలిసిందే. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మాటలను పట్టించుకోకుండా యమునా నది ఒడ్డున ఆ ప్రాంతాన్నంతా కాలుష్యమయం చేస్తూ ఏర్పాటు చేసిన సమావేశానికి నరేంద్రమోదీని రప్పించుకున్నంత సాన్నిహిత్యం. అయోధ్యలో రామమందిరమే నిర్మించాలని, మసీదు కోసం మరోస్థలం ఎంచుకోవాలని, అయోధ్య విషయంలో హిందువుల డిమాండ్‌ను నెరవేర్చకపోతే, ముస్లింలు తమ హక్కును వదులుకోకపోతే దేశం సిరియాగా మారుతుందని హెచ్చరించాడు, బెదిరించాడు.

మొదటి నుంచీ రవిశంకర్ హిందు ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధిగా, హిందు భావజాలాన్ని వ్యాప్తిచేసే వ్యక్తిగా, విదేశాలలో హిందు ధార్మిక విధానాల మీద ఉపన్యసించే వ్యక్తిగా పనిచేస్తూ వస్తున్నాడు. రామజన్మభూమి మీద చాలా బహిరంగంగానే మందిరం నిర్మించాలని వాదిస్తున్న వ్యక్తి. ఇట్లాంటి వ్యక్తిని సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వం కోసం ఎంచుకోవడమే ఆశ్చర్యకరంగా, అభ్యంతరకరంగా అనిపిస్తున్నది. శ్రీరామ్ పంచులాగా గతంలో సమర్థవంతమైన మీడియేషన్స్ నెరిపిన అనుభవమూ కనీసం రవిశంకర్‌కు లేదు. అట్లాంటి గత అనుభవాలుంటే మతపక్షపాతి అయినసూ సర్దుకోవచ్చునేమోననే కోణంలోనూ రవిశంకర్ చేర్పును అంగీకరించలేం. కొన్నిసార్లు తాను చర్చలు జరుపుతానని ప్రకటించడం తప్ప విస్తృతమైన చర్చలు జరిపిందీ లేదు, ఫలితం సాధించిందీ లేదు. అయినా సుప్రీంకోర్టు అతన్ని మధ్యవర్తిగా ప్రకటించేసింది.

నిజానికి రవిశంకర్‌ను చేర్చదల్చుకుంటే హిందుమత 'ప్రతినిధి'గా చేర్చితే పోయేది. చర్చలలో మధ్యవర్తులతో పాటు ప్రతినిధులు కక్షిదారుల తరపున ఉండవచ్చు. ఎందరు కక్షిదారులుంటే అందరి తరపునా ప్రతినిధులను చర్చలలోకి పిలిచే వీలు ఉంటే ఉండవచ్చు. అట్లా రవిశంకర్‌ను నిర్మోహి అఖారా గానీ మరో హిందు సంస్థ తరపున గానీ అతనితో పాటు సున్ని వక్ఫ్ బోర్డ్ తరపున మరొకరినో ప్రతినిధిగా పెడితే ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. కానీ రవిశంకర్‌ను ప్రతినిధిగా కాకుండా మధ్యవర్తిగా పెట్టారు. హిందు పక్షపు మనిషిని మధ్యవర్తిగా పెట్టినప్పుడు ముస్లిం పక్షపు వ్యక్తిని ఎందుకు మధ్యవర్తిగా పెట్టలేదనేది ఒక ప్రశ్న. ఇవాళ కాకుంటే రేపైనా న్యాయస్థానాన్ని ఎవరైనా అడిగే అవకాశముంటుంది. మధ్యవర్తులను కక్షిదారులే ఎంచుకున్నారు. కనుక రవిశంకర్ పేరును ప్రకటించామని సుప్రీంకోర్టు జవాబు చెప్తుందేమో గానీ అది కూడా ప్రామాణికమైంది కాదు. ఎందుకంటే కక్షిదారులు ఎంచుకునేవాళ్లు ప్రతినిధులు అవుతారు గానీ మధ్యవర్తులెలా అవుతారు? మధ్యవర్తులంటే అన్ని పక్షాలకూ తటస్థంగా ఉండాలి. అన్ని పక్షాల వాదనలు వినాలి. అన్ని పక్షాల పట్ల సమానమైన కన్‌సర్న్ ఉండాలి. రవిశంకర్ నుంచి సున్ని వక్ఫ్‌బోర్డ్ పట్ల అట్లాంటి కన్‌సర్న్‌ను ఆశించగలమా? అయినా ఒకపక్షం వాళ్లు మధ్యవర్తి పేరుతో తమవ్యక్తి పేరును ప్రతిపాదించినప్పుడు కోర్టు ఆ వ్యక్తి తటస్థతను పరిగణనలోకి తీసుకోకుండానే మధ్యవర్తిగా ప్రకటించడాన్ని ఎలా అర్థం చేసుకోవడం? ఒవైసినో, జమాతె ఇస్లామి నాయకుడినో తమ తరపు మధ్యవర్తి అనే పేరుతో సున్నివక్ఫ్ బోర్డ్ ప్రతిపాదించి ఉంటే సుప్రీంకోర్టు అంగీకరించేదా? మరి రవిశంకర్‌ను ఎట్లా అంగీకరించినట్లు? రవిశంకర్ మధ్యవర్తిత్వాన్ని హిందు సంస్థ అయిన విశ్వహిందు పరిషతే ప్రశ్నిస్తున్నది. బిజెపి ఎంపి అయిన రాంవిలాస్ వేదాంతి అయితే ఇదివరకే 'ఆయననెవరు ఈ

వ్యవహారంలో తలదూర్చడానికి?' అన్నాడు. ఎన్నడూ రామజన్మ భూమిని సందర్శించని వ్యక్తి, ఎన్నడూ ఈ వివాదం పట్ల ఆసక్తి చూపని వ్యక్తి ఈ వివాదంలో మధ్యవర్తిత్వం చేయడమేమిటని కూడా అన్నాడు. హిందు సంస్థలు పార్టీలు వద్దంటున్న వ్యక్తికి సుప్రీంకోర్టు ఎందుకు రెడ్‌కార్పెట్ స్వాగతం పలికిందో అర్థం కావడం లేదు.

ఇదే తరహాలోని మరో విషయం గురించి చూద్దాం. అయోధ్య వివాదాన్ని సుప్రీంకోర్టు మొదటి నుంచి టైటిల్ డిస్‌ప్యూట్‌గానే చూస్తూ వచ్చింది. న్యాయస్థానం దృష్టిలో అది స్థల వివాదం మాత్రమే. చరిత్రను అధ్యయనం చేసి, గత డాక్యుమెంట్లను పరిశీలించి, కక్షిదారుల వాదోపవాదాలు విని అంతిమంగా నిగ్గు తేల్చాల్సింది స్థలం యొక్క హక్కుదారులెవరనేదే.

అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని సున్ని వక్ఫ్ బోర్డ్, నిర్మోహి అఖారా, రాంలల్లా మధ్య సమానంగా పంచిన అలహాబాద్ హైకోర్టు త్రిసభ్య బెంచి 2-1 తీర్పును రామజన్మభూమి న్యాస్‌తో పాటు ఇతరులు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. దాదాపు 14 పిటిషన్లు దాఖలయ్యాయి. 2011లో సుప్రీంకోర్టు దీనిపై స్టే ఇచ్చింది. పిటిషన్ల విచారణ సందర్భంలో జస్టిస్ దీపక్ మిశ్రా చెప్తూ కక్షిదారుల మత మనోభావాలతో సంబంధం లేకుండా ఇతర సివిల్ కేసుల వలెనే దీన్ని కూడా విచారిస్తామన్నాడు. ఈ విచారణల సందర్భంలోనే దీపక్ మిశ్రా, అశోక్ భూషణ్, ఎస్ఎ నజీర్‌ల త్రిసభ్య ధర్మాసనం ముందుకు ఇస్లాంలో మసీదు స్థానం గురించి, మసీదు ఇస్లాంకు అంతర్భాగమా కాదా అనే ప్రశ్నా వచ్చింది. మసీదు లోపల ప్రార్థనలు చేయడానికున్న ప్రాముఖ్యతపై నిర్ణయం చెప్పాలని దాన్ని విస్తృత ధర్మాసనానికి పంపాలని ముస్లిం ఫిర్యాదుదారుల తరపున న్యాయవాదులు రాజీవ్ ధవన్, రాజు రామచంద్రన్‌లు అడిగారు.

1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం చెప్తూ, ఆ తీర్పు ఆధారంగానే 2010 అలహాబాద్ హైకోర్టు స్థల విభజన తీర్పు ఇచ్చిందని, దీనిపై దాఖలైన పిటిషన్లనే ఈ ధర్మాసనం విచారిస్తుంది. కనుక ఈ విషయాన్ని మొదట తేల్చాలని, విస్తృత ధర్మాసనానికి పంపాలని అడిగారు. అయితే అయోధ్య కేసును మొదటి నుంచీ స్థల వివాదంగా చూస్తున్నందున దాన్ని విస్తృత ధర్మాసనానికి రెఫర్ చేయలేమని ధర్మాసనం చెప్పింది. దీనికి జస్టిస్ నజీర్ డిసెంట్ ఇస్తూ మసీదు ఇస్లాంకు అంతర్భాగమా కాదా అనే విషయాన్ని మత విశ్వాసాల ఆధారంగా నిర్ణయించాలని అందువల్ల సవివరమైన పరిశీలన నిమిత్తం దాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలని ఆయన అభిప్రాయ పడ్డాడు.

నిజానికి ఈ విషయాన్ని స్పష్టం చేయడం కోసం దాన్ని విస్తృత ధర్మాసనానికి పంపితే పెద్దగా కొంపలేం మునిగిపోవు. మసీదు ఇస్లాంకు అంతర్భాగమనో, కాదనో తీర్పు చెప్పినంత మాత్రాన సుప్రీంకోర్టు తన కేసు స్వభావమైన స్థలవివాద పరిమితిని దాటినట్టేమీ అవదు. కానీ అట్లా చేయలేదు. దీనికింత ప్రాధాన్యత ఇవ్వడం ఎందుకంటే మసీదు విషయంలో ముస్లింలను 1994 కోర్టు తీర్పు ఒక అభద్రతా భావంలోకి నెట్టివేసింది. అందుకే స్పష్టత కోసం వాళ్లు ఆశగా ధర్మాసనాన్ని ఈ విషయం అడగవలసి వచ్చింది. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదును కూల్చివేశాక 1993లో 67.703 ఎకరాల భూమిని కేంద్ర ప్రభుత్వం సేకరిస్తూ ఇందుకు సంబంధించి 1993 'ఎక్విజిషన్ ఆఫ్ సర్టయిన్ ఏరియా ఎట్ అయోధ్య' యాక్ట్ పేరుతో చట్టం చేసింది. భూసేకరణలో కేంద్రం అనుసరించిన అంశాలపైన, చట్టంలోని కొన్ని నిబంధనలపైన ఇస్మాయిల్ ఫారూఖీతో పాటు మరికొందరు సుప్రీంకోర్టులో కేసు వేశారు. అందుకే ఈ ఇస్మాయిల్ ఫారూఖీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసును పొట్టిగా ఫారూఖీ కేసుగా పిలుస్తుంటారు.

ఈ కేసులో తీర్పు చెప్తూ సుప్రీంకోర్టు, ఇస్లాంలో మసీదు కీలకమైంది కాదని, నమాజ్‌ను కేవలం మసీదులోనే కాకుండా ఎక్కడైనా చేసుకునే అవకాశం ఇస్లాం ప్రకారం ఇవ్వబడిందని చెప్తూ ముస్లింల నమాజుకు ఆంక్షలు పెడుతూ వివాదాస్పద స్థలంలో హిందువులకు పూజ చేసే అనుమతిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 1993 చట్టం ద్వారా చేసిన 67 ఎకరాల భూసేకరణను కోర్టు సమర్థించింది. ఇక అప్పటినుంచి అయోధ్య కేసు ఎప్పుడు విచారణకు వచ్చినా ముస్లింలలో, ముస్లిం సంస్థలలో ఒక విధమైన భయం, టెన్షన్ ఏర్పడుతూ వచ్చింది. ఫారూఖీ తీర్పును ఉటంకిస్తూ ముస్లింలు ఎక్కడైనా నమాజు చేసుకోవచ్చు కనుక మసీదు మాత్రమే వాళ్లకు ప్రార్థనా స్థలం కాబోదు కనుక బాబ్రీ మసీదు స్థలంలోనే మళ్లీ మసీదు నిర్మించాల్సినంత అవసరం ఉండనక్కరలేదని తీర్పు వస్తుందేమోననే భయంలో ముస్లిం సంస్థలు పడిపోయాయి.

సివిల్ వివాదంగానే నడుస్తున్నప్పటికీ భవిష్యత్తులో అలాంటి ప్రతికూల తీర్పు రావచ్చునేమోననే అనుమానం ఆ సంస్థలలో లేకపోలేదు. ఏదో ఒక రోజు ముస్లింలు నమాజు ఎక్కడైనా చేసుకోవచ్చు కనుక పవిత్రమైన అయోధ్యలోని రామజన్మభూమి స్థలాన్ని గుడి నిర్మాణానికే వదిలేయాలని తీర్పు వచ్చినా ఆశ్చర్య పోనక్కరలేదు. ముస్లింలంతా రోడ్లమీద, బజార్లలో ప్రార్థనలు చేసుకొమ్మని తీర్పు చెప్పవచ్చు. కానీ హర్యానాలో మనోహర్‌లాల్ ఖట్టర్ లాంటి వాళ్లు అట్లా కూడా రోడ్లమీద నమాజు చేసుకోనివ్వక కేసులు పెడుతుండడాన్ని ఇటీవల మనం చూస్తూనే ఉన్నాం. అందుకే ముస్లిం తరపు న్యాయవాదులు అప్పుడు దీపక్ మిశ్రా ధర్మాసనం ముందుకు ఈ సమస్యను తెచ్చారు. కానీ ధర్మాసనం చాలా చిత్రంగా 1994 తీర్పును సమర్థిస్తూ అభిప్రాయం చెప్పింది. రాజ్యాంగం ఇచ్చిన ధార్మిక సమానత్వానికి తేడాగల అభిప్రాయాన్ని చెప్పింది. పైగా విస్తృత ధర్మాసనానికి పంపడానికి సిద్ధపడలేదు. ఇట్లా ఫారూఖీ కేసులో కూడా సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరు ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది.

ఇప్పుడు మధ్యవర్తిత్వం కోసం నిర్ణయం తీసుకోవడం కూడా అలాంటిదే. మొదటినుంచీ ఒకేమాటగా కోర్టుతీర్పును గౌరవిస్తామని చెప్తూ వస్తున్నది ముస్లిం సంస్థలో. సున్ని వక్ఫ్‌బోర్డ్ ఈసారి కూడా కోర్టు నిర్ణయమైన మధ్యవర్తిత్వానికి ఒప్పుకుంది. అలాగే ఎంఐఎం, ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డ్, బాబ్రి మసీద్ యాక్షన్ కమిటీ లాంటి ముస్లిం సంస్థలు మధ్యవర్తిత్వానికి సరేనన్నాయి. కానీ హిందు సంస్థలు మొదటి నుంచీ వ్యవహరిస్తున్నట్లు కోర్టులను ధిక్కరించి నిర్లక్ష్యం చేసే తరహాలోనే ఈసారి కూడా వ్యవహరించాయి. రాంలల్లా విరాజ్‌మాన్ మధ్యవర్తిత్వ చర్చలను వ్యతిరేకించింది. నిర్మోహీ అఖారా రెండు వర్గాలుగా చీలి మధ్యవర్తిత్వాన్ని బయటకు వ్యతిరేకిస్తూనే లోలోపల ఆమోదిస్తూ తీర్మానం ఇచ్చింది. 'రామజన్మభూమి వివాదాన్ని చర్చలతో పరిష్కరించుకునేందుకు గతంలోనూ ప్రయత్నాలు జరిగి విఫలమైనాయి. మరోసారి ఆ ప్రయత్నం చేసి రోజులు వృథా చేసే బదులు కోర్టు తీర్పు పద్ధతిని కొనసాగించడమే మేలు' అని నిర్మోహీ అఖారా మహంత్ రాందాస్ అన్నాడు. గతంలో కూడా ఇదే రాందాస్, 'చర్చలకు తాము సిద్ధమే కానీ అక్కడ రామమందిరం నిర్మించడానికి మాత్రమే చర్చలు జరగాల'ని అన్నాడు. మందిరమే నిర్మించాలనుకుంటే ఇక చర్చలెందుకో ఆయనకే తెలియాలి.

ధర్మాసనం మధ్యవర్తిత్వం నిర్ణయాన్ని వెలువరిస్తున్న సందర్భంలోనూ హిందు సంస్థలు అడ్డుపడుతూ వచ్చాయి. మధ్యవర్తిత్వం ద్వారా అయోధ్య సమస్య పరిష్కారానికి గతంలో ప్రయత్నాలు జరిగినా అవి విఫలమయ్యాయని వాదించాయి. మధ్యవర్తిత్వ ప్రక్రియకు ముందే సివిల్ ప్రొసిజర్ కోడ్ (సిపిసి) నిబంధనల ప్రకారం ఒక పబ్లిక్ నోటిస్‌ను జారీ చేయాలన్నాయి. దీనిపే ధర్మాసనం స్పందిస్తూ 'చర్చల ప్రక్రియకు సిపిసిలోని మార్గదర్శకాలు అడ్డంకి కాదు. ఒకవేళ అవాంతరాలు ఎదురైతే సరైన సమయంలో పరిశీలిస్తాం' అని బదులిచ్చింది. మళ్లీ మధ్యవర్తిత్వం నిర్ణయాన్ని ప్రజలు అంగీకరించరంటూ వాదించాయి. దీనికి ధర్మాసనం, 'గతంలో ఏం జరిగిందనేది ఇప్పుడు అప్రస్తుతం. బాబర్ ఏం చేశాడు? లేకపోతే ఇంకో రాజు ఈ ప్రాంతాన్ని జయించాడా? అనే వివాదాల జోలికి మేము వెళ్లడం లేదు. ప్రస్తుతం చరిత్ర మొత్తం చదివే స్థితిలో మేము లేము. గతం మాకు అనవసరం. ప్రస్తుతం మా ముందున్న వివాదాన్ని సామరస్యపూర్వకంగా ఎలా పరిష్కరించాలన్నదే మా ఆలోచన' అని స్పష్టం చేసింది.

ఈ ఇరవై ఏడు సంవత్సరాలుగా ఇలాగే న్యాయస్థానాల నిర్ణయాలను, తీర్పులను హిందు ఆధిపత్య సంస్థలు అడ్డగిస్తూ వస్తున్నాయి. ఇక బిజెపి సంగతి సరేసరి. రెండు సీట్ల నుంచి రెండు వందల సీట్లకు ఎగబాకడానికి దానికి దొరికిన సువర్ణావకాశం రామజన్మభూమి అంశం. పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు లాంటి అత్యవసర సమస్యలకు ఏమాత్రం స్పందించకుండా ప్రజలలో మతపరమైన తక్షణావేశాలను రెచ్చగొట్టడంలో బిజెపి ఆరితేరిపోయింది. సాక్షాత్తు ప్రధానమంత్రే కోర్టులను రాజకీయాలలోకి లాగుతాడు. కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులను భయపెడుతోందని, రామమందిరం కేసులో తీర్పు చెప్తే అభిశంసిస్తామని హెచ్చరిస్తున్నదని ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో అన్నాడాయన. నిజానికి అప్పటి సిజెఐ దీపక్ మిశ్రాపై అభిశంసన పెట్టే నిర్ణయానికి, రామమందిరం అంశానికి సంబంధమే లేదు. అయినా ప్రధానమంత్రి స్థాయిలో అలవోకగా అబద్ధం ఆడేశాడు. కేరళలో శబరిమల అంశాన్ని ఉటంకిస్తూ 'మా సాంప్రదాయాలలో దూరేందుకు కోర్టులకేం అధికారం ఉంద'ని సర్వోన్నత న్యాయస్థానాన్ని ధిక్కరిస్తూ మోదీ, అమిత్ షాలు మాట్లాడారు.

మోదీ ప్రభుత్వం నిరంతరాయంగా గోహత్యలు, లవ్ జిహాదీ హత్యలు, దళితులపై మైనారిటీలపై హింసాకాండలు, మూకదాడులు చేస్తూ వస్తున్నది. రామమందిరం అంశం కోర్టులో ఉండగానే బాబ్రిమసీదును కూల్చివేసింది. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ అయోధ్యలో తరచు పూజలు, ధర్మ సమ్మేళనాలు, హిందుయాత్రలు నిర్వహిస్తుంది. వివాదాస్పదంగా మాట్లాడుతుంది. ఇక ఇప్పుడు కోర్టులను, న్యాయ ప్రక్రియను నిర్వీర్యం చేసేలా కోర్టు తీర్పులను కాదని ఆర్డినెన్స్‌ను తెచ్చి అయోధ్యలో రామమందిరం నిర్మించాలని చూస్తున్నది. సుబ్రహ్మణ్యస్వామి లాంటి వాళ్లు అదేపనిగా ఈ మాట చెప్తూ వస్తున్నారు. ఇదయ్యాక ఇదే లాంటి ఆర్డినెన్స్‌తో మధురలో కృష్ణ మందిరం, కాశీలో విశ్వనాథుని గుడులను నిర్మించడానికి మసీదులను కూల్చాలని చూస్తున్నది. ఇందుకోసం అధికారాన్ని వాడుకుంటున్నది. ఈ క్రమంలోనే ఇటీవల మరో కొత్త నాటకంతో ముందుకు వచ్చింది. అయోధ్యలోని మసీదు ప్రాంతంలో ఉన్న అదనపు భూమిని దాని హక్కుదారులైన యజమానులకు అప్పగించాలని కేంద్రప్రభుత్వం జనవరిలో సుప్రీంకోర్టును కోరింది. 1993లో అయోధ్య చట్టం పరిధిలో కేంద్రం సేకరించిన 67.703 ఎకరాల భూమి విషయమై కేంద్రం అనుసరించిన అంశాలను మహ్మద్ అస్లాం భూరే సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

2003లో సుప్రీంకోర్టు దీనిపై యధాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగాలని తీర్పు చెప్పింది. దీనిలో మార్పులు చేయాలంటే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరుతున్నది. 2002 మార్చి 14న భూరే కేసులో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. 'భూపూజ, శిలా పూజలతో సహా ఎటువంటి మతపరమైన కార్యకలాపాలు ఆ భూమిలో కొనసాగించరాదు' అని పేర్కొంది. ఈ క్రమంలోనే పై స్టేటస్ కో ఉత్తర్వులిచ్చింది. జస్టిస్ రాజేంద్రబాబు ఇచ్చిన తీర్పులో వివాదాస్పద ప్రాంతమైన 0.313 ఎకరాల భూమి, ఆ పరిసరాలలో ఉన్న 67 ఎకరాల పైబడిన భూమి రెండు పరస్పరాధారితంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో వివాదాస్పద 0.313 ఎకరాలకు సరిహద్దుగా ఉన్న సేకరించిన భూమిలో మెజారిటి యాజమాన్యం హక్కులు రామ జన్మభూమి ట్రస్టుకు ఉన్నాయని, వాటిని దానికి తిరిగి ఇచ్చివేయాలని కేంద్రం కోరుతున్నది. అదే జరిగితే ట్రస్టుకు 42 ఎకరాలు చెందుతాయి. ఈ ట్రస్టును విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసింది. దానికి కేంద్ర ప్రభుత్వం ఈ భూమిని అప్పగించాలని చూస్తున్నది.

1994లో సుప్రీంకోర్టు జారీచేసిన యధాతథస్థితి ఆదేశాలను కాదని బిజెపి 0.313 ఎకరాల భూమి మాత్రమే వివాదాస్పద భూమి అని చెప్తూ కపట నాటకానికి తెరతీసింది. అలాగే నయానో భయానో బిజెపి షియా వక్ఫ్ బోర్డును తన దానికి తెచ్చుకుంది. ఇప్పటి మధ్యవర్తి రవిశంకర్ ద్వారానే బిజెపి షియా వక్ఫ్ బోర్డును లోబరుచుకుంది. ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ప్రాముఖ్యాన్ని తగ్గించడానికి షియా వక్ఫ్ బోర్డును ముందుకుతెచ్చి రాజకీయం చేయాలని బిజెపి ఎత్తుగడకు ఈ రవిశంకర్ బ్యాక్‌డోర్ డిప్లమసిని నడిపించాడు. బాబ్రి మసీదు కట్టించిన బాబర్ కంటే కట్టిన మీర్ బాకీ కారణంగా, అతను షియా వర్గం వాడైన కారణంగా తమను అయోధ్య కేసులో కక్షిదారునిగా చేర్చాలని షియా వక్ఫ్ బోర్డ్ చేత బిజెపి సుప్రీంకోర్టుకు పిటిషన్ పెట్టించింది. కక్షిదారుల జాబితాలో తనకు అనుకూల సంఘాలెన్ని ఉంటే అంతగా లాభిస్తుందనేది బిజెపి ఎత్తుగడ. ఇప్పుడు కూడా సుప్రీంకోర్టు ఆలయ నిర్మాణానికి అనుకూలంగా వెంటనే తీర్పుచెప్తే 2019 ఎన్నికలలో మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశ ముండేదని, కానీ మధ్యవర్తిత్వ నిర్ణయం వల్ల మరింత జాప్యం జరిగి ఎన్నికల లబ్ధిజరగదనే రాజకీయ పాచికగానే అయోధ్య వివాదాన్ని బిజెపి భావిస్తున్నది. కాంగ్రెస్ కూడా తక్కువేమీ తినలేదు.

అసలు ఈ సమస్యకంతటికీ ప్రధాన ప్రారంభం చేసింది రాజీవ్ గాంధీ. షా బానో కేసులో ముస్లిం మహిళలకు భరణం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ముస్లిం సమాజంలో తీవ్ర ఆందోళనలు చెలరేగగా ప్రభుత్వ చట్టం ద్వారా ఆ తీర్పును అమలు కాకుండా రాజీవ్ గాంధి చట్టం చేశాడు. దాని మీద హిందు సంస్థలు గొడవచేయగా దాన్ని చల్లార్చడానికి 1949 నుంచి తాళాలు పడి ఉన్న బాబ్రి మసీదు తాళాలు తెరిచి పూజలు చేసుకునే అవకాశమిచ్చాడు. దాన్ని వాడుకుని అద్వానీ రథయాత్ర చేయడం, బాబ్రి మసీదును కూల్చడం, బిజెపి ఆ తర్వాత దేశంలో అధికారంలోకి రావడం తదనంతర పరిణామాలు కనుక ఈ అగ్గి రాజేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ. బాబ్రీ మసీదును కూలగొడుతుంటే తెలిసీ తెలియనట్లు నటించినాయన పివి నరసింహారావు. పైగా తన 'అపర చాణక్యం'తో సుప్రీంకోర్టునే ఇరికించాలని చూసి భంగపడ్డాడు. '1992 డిసెంబర్ ఆరు వరకు బాబ్రి మసీదు ఉన్న స్థలంలో పూర్వం ఎప్పుడైనా దేవాలయం ఉండేదా?' అన్న ప్రశ్నను రాష్ట్రపతి పేరిట

ఏకవాక్య నివేదనగా పివి ప్రభుత్వం 1993 జనవరిలో సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఈ విధంగా వివాదాన్ని తన మెడకు చుట్టి తప్పించుకోవాలనుకున్న కేంద్రానికి సుప్రీంకోర్టు గట్టి చురకనంటించింది. 'ప్రభుత్వ నివేదన లౌకిక వ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధం' అంటూ దానికి సమాధానమివ్వాల్సిన అవసరం లేదని చెప్పింది. ఆ విధంగా దేశమంతా చెప్పుకునే అపర కౌటిల్యుడు, బహుభాషా కోవిదుడు సుప్రీంకోర్టు మేధావి తనం ముందు బొక్కబోర్లా పడ్డాడు. అప్పటినుంచి ఇప్పటిదాకా కాంగ్రెస్ ముస్లిం వోటు బ్యాంకు పోలరైజ్ కావడం కోసం ముస్లిం అనుయాయిగా నటిస్తూ వాస్తవరూపంలో హిందు సంస్థలకు ప్రో పొలిటికల్ పార్టీగా వ్యవహరిస్తూ వస్తున్నది.

ఇక మరోసారి మధ్యవర్తిత్వం విషయానికి వద్దాం. గతంలో కూడా అయోధ్య వివాదం విషయంలో ఇలాంటి మధ్యవర్తిత్వాలు జరిగాయి. 1990లో చంద్రశేఖర్ ప్రధానమంత్రిగా ఉన్నపుడు, 1992లో పివి నరసింహారావు కాలంలో ఈ ప్రయత్నాలు జరిగాయి. పివి సలహాదారుగా పనిచేసిన ఉన్నతాధికారి పివి ఆర్కె ప్రసాద్‌తో పాటు చంద్రస్వామి హిందుమత పెద్దలు మఠాధి పతులతో ముస్లిం సంఘాలతో మాట్లాడారు. కానీ ఆ తర్వాత చర్చలు మూలకు పడ్డాయి. 2003లో ప్రధాని వాజ్‌పేయి, కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతిలు కూడా ఈ తరహా చర్చల ప్రయత్నాలు చేశారు. ఈ మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఖేహర్ ఉన్నపుడు అవసరమైతే తాను మధ్యవర్తులతో కూర్చుంటానని, కావాలంటే ఇతర న్యాయమూర్తులలో ఎవరైనా మధ్యవర్తులతో రాజీకి ప్రయత్నాలు చేస్తారని హామీ ఇచ్చారు. పైన పేర్కొన్న దాదాపు అన్ని సందర్భాలలోనూ హిందు సంస్థలు, రాజకీయ పార్టీల ఆధిపత్య ధోరణి, దుందుడుకు తీరుల వల్ల చర్చలు ముందుకు సాగలేకపోయాయి. ఇతరుల సంగతి అటుంచితే హిందువులంతా గౌరవించే కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతిని ఈ చర్చల విషయమై ఏవిధంగా ఆరెస్సెస్, విశ్వ హిందు పరిషత్‌లు మూడు చెరువుల నీళ్లు తాగించాయో గుర్తుండే ఉంటుంది.

అయితే వీటన్నింటికీ ఇప్పటి మధ్యవర్తిత్వానికి మౌలికంగా ఒక తేడా ఉంది. అవేవీ కోర్టు పర్యవేక్షణలో నడిచిన మధ్యవర్తిత్వాలు కావు. కానీ ఈసారి మొదటిసారిగా సుప్రీంకోర్టు తనంతతానుగా తన పర్యవేక్షణలో మధ్యవర్తిత్వం జరగాలని, జరుగుతుందని చెప్పింది. అయితే ఈ క్రమంలోనే మధ్యవర్తిత్వం ప్రారంభమై చర్చలు జరుగుతాయనే అనుకుంటే గత అనుభవాలరీత్యా చూస్తే హిందు సంస్థలు సెంటు జాగాను కూడా వదులుకునే పరిస్థితి లేదు. ముస్లిం సంస్థలు మిగతా భూమి ఎలాగున్నా వివాదాస్పద 0.313 ఎకరాల భూమిని, మరీ ముఖ్యంగా గతంలో మసీదు ఉన్న ప్రాంతాన్ని వదులుకునే స్థితిలో లేవు. అదే ప్రదేశంలో రాముని గుడి ఉందనే మెలికతో హిందు సంస్థలు కూడా ఆ భూమిని వదులుకోవు. ఇక చర్చలు ఎలా కొలిక్కి వస్తాయి?

సమస్యంతా భూమితో ముడిపడి ఉన్నపుడు, ఆ భూమిని వదులు కోవడానికి ఇరుపక్షాలు ఒప్పుకోనపుడు ముస్లిం సంస్థలుగానీ హిందు సంస్థలు గానీ తమ ప్రార్థనాలయాన్ని మరోచోట కట్టుకునేందుకు అంగీకరించే పరిస్థితి లేనపుడు చర్చలు సఫలమై సుప్రీంకోర్టు ఆశించిన ః శాశ్వత పరిష్కారంః సిద్ధించే అవకాశమే ఉండదు. ఒకవేళ ముగ్గురు మధ్యవర్తులు ఏదో ఒక రకంగా ఆయా సంస్థలను రాజీపరిచి అటుఇటుగా ఏదైనా నిర్ణయానికి దగ్గరగా తెస్తారనుకుందాం. అప్పుడు ఆ నిర్ణయాన్ని దేశంలోని అన్ని హిందు, ముస్లిం సంస్థలు, ప్రజలు అంగీకరిస్తారనే గ్యారంటీ ఏముంది? ఆరెస్సెస్, శివసేన లాంటివి రాజీ నిర్ణయాలను ఆమోదిస్తాయని కలలోనైనా ఊహించగలమా? తమకు ఆమోదంకాని నిర్ణయాలకు అవి మళ్లీ కోర్టుల దగ్గరకే రావా? అలాంటపుడు చర్చలతో 'శాశ్వత పరిష్కారాలు' ఎలా సాధ్యమవుతాయి? మధ్యవర్తుల ప్రయత్నాలు విఫలమైతే మళ్లీ కోర్టు ప్రొసీజర్‌తోనే కదా సమస్యలు పరిష్కారం కావాల్సింది. ఈ మాత్రం దానికి మధ్యవర్తిత్వాలు ఏం మేలు చేస్తాయి? అయితే తాత్కాలిక ఉద్రేకాలను, ఆవేశాలను తగ్గించడానికి, ఎన్నికల వేళ ప్రజల ఓటింగ్‌ను ప్రభావితం చేయకుండా ఇప్పటికిప్పుడు మధ్యవర్తిత్వం నిర్ణయం ఉపయోగపడుతుందనడంలో మాత్రం ఎలాంటి సందేహం లేదు. అంతవరకైతే సుప్రీంకోర్టు నిర్ణయం సరైనదే. కానీ శాశ్వత పరిష్కారాల అద్భుతాలు మాత్రం ఏమీ జరగవు.

అయితే వీటన్నింటినీ పక్కనబెడితే కోర్టుల పని తీర్పులు చెప్పడం. అది వాటి బాధ్యత. కానీ మధ్యవర్తులను ఎంపిక చేయడం, మధ్యవర్తిత్వాలను జరిగేలా చూడటం, పంచాయితి పెట్టించడం వంటివి అత్యున్నత న్యాయస్థానాల పని కాదు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు న్యాయం దొరుకుందని, న్యాయం వెలువరించబడుతుందని గంపెడాశలతో కోర్టు తలుపులు తట్టినపుడు వారికి దొరకాల్సింది న్యాయబద్ధమైన తీర్పులు. కానీ ఆ పనిని పక్కనబెట్టి కోర్టు తానే స్వయంగా మధ్యవర్తిత్వాన్ని నిర్ణయించడం అంటే తన బాధ్యత నుంచి పక్కకు జరుగుతున్నట్లే. భావోద్వేగాలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయనే కారణంగా తాను తీర్పు చెప్పే బాధ్యతను పక్కనబెడితే అలాంటి భావోద్వేగాలు కలిగిన కేసులు దేశంలో లక్షల్లో ఉన్నాయి. వాటన్నింటికీ రేపటినుంచి ఇదే తరహా మధ్యవర్తిత్వం గురించిన ప్రతిపాదనలు ముందుకువస్తే, ఎవరైనా డిమాండ్ చేస్తే కోర్టుల ప్రాసంగికత ప్రమాదంలో పడిపోతుంది. దేశం భగ్గుమంటుందనో, ఆవేశకావేశాలు ఏర్పడతాయనో తీర్పులివ్వడాన్ని వాయిదా వేస్తూ పోతే, ప్రతి కేసునూ మధ్యవర్తులకే అప్పగించాల్సి ఉంటుంది. కేసులలో ఇరుపక్షాల పోటీల్లో ఆవేశకావేశాలు సహజం. వాటివల్ల అల్లర్లు చెలరేగి, శాంతి భద్రతలకు ఇబ్బంది కలిగితే ఆ పరిస్థితులను ప్రభుత్వాలు, అందుకోసం ఏర్పాటు చేయబడిన వ్యవస్థలు చక్కదిద్దుకుంటాయి. కేసులలో ఏ పక్షమైనా అసంతృప్తికి లోనైనపుడు పైకోర్టుకు అప్పీలు చేసుకోవడానికి, లేదా రివ్యూ కోసం వెళ్లడానికి న్యాయ ప్రక్రియనే అవకాశమిస్తున్నది.

కనుక ఇలాంటి స్వేచ్ఛను అందించకుండా కోర్టులు మధ్యవర్తిత్వాలకు ద్వారాలు తెరిస్తే న్యాయవ్యవస్థ శక్తి సన్నగిల్లి మధ్యవర్తుల బృందం సమాంతర శక్తిని సంతరించుకునే ప్రమాదముంది. ఈ పరిణామం ప్రజలకు న్యాయస్థానాలు, రాజ్యాంగం ఇచ్చే భరోసాలను తుంచివేసి కోర్టుల మెట్లెక్కకుండా మధ్యవర్తుల చుట్టూ తిరిగేందుకు, ఆర్థికంగా, సామాజికంగా శక్తివంతులు మధ్యవర్తులను మేనేజ్ చేసుకుని లబ్ధి పొందే పరిస్థితులు తలెత్తుతాయి.

భారత రాజ్యాంగం ప్రజలకు ఖచ్చితమైన న్యాయం అందాలనే సదాశయంతో న్యాయస్థానాలను, న్యాయ ప్రక్రియను పటిష్టంగా రూపొందించి, రాజకీయ పక్షాలకు లొంగకుండా, చట్టసభలు పెత్తనం చేయకుండా శక్తివంతంగా నిర్మించి ఇచ్చింది. కానీ ఆ న్యాయస్థానాలే తమ పనులను వాయిదా వేసి మధ్యవర్తిత్వాలను ప్రారంభించదలిస్తే అది రాజ్యాంగ ఆదర్శాలకే విరుద్ధం. అందుకే కోర్టులు మధ్యవర్తిత్వాలను వదిలేసి తీర్పుల ద్వారానే ప్రజలకు న్యాయాన్ని అందించాలి. ఆ తీర్పులే కోర్టు మెట్లెక్కే పేద, అట్టడుగు వర్గాల ప్రజలకు కొండంత ధైర్యాన్ని, జీవితం మీద విశ్వాసాన్ని, న్యాయం మీద నమ్మకాన్ని కలిగిస్తాయి.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

మార్చి 8ని వక్రీకరిస్తున్న పాలకులు

***కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే పాలకులు మహిళా పోరాట దినాన్ని ఉత్సవంగా మార్చారని, శ్రమ విముక్తి పోరాటంలోనే మహిళా విముక్తి దాగి వుందని అంటున్నారు* సతీష్ బైరెడ్డి**

ఏదైన ప్రజా ఉద్యమ చరిత్రను మరుగునపర్చాలన్నా, దాని స్ఫూర్తిని చంపేయాలన్నా దానిని ఉత్సవంగా మారిస్తే సరిపోతుందని పాలకులు ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. దానికి ఉదాహరణ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినమైన మార్చ్ 8 కంటే మరొకటుండదు. దీనిని వక్రీకరించినంతగా మరొక రోజు మనకు కనిపించదు. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక విప్లవం విస్తరించిన నేపథ్యంలో ప్రధానంగా యూరప్, అమెరికా దేశాల్లో కార్మికులపైన శ్రమ దోపిడీ కూడా అంతగానే విస్తరించింది. మహిళా కార్మికులైతే పనిచేస్తున్న చోట, ఇంట్లోనూ దోపిడీ, హింసనూ ఎదుర్కోవాల్సివచ్చింది.

బట్టల మిల్లుల్లో పనిచేసే స్త్రీలు అయితే రోజుకు 16 గంటల పాటు బలవంతంగా పనిచేయాల్సి వచ్చింది. గాలి, వెలుతురుతో పాటు ఇతర సదుపాయాల లేమి వల్ల వారు తీవ్రమైన అనారోగ్యానికి గురై ప్రధానంగా కంటిచూపును కోల్పోయారు. తమ చంటి పిల్లలకు పాలు ఇవ్వకుండా నిరంతరాయంగా పనిచేయాల్సి రావడం వల్ల మరుగుదొడ్లల్లో పిల్లలకు చాటుగా పాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలీచాలని వేతనాలు, లైంగిక వేదింపులు అనేక రూపాల్లో అవమానాలు, అణచివేత నిత్యకృత్యమై మహిళా కార్మిక లోకాన్ని ఉద్యమించక తప్పని స్థితికి నెట్టివేశాయి. ఈ నేపథ్యంలోనే 1908 మార్చ్‌లో న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళా కార్మికులు పని గంటలు తగ్గించాలని, సమాన పనికి సమాన వేతనంకై, వేతనంతో కూడిన ప్రసూతి సెలవుకై, పిల్లల బాగోగుల కోసమై, వారికి ఉచిత విద్యను అందించడం కోసమై, ఓటింగు హక్కులు కల్పించాలని, పనిచేసే చోట మెరుగైన పరిస్థితులను ఏర్పర్చాలని మహా ప్రదర్శనను నిర్వహించారు. చరిత్రాత్మకమైన ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తంగా మహిళలను మరింత సంఘటితపరిచేలా, నిర్మాణాత్మకమైన పోరాటాలకు పురికొల్పేలా చేసింది. నిజానికి ఈ గొప్ప పరిణామం వెనుక అర్ధ శతాబ్దానికి పైగా సాగిన అనేక అసంఘటిత పోరాటాలు, చరిత్రకు చేరని ఎన్నో ఘటనలు ఉన్నాయి. అమెరికన్ సోషలిస్టు పార్టీ, జర్మనీకి చెందిన సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాయకురాలు క్లారా జెట్కిన్‌తో పాటు రోజా లగ్జెంబర్గ్ లాంటి వాళ్లు భూస్వాములకు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా మహిళా శక్తిని సమీకరించి క్రియాశీలకంగా వ్యవహించారు.

అమెరికన్ సోషలిస్టు పార్టీ మొదటగా మహిళా ఉద్యమ స్ఫూర్తిని చాటేలా ఫిబ్రవరి 28ని మొదటి మహిళా దినంగా ప్రకటించింది. ఇవాల జరుపుకుంటున్న మార్చ్ 8ని 1910లో కోపెన్ హెగెన్‌లో క్లారా జెట్కిన్ ప్రతిపాదించగా 100 దేశాల ప్రతినిధులు అమోదించారు. 1911 మార్చ్ 25న న్యూయార్క్ నగరంలో ట్రయాంగిల్ అగ్ని ప్రమాదంగా ప్రసిద్ధమైన అక్కడి బట్టల మిల్లులో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 146 మంది ప్రధానంగా 123 మంది మహిళా కార్మికులు తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ మొత్తంలో కూడా 14 నుండి 23 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళా కార్మికులే ఎక్కువగా ఉన్నారు. అదే కాలంలో ముంచుకొచ్చిన మొదటి ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, ప్రపంచ వ్యాప్త శాంతిని కాంక్షిస్తూ రష్యన్ మహిళలు నినదించారు. మొత్తంగా మార్చ్ 8 అనేది ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక మహిళా పోరాట దినంగా ప్రాచుర్యం పొంది, ముందు తరాలను మరింతగా ప్రేరేపించి పోరాట జెండాను విడవకుండా సమాన హక్కులు, స్వేచ్ఛకై మహిళా విముక్తికై ఎలుగెత్తేల నిలిచిపోయింది. 1975 నుండి ఐక్యరాజ్య సమితి కూడా ఈ రోజు ప్రాధాన్యతను గుర్తించి ప్రతి సంవత్సరం ఏదో ఒక కొత్త నినాదంతో ఈ పోరాట దినాన్ని జరుపుకోవడం ప్రారంభించింది.

ఇంతటి సుదీర్ఘమైన, చైతన్యవంతమైన, ఉద్వేగభరితమైన చరిత్ర కలిగి సగం ప్రపంచానికి సంబంధించిన రోజును 'ఉత్సవం'గా మార్చే పనికి ప్రయత్నాలు ప్రపంచీకరణకు అడుగులు పడడంతోనే మొదలైనా ఆయా దేశాల్లోని భూస్వామ్య వర్గాలు, మతచాందస శక్తులు, పెట్టుబడి దారులు కొత్త చరిత్రను నిర్మించిన మహిళా ఉద్యమ చైతన్యాన్ని నీరుగార్చేలా, దారితప్పించేలా నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ముడిసరుకులకై సహజ వనరుల వేటలో, మార్కెట్ విస్తరణలో భాగంగా మహిళా శ్రమను చౌకగా పొందే దోపిడీ యత్నాల్లోనూ మహిళా దినం మరింత పలచబడింది. స్త్రీని విలాస వస్తువుగా చూసిన భూస్వామ్యం, సరుకుగా మార్చిన పెట్టుబడి వీటన్నింటికి తార్కిక లెజిటిమసీని ఇచ్చిన మత గ్రంథాలు, మహిళా ఉద్యమాన్ని కొత్త రూపాల్లో అణిచివేస్తున్నాయి. ఎన్ని రూపాల్లో అణిచివేయవచ్చో, ఎన్ని రంగాల్లో అణిగిమణిగి ఉండేలా చేయవచ్చో వాటన్నిటికి కట్టుబాట్లు, సిద్ధాంత రూపాలను అన్ని మత గ్రంథాలు బోధించాయి.

సంఘంలో ఆమె స్థానమంటూ ప్రత్యేకంగా ఏమీలేదని, పురుషుడి వల్లే ఆమె స్థానం నిర్ణయించబడుతుందని, తనంతట తానుగా తన ఉనికిని వ్యక్తిగా చాటుకునే అవకాశమే లేకుండా సామాజిక అణిచివేత కొనసాగుతున్న నేపథ్యంలోనే పెట్టుబడుల ప్రవాహం, మార్కెట్ విస్తరణతో కొత్త రూపంలో అదే స్థితిని కొనసాగించేలా 'ఉత్సవ' నినాదాలు ఊపందుకున్నాయి. భారతదేశ సందర్భంలో అయితే స్త్రీని దేవతీకరించి, ఆదర్శీకరించి ఉత్తమ గుణాలు కలిగిన వ్యక్తి అని కీర్తించే బ్రాహ్మణీయ సంస్కృతి వారిని మరింతగా ఒంటింటి కుందేళ్లుగా మార్చివేసింది. ప్రశ్నించడాన్ని, స్వేచ్ఛకై ఎలుగెత్తడాన్ని బరితెగింపుగా ప్రచారం చేస్తూ మరింత అణిచివేతను అమలు చేస్తున్నది. మరోవైపు నూతన ఆర్థిక

విధానాల అమలు తర్వాత వినియోగదారీ సంస్కృతి విచ్చలవిడిగా పెరిగి పోయి మహిళలపై మరింతగా ఇంటాబయటా హింస పెరిగి పోయింది. ప్రభావంతమైన సినిమా మాధ్యమంలో, మీడియా వ్యాపార ప్రకటనలలో స్త్రీల చిత్రీకరణ వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, కేవలం పురుషున్ని సంతోషపెట్టే శారీరక నిర్మాణంగానే చూపించడం పెరిగిపోయింది. ఐటమ్ పాటల సంస్కృతి వికృత రూపం తీసుకొని స్త్రీని కేవలం వినోద వస్తువుగా స్థిరపరిచే వ్యాపార ధోరణి ప్రమాదకర స్థితికి చేరుకున్నది. యాసిడ్ దాడులు, పెట్రోల్ పోయడాలు, నడి బజారులో నరికి వేయడాలు, అత్యాచార సంఘటనలు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి.

మైదాన ప్రాంతాల్లో స్త్రీలపై జరిగే అనేక ఘోర వృత్తాంతాలు కొన్నైనా వెలుగు చూసే అవకాశమున్నా అడవుల్లో ఆదివాసీ పల్లెల్లో ఆదివాసీ మహిళలపై మిలటరీ బలగాలు ఒక అణిచివేత సాధనంగా రేప్‌ను ప్రవేశపెట్టిన దుర్మార్గం బయటి ప్రపంచానికి పూర్తిగా తెలియడం లేదు. ఉద్యమ ప్రాంతాల్లోని మహిళలు, ప్రధానంగా ఖనిజ సంపద నిక్షిప్తమైన చోట ఆదివాసీలను విస్తాపనకు గురిచేస్తూ బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్స్ ప్రవేశించిన చోట భద్రతా బలగాలు వారి ప్రతిఘటనను అణిచే సాధనంగా ఈ దుర్మార్గానికి ఒడిగడుతున్నాయి. అభివృద్ధి పేరుతో స్త్రీలపైన మరింత హింస, అణిచివేత అమలవుతున్నది. అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా, రాష్ట్రాలుగా చెప్పబడుతున్న చోటనే 'పరువు' పేరుతో స్త్రీలపైన తీవ్రమైన హింసాకాండను ప్రయోగిస్తున్నారు. స్త్రీని 'దేవత'గా కీర్తించే దేశం మహిళలపై అత్యాచారాలు జరుగుతున్న 146 దేశాలలో 132వ స్థానం సంపాదించుకున్నదంటే పరిస్థితి ఏంటో అర్థమౌతున్నది.

'నిర్భయ' చట్టం వచ్చిన తర్వాత మహిళలపై 27 శాతం అత్యాచారాలు అధికంగా నమోదయ్యాయి. ఇన్ని దుర్మార్గాలు ఇంటా బయటా మహిళలపై జరుగుతుంటే పాలకులు నినాదాలకు పరిమితమయ్యారు. బేటీ బచావో, బేటీ పడావో నినాదమిచ్చిన మోడీ అనుచరగణం అంతా స్త్రీలు కురుచ దుస్తులు ధరిస్తున్నారనో, దేశ సంస్కృతిని మంటగలుపుతున్నారనో వీధుల్లో వీరంగం సృష్టిస్తూ సాంస్కృతిక పోలీసింగ్‌కు పాల్పడుతున్నారు. సనాతన వాదులంతా పితృస్వామ్య, బ్రాహ్మణీయ విలువలు మరింత బలపడేలా తమ ఎజెండాకు పదును పెడుతున్నారు. 'నస్త్రీ స్వాతంత్ర మర్హతి' అని చెప్పిన శాస్త్రాల సంఘపరివార్ పెద్దలు స్త్రీలు వంటింటికే పరిమితం కావాలని బాహాటంగానే ఘోషిస్తున్నారు.

వ్యక్తులుగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించే హక్కులను నిరాకరించి 'శాస్త్రాల'నుసారం, మతం విధించిన పరిమితులకు లోబడి నడుచుకోవాలని ఈ శక్తులు నిర్దేశిస్తున్నాయి. శిశు మంధిర్‌ల చదువులు స్త్రీలకు శిలాశాసనాలను విధిస్తున్నాయి. జాతీయ వాదం పేరుతో హిందూ బ్రాహ్మణీయ ఫాసిజంను అమలు పరుస్తూ మహిళల సాంస్కృతిక హక్కుల్ని అణిచివేస్తున్నాయి. ప్రతి ప్రభాతాన టివి ఛానళ్ల నుండి ప్రవహించే ప్రవచనాలన్నీ స్త్రీల చుట్టూ సనాతన ఇనుప కంచెలను వేస్తున్నాయి. భక్తి పేరుతో సృజనాత్మకత లేకుండా పారాయణాలను చేయిస్తూ మహిళ మనోవికాసానికి అడ్డుగోడల్ని నిర్మిస్తున్నారు. శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ వైఖరిని అలవర్చుకొని ఆధునిక జీవన శైలిని ప్రదర్శించే మహిళలను ప్రాశ్చాత్య సంస్కృతికి బానిసలయ్యారంటూ ప్రచారం చేస్తున్నారు. స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, ఉన్నతమైన అభిప్రాయాలను కలిగి ఉండి తమ జీవితాన్ని తామే నిర్దేశించుకుంటామంటే సహించని 'సంఘ్' జీవులు వీరు. ఫ్లవర్‌వాజ్‌లో పువ్వులా, షోకేసుల్లో బొమ్మలా ఉండాలని అనుకువ, వినయం, విధేయతల చాటున స్త్రీలను తోలుబొమ్మలుగా ఆడించే ఈ శక్తులకు స్త్రీలు స్వేచ్ఛగా ఆలోచించడం, స్వేచ్ఛాయుత జీవితం గడపడం కంటగింపుగా మారింది.

ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి స్థితి నెలకొని ఉంటే పాలకులకు వాళ్లు ఊడిగం చేస్తున్న కార్పొరేట్స్‌కి ప్రతి సందర్భంలోంచి పైసలు పిండుకోవడం కావాలి. 'ఉత్సవ విగ్రహం' అనే మాట ప్రజా బాహుళ్యంలో బహుళ ప్రచారం పొందినది. ఉత్సవ విగ్రహమనేది ప్రయోజనకరమైనది కాదని, అది ఉత్త విగ్రహమేనని దాని సారాంశం. ఏదైన చారిత్రిక సన్నివేశాన్ని, పోరాట స్ఫూర్తిని, చైతన్యాన్ని, విముక్తి పథాన్ని చూపించే శక్తి ఉన్న ఏ సందర్భాన్నైనా వక్రీకరించి నిర్వీర్యపరిచి తమ ప్రయోజనాలకు, తాము రక్షణగా నిలబడ్డ వారి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా చూసుకుంటారు పాలకులు. సరిగ్గా మార్చ్ 8ని కూడా అలాగే మార్చి వేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంను అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని ఆర్భాటం చేస్తున్నాయి ప్రభుత్వాలు, కార్పొరేట్స్.

ఆస్తిపర వర్గాల మహిళలు, ఉన్నతోద్యోగ స్థానంలో ఉన్నవాళ్లు, అధికార పీఠాల్లో వారందరికి ఇది ఏనాడో ఉత్సవం అయింది. న్యూ ఇయర్ లాగానో, వాలైంటైన్స్ డేలాగానో మార్చివేసి కేక్ కట్ చేయడానికి, అభినందనలు చెప్పుకోవడానికి పార్టీలు చేసుకునే స్థాయికి దిగజార్చారు. ఫ్యాషన్ పరేడ్‌లు, వంటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించి స్త్రీని 'దేవత' అని, భూదేవంత 'సహనశీలి' అని కుటుంబ బరువును, బయటి బరువును నెత్తిన వేస్తున్నారు. పావలా వడ్డీలు, కుట్టు మిషన్‌లు, బ్యూటీపార్లర్లు, ఫ్యాషన్ డిజైనింగ్‌లను నేర్పి వాటినే 'మహిళా సాధికారత'గా ప్రచారం చేసుకుంటున్నారు పాలకులు. వీటికి తోడు 'ఉత్సవం' అయితే కాస్మోటిక్స్, ఫ్యాషన్ దుస్తులను ఉత్పత్తి చేసే కార్పొరేట్స్‌కి అది కాసుల ఉత్సవంగా మారుతుంది. పండుగలా జరుపుకునే రోజులు పోరాటాలను, త్యాగాలను, విముక్తి పథాలను గుర్తుకు తెస్తాయంటారా? పండుగల పేరుతో మైమరిచిపోయేలా అనేక కంపెనీలు బట్టలకు, వంట సామాన్లకు, బంగారు ఆభరణాలకు 'భారీ' డిస్కౌంట్ ఇస్తున్నాయి. అందంగా, ఆకర్షణీయంగా తయారుకమ్మని, ఆడుతూ పాడుతూ వేడుక చేసుకొమ్మని చెప్పి సమ్మతించేలా జరిగే 'కండీషనింగ్' కూడా సమాంతరంగా జరుగుతూనే ఉంటుంది. వినియోగదారీ సంస్కృతి పెంచాలంటే ప్రతి సందర్భాన్ని ఉత్సవం చేయాల్సిందే.

రెక్కలు ముక్కలు చేసుకొని కంపెనీల్లో కాలిపోతున్న మహిళా కార్మికులు, అసంఘటిత రంగంలో కునారిల్లుతున్న అసంఖ్యాక మహిళలు, కుదేలైన వ్యవసాయంలో రుణగ్రస్తులై బతుకులెల్లదీస్తున్నవారు ఇంటికే పరిమితం చేయబడి బయటి ప్రపంచాన్ని కనే అవకాశం లేనివాళ్లంతా తమ చుట్టూ అల్లుకున్న దోపిడీ కంచెల్ని బద్ధలుకొట్టి విముక్తి గీతం పాడుకోవడం కోసం ఉద్దేశించబడినది ఈ శ్రామిక మహిళా పోరాట దినం. మహిళల్ని పరాయీకరించి బానిసలుగా చేసిన, వారి శ్రమ శక్తిపై పురుషులకు అధికారమిచ్చిన కుల, మత, పితృస్వామిక చట్రాలను కూల్చివేయకుండా ఉండడం కోసం, వస్తు వ్యామోహపు ప్రవాహంలో కొట్టుకుపోయేలా చేయడం కోసమే పోరాట దినం ఉత్సవం అయ్యింది. శ్రమ విముక్తి పోరాటంతోనే మహిళా విముక్తి దాగి ఉందన్న సత్యాన్ని మరుగున పరిచేందుకు పోరాటాన్ని నీరుగార్చి 'వేడుక'ను చేస్తున్నారు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

వెనిజులాలో అమెరికా జోక్యం

వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంటూ మదురో ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి ప్రయత్నిస్తోందనీ, ఈ కుట్రలను లాటిన్ అమెరికా దేశాలు కలిసికట్టుగా ఎదిరించకపోతే మరిన్ని సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తుందనీ హెచ్చరిస్తున్నారు ఎ. నర్సింహా రెడ్డి

దక్షిణ అమెరికా దేశమైన వెనిజులాలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఈ పరిస్థితికి అధ్యక్షుడు మదురో స్వయంకృతాపరాధం, అమెరికా వైఖరి ప్రధాన కారణాలు. ఇదే అదునుగా వాషింగ్టన్ పావులు కదుపుతోంది. ఇదే అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ వెనిజులా తిరుగుబాటు అసమ్మతివాదులకు అండగా ఉంటామని హామీ ఇస్తూ వీడియో మెసెజ్ పంపిన మరుక్షణమే 2019 జనవరి 5న వెనిజులా జాతీయ అసెంబ్లీ మదురోను అధ్యక్షుడిగా గుర్తించబోమని తీర్మానించింది. మధ్యంతర ప్రభుత్వాన్ని తీసుకువచ్చి మళ్లీ ఎన్నికలు జరుపుతామని ప్రకటించింది. జనవరి 23న ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైనా మదురోను కాదని జాతీయ అసెంబ్లీ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఆ దేశ ప్రతిపక్ష నేత జువాన్ గువాయిడో (35) రాజధాని కారకాస్‌లో 2019 జనవరి 23న తానే దేశాధ్యక్షుడినని ప్రకటించుకున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అధికారులు వెనిజులా సైన్యంతోనూ, ప్రతిపక్షాలతోనూ మంతనాలు జరిపారు. మదురోకు వ్యతిరేకంగా కుట్ర పన్నారు. రెండు మాసాలుగా వెనిజులాలో అమెరికా ముట్టించిన మంటలు సెగలు గక్కుతున్నాయి.

2015 పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో మదురో పార్టీ కాకుండా విపక్షాలే అత్యధిక స్థానాలు చేజిక్కించుకున్నాయి. పార్లమెంట్‌లో మెజార్టీ రాగానే మదురోను తొలగించాలని ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. 2017లో సుప్రీం ట్రిబ్యునల్ పార్లమెంట్ అధికారాలను రద్దు చేసింది. అప్పటి నుంచి అధికారంలేని పార్లమెంట్ కొనసాగుతోంది. తర్వాత నూతన రాజ్యాంగ రచనకు, రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి. ప్రతిపక్ష ఆధిపత్యం గల జాతీయ పార్లమెంట్ స్థానంలో 545 మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ నిర్మాణ సభను 2017 జూలై 30న మదురో తన అనుయాయులతో ఏర్పాటు చేయడంతో రాజకీయ వివాదం రాజుకుంది. ఇవాళ్టి సంక్షోభానికి ఇది ఒక కారణం.

2018 మేలో వెనిజులా అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఓడిపోతామనే భయంతో ప్రతిపక్షాలు ఆ ఎన్నికలను బహిష్కరించాయి. 60 శాతం ఓట్లతో మదురో అధ్యక్ష స్థానానికి ఎన్నికయ్యారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదంటూ అమెరికా, యూరప్ దేశాలు ఆరోపించాయి. 2019 జనవరి 10న మదురో రెండోసారి అధ్యక్ష పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అయితే పార్లమెంట్ ఆ మరుసటిరోజు మదురో అధికార అపహర్త అంటూ అధికారాలు లేని పార్లమెంట్ ఒక తీర్మానం చేసి పార్లమెంట్ స్పీకర్‌గా ఉన్న గువాయిడోను అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. వెనిజులా ఆస్తులు, బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయాలంటూ 46 దేశాలకు గువాయిడో నేతృత్వంలోని పార్లమెంట్ లేఖలు రాసింది. కానీ పార్లమెంట్ నిర్ణయాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అయినప్పటికీ పార్లమెంట్ తీర్మానాన్ని అమెరికా, కెనడా, బ్రెజిల్‌లు అభినందించడం ద్వారా గువాయిడోను గుర్తించినట్లయింది. ఆయన నియమించే రాయబారులను గుర్తిస్తామని కూడా వెల్లడించాయి. అంటే వెనిజులాలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపేందుకు అమెరికా వ్యూహ రచన చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

దేశాధ్యక్షుడిగా గువాయిడోను గుర్తిస్తున్నట్లుగా అమెరికాతో పాటు పొరుగు దేశాలైన బ్రెజిల్, కొలంబియా, పెరూ, అర్జెంటీనా, పశ్చిమ యూరప్ దేశాలు ప్రకటించాయి. కానీ ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో ఈ చర్యలను తీవ్రంగా ఖండించారు. అమెరికా గువాయిడోను అధ్యక్షుడిగా గుర్తించడం పట్ల ఘాటుగా ప్రతిస్పందిస్తూ అమెరికాతో దౌత్య సంబంధాలన్నింటినీ తెంచుకుంటున్నామని ప్రకటించారు. అమెరికా దౌత్యవేత్తలు, ప్రతినిధులు అంతా 72 గంటల్లోగా తమ దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. కానీ మదురో అధ్యక్షుడు కాదనీ, ఆయన మాటలను పాటించాల్సిన అవసరం లేదని అమెరికా తిప్పికొట్టింది. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడం పట్ల రష్యా, చైనా, క్యూబా, టర్కీలు ఆగ్రహం వ్యక్తపరిచాయి. మదురోను గద్దె దించేందుకు అమెరికా కుట్ర పన్నిందని ఆరోపించాయి.

వెనిజులాలో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నంలో భాగంగా అమెరికా మద్దతుతో చెలరేగిన తిరుగుబాటుదారులు హింసను తీవ్రతరం చేశారు. దీంతో దేశంలో మృతుల సంఖ్య 30కి పెరిగింది. పైగా వెనిజులాపై ఒత్తిడి తెచ్చేందుకు లిమా గ్రూప్‌లోని కొన్ని దేశాలతో ట్రంప్ స్వయంగా సంభాషించినట్లు సమాచారం. లిమా గ్రూప్ దేశాల్లో బ్రెజిల్, అర్జెంటీనా, చిలీ, కొలంబియా, ఈక్వెడార్, పెరూ, కోస్టారికా, పరాగ్వే వంటి దేశాలున్నాయి. ఈ లాటిన్ అమెరికా దేశాలతో పాటు కెనడా, ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ దేశాలను కూడా డోనాల్డ్ ట్రంప్ రంగంలోకి దించారు. దీంతో ఈ దేశాలన్నీ వెనిజులా అధ్యక్షుడు మదురోకు వ్యతిరేకంగా, తిరుగుబాటుకు అనుకూలంగా తమ ప్రకటనలు జారీ చేశారు. తక్షణమే అక్కడ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కావాలంటూ డొంకతిరుగుడు ప్రకటనలు చేశారు. నిజానికి మదురో ప్రభుత్వం చట్టబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రభుత్వమే.

వెనిజులాలో అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వెనిజులా పరిణామాలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరాస్ ప్రతిస్పందిస్తూ దేశంలో ఇరువర్గాల మధ్య చర్చలు జరగాలని పేర్కొన్నారు. వెనిజులాలో తాజాగా ఎన్నికలు జరపడం మేలని యూరోపియన్ యూనియన్ సూచించింది. మదురో ప్రభుత్వాన్ని రద్దు చేయాలని మార్చి 1న ఐక్యరాజ్య సమితిలో అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా 9 దేశాలు, వ్యతిరేకంగా 3 దేశాలు ఓటు చేశాయి. మరోవైపు 3 దేశాలు హాజరుకాలేదు. ఈ తీర్మానాన్ని రష్యా, చైనా దేశాలు వీటో చేశాయి.

ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభం

వెనిజులాలో రాజకీయ విభేదాలు కొత్తేమికావు. ఆ దేశంలో దీర్ఘకాలంగా ఆర్థికపరమైన విభేదాలు, పెట్టుబడిదారీ సంక్షోభం, సామ్రాజ్యవాద కుట్రలు, సోషల్ డెమోక్రసీలో ఉన్న రాజకీయ లోపాలు, విప్లవోద్యమం బలహీనతలు కొనసాగుతూనే ఉన్నాయి. మరోవైపు ఇటీవల కాలంలో అంతర్జాతీయంగా వచ్చిన పరిణామాల నేపథ్యంలో చమురు ధరలు తగ్గి వెనిజులా ఆర్థిక ఇబ్బందులకు గురైంది. వెనిజులాపై అమెరికా అనేక ఆంక్షలు విధించింది. దేశంలోని బహుళజాతి సంస్థలు కూడా అస్థిరతకు తమ వంతు పాత్ర పోషించాయి. ఎగుమతులు దెబ్బతినడంతో ఆహారం, మందుల కొరత తలెత్తింది. ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. ఇదే అదునుగా దేశంలో అశాంతి సృష్టించడానికి అమెరికా ప్రతిపక్షాలను రెచ్చగొట్టింది.

1980లలో ప్రవేశపెట్టిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు లాటిన్ అమెరికాను అన్ని రంగాల్లోనూ దివాళా తీయించడంతో వాటికి వ్యతిరేకంగా ఒక ప్రజా వెల్లువ వచ్చింది. ఆ క్రమంలోనే 1998లో వెనిజులాలో హ్యూగో చావెజ్ అధికారంలోకి వచ్చారు. వెనిజులాలో చావెజ్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రైవేట్ రంగంలో ఉన్న చమురు కంపెనీలన్నిటినీ జాతీయం చేసింది. అలా స్వాధీనం చేసుకున్న వాటిలో ప్రస్తుత అమెరికా విదేశాంగ మంత్రి టిల్లర్‌సన్‌కు చెందిన ఎక్సాన్ మొబిల్ కంపెనీ కూడా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర గరిష్ట స్థాయిలో ఉండడంతో ప్రభుత్వం వద్ద పెద్ద ఎత్తున పెట్రోడాలర్లు పోగుపడ్డాయి. వీటిని ఉపయోగించి చావెజ్ ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టింది. సామాజిక పించన్లు, నిరుద్యోగ భృతి, అందరికీ ఉచితంగా విద్య, వైద్యం వంటి పలు సంక్షేమ చర్యలు చేపట్టింది. ఈ విధానాలు ప్రజల జీవన ప్రమాణాల్లో కొంత మార్పు తీసుకొచ్చాయి. చావెజ్ ప్రభుత్వానికి ప్రజలు వెన్నుదన్నుగా నిలిచారు. ఆ ప్రజా బలంతోనే అమెరికా సామ్రాజ్యవాదుల కుట్రలను ఆయన దీటుగా ఎదుర్కొన్నాడు.

చావెజ్‌ను కూలదోయడానికి అమెరికా పన్నిన సైనిక కుట్రకు ప్రజల నుండి పెద్ద ఎత్తున నిరసన రావడంతో ఆ ప్రయత్నం బెడిసికొట్టింది. ఆయన జీవించి ఉన్నంతకాలం అమెరికా పాచికలు పారలేదు. ఆయన ఆకస్మిక మరణంతో వెనిజులాలో కుట్రలకు అమెరికా మళ్లీ తెర తీసింది. సామ్రాజ్యవాద కుట్రలను ఎదుర్కోవడంలో చావెజ్‌కు ఉన్న సామర్థ్యం మదురోకు లేకపోవడం, అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భారీగా పతనం కావడం వెరసి వెనిజులాను సంక్షోభం సుడిగుండంలోకి నెట్టాయి. చమురు ధరల పతనంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం బాగా పడిపోవడం, సంక్షేమ పథకాలకు నిధుల కొరత ఏర్పడడంతో ఆర్థిక పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. దీనికి తోడు వెనిజులాలోని 80 శాతం పరిశ్రమలపై అదుపు కలిగివున్న కార్పొరేట్ సంస్థలు ఉత్పత్తి చేసిన సరుకులను అక్రమంగా గోదాములకు తరలిస్తూ, కృత్రిమ కొరత సృష్టించాయి. ఆ కొరతను సాకుగా చూపి నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచేశాయి. బ్లాక్ మార్కెటీర్లపైన, గోదాములపైన ప్రభుత్వం దాడులు నిర్వహించినప్పటికీ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టాన్ని అవి పూడ్చలేకపోయాయి.

వెనిజులా ప్రభుత్వ రంగ చమురు కంపెనీ (పిడివిఎస్ఎ)కు చెందిన దాదాపు 700 కోట్ల డాలర్ల ఆస్తులను అమెరికా స్తంభింప చేసింది. మరో వైపు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో డిపాజిట్ చేసిన బంగారం నిల్వలను మదురో ప్రభుత్వం తీసుకునేందుకు వీలు లేకుండా బ్రిటన్ సర్కారు ఆంక్షలు విధించింది. తమ దేశంలో ఉన్న వెనిజులా ఆస్తులపై ఆ దేశ స్వయం ప్రకటిత అధ్యక్షుడు జువాన్ గువాయిడోకు అధికారం కల్పిస్తూ అమెరికా నిర్ణయం తీసుకుంది. వీటన్నింటికీ తోడు కనీసం అధ్యక్ష ఎన్నికల బరిలో ఒక్కసారి కూడా దిగని గువాయిడోకు 2 కోట్ల డాలర్ల 'మానవతా సాయాన్ని' అందిస్తామని హామీ కూడా ఇచ్చింది. తన చెప్పుచేతుల్లో నుండి జారిపోతున్న ఏదైనా దేశంలో ప్రభుత్వాన్ని పడగొట్టాలని భావించినప్పుడు అమెరికా 'ప్రజాస్వామ్యం', మానవత ముసుగు తొడుక్కుంటుంది.

2018 ఆగస్టులో దేశ ఆర్థిక వ్యవస్థను పైకి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగా కొత్త కరెన్సీని ప్రారంభించారు. అయినా పెద్దగా ఫలితాలు లేకపోవడంతో ప్రజలు నిరసనలు ప్రారంభించారు. ప్రజల నిరసనలు నియంత్రించేందుకు గాను సైనికుల సాయంతోనూ, రష్యా సహకారం తోనూ మదురో పాలన సాగిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న వెనిజులాపై చమురు రాజకీయాలను విస్తృతం చేసింది అమెరికానే. అమెరికా ఆంక్షల కారణంగానే వెనిజులాలో పరిస్థితులు దారితప్పాయని స్వయంగా '2018 నవంబర్ కాంగ్రెసనల్ రీసెర్చ్ సర్వీస్ రిపోర్ట్' వెల్లడించింది.

వెనిజులాలో నెలకొన్న ఆర్థిక, సామాజిక సంక్షోభాన్ని ఆసరాగా చేసుకొని మదురో ప్రభుత్వంపైకి ప్రతిపక్షాలను అమెరికా ఉసిగొల్పింది. మదురోకు అనుకూలంగా, వ్యతిరేకంగా ప్రదర్శనలు ప్రతి రోజూ జరుగుతున్నా పాశ్చాత్య మీడియా మాత్రం ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలను మాత్రమే చూపిస్తున్నది. 2015 నవంబర్‌లో జరిగిన వెనిజులా పార్లమెంట్ ఎన్నికల్లో అమెరికా ప్రతిపక్షాలకు పెద్ద ఎత్తున డబ్బు సంచులు ముట్టజెప్పింది. తన ప్రచార బాకాల ద్వారా మదురోకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అసత్య ప్రచారం గావించింది. ఫలితంగా ఆ ఎన్నికల్లో మితవాదశక్తులు మెజార్టీ సాధించాయి. అధ్యక్షుడు మదురో పదవీ కాల పరిమితి పూర్తికావడానికి ఇంకా మూడేళ్లు ఉండగానే ఆయన గద్దె దిగాలని ఈ మితవాదశక్తులు రంకెలేస్తున్నాయి.

వెనిజులాలో అమెరికా అంతర్గత జోక్యం

అమెరికా సామ్రాజ్యవాద విషసర్పానికి వెనిజులా దేశంలోని ముడి చమురుపై కళ్లు పడ్డాయి. దేశ సార్వభౌమాధికారాన్ని, స్వావలంబనను కాపాడుకొంటున్న మదురో ప్రభుత్వాన్ని కాటువేయడానికి అమెరికా విషసర్పం సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 3న ప్రభుత్వ అనుకూల ప్రదర్శన, అమెరికా దన్నుతో తనకుతానే అధ్యక్షునిగా చెప్పుకొన్న గువాయిడో అనుకూలుర వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. ఇరు పక్షాల మధ్య చర్చలు జరగడం లేదు. తాము విధించిన గడువు (ఫిబ్రవరి 2) లోపు నూతన ఎన్నికలు జరపలేదు గనుక 'మిలిటరీ చొరబాటు ప్రయత్నాలను తోసివేయలేమని' ట్రంప్ పేర్కొన్నాడు. ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్, జాతీయ భద్రతా సలహాదారుడు జాన్ బోల్టన్‌లు చెరొకవైపు నుండి వెనిజులా ప్రభుత్వంపై మాటల దాడిని ముమ్మరం చేశారు. మియామీలో పెన్స్ మాట్లాడుతూ 'ప్రస్తుతం ఇక చర్చలకు తావేలేదు. కార్యాచరణకు సమయం ఆసన్నమైనది, మదురోను అంతం చేయడానికి అన్ని రంగాలు సిద్ధమైనాయి' అంటూ అవసరమైతే ఆయనను హత్య చేస్తామని, రొమేనియాలో నికోలాయ్ చౌచెస్కీకి పట్టిన గతే పడుతుందని' అన్నాడు.

అమెరికా అధ్యక్షుడు తమ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన స్టేట్స్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలో 'మదురో సర్కారు కిరాతకాలను మేం ఖండిస్తున్నాం. నికోలస్ మదురోను అంగీకరించే ప్రసక్తి లేదు. ఈ విషయంలో వెనక్కు పోయేదీ లేదని' అన్నాడు.

ఫ్రాన్సిస్కో టోరో అనే వాషింగ్టన్ పోస్టు కాలమిస్టు ఒక వ్యాసం రాస్తూ, 'వెనిజులాలో ఒకవేళ అమెరికా మిలిటరీ ప్రవేశం జరిగితే

ఆగ్నేయం నుండి బ్రెజిల్, నైరుతి నుండి కొలంబియాలు రంగ ప్రవేశం చేయవచ్చని మనం సులభంగా ఊహించుకోవచ్చును. రష్యా తన చమురు వాణిజ్యాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంది. చైనా కూడా తనవంతుపని తను చేయొచ్చు. క్యూబా ఇప్పటికే మిలిటరీ ఎత్తుగడలు చేస్తున్నది' అని పేర్కొంది. '2018లో అమెరికా యుద్ధ కళాశాల లాటిన్ అమెరికాలో 'యుఎస్ రక్షణ' అనే పుస్తకం విడుదల చేసింది. దాంట్లో 1970/80 దశకాల్లో లాటిన్ అమెరికాలోని చాలా దేశాల్లో నియంతల రాజ్యాలు కూలిపోయి అమెరికా వ్యతిరేక వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడడంతో అమెరికా పట్టు తప్పిందని, మరోవైపు బాహ్య శక్తులు (రష్యా, చైనా) అమెరికా ఆధిపత్యానికి అడ్డు తగులుతున్నాయి. ఇది మన భద్రతకే ముప్పు' అని పేర్కొన్నట్లు సోషలిస్టు వెబ్‌సైట్ తెలుపుతుంది.

ప్రధానంగా లాటిన్ అమెరికా దేశాలలో రష్యా, చైనా వాణిజ్య సంబంధాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. కనుక లాటిన్ అమెరికాలో రష్యా, చైనా దేశాల వాణిజ్య సంబంధాలను బలహీనపర్చడం ద్వారా అమెరికా ఆధిపత్యాన్ని తిరిగి పెంచుకోవాలని ఆరాటపడుతున్నట్లు సోషలిస్టు వెబ్‌సైట్ పేర్కొంది. మరోవైపు మదురోకు ఇప్పుడు 3 అంచెల ప్రణాళికలున్నాయని సోషలిస్టు వెబ్‌సైట్ పేర్కొంది. 'ఒకటి మితవాద ప్రతిపక్షాలతో చర్చలు జరుపుతూ అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడం, రెండవది వియత్నాం తరహాగా అమెరికాను దేశ ప్రజలతోనూ, సాయుధ పోరాటంతోనూ, మిలిటరీపరంగా ఎదుర్కొనడం, మూడవది ప్రతిపక్షాల్ని అణచివేయడం' అని పేర్కొంది.

అమెరికా సామ్రాజ్యవాదానికి నేడు తక్షణం కావాల్సింది ప్రపంచం లోని ముడి చమురు నిల్వలలో 24 శాతం పైబడి వెనిజులా దేశంలో ఉన్న సంపద మాత్రమే. 'మదురో రాజీనామా చేస్తే చక్కగా బీచ్‌ల దగ్గర విలాసవంతంగా తన శేష జీవితాన్ని మదురో గడుపుకోవచ్చును. లేకుంటే గ్వాటెనామో దీవిలోని బీచ్ ఒడ్డున ఉన్న ప్రత్యేక జైల్లో తను ఊసలను లెక్కపెట్టుకొంటాడు' అని అమెరికా ఉపాధ్యక్షుడు పెన్స్ పొగరుబోతుగా మాట్లాడాడు. గువాయిడో మాత్రం అమెరికాతోనూ, ఈయూ దేశాలతోనూ సంబంధాలను కలిగి ఉండి, అమెరికా నుండి మూడు ప్రాంతాలకు సహాయం (ఎయిడ్) రానున్నదని చెప్పుకొంటున్నాడు. దేశంలో 3 సరిహద్దు ప్రాంతాలలో ఒకటి కొలంబియా సరిహద్దు, రెండవది బ్రెజిల్ సరిహద్దు, మూడవది కరేబియన్. వాస్తవానికి పైకి ఆహారం, దుస్తులు, మందులు పంపుతున్నట్టు చెప్పి వీటితోపాటు ఆయుధాల్ని, డాలర్లను పంపుతున్నారు.

అమెరికా జాతీయ భద్రత సలహాదారు బోల్టన్ ఇప్పటికే 5 వేల మంది అమెరికా సైనికుల్ని కొలంబియా సరిహద్దుకు వెళ్లవల్సినదిగా ఆదేశించాడు. మార్చి 7న వెనిజులా జల విద్యుత్ కేంద్రంపై సాంకేతిక సైబర్ దాడి జరిగింది. దీంతో వెనిజులా ప్రధాన అవసరాలు తీర్చే విద్యుత్ కేంద్రం నుంచి జరిగే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దేశమంతా అంధకారం అలుముకుంది. ఈ సందర్భంగా వెనిజులా విదేశాంగ మంత్రి రొడ్రిగజ్ టెలిన్యూస్‌తో మాట్లాడుతూ 'సామ్రాజ్యవాద అమెరికా విద్యుత్ యుద్ధ బాధితురాలిగా తమ దేశం ఉందని' అన్నారు. ఈ బ్లాకవుట్‌ను విద్రోహ చర్యగా వెనిజులా ప్రభుత్వం పేర్కొంది.

కొలంబియా రాజధాని బొగోటా నగరంలో జరిగిన 14 లాటిన్ అమెరికా దేశాల 'లీమా' సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు పెన్స్ మాట్లాడుతూ మిగిలి ఉన్న సోషలిజాన్ని మట్టి కరిపిస్తానంటూ బీరాలు పలికారు. అదే సమావేశంలో పెన్స్ అమెరికా ట్రక్కులు వెనుదిరిగే ప్రసక్తే లేదన్నారు. అన్ని అవకాశాలు మాముందున్నాయన్నాడు. 'సోషలిజం చనిపోతుంది, స్వేచ్ఛా, సౌభ్రాతృత్వం విరాజిల్లుతుంది, ప్రజాస్వామ్యం పునర్జన్మ ఎత్తబోతున్నది' అంటూ వెనిజులాపై ఇంకా ఆంక్షలు విధిస్తామని ప్రగల్భాలు పలికాడు. విదేశాల్లో ఉన్న వెనిజులా ఆస్తుల్ని దిగ్బంధించడమే కాక, ఆ ఆస్తులన్నీ అధ్యక్షునిగా ప్రకటించుకొన్న ప్రతిపక్ష నాయకుడైన గువాయిడోకు మార్చాలంటూ అమెరికాకు ఎప్పుడూ తలూపే బ్రెజిల్ అధ్యక్షుడైన నియంత జైర్ బొల్సోనారోతో బాటుగా 'లీమా' దేశాల ప్రభుత్వాధినేతలను ట్రంప్ ఆదేశించాడు.

17 సంవత్సరాల ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలోనూ, 14 సంవత్సరాల వియత్నాం యుద్ధంలోనూ అమెరికా ఏమీ సాధించలేకపోయింది. ఈ తరహాగానే వెనిజులాలో పరిస్థితులు ఎదురుకావచ్చని అమెరికాకు భయమేస్తుంది. వెనిజులాకు మూడున్నర లక్షల సైన్యం ఉంది. దీనికి అదనంగా 2 లక్షల రిజర్వు ఆర్మీ ఉంది. గనుక లిబియా, ఇరాక్‌ల వలే కేక్‌వాక్ కాదు. యుద్ధమే జరిగితే తీవ్ర నష్టాల్ని అమెరికా చవిచూడవలసి వస్తుంది. అధునాతనమైన రష్యా మిలిటరీ పరికరాలతో పాటుగా ఎస్-300 వంటి క్షిపణుల రక్షక వ్యవస్థ కూడా వెనిజులా కలిగి ఉంది. అమెరికా ఎఫ్-16 ఫైటర్స్, రష్యా ఎస్‌యు-30 ఎమ్‌కె2 యుద్ధ విమానాలు కూడా వెనిజులా ఆర్మీకి ఉన్నాయి. యుద్ధం జరిగితే శరణార్థుల సమస్యలు ఎదురవుతాయి.

ఏది ఏమైనప్పటికీ వెనిజులా పరిస్థితులు గమనిస్తే అమెరికాకు కేక్‌వాక్ కాకపోవచ్చును. మిలిటరీ ప్రతిఘటన, మదురో అనుచరులతో అంతర్యుద్ధానికి దారితీసే పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రష్యా, చైనాలు వారి వారి అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దృష్టిలో ఉంచుకొని ఎంతవరకు సామ్రాజ్యవాద అమెరికాను ఎదిరించి వెనిజులాకు సంఘీభావంగా ఉంటాయనేది ప్రశ్నార్థకమే.

లాటిన్ అమెరికాలో అధికారంలోకి వచ్చిన వామపక్ష శక్తులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల పునాదుల మీద సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిపి చిరకాలం ప్రజాభిమానం పొందలేరని, అది దీర్ఘకాలం నిలవదని, దోపిడీ సంబంధాలను తెంచివేసి ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను అమలు జరిపినప్పుడే ప్రజా మద్దతు స్థిరంగా ఉంటుందని స్పష్టమైంది. ఈ నేపథ్యంలోనే లాటిన్ అమెరికాలోని అర్జెంటీనా, బ్రెజిల్, వెనిజులా దేశాలలో వామపక్ష ప్రభుత్వాల మీద తలెత్తిన అసంతృప్తితో ప్రజలు మితవాద, ఫాసిస్టు శక్తులను ఆశ్రయిస్తున్నారు. బ్రెజిల్, అర్జెంటీనాలో అదే జరిగింది. వెనిజులాలో కూడా మదురో విధానాలు మార్చుకోకుంటే ప్రతిపక్షం బలపడే అవకాశం ఉంది. మరోవైపు అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాలు ప్రజానుకూల ప్రభుత్వాలు ఎప్పుడు కూలిపోతాయా అని కాచుకు కూచున్నాయి.

లాటిన్ అమెరికా దేశాలను అస్థిరత్వం పాలు చేసి అక్కడి ప్రజలు బతకలేక వలసపోయే దుస్థితిని అనేక రూపాల్లో అమెరికా సృష్టిస్తున్నది. వెనిజులా అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకొని అక్కడి ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రలు పన్నుతున్నది. వెనిజులా వ్యవహారంలో విదేశీ జోక్యం ఎంతమాత్రం వాంఛనీయం కాదు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడి పార్టీలు, ప్రజలు పరిష్కరించుకోవాలి. అమెరికా దురహంకారానికి ఇప్పటికే పలు దేశాలు బలయ్యాయి. వెనిజులాలో నెత్తురు పారకుండా, అరాచకం తాండవించకుండా, అస్థిరత దాన్ని చుట్టు ముట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రపంచ పౌరులందరిదీ. అంతర్జాతీయ సమాజం చొరవ చూపి చట్టబద్ధమైన పాలనలు సాగే విధంగా, ఏ దేశంలోనూ బయటి శక్తులు జోక్యం చేసుకోకుండా కట్టడి చేసేందుకు అవసరమైన చేయూత అందించడం అంతర్జాతీయ సమాజం బాధ్యత.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

హిరోషిమా, నాగసాకీలు మరోసారి వద్దు

***యుద్ధం మానవాళి విధ్వంసానికే దారితీస్తుందనీ, సామ్రాజ్యవాదుల వ్యాపార ప్రయోజనాలకే తప్ప యుద్ధం ఏ సమస్యకూ పరిష్కారం కాదనీ అంటున్నారు* కేశవ్**

ఫిబ్రవరి 14న భారత కేంద్ర పోలీసు దళాల మీద జైష్ మహమ్మద్ గ్రూప్‌కి చెందిన ఓ కుర్రాడు దాడికి పూనుకోవడం, దాదాపు నలభై మంది మరణానికి కారణం కావడం యావత్ భారత దేశాన్ని శోకంలో ముంచేసింది. ఎన్నడూ లేనంత తీవ్రతలో ప్రజలూ, యువతరం కొవ్వొత్తులతో ముందుకొచ్చారు. నివాళులర్పించారు. ప్రజల్లోని, యువకులలోని అనూహ్యమైన ఈ స్పందన దేశంలోని సైనికులకు కొండంత మనోబలాన్ని ఇచ్చింది. తమతో పాటు తమ కోసం ఉన్న అసంఖ్యాక ప్రజల ఆశీస్సులు తీవ్రంగానూ, మానసికంగానూ అఘాతం పొందిన వీరికి మానసికంగా ఊరటనిచ్చింది. మనిషి జీవిత చరిత్రలో ఈ రకమైన ఎమోషన్లు సహజమే. అన్యాయాన్ని సహించని గుణం భారతీయుడి నరాల్లో ఉంది, దాదాపు రెండు వందల సంవత్సరాలు బ్రిటిష్ సామ్రాజ్యవాదితో పోరాడడం అంటే సాదారణ విషయం కాదు. అలాంటిది తమ కళ్ల ముందే నలభై మంది సైనికులు 'వీరమరణం' చెందడం ఒక చిన్న కుర్రాడి చేతిలో అలా బలవ్వడం భారత యువతరం తట్టుకోలేక పోయింది. ఆదీనూ టెలివిజన్ ఛానళ్లు మాటిమాటికీ ఆ సంఘటన దృశ్యాలు చూపించడం, రెచ్చగొట్టేలా దేశభక్తిని ప్రభోదించడం యువతరం మరింత తట్టుకోలేని పరిస్థితికి దారితీసింది. పద్దెనిమిది సంవత్సరాలు నిండని టీనేజి కుర్రాళ్లు రోడ్ల మీదకు వచ్చి పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ ఉంటే, రేపే యుద్ధం వచ్చేస్తుందా అన్నంత భయం వేసింది. పుల్వామా తర్వాత పగ తీర్చుకుంటున్నామనీ, తలెత్తుకుని తిరగాలనీ, ఉగ్రవాదాన్ని అంతం చేస్తున్నామనీ, ఎలక్ట్రానిక్ మీడియాలో బాకా ఊది పాకిస్తాన్‌లోని బాలాకోట్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత వైమానిక దళాలు ఫిబ్రవరి 26న కాల్పులు జరిపాయి.

ఈ చర్యని కొన్ని వర్గాలు భారత దేశం ఘన విజయంగా కొనియాడాయి. కొన్ని వామపక్ష పార్టీలు కూడా శభాష్ అంటూ అక్కడక్కడా ర్యాలీలు తీసి బూర్జువా మీడియాతో చేతులు కలిపాయి. తమ సిద్ధాంతాలు గాలికి వదిలేశాయి. అలా యుద్ధ కాంక్షని కీర్తించని వారిని పాకిస్తాన్ ఏజెంట్లుగా అభివర్ణించారు. మరో హిరోషిమా చీకటి మేఘాలను ప్రపంచానికి బహూకరించే దిశగా ఇరు దేశాలు కొద్ది రోజులు నడిచాయి. అభినందన్ రాకతో యుద్ధ మేఘం సద్దు మణిగింది. యుద్ధాలతో విసిగిపోయిన మానవాళి మరలా మరో యుద్ధం అంధకార మబ్బుల్లోకి ప్రయాణమవుతుందా అని అనిపించింది.

2014కి ముందు మూడు సంవత్సరాల్లో 249 మంది ఉగ్రవాదులు చనిపోయారు. 2015-2018 మధ్య 475 మంది ఉగ్రవాదులు చనిపోయారు. 2014- 2018 మధ్య 1700 కంటే ఎక్కువ ఉగ్రవాద దాడులు జరిగాయి. యురీ దాడి అయినా, పుల్వామా దాడి అయినా, పార్లమెంటు మీద దాడి అయినా, ముంబై మీద దాడి అయినా మనం ఖండించాల్సిందే.

ఇక పుల్వామా దాడిని విశ్లేషించి చూస్తే, కొందరేమో ఇది ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్ అన్నారు. కొందరేమో ఇది ఎన్నికల ముందు పన్నాగం అన్నారు. కొందరేమో ఇది పాకిస్తాన్ చేసిన పన్నాగం అన్నారు. కొందరేమో ఇప్పుడే యుద్ధం ప్రకటించాలి అన్నారు. ఇండియాకి ధైర్యం లేదు. వారు అంతగా పెట్రేగిపోతుంటే, ఇండియా చూస్తూ ఊరుకుంటుంది. చేతకాదు, అని యుద్ధ భూముల్లోకి, సైన్యంలోకి తమ పిల్లల్ని ఏనాడూ పంపించాల నుకోని మధ్య తరగతి మేధావులు సెలవిచ్చారు. ఎవరికి తెలిసిన రీతిలో వారు స్టేట్‌మెంట్లు ఇచ్చేశారు.

మరో హిరోషిమా వద్దు

యుద్ధం మనం దుకాణంలో చాయ్ కొన్నంత సాధారణ విషయం కాదు. మనం కోరుకుంటే ఆరంభించడానికి, వద్దంటే ఆపెయ్యడానికి. పైగా సామ్రాజ్యవాదులకు నిజంగానే యుద్ధం కావాలంటే, ఇరు దేశాలు యుద్ధం చేస్తేనే వారికి ఆర్థిక ప్రయోజనాలు ఒనగూరుతాయంటే, మనం యుద్ధం వద్దు అన్నా, రోడ్ల మీదకు వచ్చి యుద్ధం వద్దు అని అరిచినా, నినాదాలు చేసినా వారు మానవాళి మీద బాంబుల వర్షం కురిపించక మానరు. పాత ఆయుధాలు చెల్లగొట్టి, కొత్త ఆయుధాల నిర్మాణానికీ, అమ్మకాలకీ వేల కోట్ల లాభాల వ్యాపారానికీ శ్రీకారం చుట్టక మానరు. ఆయుధాల పరిశ్రమకి ఊపిరి ఇవ్వక మానరు. ఒకవేళ, మనం యుద్ధం కావాలన్నా యుద్ధం ఆరంభం అవ్వడం ద్వారా, కొనసాగడం ద్వారా ఇరు దేశాల్లో తమ వ్యాపార ప్రయోజనాలు దెబ్బ తింటే, ఈ యుద్ధం జరగని పరిస్థితులనే ఏర్పరుస్తారు.

చమురు దేశాల్లో ఈ రోజు జరుగుతుంది ఇదే. చమురు మీద ఆధిపత్యం కోసం, వ్యాపారం కోసం శాంతియుతంగా ఉన్న దేశాల్లో రాజకీయ అస్థిరతను ఏర్పరచి దేశాన్ని అస్తవ్యస్తంగా మార్చేసి తమ పబ్బం గడుపుకునే పరిస్థితుల్ని మనం చూశాం. చూస్తున్నాం. ఇరాక్ లో చూశాం. లాటిన్ అమెరికన్ దేశాల్లో చూశాం. సిరియాలో చూశాం. ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో చూశాం. ఈ రోజు వెనెజులాలో గత కొన్ని రోజులుగా మధురోని కూలద్రోసే అంతర్జాతీయ కుట్రలో చూస్తున్నాం. సోషలిస్టు ప్రభుత్వాన్ని కూలదోసి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరచే కుంటి సాకులో చూస్తున్నాం. వీరంతా యుద్ధం కోరుకోలేదు. రోడ్ల మీదకు వచ్చి ఈ ప్రజలు యుద్ధం వద్దంటున్నారు. మన యువత పుల్వామా నేపథ్యంలో ఈ మధ్య రోడ్ల మీదకు వచ్చి యుద్ధం కావాలని కోరుకుంటే, వెనెజులా యువత, ప్రజలు యుద్ధం వద్దని అంటున్నారు. తమ దేశ అంతర్గత వ్యవహారాల్లో సామ్రాజ్యవాద దేశాలు జోక్యం చేసుకోవద్దని అంటున్నారు. సాధారణ ప్రజలు ఎలా అభిప్రాయపడినా సామ్రాజ్యవాదులకూ, ఆయుధాల వ్యాపారులకూ, అమ్మకమయిపోయిన మీడియాకూ వీటితో పని ఉండదు. ఒక పన్నాగం ప్రకారం వీరికి అనుగుణంగా అబద్ధాలు

ప్రచారం కావలసిందే. అంతిమంగా తాము అనుకున్నది నెరవేరాల్సిందే. ఉగ్రవాదం ఏదో కొంతమంది కుర్రాళ్లు చేసే చర్యకాదు. నేడు ఉగ్రవాదం జాతీయం కాదు. అంతర్జాతీయం. ధనిక దేశాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వీటిని పెంచి, పోషించి బతికిస్తాయి. తమకు ప్రయోజనం అందిస్తున్నంత కాలం వీటికి పోషించి ఉంచుతాయి. ఆ తర్వాత వీటిని అంతం చేసేసి, డ్రోన్‌లతో ఎగరేసి మరో టెర్రరిస్టు ముఠాకి ప్రాణం పోస్తాయి.

మీడియా పాత్ర ఎలా ఉంది?

పుల్వామా, బాలాకోట్‌ల నేపథ్యంలో టెలివిజన్ యాంకర్లు వ్యక్తపరచిన ఎమోషన్, వాడిన పదాలు, వాక్య నిర్మాణాలు మొత్తం జర్నలిజం వృత్తినే సవాల్ చేస్తున్నాయి. ఇది యాంకర్ వ్యక్తిగత నైపుణ్యమా లేదా ఒక ప్రత్యేక ప్రాపగండా ప్రకారం పని జరుగుతుందా అనేది స్పష్టం కావడం లేదు. ఇది యధృచ్ఛికమా, కల్పితమా, పన్నాగామా ? టెలివిజన్ చరిత్రలో బహుశా యాంకర్లు ఇంత దిగజారి భాషను ఉపయోగించడం, చాలా దిగజారుడు భాషను ఉపయోగించడం, చూపించే వార్తల కంటే, మసాలాతో, రంగరించి ఎమోషన్‌ని మిక్స్ చేసి, ఉద్రేకపరచి ఒక ప్రత్యేక టార్గెట్‌ని ముందుగా నిర్ణయించుకొని పని చేస్తున్నాయా అని సందేహం వస్తుంది. అమెరికా లాంటి అతిపెద్ద పెట్టుబడిదారీ దేశాల్లో కూడా మీడియా ఇంతగా దిగజారలేదేమో. ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు వెన్నుపట్టు అయిన మీడియా వాస్తవాలను అందించాలి, విశ్లేషించాలి. సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలి. రెచ్చగొట్టే ధోరణులకు దూరమైన నాణ్యత గల వార్తలను అందించాలి. తప్పులుంటే వ్యవస్థలను నడిపే వాళ్లను ప్రశ్నించాలి. ఒక వాచ్ డాగ్‌లా ప్రజలు హాయిగా నమ్మగలిగేలా వ్యవహరించాలి. ప్రజాస్వామ్యం నాలుగో మూలస్తంభంలా వ్యవహరించాలి. కానీ, ఇప్పుడలా జరిగిందా అనే ప్రశ్న వస్తుంది. రెండు దేశాల సైనిక అధికారులూ, మంత్రులూ యుద్ధాల గురించి ఆలోచించే లోగానే ఈ మీడియాయే యుద్ధం కొని తెచ్చేసినట్టుంది. ఒక తండ్రిలా, ఒక ఫిలాసఫర్‌లా, ఒక మార్గదర్శిలా దారి చూపించాల్సిన మీడియా అత్యంత చవకబారు భాషతో రెచ్చిపోయే వైనం రాబోయే ప్రమాదాలకు సంకేతం.

యుద్ధం సరయిన పరిష్కారమా?

పుల్వామా, బాలాకోట్‌ల సంఘటనకు స్పందించి మనం యుద్ధం కావాలన్నా, యుద్ధం సరైన పరిష్కారం కాదు. యుద్ధం ఎట్టి పరిస్థితుల్లోను మానవాళికి సరైన న్యాయంచేసే చర్య కాదు. పైగా ఆధునిక యుద్ధం ఎవరో సైనికులు చేసే యుద్ధం కాదు. సాధారణ ప్రజలు, పిల్లలు ఎలా విలపించారో సిరియాలో ఈ మధ్యనే చూశాం. యుద్ధం కావాలని రోడ్ల మీదకు వచ్చిన యువత ఇళ్ల మీదుగానే బాంబులు వెళతాయి. తల్లో, పిల్లలో, చెల్లెలో, మొత్తం కుటుంబమో, సమూహమో, మొత్తం నగరమో. రెండు మూడు, నగరాలో హిరోషిమాలవుతాయి. యుద్ధం చేదు అనుభవాలను మానవాళి చూసింది. పుల్వామా సమస్యకు పరిష్కారం జటిలమైంది. అది యుద్ధంలో లేదు. కశ్మీర్ సమస్య పరిష్కారంలో ఉంది.

పాకిస్తాన్ కొనసాగిస్తున్న ముసుగు యుద్ధం కొత్త కాదు. చాలా పాత వ్యవహారం. ఉగ్రవాదం నేడు ఎన్నో దేశాలు ఎదుర్కొంటున్న సమస్య. ఉగ్రవాదానికి పరిష్కారంగా భారత దేశానికి యుద్ధమొక్కటే మార్గమని ఘోషిస్తున్న మీడియాకి యుద్ధం పర్యవసానం తెలీదు. పైగా, అంతర్జాతీయ పరిస్థితుల్ని బేరీజు వేసుకున్నా సరే అవి భారత దేశానికి అనుకూలంగా లేవు. అఫ్ఘనిస్తాన్‌లో సైనికుల్ని ఉపసంహరించుకున్న ట్రాంప్‌కి నేడు తాలిబాన్‌లతో మంతనాలకు, శాంతి ఒప్పందాలకు మధ్యవర్తిగా పాకిస్తాన్ కావాలి. అటు చైనాకు కూడా పాకిస్తాన్‌తో భారీ వ్యాపార ప్రయోజనాలు ఉన్నాయి. కాబట్టి, చైనా కూడా పాక్ వైపే మొగ్గు చూపుతుంది. రష్యా కూడా పాక్ వైపే మొగ్గు చూపుతుంది. కాబట్టి యుద్ధం వ్యూహం ప్రకారం కూడా భారత దేశానికి అనుకూలంగా ఉండదు. ఇప్పటికే కోట్ల కొలది నిరుద్యోగులతో సతమతమైపోతున్న దేశం యుద్ధం తర్వాత ఆర్థికంగా భారీగా నష్టపోతుంది.

కాబట్టి, పుల్వామా సంఘటన ఏదో ఒక వ్యక్తి చేసిన సంఘటనగానో, ఒక ప్రత్యేక సమూహం చేసిన సంఘటనగానో చూడకూడదు. ఒక ప్రత్యేక చారిత్రక నేపథ్యంలో దీన్ని చూడాల్సిన అవసరం ఉంది. పుల్వామాకు సమాధానం కూడా యుద్ధం కాదు. యుద్ధం రక్తాన్ని సాధారణ ప్రజలకు అంటించి మానవ జీవితాన్ని మరో హిరోషిమాగా మార్చడం కాదు మన కర్తవ్యం. మన స్పందన కశ్మీరీలపై అత్యాచారంతో కాదు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను అర్థం చేసు కోవడం. యుద్ధం కారు మేఘాలను ఎల్లప్పుడూ సజీవంగా ఉంచి ఆయుధాలను అమ్ముకునే సామ్రాజ్యవాద దేశాల ఎత్తుగడలను అర్థం చేసుకోవడం, ఉగ్రవాదం జాతీయ, అంతర్జాతీయ అస్తిత్వాన్ని, ఉగ్రవాదం పెంచి పోషిస్తున్న ముసుగు రాజకీయాల్ని అర్థం చేసుకోవడం యువత కర్తవ్యం నేడు.

వీటి నేపథ్యంలో కశ్మీర్ చారిత్రక పరిస్థితినీ, పరిణామాల్నీ, ఉగ్రవాద చర్యల్నీ అర్థం చేసుకోవడం, శాంతిగా సోషలిస్టు ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్న వెనిజులాపై చమురు ప్రయోజనలకోసం మారణ హోమాన్ని సృష్టించబోయే అమెరికా పుల్వామా పై సానుభూతిని వ్యక్తం చేసే ద్వంద్వ రాజకీయాల్ని శాస్త్రీయ దృక్కోణంలో అర్థం చేసుకోవడంలోనే పుల్వామాలాంటి సంఘటనలు మనకు మరింత స్పష్టమవుతాయి. ఒకవేళ ఈ అజెండా ఎన్నికల కోసమే అనుకున్నా మనిషికి ప్రత్యక్షంగా ప్రభావం కలిగిస్తున్న ఆకలి, విద్య, వైద్యం, నిరుద్యోగం, సామాజిక న్యాయం మొదలైన ప్రధాన అంశాలను పక్కన పెట్టి ప్రధానం కాని అంశాలను ముందుకు తేవడంలో దేశానికి ఏ రకమైన ప్రయోజనం ఉంది?

2014 ఎన్నికల ముందు అభివృద్ధి, అందరికీ ఉద్యోగం అని నినాదాలు చేసిన పార్టీలు నేడు ఆ నినాదాల నుండి తప్పుకుని ఉగ్రవాదం వైపుగా, దేశభక్తి వైపుగా మళ్లాయి. ఉగ్రవాదం అంతం కావడానికి నోట్ల రద్దు ప్రక్రియ ఒకానొక ముఖ్య పరిష్కారం అని మనం విన్నాం. నమ్మాం. నోట్ల రద్దు ఫలితంగా తమ దగ్గర ఉన్న నకిలీ నోట్లతో ఉగ్రవాదులు ఆర్థికంగా బలహీనం అయిపోతారని మనల్ని నమ్మించారు. ఆర్థికంగా బలహీనం అయిన ఉగ్రవాదులతో ఉగ్రవాదం అంతమయిపోతుందని నమ్మాం. కానీ, ఉగ్రవాదం అంతం కాలేదు సరి కదా మరింత విశ్వరూపం దాల్చింది. దేశంలోని యువతరం రోడ్లమీదకొచ్చి యుద్ధం కావాలి అనే స్థాయివరకు మళ్లింది. భయంకరమైన పరిణామం ఇది. ప్రపంచీకరణ, ఆయుధాల అమ్మకాలపై, లాభాలపై ఆధారపడ్డ సామ్రాజ్యవాదం ఉగ్రవాదాన్నీ, యుద్ధాలనీ ఏనాడూ ఆపదు. యుద్ధం ప్రజలకు ప్రయోజనం అని పెయిడ్ మీడియా ద్వారా నమ్మిస్తున్నది అబద్ధం. యుద్ధం పాలించే వర్గాలకు లాభం. సామ్రాజ్యవాదులకు లాభం. రెండు దేశాల శ్రామిక వర్గానికి యుద్ధం ద్వారా ఒనగూడేదేమీ లేదు. మరింత దారిద్ర్యం, మరింత శోకం తప్ప! రెండు దేశాల శ్రామిక వర్గాలకు నేడు కావలసింది యుద్ధం కాదు. ఆకలికి, పరిష్కారం. నిరుద్యోగం లేని ప్రపంచం. ఆరోగ్యం, సామాజిక న్యాయం అందించే ప్రభుత్వాలు. అంతేగాని, హిరోషిమా, నాగాసాకీల అనంత శోకం కాదు.

(రచయిత ఉపాధ్యాయులు,
'జాగృతి సమీక్ష' త్రైమాసిక పత్రిక సంపాదకులు) వీ

డేవిడ్ హార్వే: పెట్టుబడి - ప్రాథమిక వైరుధ్యాలు

పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణలోని ఏడు ప్రాథమిక వైరుధ్యాలను వివరిస్తున్నారు **రమేష్ పట్నాయిక్**

వైరుధ్యం 2 (భాగం 1)

'శ్రమ సామాజిక విలువ, డబ్బుచే దాని వ్యక్తీకరణల మధ్య వైరుధ్యం'. '17 వైరుధ్యాలు–పెట్టుబడి వ్యవస్థ అంతం' అనే డేవిడ్ హార్వే రచనలో మొదటి 7 ప్రధాన వైరుధ్యాలను ఈ ధారావాహికలో వరుసగా చర్చిస్తున్న విషయం తెలిసిందే. గత సంచికలో వైరుధ్యం 1, 'ఉపయోగపు విలువ, మారకపు విలువుల మధ్య వైరుధ్యం' అనే విషయాన్ని చర్చించాం. ఈ సంచికలో, తరువాత సంచికలో వైరుధ్యం 2, 'శ్రమ సామాజిక విలువ, డబ్బుచే దాని వ్యక్తీకరణల మధ్య వైరుధ్యం' పై చర్చిద్దాం.

పరిశ్రమలు పుట్టకముందు, డబ్బు చలామణి ప్రారంభం కాకముందు కూడా వస్తువులు ఉత్పత్తి, మారకం ఉండేవని మనకు తెలుసు. వ్యక్తులు లేదా కుటుంబాలు తమ వాడకం కొరకు తయారు చేసుకున్న వస్తువులు సామాజిక ప్రక్రియలోనికి రావు. వ్యక్తులు, కుటుంబాలు లేదా సంస్థలు తయారు చేసిన వస్తువులలో అమ్మకానికి పెట్టినవి మాత్రమే సామాజిక వినియోగంలోనికి వస్తాయి. ఆర్థిక శాస్త్ర పరిభాషలో ఇతరులకు అమ్మడం కొరకు తయారుచేసిన వస్తువుల కొరకు జరిగిన శ్రమను సామాజిక శ్రమ అంటారు. ఆ వస్తువులను సరుకులు అంటారు. ఈ వస్తువులకు ఉపయోగపు విలువ ఉంటుంది, అలాగే మారకపు విలువ కూడా ఉంటుంది. వస్తువుకున్న ఈ విలువ వస్తువులో చేరిన మానవ శ్రమయే అని కార్ల్ మార్క్స్ వివరిస్తాడు. ఈ విలువనే సామాజిక విలువ అనికూడా అంటారు. కొన్ని పదాలకు నిత్యజీవితంలో అర్థాలు వేరు కాగా, ఆర్థిక శాస్త్రాలలో అర్థాలు వేరు. పాఠకుడు ఈ వ్యత్యాసాలను జాగ్రత్తగా గమనించాలి. అర్థ శాస్త్రంలో పరిశ్రమల యజమానులను కాకుండా పనిచేసి వస్తువులను ఉత్పత్తిచేసిన వారినే ఉత్పత్తిదారులు అంటారు. అలాగే సామాజిక విలువ అంటే నైతిక విలువలు అనుకోకూడదు. వస్తువులో చేరిన సామాజికంగా అవసరమైన శ్రమనే సామాజిక విలువ అంటారు. కార్ల్‌మార్క్స్ 'సరుకు'కు ఇచ్చిన నిర్వచనాన్ని ఇలా వివరించవచ్చు: ఒక వస్తువును సరుకుగా పరిగణించాలంటే, ఒక వ్యక్తిచేత లేదా కుటంబంచేత లేదా సంస్థచేత తయారుచేయబడిన ఆ వస్తువు సమాజంలో ఇతరుల అవసరాన్ని తీర్చగలిగేదిగా ఉండాలి. అది మొదటి షరతు. దానిని అమ్మకానికి పెట్టాలన్నది మొదటి షరతులో భాగమే. ఇక రెండవ షరతు ఏమంటే, ఆ వ్యక్తి శ్రమ తప్పనిసరిగా సమాజంలో శ్రమ విభజనకు లోబడి ఉండాలి. అంటే ఆ వ్యక్తి ఉన్న సమాజంలో మొత్తం సరుకుల ఉత్పత్తిలో భాగంగానే, అంటే సమాజపు పని విభజనలో భాగంగానే ఒక వ్యక్తి లేదా సంస్థ శ్రమ ద్వారా వస్తువులను ఉత్పత్తిచేస్తేనే సరుకులను ఉత్పత్తిచేసినట్లు భావించబడుతుంది. మార్క్స్ చెప్పిన షరతులలో ఈ రెండవ షరతు పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలలో సరుకులకు కూడా వర్తిస్తుందని ఫ్రడరిక్ ఏంగెల్స్ భావించాడు. అయితే మరికొద్దిమంది మార్క్సిస్టులు మార్క్స్ ప్రతిపాదించిన రెండవ షరతు పెట్టుబడిదారీ వ్యవస్థకు మాత్రమే వర్తిస్తుందని వాదించారు.

పరస్పర అవసరాల కలయిక

ఆధునిక పరిశ్రమలు పుట్టకముందు ఆర్థిక వ్యవస్థలలో కొన్ని కుటుంబాలు వ్యవసాయం చేస్తే మిగిలిన కుటుంబాలు వివిధ వస్తువులను తయారుచేసేవి. అమ్మకం కొరకు తయారు చేసిన వస్తువులను వివిధ వ్యష్టి ఉత్పత్తిదారులు తమ మధ్య వస్తుమార్పిడి పద్ధతి (బార్టర్ విధానం) లో పంపిణీ చేసుకునేవారు. అయితే వస్తుమార్పిడి పద్ధతిలో చాలా ఇబ్బందులు ఉన్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని వివరించడానికి సాధారణంగా ఒక ఉదాహరణ చెప్తారు. కుండలు తయారుచేసే వ్యక్తికి ధాన్యం కావాలి. కాని ధాన్యం ఉత్పత్తి చేసే వ్యక్తికి కుండలు అవసరం లేదు, ఆ వ్యక్తికి బట్ట కావాలి. కాని బట్టలు నేసే వ్యక్తికి కుండలు కావాలి. అటువంటి పరిస్థితిలో కుండలు తయారుచేసే వ్యక్తి బట్టలు నేసే వ్యక్తికి కుండలు ఇచ్చి, బట్ట పుచ్చుకుని దానిని ధాన్యం ఉత్పత్తిచేసే వ్యక్తికి ఇచ్చి ధాన్యం తీసుకుంటాడు. ఇవన్నీ ఏకకాలంలో కుదిరితేనే కుమ్మరికి ధాన్యం, ఇతరులకు వారు కోరుకున్నవి లభ్యమవుతాయి. దీనినే 'పరస్పర అవసరాల కలయిక' అంటారు. ఒకసారి ఈ వస్తుమార్పిడి గొలుసు పొట్టిగా ఉండవచ్చు, మరొకసారి పొడువుగా ఉండవచ్చు. వేరొకసారి ఈ వ్యవహారం ఎక్కువ సమయం తీసుకోవచ్చు. పరిమాణాల సమస్య కూడా ఉంటుంది. అయితే నాటి గ్రామీణ స్వయం పోషక వ్యవస్థలో ఈ సమస్య మనం ఈనాడు ఊహించినంత క్లిష్టమైంది కాదు. ఉత్పత్తి విస్తరించిన తరువాత, వైవిధ్యం పెంపొందిన తరువాత సమస్య క్లిష్టతరమైంది. ఆ సమస్య పరిష్కారానికే డబ్బు పుట్టింది. డబ్బు చెలామణిలోనికి వచ్చిన తరువాత 'పరస్పర అవసరాల కలయిక' అనే సమస్య పరిష్కారం అయింది. ప్రతి ఉత్పత్తిదారుడు తన ఉత్పత్తులను డబ్బులకు అమ్మి వచ్చిన డబ్బుతో తనకు కావలసిన సరుకులను నేరుగా కొనుగోలుచేసే వీలు ఏర్పడింది. అయితే అదే సందర్భంలో 'శ్రమకు దాని వ్యక్తీకరణ అయిన డబ్బుకు మధ్య వైరుధ్యం' తలెత్తింది. డేవిడ్ హార్వే ఈ వైరుధ్యాన్నే రెండవ ప్రాథమిక వైరుధ్యంగా చర్చిస్తాడు. అయితే డేవిడ్ హార్వేచేసిన చర్చలోనికి వెళ్లే ముందు కొన్ని ప్రాథమిక విషయాలను పరిశీలిద్దాం.

వస్తు మార్పిడి ప్రాతిపదిక

ముందుగా వస్తుమార్పిడి కాలంలో ఒక ఉదాహరణ పరిశీలిద్దాం. మన ఉదాహరణలో సౌలభ్యం కొరకు బుట్టలు అల్లే వ్యక్తి కుండలు తయారుచేసే వ్యక్తి సరాసరి వస్తుమార్పిడి చేసుకున్నారనుకుందాం. అటువంటి సందర్భాలు తప్పకుండా ఉంటాయి కదా. వారు ఎన్ని బుట్టలకు ఎన్ని కుండలు మార్పిడి చేసుకుంటారు? వస్తు మార్పిడికి వారి మధ్య ఉండగల ప్రాతిపదిక ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు చూద్దాం. వారిద్దరు అంటే కుండలు తయారుచేసే వ్యక్తి, బుట్టలు అల్లే వ్యక్తి తమ తమ శ్రమలను పరస్పరం సమానమైనవిగా భావిస్తారు. అదే వారి మధ్య వస్తు మార్పిడికి ప్రాతిపదిక. 8 గంటల పనిదినంలో

తయారైన బుట్టలకు 8 గంటల పనిదినంలో తయారైన కుండలు మార్పిడి చేసుకుంటారు. (ఆ రోజులలో 8 గంటల పనిదినం నిబంధన లేదు. కాని, పగటిపూట వెలుతురులో మాత్రమే పనిచేసేవారు. ఫలితంగా శరీర సంబంధమైన గృహ సంబంధమైన పనులకు అవసరమైన సమయం పోను ఉత్పత్తి కార్యక్రమాలకు సుమారు దినంలో 8 గంటలు మాత్రమే మిగిలేది అని భావించవచ్చు.) వారిద్దరికీ అవసరమైన ముడిసరుకులు మట్టి, వెదురు ప్రకృతినుంచి నేరుగా పొంది ఉంటారు. వారి పనిముట్లు సరళమైనవి, వాటి అరుగుదల విలువలు సుమారు సమానం అనిభావిస్తారు. అందుకే 8 గంటల కాలంలో అల్లిన బుట్టలకు 8 గంటల కాలంలో తయారైన కుండలను మార్పిడిచేసుకున్నారు. వారికి మరొక మార్గం కూడా తోచదు. వారు 8 గంటల కాలంలో తయారైన ఐదు బుట్టలకు అదే కాలంలో తయారైన మూడు కుండలను మార్పిడి చేసుకున్నారు. ఆ వస్తువుల ఉత్పత్తిలో శ్రమ సమానం కనుక వాటి విలువ సమానం అని భావించారు.

నిర్దిష్ట శ్రమ, సాధారణ శ్రమ

మన ఉదాహరణలో సమాన శ్రమకాలాలలో తయారైన వస్తువులు సమాన విలువగలవని వారు భావించారు. అంటే సరుకులకు విలువ వాటిలో ఉన్న శ్రమ గంటల ఫలితంగా వస్తుంది. సరకులకు విలువ శ్రమ గంటల ద్వారా మాత్రమే వస్తుందని వారు అంగీకరించారు. బుట్టలు అల్లే శ్రమవేరు, కుండలు తయారుచేసే శ్రమ వేరు. వివిధ నిర్దిష్ట శ్రమల వలన వివిధ నిర్దిష్ట సరుకులు ఉత్పత్తి అవుతాయి. కాగా, శ్రమకు ఉండే సాధారణ రూపం వలన, ప్రతి సందర్భంలో కండరాలు, నరాలు పనిచేయడం వంటి సాధారణ లక్షణాల వలన వేరువేరు శ్రమలను, వాటి ఉత్పత్తుల విలువలను సరిపోల్చడం సాధ్యమవుతుంది. మార్క్స్ ప్రతిపాదించిన విలువ సిద్ధాంతం ఇదే. ప్రకృతిలో ఉన్న పదార్థాలపై ఉపయుక్తమైన మానవ శ్రమ జరిగి మార్కెట్‌లో అమ్మకం కొరకు ఒక వస్తువు తయారైనప్పుడు, ఆ వస్తువులో మారకపు విలువ ఏర్పడుతుంది. వస్తువు మారకపు విలువలో శ్రమ తప్ప ఇంకా ఏమీ ఉండదు. మనం పైన తీసుకున్న కుండ, బుట్ట ఉదాహరణలు సరళమైనవి. కొద్దిగా క్లిష్టమైన ఉదాహరణ ఒకటి తీసుకుందాం. బట్టల ఉత్పత్తిని తీసుకుంటే, పండించిన పత్తి విలువ కూడా బట్టకు చేరుతుంది. పత్తి పండించడంలో మానవ శ్రమ ఉంటుంది కావున పత్తికి విలువ ఉంటుంది. ప్రతిదినం యంత్రాల అరుగుదల విలువలు ఆనాటి ఉత్పత్తులకు చేరుతాయి. అయితే ఆ యంత్రాలకు ఎందుకు విలువ ఉంటుందంటే, వాటిని ఉత్పత్తి చేయడంలో మానవ శ్రమ ఉందికాబట్టి. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే తయారైన సరుకులో ముడి సరుకుల ఉత్పత్తి శ్రమ, యంత్రాల ఉత్పత్తి శ్రమ (అరుగుదల), వర్తమాన సరుకు తయారీ శ్రమ ఉంటాయి. వస్తువు మారకపు విలువ వస్తువులో చేరిన శ్రమల మొత్తానికి సమానం. ఈ విలువ సిద్ధాంతం మార్క్సిజానికి చాలా ప్రధానమైన విషయం. మారకపు విలువ లుప్తం కావడం గురించి మరొక సందర్భంలో ప్రస్తావిద్దాం.

బంగారం విలువ దానిలో శ్రమ ఫలితమే

వస్తుమార్పిడి కాలంలో శ్రమలు రూపరాహిత్యాన్ని పొందలేదు. ఎటువంటి ముసుగు తొడుక్కోలేదు. వేరువేరు శ్రమలు వేరువేరు రూపాలు పొందాయి. కుండలు తయారుచేసే శ్రమ కుండగా రూపొందింది. బుట్టలు అల్లే శ్రమ బుట్టగా రూపొందింది. సరుకును చూడగానే శ్రమకూడా గుర్తుకు వస్తుంది. తదనంతర కాలంలో పరిస్థితి మారిపోయింది. వస్తుమార్పిడి పద్ధతి పోయి డబ్బు మాధ్యమంలో అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయి. వస్తువుల మధ్యలోనికి డబ్బు వచ్చింది. ఫలితంగా వస్తువులలో శ్రమ కనిపించడం లేదు. ఈ విషయాన్ని పరిశీలిద్దాం. వస్తుమార్పిడి విధానం కొనసాగుతూ ఉండగానే బంగారు వెండి నాణాలు రూపంలో డబ్బు వచ్చింది. బంగారు, వెండి నాణాలలో కూడా సామాజిక శ్రమ ఉంటుంది. వెయ్యి కే.జిల బంగారు ఖనిజాన్ని శుద్ధిచేస్తే గాని 10 గ్రాముల బంగారం రాదు. అందుకై కార్మికులు పెద్ద సంఖ్యలో పనిచేయవలసి ఉంటుంది. ఒక వంద మంది కార్మికులు పనిచేస్తే ఒక 8 గంటల పనిదినం లో 10 గ్రాముల బంగారం ఉత్పత్తి అవుతుందనుకుంటే, ఆ క్రమంలో నాలుగువేల రూపాయిల విలువగల సహాయ సరకులు ఖర్చు అయ్యాయి అని, యంత్రాల తరుగుదల విలువ 1000 రూపాయిలు అని అనుకుంటే, 10 గ్రాముల బంగారం విలువ 30,000 రూపాయిలు అనుకుంటే వంద మంది కార్మికులు ఒక పనిదినంలో సృష్టించిన విలువ 30,000 – (4,000+1,000) = 25,000 రూపాయిలు అవుతుంది. అంటే ఒక్కొక్క కార్మికుడు ఒక పనిదినంలో 250 రూపాయిల విలువైన సామాజిక శ్రమ చేసినట్లు. అయితే వారికి అందులో సగం కూడా వేతనంగా చెల్లించరని, మిగిలినది లాభంగా భావించి గని యజమాని తీసుకుంటాడని, అందులో ప్రభుత్వానికి రాయల్టీ, వ్యాపారికి డిస్కౌంటు ఇస్తాడని మనకు తెలుసు. ఆ విషయం ఇక్కడ అప్రస్తుతం. ఇక్కడ మనకు ప్రధానమైన విషయం బంగారంలో కూడా శ్రమ ఉన్నదన్న గుర్తింపు, బంగారానికి ఎటువంటి స్వతఃసిద్ధమైన మహత్తు లేదని బంగారంలో కూడా శ్రమ మాత్రమే ఉన్నదన్న గుర్తింపు. దానిలో ఎక్కువ అవసర శ్రమ ఉన్నందుకే ఎక్కువ విలువ ఉన్నదన్న గుర్తింపు. ఇప్పుడు మనం మారకమాధ్యమంగా బంగారు, వెండి నాణాలను పరిశీలిద్దాం. రచన సరళత కొరకు వెండిని విడిచిపెట్టేద్దాం. బంగారు నాణాలనే పరిశీలిద్దాం. ప్రభుత్వంచే సీలువేయబడిన నాణాలు ప్రామాణీకరించబడిన భారాలు కలిగి ఉంటాయి. వాటిని ప్రతిసారీ తూనిక చేయవలసిన అవసరం ఉండదు. ప్రభుత్వమే సీలు వేయడం వలన వాటి ప్రామాణికతను అందరూ అంగీకరిస్తారు. (క్రీస్తు పూర్వం 7వ శతాబ్దంలో బంగారు నాణాలు మొదటిసారిగా ఆసియా మైనరులో కనిపించాయి.)

భూస్వామి – వ్యాపారి

భూస్వామ్య వ్యవస్థలో రైతులు, వృత్తిపనివారు భూస్వాముల వద్ద 'వెట్టి' చేసేవారు, లేదా తమ స్వంత ఉత్పత్తులనుండి కౌలు కొలిసేవారు. ఫలితంగా భూస్వాముల వద్ద వెట్టి శ్రమద్వారా ఉత్పత్తి చేయబడిన వస్తువులుగాని లేదా కౌలుగా పొందిన వస్తువులుగాని పెద్ద మొత్తంలో ఉండేవి. తాము వాడుకోగా, రాజుగారికి పన్నులు చెల్లించగా మిగిలిన వస్తువులను భూస్వాములు వ్యాపారులకు అమ్మేవారు. అంటే మిగిలినవి సరుకులుగా మారేవి. మన ఉదాహరణలో ఒక భూస్వామివద్ద మిగిలిన సరుకులు 40 వేల గంటల శ్రమతో తయారైనవి అనుకుందాం. సదరు భూస్వామి తనవద్దనున్న వివిధ రకాల శ్రమలు మూర్తీభవించిన వివిధ ఉత్పత్తులను వ్యాపారికి అమ్ముతాడు. వ్యాపారి భూస్వామికి 40 వేల గంటలలో తయారైన బంగారాన్ని ఇచ్చాడు. వ్యాపారికి లాభం ఉండదా అంటే ఉంటుంది. వ్యాపారికి బంగారు గని యజమాని రిబేటు ఇచ్చి ఉంటాడు కదా. ఇక్కడ విషయాన్ని పరిశీలిస్తే భూస్వామి వద్ద ఉన్న వివిధ వస్తువులుగా రూపుదిద్దుకున్న 40 వేల పనిగంటల సామాజిక శ్రమ వ్యాపారి వద్ద ఉన్న బంగారు నాణాలుగా స్వరూపం సంతరించుకున్న 40 వేల పనిగంటల సామాజిక శ్రమతో మార్పిడి జరిగింది. ఇక్కడ కూడా సమాన విలువలే మార్పిడి జరిగాయి.

భూస్వామి వ్యవసాయ ఉత్పత్తులు ఇచ్చినా, తోలు, కలప లేదా మట్టి ఉత్పత్తులు ఇచ్చినా, దంతం ఉత్పత్తులు ఇచ్చినా అంటే వివిధ శ్రమలతో తయారైన వివిధ వస్తువులు ఇచ్చినా వ్యాపారి మాత్రం వాటికి బదులుగా ఇచ్చింది సుమారు ఒకే రకం శ్రమతో తయారైన బంగారం. ఈ విధంగా సార్వత్రిక విలువ వ్యక్తీకరణగా బంగారం ముందుకు వచ్చింది.

సార్వత్రిక మారకపు విలువ

వస్తు మార్పిడి పద్ధతిలో వివిధ రూపాలలో ఉన్న విలువల మధ్య మారకం జరుగుతుంది. బంగారం డబ్బుగా ఉపయోగ పడినప్పుడు, ఒక వైపు వివిధ వస్తు రూపాలలో ఉన్న విలువలుగా రెండవ వైపు బంగారం రూపంలో ఉన్న విలువలు మాత్రమే ఉంటాయి. ప్రతి సరుకు విలువను బంగారం నాణెంలో చెప్పవచ్చు. బంగారం సార్వత్రిక మారకపు విలువగా ముందుకు రావడంతో ఆర్థిక లావాదేవీలు స్థానిక పరిమితులనే కాక రాజ్యం ఎల్లలను కూడా అధిగమించాయి. ఒక మారకపు విలువగా బంగారం గురించి వివరంగా చెప్పుకోవాలంటే ఎ) బంగారం శ్రమతో ఉత్పత్తి అవుతుంది. నిర్దిష్ట భారంగల బంగారం ఇతర సరుకుల వలెనే ఒకానొక పరిమాణం గల సామాజిక శ్రమకు వ్యక్తీకరణ, ఒక మారకపు విలువ. బి) ఇది అన్ని సరుకులతో తనను తాను మార్పిడి చేసుకోగలదు. కావున ఒక సార్వత్రికమైన మారకపు విలువగా పనిచేయగలుగుతుంది. సి) అన్ని రాజ్యాలు ఆమోదించిన అంటే ఎల్లలు లేని మారకపు విలువ. వస్తు మార్పిడి జరిగిన పద్ధతిలో సామాజిక శ్రమల మధ్య మార్పిడి జరగడం మనం చూసాం. బుట్టలు అల్లేవాడు, కుండలు తయారు చేసేవాడు సమాన శ్రమలు ఉన్న ఉత్పత్తుల మధ్య మారకం చేసుకున్నారు. ఒక సరుకు బంగారంతో మారకం జరిగినప్పుడు కూడా ఆవిధంగానే సమాన శ్రమల మధ్య మారకం జరుగుతుంది. ఈ సందర్భంలో కూడా వేరువేరు రూపాలు కలిగిన శ్రమల మధ్య మారకం జరుగుతుంది. అందులో ప్రత్యేకత ఏమీ లేదు. బంగారం ఒక సార్వత్రిక మారకపు సరుకుగా ముందుకు రావడమే ప్రత్యేకత. బంగారం లేకముందు అటువంటి సార్వత్రిక మారకపు సరుకు సుమారు లేదు.

ఉపయోగపు విలువ లేని మారకపు విలువ

గోవులను లేదా ధాన్యాన్ని సార్వత్రిక మారకపు సరుకుగా వాడిన కాలాలు ఉన్నాయి. అయితే అప్పుడు అనేక సమస్యలు ఉండేవి. అన్ని గోవులు సమానం కావు. ఆపైన గోవులు చనిపోవచ్చు. అలాగే ధాన్యం చెడిపోవచ్చు. బంగారు నాణాలు చెడిపోవు, కనీసం తుప్పు పట్టవు. ఈ కారణాల వలన బంగారు నాణాలు ఇతర అన్ని సార్వత్రిక మారకపు సరుకుల కంటే అనువైనవి. రైతులు, వృత్తిదారుల మధ్య కాకపోయినా మొదట్లో భూస్వాముల – వ్యాపారుల, వ్యాపారుల – వ్యాపారుల మధ్య బంగారం ఒక సార్వత్రిక మారకపు విలువ అయ్యింది. అనాడు, ప్రభుత్వాలు పాక్షికంగానైనా భూస్వాముల నుండి, వ్యాపారులనుండి పన్నులు బంగారం నాణాల రూపంలోనే వసూలు చేసేవి. నాణాలు తయారీకి బంగారం, వెండి వంటి లోహాలను, ప్రధానంగా బంగారాన్ని ఎందుకు ఎంచుకుంటారన్నది సులభంగా అర్థం అయ్యే విషయమే. సజీవ వస్తువుల కంటే నిర్జీవ వస్తువులు ఎత్తిపెట్టడానికి, ఒక స్థలం నుండి వేరొక స్థలానికి తీసుకుపోవడానికి సులభంగా ఉంటాయి. గుణ, పరిమాణాలను ప్రమాణికీకరించడం కూడా సులభంగా ఉంటుంది. నిర్జీవ వస్తువులలో తక్కువ బరువులో ఎక్కువ విలువ ఉండాలంటే బంగారం, వెండి వంటి లోహాలు మెరుగైన ఎంపిక. శుద్ధిచేయడానికి ఎక్కువ శ్రమ అవసరమైన, అంటే ఉత్పత్తికి ఎక్కువ శ్రమ అవసరమైన, ఆ కారణంగా ఎక్కువ విలువ కలిగిన, బంగారం, వెండి లోహాలు నాణాలు తయారీకి ఎంచుకోబడ్డాయి. ఆపైన ముక్కలైపోవడం, అంచులు వంగి పోవడం, తుప్పు పట్టడం వంటి సమస్యలు లేనికారణంగా ఈ లోహాలు నాణాలు తయారీకి ఉపయుక్తంగా ఉన్నాయి. ఆపైన బంగారం ధగధగ మెరుస్తూ స్వతహాగానే విలువైనదిగా కనిపిస్తుంది. అందుకే రాజులకు బంగారమంటే మోజు. వీటన్నింటికంటే ప్రధానమైన విషయం ఏమంటే బంగారాన్ని ఆభరణాలుగా వాడని ఆనాటి యూరోపులో బంగారానికి ఉపయోగపు విలువ లేదు, మారకపు విలువ మాత్రమే ఉంది. ఉపయోగపు విలువ లేకుండా మారకపు విలువ మాత్రమే ఉన్న బంగారం ఒక ఆదర్శవంతమైన మారకపు విలువగా పాదుకుంది. అయితే, అది ఒక పెద్ద సంక్షోభానికి పునాది వేసింది.

సరుకుల మాయ

బంగారం ఒక సార్వత్రిక మారకపు విలువగా ముందుకు రావడం గమనించాము. అయితే అదే క్రమంలో సామాజిక శ్రమ తన గుర్తింపును పాక్షికంగా కోల్పోయిన విషయాన్ని ఇక్కడ పరిశీలిద్దాం. భూస్వామి, వ్యాపారి మధ్య జరిగిన లావాదేవీలను మరొక్కసారి చూద్దాం. గ్రామ మార్కెట్‌లో 8 గంటల బుట్టల అల్లిక శ్రమ, 8 గంటల కుండలు తయారు చేసే శ్రమతో మారకం పొందింది. అది శ్రమల మధ్య ప్రత్యక్ష సంబంధంగా ఉండింది. అంతా తేటతెల్లంగా ఉండింది. అయితే భూస్వామి, వ్యాపారి మధ్య మారకంలో గ్రామీణ ఉత్పత్తులు బంగారంతో మారకం జరుగుతాయి. ఈ మారకం శ్రమల మధ్య మారకంగా స్పష్టంగా కనిపించదు. ఈ సందర్భంలో గ్రామంలో రైతులు, వృత్తికారులు తమ ఉత్పత్తులను గనిలో కార్మికులకిచ్చి వారు ఉత్పత్తిచేసిన బంగారాన్ని తీసుకోవడం లేదు. భూస్వామి, గని యజమాని, వ్యాపారి మధ్య మాత్రమే లావాదేవీలు జరుగుతున్నాయి. గ్రామాలలో రైతుల, వృత్తికారుల శ్రమగురించి గని కార్మికులకు తెలియదు. గని కార్మికుల శ్రమగురించి రైతులకు, వృత్తికారులకు కూడా తెలియదు. అంతేకాదు, గ్రామంలో రైతులు, వృత్తికారులు భూస్వామికి తమ ఉత్పత్తులను కౌలుగా చెల్లించి ఉన్నారు. వారు తమ ఉత్పత్తినుంచి పరాయీకరణ పొంది ఉన్నారు. ఆ ఉత్పత్తి ఎటు పోతుందో వారికి తెలియదు.

గనిలో కార్మికులు వేతనానికి పనిచేస్తున్నారు. వారికి ఇచ్చే వేతనాలు చాలా తక్కువ. వేతనాలు చాలా అన్యాయంగా ఉంటాయి. అయినా వారు ఉత్పత్తిని యజమానికి చెందినదిగా భావిస్తారు. వారు కూడా ఉత్పత్తి నుంచి పరాయీకరణ పొంది ఉంటారు. ఉత్పత్తులు ఉత్పత్తిదారుల నుండి అంటే శ్రమచేసేవారినుండి విడివడిపోవడంతో శ్రమనుండి విడివడినట్లు కనిపిస్తుంది. సరుకులు శ్రమతో సంబంధంలేనివిగా కనిపిస్తాయి. సరుకులకు వాటిలో చేరిన శ్రమతో ఎటువంటి సంబంధం లేనట్లు, వాటి మారకపు విలువ వాటి అగోచరమైన అంతర్గత విలువ అయినట్లు కనిపిస్తుంది. వస్తు మార్పిడి పద్ధతిలో బుట్ట, కుండ మధ్య మార్పిడి జరిగినప్పుడు రెండు శ్రమల మధ్య మార్పిడి జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. భూస్వామి వద్ద ఉన్న సరుకులు, వ్యాపారి వద్ద ఉన్న బంగారం మధ్యలో మారకం జరిగినప్పుడు అది శ్రమల మధ్య మార్పిడిగా కనిపించదు. శ్రమతో సంబంధంలేని అంతర్గత విలువలేవో ఉన్న సరుకుల మధ్య మార్పిడిగా కనిపిస్తుంది. దీనినే కార్ల్ మార్క్స్ సరకుల మాయ అన్నాడు. ఇక బంగారపు నాణాల స్థానంలో కాగితపు నోట్లు వచ్చినప్పుడు సరుకుల మాయ రెట్టింపు అవుతుంది. కాగితపు నోట్ల విషయం తరువాత పరిశీలిద్దాం.

(ఇంకా ఉంది)

(రచయిత విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

చైనా సోషల్ సామ్రాజ్యవాద దేశమే-2

- లంకా పాపిరెడ్డి

సోషల్ సామ్రాజ్యవాదం: మాటలలో సోషలిజం గురించి వల్లిస్తూ, ఆచరణలో అవకాశవాదం, సామ్రాజ్యవాద విధానాలు అవలంబిస్తే అది సోషల్ సామ్రాజ్యవాదమే అవుతుంది. దానికి అంతర్జాతీయ సహాయమనీ ఇతర దేశాల అభివృద్ధికి కృషి అని ఎన్ని నగిషీలు చెక్కినా అది సామ్రాజ్యవాదమే అవుతుంది. చైనాలో సోషలిస్టు విధానాలను, సంబంధాలను పూర్తిగా ధ్వంసం చేసిన తరువాత, పెట్టుబడిదారీ విధానం వేగంగా అభివృద్ధి చెందింది. సోవియట్ యూనియన్‌లో అయినా చైనాలో అయినా, ఆ దేశాలు విముక్తి చెందిన తరువాత మొదటి 36 ఏండ్లల్లో ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి, బలమైన సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలకు పునాదులు వేశారు. తరవాత ఈ పునాదుల బలాన్నే రివిజనిస్టులు వాడుకుని పెట్టుబడిదారీ విధానాన్ని వేగంగా అభివృద్ధి చేశారు. ఈ పునాదుల బలం వలనే ప్రపంచంలోని ఏ ఇతర దేశాల కంటే కూడా ఎక్కువ వేగంగా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందింది. యూరప్‌లో అతి వెనకపడిన ఒక దేశం, ఆసియాలో అతి వెనకపడిన మరో దేశం అగ్రరాజ్యాలుగా ఎదగడానికి కారణం కూడా ఈ పునాది బలమే. ఒకసారి పెట్టుబడిదారీ విధానం వేగంగా అభివృద్ధి చెందిన తరువాత అది ప్రపంచ మార్కెట్ కొరకు పోటీలోకి దిగక తప్పదు. ప్రపంచ మార్కెట్‌కు పెద్ద ఎత్తున సరుకులు ఎగుమతి చేసే స్థితికి చేరుకున్న తరువాత అటువంటి దేశానికి ముడి సరుకులు కూడా అంతే పెద్ద ఎత్తున కావల్సి ఉంటుంది. సరుకుల తయారికి ప్రపంచంలో ఉన్న ముడిసరుకులు కావాలి. తయారైన సరుకులు అమ్ముకోడానికి ప్రపంచ మార్కెట్ కావాలి. చైనా ప్రస్తుతం ఆ స్థితికే చేరుకున్నది. చైనా ముడిసరుకుల కొరకు ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నది. దీనినే చైనా సమర్థకులు, సహాయం అని చెప్పుతున్నారు. సహాయం అంటే ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా చేసేదాన్ని సహాయం అంటారు. కాని సామ్రాజ్యవాద దేశాల 'సహాయానికి' అసలు అర్థం వేరు. చైనా సహాయం కాదు, సహాయం పేరు మీద ఆ దేశాలతో ముడిసరుకుల చౌక వ్యాపారం చేస్తున్నది. సహజ వనరులతో నిండి ఉన్న ఆఫ్రికా ఖండం చైనాకు ముడిసరుకుల గనిగా మారిపోతున్నది. ప్రపంచంలో సరఫరా అయ్యే ప్లాటినమ్, కోబాల్ట్‌లో 90 శాతం ఆఫ్రికా నుండే జరుగుతుంది. 50 శాతం బంగారం, మాంగనీస్ ఇక్కడే ఉన్నాయి. 35 శాతం యురేనియం ఆఫ్రికాదే. ఇంకా ముఖ్యంగా సెల్ ఫోన్, కంప్యూటర్ లాంటి ఎలక్ట్రానిక్ డివైజ్‌లలో వాడే కోల్టాన్ 75 శాతం ఆఫ్రికాలోనే ఉన్నది. చైనా, ఆఫ్రికా గనులలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టింది. ఇక గ్రాంటులు, వడ్డీ లేని రుణాలు, తక్కువ వడ్డీ రుణాలు అని ఎన్ని తీర్లుగా ఇచ్చినా అవన్నీ అంతిమంగా చైనాకు ఉపయోగపడేవే. ఆ దేశాలలో ఏ ప్రాజెక్టులు చేపట్టినా వాటిని చైనా కంపెనీలకే కాంట్రాక్టు ఇవ్వాలి. వాటికి అవసరం అయ్యే సామాగ్రి అంతా చైనా నుండే దిగుమతి చేసుకోవాలి. మనుషులు కూడా చైనా నుండి వస్తారు. ఇదంతా 'సహాయానికి' చెందిన లాభం అన్నమాట. అందరు సామ్రాజ్యవాదులు ఇదే చేశారు, ఇదే చేస్తారు. చైనా కూడా అదే చేస్తున్నది. అయినా కొందరు దాన్ని సామ్రాజ్యవాద దోపిడీ కాదు, అది సహాయం అంటున్నారు. సహాయాలు మాత్రమే చేస్తే, చైనా సంపదలు అంత వేగంగా ఎలా పెరుగుతున్నాయి? చైనా ఫైనాన్సియల్ సంస్థలకు, కంపెనీలకు విదేశాల నుండి ఆదాయాలు ఎలా పెరుగుతున్నాయి?

ఆఫ్రికా దేశాలు వెనకబడిన వ్యవసాయక దేశాలు. నిజంగానే ఆ దేశాల అభివృద్ధి కొరకు సహాయం చేస్తే పెట్టుబడి పెట్టే రంగాలు వేరుగా ఉండాలి. చైనా పెట్టుబడి పెట్టిన రంగాలను చూస్తేనే తెలిసే విషయం ఏమిటంటే, చైనా ఆ దేశాల అభివృద్ధి కొరకు సహాయం చేయడం లేదు. ఆ దేశాల సహజ వనరుల కొరకే 'సహాయం' చేస్తున్నది. కాంట్రాక్టుల కొరకు సహాయం చేస్తున్నది. రోడ్లు, రైల్వేలు, పోర్టులు, హార్బర్లు, మైనింగ్, ఎనర్జీ లాంటివాటి పైన్నే ఎక్కువ పెట్టుబడి పెడుతున్నది. నిజంగా ఆ దేశాలు అభివృద్ధి చెందాలంటే, వ్యవసాయం, మౌలిక పరిశ్రమల అభివృద్ధి పైన ప్రధానంగా కేంద్రీకరించాలి. కాని చైనా, ఆ దేశాలను ముడి సరుకుల ఎగుమతి దేశాలుగాను, తయారైన చైనా సరుకులను దిగుమతి చేసుకునే దేశాలుగానే నిలిపి ఉంచుతున్నది. చైనా కేవలం ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దేశాలలోనే పెట్టుబడులు పెట్టలేదు, ఆసియా దేశాల లోనూ పెట్టుబడులు పెద్ద ఎత్తున పెడుతున్నది. అంతటా అవే విధానాలు.

రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా గ్రేట్ బ్రిటన్ బలహీనపడి, తన పాత వలసలలో పెట్టుబడులు పెట్టలేని పరిస్థితికి గురైంది. అమెరికా ఈ పరిస్థితిని ఉపయోగించుకుని, బ్రిటన్ పాత వలసలలో పెట్టుబడులు పెడుతూ అగ్రరాజ్యంగా రూపాంతరం చెందింది. సరిగ్గా చైనా కూడా అమెరికా, యూరోపియన్ యూనియన్లు ఆర్థికంగా బలహీనపడిన పరిస్థితులలో, చడీ చప్పుడు లేకుండా ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో పెట్టుబడులు ('సహాయం') విస్తరించుకుంటూ పోయింది. 'సహాయాలు' చేస్తూ సామ్రాజ్యవాద దేశంగా ఆవిర్భవించింది. సామ్రాజ్యవాద దేశంగా ఆవిర్భవించిన తరువాత, మిగతా సామ్రాజ్యవాద దేశాలతో పోటీ, ఘర్షణ అనివార్యం. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియాలపై పట్టు కోల్పోతూ ఉన్న పరిస్థితిలో అమెరికా, చైనాతో ఘర్షణకు దిగుతున్నది. నిజానికి ఈరోజు చైనా, అమెరికాల మధ్య జరుగుతున్న వ్యాపార యుద్ధానికి కారణం అమెరికా వైపు వ్యాపార లోటు ఎక్కువ ఉండడం మాత్రమే కాదు, ప్రపంచ మార్కెట్ పైన రోజురోజుకు చైనా ఆధిపత్యం పెరుగు తుండడమే. ఈ రెండు సామ్రాజ్యవాద దేశాల మధ్య ఘర్షణ, ముందు ముందు ఏ రూపమైనా తీసుకోవచ్చు.

ఏ దేశం అయినా పెట్టుబడిదారీ దేశంగా, సామ్రాజ్యవాద దేశంగా ఆవిర్భవించిన తరువాత పెట్టుబడిదారీ వ్యవస్థ నియమాల ప్రకారం సంక్షోభాలను ఎదుర్కోక తప్పదు. చైనా కూడా దానికి అతీతం కాదు. దేశంలోనూ, బయటా సంక్షోభం వేడిని చైనా అనుభవిస్తున్నది. ఈ పరిస్థితులలో ఏ సామ్రాజ్యవాద దేశం కూడా మరో సామ్రాజ్యవాద దేశానికి రాయితీలు ఇచ్చే రాజీలు చేసుకునో సర్దుబాటు చేసుకునే పరిస్థితిలేదు. ఈ ప్రపంచ పరిణామాల గురించి అవగాహన, అధ్యయనం లేక కొందరు, తెలిసీ చైనా అసలు స్వభావాన్ని మరుగుపరచడానికి కొందరు చైనాను సామ్రాజ్యవాద దేశం కాదు సోషలిస్టు దేశమని చెప్పుతున్నారు. ఇప్పటికే స్పటికమంత స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నది చైనా స్వభావం. ఇంకా దగ్గరి భవిష్యత్‌లోనే, సోవియట్ యూనియన్

లాగా చీమకాలంత కూడా అనుమానం లేకుండా ఎటువంటి ముసుగులు లేకుండా చైనా తన సామ్రాజ్యవాద స్వభావాన్ని బయట పెట్టుకోక తప్పదు.

❖ ❖ ❖

చైనా సోషల్ సామ్రాజ్యవాద దేశమే అనే నా చర్చా వ్యాసానికి 2019 ఫిబ్రవరి సంచికలో కృష్ణ ఆదిత్య మరికొన్ని వివరణలు పేరుతో జవాబు రాశారు. నా వ్యాసంలో లేవనెత్తిన ప్రశ్నలకు జవాబు చెప్పక పోగా, తన గత వ్యాసంలోని విషయాలనే తిరిగి వల్లె వేశారు. 'పాపిరెడ్డి గారి శీర్షికలోని విషయం చాలా పెద్దది. వీక్షణంలో ఆ విషయంపై కొన్ని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. చైనాపై సమీర్ అమీన్ అభిప్రాయాలు కూడా 2018 అక్టోబర్ వీక్షణంలో వచ్చాయి. వాటిలోని అంశాలను పరిగణలోకి తీసుకోవలసి ఉంది. పాపిరెడ్డి శీర్షిక పరిధి అది. కాని పాపిరెడ్డి పరిమిత పరిధిలో ఉన్న నా చర్చా వ్యాసాన్ని విశ్లేషించారు' అని కృష్ణ రాశారు. ఇది పూర్తిగా తప్పు, అబద్దం. నా చర్చా వ్యాసం (2018 నవంబర్) ప్రారంభంలోనే, '2018 జూన్ సంచికలో చైనా గురించి ప్రారంభమైన చర్చ అక్టోబర్ వరకు సాగింది. చర్చ ప్రారంభం అయిన సందర్భం ఏదైనా చివరికి చైనా సోషలిస్ట్ దేశమా కాదా అనేదే అసలు చర్చగా మారింది' అని చెప్పుతూ అన్ని అభిప్రాయాలను దృష్టిలోకి తీసుకుంటూనే కృష్ణ గారి వ్యాసం పై రాశాను. ఎందుకంటే కృష్ణగారి వ్యాసంలోని విషయాలను సమర్థిస్తూనే లేఖలు, అమీన్ అభిప్రాయాలు రాయబడినాయి. కాని ఆశ్చర్యంగా కృష్ణ 'చైనాలో ప్రజాస్వామిక ప్రక్రియ, సొంత ఆస్తిగా భూమి ఉందా లేదా? సోషలిస్ట్ మార్కెట్ వ్యవస్థ గురించి మావో సిద్ధాంతాల క్లుప్త పరిచయం – ఈ విషయాలకు మాత్రమే పరిమితం' అంటూ రాశారు. అవును ఈ విషయాల గురించి కృష్ణ ఎందుకు రాశారు? చైనాలో పెట్టుబడిదారీ విధానం ఉన్నదని నిరూపించడానికా? సోషలిజం ఉన్నదని నిరూపించడానికా? చైనాలో సోషలిజమే ఉన్నదని నిరూపించడానికి ఈ విషయాల గురించి రాయలేదా? కృష్ణ తను ఎందుకు రాశాడో తనే మరిచిపోయాడు. ఇప్పుడు క్లుప్తపరిచయం, నా పరిధి వేరు అంటున్నాడు. ఇక సమీర్ అమీన్ అభిప్రాయాల పేరు మీద వచ్చిన లేఖలోని విషయాలకు, కృష్ణగారి వ్యాసంలోని విషయాలకు మౌలికమైన తేడా ఏమీ లేదు. అమీన్ అభిప్రాయాల లేఖలో కూడా భూమి ప్రైవేట్ ఆస్తి కాదు అనే విషయం గురించే, సోషలిజంలో మార్కెట్ ఆర్థిక వ్యవస్థ గురించే ప్రధానంగా ఉంది. పోతే అమీన్ చెప్పిన చైనా 'ఒరిజినల్ మార్గం' అంటే ఏమిటో సూక్ష్మదర్శిని, దూరదర్శినిలు ఎన్ని పెట్టి వెతికినా దొరకదు. కనిపించదు వినిపించదు. అమీన్ గారి మరో అప్రధాన పనికి రాని చెత్త విషయం ఏమిటంటే, చైనాను విమర్శించే వాళ్లు అమెరికా ఏజెంట్లు అనే అర్థం వచ్చేలా రాసినది. కృష్ణగారి వ్యాసంలోనూ ఇటువంటి భావమే ఉంది. గతంలోనూ సోవియట్ యూనియన్‌ను విమర్శిస్తే, సిఐఎ ఏజెంట్లని ప్రచారం చేసిన పార్టీలు ఉన్నాయి. ఇప్పుడు కొత్త పంతులు అమీన్ సమర్థకులు అదే చేస్తున్నారు. మొత్తంగా కృష్ణగారి వ్యాసానికి, అమీన్ అభిప్రాయాల లేఖకు తేడా ఏమిలేదు. కాని తన వ్యాసం పరిధి వేరంటూ కృష్ణ బుకాయిస్తున్నారు.

కృష్ణ వివరణలో మరొక వైరుధ్యపూరిత వాదన ఉంది. తన చర్చా వ్యాసంలో విషయాలను క్లుప్తంగా మాత్రమే రాశానని అంటారు. ఇంకా 'ఆయా విషయాలపై సమగ్ర అధ్యయనం అవసరం, ఇవి తేలిగ్గా నిర్ధారించేవి కావు అని నొక్కి చెప్పడానికే క్లుప్తంగా రాసిన వ్యాఖ్య అని నా వ్యాస పరిధిని పేర్కొనడం జరిగింది' అని రాశారు. ఒక వైపు కృష్ణగారు, వామ్మో అది చాలా పెద్ద విషయం, బోల్డంత అధ్యయనం అవసరం, తేలిగ్గా నిర్ధారించే విషయం కాదంటారు. కాని మరో వైపు కృష్ణ మాత్రం, చైనాలో సోషలిజం లేదని వాదించే వారిని పిడివాదులు, వక్రీకరణలు, దురవగాహనలపై ఆధారపడిన వారు, ఆదర్శవాద ఊహాజనిత సోషలిజమే ఒంటపట్టింది, ఎంగెల్స్ చెప్పిన శాస్త్రీయ సోషలిజం అంతగా తెలియదు, పట్టదు. (కృష్ణగారికే అంతా తెలుసు... అశాస్త్రీయమైన అవగాహనతో విమర్శలు చేస్తుంటారు. చింత చచ్చినా పులుపు చావలేదు, చైనాను విమర్శించడమే పోరాటం అనుకుంటారు... లాంటి నిర్ధారణలు చేసేశాడు. బోల్డంత అధ్యయనం అవసరం, తేలిగ్గా నిర్ధారించే విషయాలు కావు అంటూనే ఇతరుల గురించి ఎలా నిర్ధారించగలుగుతాడు, గలిగినాడు. అసలు విషయం ఏమిటంటే, క్లుప్తం, పరిమిత వ్యాఖ్య, చాలా అధ్యయనం అవసరం అనేవి తను జవాబులు చెప్పలేని దగ్గర డాలు లాంటి రక్షణ కవచాలు మాత్రమే. వాటి వెనక దాక్కుని దాడి మాత్రం చేస్తాడు, చేశాడు.)

వర్గాలు–వర్గపోరాటం: అసలు నేను రాసిన దానిని కత్తిరించి, 'సోషలిజంలో వర్గాలు కూడా ఉంటాయని మాత్రం కృష్ణ అవసరం రీత్యా మరిచి పోయారా?' అని మాత్రమే పేర్కొని కృష్ణ జవాబు ఇచ్చారు. అదీ వంకర జవాబు. 'చైనాలో వర్గరహిత సమాజం ఏర్పడ లేదని, అలా అనుకుంటే అతివాదం, పొరపాటు అవుతుందని చైనా పార్టీ భావించిందని నా వ్యాసంలో ఉంది. పాపిరెడ్డి దాన్ని గుర్తించకుండా, అవసరం రీత్యా మరిచి పోయారా అనడం తగని పని' అని కృష్ణ రాశారు. ఇది చదివిన తరువాత కృష్ణ అవకాశవాదంతో అవసరం రీత్యానే మరిచి పోయాడు అని చెప్పక తప్పడం లేదు. అబద్ధాలు చెప్పడం అవకాశవాదమే అవుతుంది. కృష్ణ నేను రాసిన అసలు విషయం తలా తోకా కత్తిరించి తనకు ఉపయోగపడుతాయి అనుకున్న వాక్యాలను పేర్కొన్నారు. నేను రాసినది, కృష్ణ కత్తిరించిన వాక్యాలు ఇవి. 'మూడవ విషయం–వర్గపోరాటం గురించి దీన్ని కత్తిరించి తరువాతి వాక్యాలను పేర్కొన్నాడు. కత్తిరించిన చివరి వాక్యాలు ఇవి. 'ఎందుకంటే సరుకు ఉత్పత్తి, మార్కెట్ ఉన్న తరువాత వర్గాలు కూడా ఉంటాయి. వర్గాలు ఉన్న తరువాత వర్గపోరాటం కూడా ఉంటుంది. కాని కృష్ణ అసలు వర్గ పోరాటాన్నే మరిచి పోయాడు'. వర్గ పోరాటం గురించి చెప్పిన అసలు విషయాన్ని ముందు చివర కత్తిరించి, నేను కేవలం వర్గాల ఉనికి గురించి మాత్రమే ప్రశ్నించినట్లుగా కృష్ణ తన వ్యాసంలో తప్పుగా చిత్రించాడు. ఇంకా పైగా తను వర్గాల ఉనికి గురించి రాసినట్లుగా, నేనే గుర్తించనట్లుగా దబాయింపు ఒకటి.

నిజంగానే వర్గాల ఉనికి గురించి కృష్ణ ఏమైనా రాశారా? అదీ ఒక బుకాయింపే. రష్యా గురించి కృష్ణ రాసిన సందర్భం, చైనాలో కూడా వర్గాలు ఉన్నాయని నిరూపించడానికి కాదు. చైనాలో ఇంకా మార్కెట్ వ్యవస్థకు కీలక పాత్ర ఉన్నదని నిరూపించడానికి మాత్రమే రాశాడు. 'రష్యాలో సోషలిజం చాలా పరిణతి చెంది, వర్గ రహిత కమ్యూనిజం వలె రూపొందుతున్నదన్న అతివాద అంచనా వేసి, పొరపాటు చేసినట్లు స్టాలిన్ కాలం చివరలో గుర్తించబడింది. రష్యాలోని ఆ పొరపాటును మావో కాలంలోనే చైనా పార్టీ గుర్తించింది'. కృష్ణ తన జవాబులో పై వాక్యాలను పేర్కొని, వాటి మధ్యలో ఉన్న విషయాన్ని సందర్భం నుండి విడతీసి, తను వర్గాల ఉనికి గురించి రాసినట్లుగా దబాయిస్తున్నాడు. తను పేర్కొన్న వాక్యాల కొనసాగింపుగా ఉన్న వాక్యాలను చూస్తే సందర్భం అర్థం అవుతుంది. 'నేడు చైనాలో సోషలిజం ప్రాథమిక స్థాయిలో ఉన్నది'

అక్కడ సోషలిస్ట్ మార్కెట్ వ్యవస్థకు కీలక పాత్ర ఉన్నది- అని డెంగ్ నాయకత్వంలో చైనా పార్టీ సూత్రీకరించింది'. అంటే సోషలిజంలో మార్కెట్ వ్యవస్థకు ఉన్న కీలక పాత్ర గురించి చెప్పడం సందర్భం. అసలు కృష్ణ గారి 9వ పాయింట్ మొత్తం, సోషలిజంలో మార్కెట్ వ్యవస్థ గురించే చెప్పింది. సోషలిజంలో కూడా మార్కెట్ వ్యవస్థ ఉంటుందనే విషయాన్ని గుర్తించకుండా(రష్యాలో) తప్పుచేశారని, సోషలిజంలో కూడా మార్కెట్ వ్యవస్థ ఉంటుందనే విషయానికి సమర్థనగా పేర్కొన్న వాక్యాలలో వర్గాల ఉనికిని ఆవిష్కరించారు కృష్ణ గారు. తను ఏదో విషయం గురించి చెప్పిన దాంట్లో వర్గ రహిత కమ్యూనిజాన్ని తప్పుపట్టడం ఉంది కావున, తాను సోషలిజంలో వర్గాల ఉనికి గురించి రాశానని కృష్ణ చెప్పుకుంటు న్నారు. ఆహా ఏమి సమర్థన, ఎటువంటి సంకోచం లేకుండా మరీ. ఇంకా ఇతరులే వక్రీకరించారని బుకాయింపు. వర్గాల ఉనికి గురించి రాస్తే వర్గపోరాటం గురించి ఎందుకు మరిచిపోయారో? సోషలిజంలో కూడా వర్గపోరాటమే సమాజ చోదక శక్తి అని మావో చెప్పాడు. అందుకే నేను వర్గపోరాటం గురించి ప్రశ్నించాను.

తన గత వ్యాసంలో వర్గపోరాటాన్ని ప్రస్తావించని కృష్ణ ఇదే అదునుగా 'వివరణ' పేరుతో చైనా సోషల్ సామ్రాజ్యవాదుల వర్గ సంకర వర్గ పోరాటాన్ని సమర్థించడానికి పూనుకున్నాడు. '12వ చైనా పార్టీ మహాసభలో(1982)–ఇక చైనాలో దోపిడీ వర్గాలు లేవు. వర్గ పోరాటానికి కాలం చెల్లిందని తేల్చివేశారు' అని నేను రాసిన వాక్యాలను పేర్కొంటూ, '12వ చైనా పార్టీ మహాసభ రిపోర్టులో ఉన్నదాన్ని వారు(పాపిరెడ్డి) తప్పుగా చిత్రించి తేల్చివేశారు' అని ఆరోపించారు కృష్ణ గారు. అయితే దీని తరువాత కృష్ణ వర్గపోరాటం' గురించి చెప్పినదంతా డొంకతిరుగుడు, అస్పష్టతనే. రివిజనిజం స్పష్టమైన లక్షణం, అస్పష్టత, డొంకతిరుగుడే. సూటిగా చెప్పితే, వాళ్లు చెప్పిన దానిని సమర్థించుకోలేరు, ఇతరులను మాయ చేయలేరు. 12వ చైనా పార్టీ మహాసభ రిపోర్టులో ఉన్న దాన్ని నేను తప్పుగా చిత్రీకరించానని చెప్పి, కృష్ణ వివరించినది ఎలా ఉందంటే, ఎడమ చేయి తీసి పుర చెయ్యి పెట్టినట్లు ఉంది. 12వ చైనా పార్టీ సభ రిపోర్ట్ గురించి వివరిస్తూ 'అయితే నేటి మన సమాజంలోని వైరుధ్యాలలో చాలా వాటికి వర్గపోరాట స్వభావం లేదు. వర్గపోరాటం ప్రధాన వైరుధ్యంగా ఇంకా ఉండదు' అని కృష్ణ చెప్పారు. వర్గాలు ఉంటాయి, శత్రు పూరిత శక్తులు(?) ఉంటాయి, వర్గపోరాటం ఉంటుంది, ఇంకా తీవ్రం కావచ్చు కూడా, కాని వాటిలో చాలా వాటికి వర్గపోరాట స్వభావం ఉండదు, ఉన్న వర్గపోరాటం కొన్ని పరిమితులకు లోబడి ఉంటుంది, ఇక వర్గ పోరాటం ప్రధాన వైరుధ్యంగా ఉండదు. ఆహా ఏమి వివరణ. చైనాలో దోపిడీ వర్గాలు లేవు, వర్గ పోరాటానికి కాలం చెల్లిందని 12వ సభ తేల్చివేసిందని నేను పేర్కొన్న విషయాన్ని ఈ వివరణ రుజువు చేయడం లేదా? ఇంకా ఎవరో వక్రీకరించారని దబాయింపు. నేను నా వ్యాసంలో, 'చైనాలో దోపిడి వర్గాలు లేవని 12వ చైనా పార్టీ మహాసభలో తేల్చివేసారు' అని రాశాను. చైనాలో వర్గపోరాటం గురించి చేంతాడంత చెప్పిన కృష్ణ అసలు చైనాలో దోపిడీ వర్గాలు ఉన్నాయో, లేవో చెప్పనే లేదు. కావాలనే చెప్పలేదు. దోపిడీ వర్గాలు ఉన్నాయని ఒప్పుకుంటే, దోపిడి వర్గాలకు, శ్రామిక వర్గాలకు మధ్యనే ప్రధాన వైరుధ్యం ఉంటుందని కూడా ఒప్పుకోవలసి ఉంటుంది. అసలైన ఈ విషయాన్ని తప్పించి చెప్పే అంటే, ప్రధాన వైరుధ్యంగా లేని వర్గ పోరాటం, పరిమితుల వర్గపోరాటం అంతా ఒట్టి బూటకం. సోషలిజంలో కూడా దోపిడీ వర్గాలు ఉంటాయి, వాటితో ఉండే వైరుధ్యమే ప్రధాన వైరుధ్యంగా ఉంటుంది. అదే సోషలిజం అభివృద్ధికి చోదక శక్తిగా పని చేస్తుందని మావో చెప్పాడు. 1949 మార్చి, చైనా కమ్యూనిస్టు పార్టీ 7వ కేంద్ర కమిటీ రెండవ ప్లీనంలో మావో ఏమన్నాడో చూడండి, 'చైనా విప్లవం దేశవ్యాప్తంగా విజయం పొందిన తరువాత చైనా సమాజంలో ప్రధాన వైరుధ్యం శ్రామిక వర్గానికి, బూర్జువావర్గానికి మధ్య ఉన్న వైరుధ్యమే' అని చెప్పాడు. ఈ పంథా కొరకే చివరి వరకు పోరాడినాడు. ఈ పంథాకు వ్యతిరేకంగానే లీషావ్ చీ, డెంగ్‌లు ఒకసారి బహిరంగంగానూ మరో సారి ముసుగు లోనూ పోరాడినారు. ఈ విషయంలో లెనిన్ ఏమన్నాడో చూద్దాం, 'ఈ పరివర్తన దశ (సోషలిజం) మరణిస్తున్న పెట్టుబడిదారి వ్యవస్థకూ ఆవిర్భవిస్తున్న కమ్యూనిజంకూ – అనగా మరొక విధంగా చెప్పాలంటే, ఓడింపబడి, ఇంకా నాశనం కాని పెట్టుబడిదారీ వ్యవస్థకూ, పుట్టి ఇంకా దుర్బలంగా ఉన్న కమ్యూనిజంకూ మధ్య పోరాట దశగా ఉండక తప్పదు'.(శ్రామిక వర్గ నియంతృత్వ యుగంలో ఆర్థిక విధానం రాజకీయాలు)

సోషలిజం–సరుకుల ఉత్పత్తి: చైనా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ అనే సబ్ హెడ్డింగ్ కింద, నేను వారి సోషలిస్టు మార్కెట్ వ్యవస్థను అంగీకరిస్తూనే, అమలును ప్రశ్నించినట్లుగా పేర్కొన్నారు. 'పాపిరెడ్డి ఆ భావనను అంగీకరిస్తూనే, చైనాలో అమలును ప్రశ్నిస్తున్నారా? దీన్ని వారు స్పష్టం చేయాలి' దీన్ని ఘోరమైన వక్రీకరణ అని నేను అనుకోవడం లేదు. అసలు నేను రాసిందేమిటో అర్థం చేసుకోలేని సిద్ధాంత దారిద్ర్యం అది. సోషలిజంలో కూడా సరుకు ఉత్పత్తి, పరిమితులలో నియంత్రణలో, అంతం చెందే దిశలో మాత్రమే దాని అభివృద్ధి ఉంటుందని, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు అభివృద్ధి చెందే క్రమంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు నశిస్తూ ఉంటాయని మార్క్సిస్ట్ టీచర్స్ చెప్పిన విషయాన్నే నేను చెప్పాను. కాని మీరు చెప్పే మార్కెట్ సోషలిజం వేరు. మీ మార్కెట్ సోషలిజం ప్రకారం, సోషలిజం పేరు తప్పితే సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక విధానం ఉండకూడదు, పెట్టుబడిదారీ విధానం మాత్రమే అభివృద్ధి చెందాలి సంపూర్ణ వికసన దశ వరకు). మార్క్సిస్టు సోషలిజానికి, కృష్ణ చెప్పే డెంగ్ మార్కెట్ సోషలిజానికి భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉంది. నకలు నకిలీ సరుకులు ఎప్పుడూ అసలు సరుకుల రూపాన్ని కొద్ది తేడాలతో నకలు కొట్టి మార్కెట్‌లోకి వస్తాయి. ఏది నకలో ఏది అసలో మీకు తెలవక పోవచ్చు. అందుకే నేను ఏమి రాసానో దాన్ని అర్థం చేసుకోలేకపోయారు.

'రెండవది– ఈ వాదనలో కప్పి పుచ్చ బడుతున్న అసలు విషయం ఏమిటంటే, సోషలిజంలో సరుకు ఉత్పత్తి క్రమం దాని దిశ ఏ వైపుకు ఉండాలనేది అసలు విషయం. సరుకుల ఉత్పత్తి వ్యవస్థపై ఎవరి నియంత్రణ అయినా ఉండాలా వద్దా అనేది అసలు విషయం. సోషలిజం లో సరుకుల ఉత్పత్తి శాశ్వతంగా ఉంటుందని స్టాలిన్ మావోలు చెప్పారా? లేక కొంతకాలం వరకు సరుకుల ఉత్పత్తి అనివార్యంగా ఉంటుందని చెప్పారా? ఈ విషయంలో కృష్ణ ఆదిత్య పూర్తిగా మౌనం పాటించారు' అని నేను నా వ్యాసంలో రాశాను. దానికి కృష్ణ, తను మౌనం వహించ లేదని, తన వ్యాసంలో దానికి జవాబు ఉన్నదంటు 'రుజువు' చూపించాడు. 'చైనాలో అనుసరిస్తున్నది స్వేచ్ఛా మార్కెట్ పద్ధతి కాదు. దాన్ని సోషలిస్టు మార్కెట్ ఎకానమీ అంటారు. దానికే సోషలిస్టు ప్లాన్డ్ కమోడిటీ ఎకానమీ అనే పేరు కూడా ఉంది. పబ్లిక్ ఓనర్‌షిప్ పైచేయిగా ఉండే వ్యవస్థ అది. రాజ్యం మార్కెట్‌ను రెగ్యులేట్ చేస్తుంది' మార్కెట్ ఎంటర్ ప్రైజెస్‌ను గైడ్ చేస్తుంది.– అన్నది దాని ప్రాతిపదిక. ఆ విధంగా ప్లానింగ్, మార్కెట్ మేళవించబడతాయి.' కృష్ణ ఈ 'రుజువు' నా ప్రశ్నకు జవాబు

చెప్పుతున్నదా? సరుకు ఉత్పత్తి క్రమం, దాని దిశ ఏ వైపుకు ఉండాలనేది చెప్పుతున్నదా.. సరుకు ఉత్పత్తి గురించి స్టాలిన్, మావోలు చెప్పిన విషయాన్నే చెప్పుతున్నదా..? మార్కెట్ ఎంటర్‌ప్రైజెస్‌ను గైడ్ చేస్తుందని స్టాలిన్ మావోలు చెప్పారా? మార్క్సిస్టు సోషలిజానికి చెందిన విషయాల గురించి కృష్ణ మౌనం పాటించాడని అన్నాను కాని, డెంగ్ సోషలిజానికి చెందిన విషయాల గురించి మౌనం పాటించాడని నేను అనలేదు. కాని కృష్ణ చాలా తెలివిగా డెంగ్ సోషలిజాన్ని జవాబుగా, రుజువుగా చూపిస్తున్నారు ఇక్కడ.

ఇక నేను ఈ విషయాన్ని చూడకుండా ఏమి ఉండ లేదు. చూశాను కనుకనే, 'సరుకుల ఉత్పత్తి వ్యవస్థపై ఎటువంటి నియంత్రణ ఉండొద్దు అనేది పెట్టుబడిదారీ మార్గీయుల వాదన. అయితే వాళ్లు ఈ విషయాన్ని తిన్నగా చెప్పరు. వాళ్లు కూడా మార్క్సిస్టుల లాగానే సరుకుల ఉత్పత్తిపైన, మార్కెట్ వ్యవస్థపైన ప్రభుత్వం కంట్రోల్ ఉండాలంటూ పేరుకు చెప్తూనే, రకరకాల పరిస్థితులను కారణంగా చూపిస్తూ ప్రభుత్వ నియంత్రణను బలహీన పరుస్తారు. సరుకుల ఉత్పత్తి వ్యవస్థను ఎదగనిస్తూ సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలను నాశనం చేస్తూ ఉంటారు'. అని డెంగ్ సోషలిజం సారాంశాన్ని చెప్పాను. చూశాను కనుకనే 'ఈ రోజు చైనా జి.డి.పి. లో ప్రైవేట్ రంగం వాటా 60 శాతానికంటే ఎక్కువగా ఉంది... ప్రైవేట్ పెట్టుబడులు ప్రతి సంవత్సరం 6 చొప్పున పెరుగుతున్నాయి అని... చైనా ప్రైవేట్ రంగం విశ్వరూపాన్ని లెక్కలలో చూపించి 'పబ్లిక్ ఓనర్ షిప్ పైచేయి' లోని వాస్తవం ఏమిటో చెప్పాను. కావున కృష్ణ గారి రుజువును నేను చూడలేదనుకోవడం నిజం కాదు. చైనా ప్రైవేట్ రంగం విశ్వరూపం గురించి నేను ఇచ్చిన లెక్కల పై కృష్ణ గారి విచిత్రవాదనను కూడా చూద్దాం. 'చైనా ప్రైవేట్ రంగం విశ్వరూపం గురించి చెప్పుతూ కొన్ని గణాంకాలు ఇచ్చారు. ఇలాంటి గణాంకాలలో, వాటి విశ్లేషణలో చాలా చిక్కులు ఉంటాయి. (డొంకతిరుగుడు అంటే ఇదే), వీటిలోనూ ఉన్నాయి. నిపుణులు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. జవాబు లేదనా) ఇదంతా కేవలం ఆర్థిక విషయం కాదు రాజకీయ ఆర్థిక కోణంతో చూడాల్సిన చాలా సంక్లిష్టతతో కూడిన విషయం'. ఇదీ సంగతీ. అసలు పబ్లిక్ ఓనర్ షిప్' ఆధిపత్యంలోనే లేదని చూపిస్తూ లెక్కలు ఇస్తే, అవీ చైనా అధికారిక పత్రికలలో వచ్చిన లెక్కలు (2018 మార్చ్ 6, జినువా) ఇస్తే వాటిని సంక్లిష్టం ఖాతాలో వేసి చైనాలో సోషలిజం ఉన్నదని నిరూపించడానికి అమెరికా, యూరోపియన్‌ల వద్దకు వెళ్లారు కృష్ణ. 'ఒక్క వాస్తవాన్ని పరిశీలించండి' చైనా ప్రపంచ వాణిజ్య సంస్థలో 2001లో చేరింది. కాని చైనాను మార్కెట్ ఆర్థిక వ్యవస్థ గల దేశంగా అమెరికా, యురోపియన్ యూనియన్ నేటికీ గుర్తించడం లేదు. చైనా ఆర్థిక వ్యవస్థలో ముఖ్యంగా మార్కెట్‌పై ప్రభుత్వ నియంత్రణ, ప్రభుత్వరంగ ప్రాబల్యం దీనికి ముఖ్య కారణంగా చూపెడుతున్నారు' అని కృష్ణ రాసారు. విచిత్రం ఏమిటంటే, అమెరికా, పాశ్చాత్య దేశాల తప్పుడు ప్రచారంతో ప్రభావితం అయిన వాళ్లే, చైనాను సోషలిస్టు దేశం కాదని విమర్శిస్తున్నారని చెప్పుకొచ్చే కృష్ణగారు, ఇక్కడ మాత్రం చైనా అధికారిక పత్రికల లెక్కలను కూడా పక్కకు నెట్టేసి, చైనాను సోషలిస్టు దేశంగా నిరూపించడానికి అమెరికా, యురోపియన్ యూనియన్‌ల సహాయం తీసుకున్నాడు. ఒక సారేమో, 'ఇలా బయటి దేశాలన్నీ చైనా గురించి ఏమనుకుంటున్నాయో పట్టని కొద్ది మంది పిడివాదులు మాత్రమే వారు సోషల్ సామ్రాజ్య వాదులని భావిస్తున్నారు' అని అంటాడు. మరో సారి, '9 కోట్ల మంది సభ్యులు కల చైనా కమ్యూనిస్టు పార్టీ ఏమి చెప్పుతున్నది-అన్న దాన్ని పరిశీలించకుండా పూర్వ నిశ్చితాభిప్రాయాలతో కొద్దిమంది పిడివాదులు ఇలా బల్లలు గుద్దుతున్నారు' అని అంటాడు. అంటే ఎప్పుడు ఏ రాయి దొరికితే దాన్ని విసురుతారన్న మాట. చైనా అధికారిక పత్రికల నుండి లెక్కలు ఇస్తే పక్కకు నెట్టేసి అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు ఇచ్చిన సర్టిఫికెట్‌లు చూపిస్తారు కృష్ణ. ఏమి అవకాశవాదమండీ బాబు ఇది. చైనాలో మానవ హక్కులు లేవనీ, చైనా వన్ రోడ్... పేరుతో ఇతర దేశాలను అప్పుల ఊబిలో దింపుతున్నదని కూడా అమెరికా అంటున్నది, కృష్ణ ఒప్పుకుంటారా? ఇంకా రష్యా, చైనాకు ఉన్న పోలికలను కూడా ఐరాస తీర్మాణాల ప్రకారమే నిర్ణయిస్తారు, ఉత్పత్తి విధానాలతో కాదు.

సోషలిజంలో సరుకుల ఉత్పత్తి విషయంలో కృష్ణ ఒక విచిత్ర మైన ప్రశ్న అడిగారు. 'అందరికీ తెలిసిన విషయమే అయితే రష్యా అనుభవాలతో స్టాలిన్... ప్రత్యేకంగా దాని గురించి ఒక పుస్తకం రాసి అంతగా చర్చించాల్సిన అవసరమే లేదు. అందరికీ తెలిసినదే అయితే దానిపై మళ్లీ మావో 1958లో ఒక సమీక్ష రాయాల్సిన పనిలేదు'. ముందు ఒక వక్రీకరణ గురించి చెప్పాల్సి ఉంది. సోషలిజంలో సరుకు ఉత్పత్తి మార్కెట్ వ్యవస్థ ఉంటాయని మార్క్సిస్టులందరికీ తెలుసు అని రాశాను కాని అందరికి తెలుసు అని రాయలేదు. అందరికి తెలుసు అని కృష్ణ రాసిన చోటల్లా మార్క్సిస్టులందరికీ అని చదువుకోవాలని మనవి. ఇక విషయంలోకి వస్తే.. ఇంకా నయం మార్క్సిస్టులందరికీ తెలిస్తే మార్క్స్ అలా ఎందుకు రాశాడని అడగలేదు. ఎందుకంటే మార్క్స్ కూడా సోషలిజం గురించి ఇలా చెప్పాడు. 'పెట్టుబడిదారీ సమాజం నుండి ఆవిర్భవిస్తుంది కావున అది అన్ని అంశాలలోనూ, ఆర్థికంగానూ నైతికంగానూ మేధోపరంగానూ దాని పుట్టు మచ్చలు కలిగి ఉంటుంది' ఇంకా ఇదే విషయం లెనిన్ కూడా చెప్పాడు. 'పెట్టుబడిదారీ వ్యవస్థకూ కమ్యూనిజంకూ మధ్య ఒక నిర్దిష్టమైన పరివర్తనా దశ ఉందనడంలో సందేహం ఉండజాలదు. సామాజిక ఆర్థిక వ్యవస్థ ఈ రెండు రూపాలలోని, లక్షణాలు, గుణాలు ఈ పరివర్తన దశలో కలిసి ఉండక తప్పదు'. (శ్రామికవర్గ నియంతృత్వ యుగంలో ఆర్థిక విధానం రాజకీయాలు) ఈ లెక్కన మార్క్సిస్టులందరికీ తెలిస్తే మళ్లీ లెనిన్ ఎందుకు రాశాడని కూడా కృష్ణ అడగాలి. తలకిందికి కాలుపైకి పెట్టి చూస్తే అలాగే కనిపిస్తుంది. తలపైకీ, కాల్లు కిందికీ పెట్టి చూస్తే కనిపించే విషయం ఏమిటంటే వాళ్లంత మార్క్సిస్టు టీచర్స్. వాళ్లు చెప్పినందుకే మార్క్సిస్టులైన వారందరికి ఆ విషయం తెలుసు. స్టాలిన్, మావోలు రాసినవి చదివినారు కనుకనే మార్క్సిస్టులకు ఆ విషయం తెలుసు. అసలు విషయం ఏమిటంటే, స్టాలిన్, మావోలు రాసిన పుస్తకాలను కృష్ణ తప్ప తెలుగు ప్రజలు ఎవరూ చదవ లేదని అనుకుంటున్నారు. అందుకే అటువంటి వింత ప్రశ్న అడిగారు.

మావోనే చెప్పారు: కృష్ణ పదే పదే చెప్పుతున్న అసత్యం ఏమిటంటే, 'సోషలిస్టు యుగంలో మనం సరుకుల వ్యవస్థను సంపూర్ణ వికసన దశవరకు అభివృద్ధి చేయాలి' అని మావో చెప్పాడని. సోషలిస్టు యుగంలో, సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలను ప్రవేశ పెట్టకుండా, వాటి అభివృద్ధికి కృషి చేయకుండా, సరుకుల వ్యవస్థను అభివృద్ధి చేయాలని మావో చెప్పాడా? వాక్యాలను కత్తిరించి, సందర్భం నుండి విడతీసి రచయిత భావాన్ని వక్రీకరించడం, దబాయించడం కృష్ణకే చెల్లింది. మావోనే అంత గొప్పగా పెట్టుబడిదారీ విధానాన్ని (సరుకుల ఉత్పత్తి వ్యవస్థ) అభివృద్ధి చేయండని చెప్పాక, డెంగ్ గారి ప్రాథమిక సోషలిజం అవసరం ఎందుకు వచ్చిందండి.

చైనా చరిత్ర వక్రీకరణ: కృష్ణ వాదన అంతా అర్ధసత్యాలు, కత్తిరించిన వాక్యాలపైనే ఆధారపడి ఉంది. అర్ధసత్యం అంటే సంపూర్ణమైన అబద్ధమే. అబద్ధాలలో కెల్లా అధమమైన అబద్ధం. కృష్ణ చైనా చరిత్ర, డెంగ్ గురించి చెప్పింది అర్ధసత్యమే. డెంగ్ సిద్ధాంతాలు రివిజనిజం అని 1968-69 లో, డెంగ్‌ను అన్ని బాధ్యతల నుండి తొలగించారు. కాని సాంస్కృతిక విప్లవపు ఆటుపోట్లు, చేదు అనుభవాల వలన దానికి బ్రేకులు వేశారు. డెంగ్‌ను మళ్లీ పార్టీలో ఉన్నతమైన పదవులలోకి తీసుకున్నారు. డెంగ్ పట్ల తన వైఖరిని నిర్ణయాలను మావో దిద్దుకున్నారు. కృష్ణా ఈ విధంగా డెంగ్‌ను పొగడడంతో పాటు, డెంగ్ వ్యతిరేకులను, మావో నుండి నేర్చుకోలేని పిడివాదులని విమర్శించాడు. కాని కృష్ణ 1974 వరకే, పార్టీలో డెంగ్ ఉన్నత పదవుల గురించి గొప్పదనం గురించి ఏకరువు పెట్టాడు. 1976 లో మావో చనిపోయేనాటికి డెంగ్ పార్టీలో ఏ స్థాయిలో ఉన్నది ఏం వెలగబెట్టుతున్నది మాత్రం రాయలేదు. సాంస్కృతిక విప్లవం ప్రారంభంలో అన్ని పదవుల నుండి తొలగించిన డెంగ్‌కు మళ్లి ఉన్నత భాధ్యతలు అప్పచెప్పితే, తిరిగి పెట్టుబడిదారీ విధానాలను శక్తులను బలోపేతం చేయడానికి పూనుకున్నాడు. దానితో 1975 నుండే పార్టీలో డెంగ్‌ను విమర్శించడం మొదలైంది. డెంగ్ బూటకపు ఆత్మవిమర్శ చేసుకున్నాడు. సంతృప్తి చెందని పార్టీ 1976 ప్రాంభంలో డెంగ్ ను మళ్లి అన్ని పదవుల నుండి తొలగించింది. ఇదంతా కూడా మావో, చైర్మన్‌గా ఉండగానే మావో గైడెన్స్ లోనే జరిగింది. మావో చనిపోయాక అవకాశవాద, కుట్ర రాజకీయాలు చేసి రెండు సంత్సరాలలో పార్టీలో ఆధిపత్యం సాధించ గలిగాడు డెంగ్. కృష్ణ సగం చరిత్ర చెప్పి డెంగ్ గొప్ప వాడు, మావోనే తప్పులు దిద్దుకున్నాడు అని చరిత్ర గురించి తప్పుడు చిత్రాన్ని ఇచ్చాడు.

మావో కాని చౌఎన్ లై కాని సాంస్కృతిక విప్లవంలో జరిగిన లోపాలను సరిదిద్దాలనుకున్నారు కాని సాంస్కృతిక విప్లవం తప్పని అనలేదు. కాని కృష్ణ అటువంటి చిత్రం ఇవ్వడానికే ప్రయత్నించాడు. చౌ ఎన్ లై, 10 వ పార్టీ మహాసభలో సమర్పించిన నివేదికలో, 9వ పార్టీ మహాసభ సందర్భంగా ముందు పెట్టిన చెన్ పొటా, లిన్ పియావోల ముసాయిదా రాజకీయ నివేదికను విమర్శిస్తూ ఇలా అన్నాడు, 'వాళ్లు కార్మికవర్గ నాయకత్వం కింద విప్లవం కొనసాగింపును వ్యతిరేకిస్తూ 9వ మహాసభ ముందున్న ముఖ్యమైన పని ఉత్పత్తిని పెంచడం అని పేర్కొన్నారు. మన దేశంలో ప్రధాన వైరుధ్యం కార్మిక వర్గానికీ, బూర్జువాకీ మధ్య కాకుండా ప్రగతి సాధించిన సోషలిస్టు విధానానికీ సమాజంలో వెనకబడి ఉన్న ఉత్పత్తి శక్తులకు మధ్య ఉంది అన్న తీర్మానాన్ని 8 వ మహాసభలో దొంగచాటుగా చొప్పించిన లీషావ్ చీ, చెన్ పోటాల రివిజనిస్టు చెత్తకు, మారిన పరిస్థితులలో ఇది కొత్త రూపం మాత్రమే'. దీన్ని బట్టి చౌ ఎన్ లై, సాంస్కృతిక విప్లవాన్ని వ్యతిరేకించలేదని అర్థం అవుతుంది. ఇక విలియం హింటన్ అయితే సాంస్కృతిక విప్లవాన్ని ఎత్తిపట్టుతూ 'మలుపు తిప్పిన మహా ఉద్యమం' (టర్నింగ్ పాయింట్ ఇన్ చైనా) అని పుస్తకమే రాసాడు. ' సోషలిజంలో వర్గపోరాటం' అనే మొదటి అధ్యాయంలో సాంస్కృతిక విప్లవం గురించి ఇలా చెప్పాడు, 'రాజ్యాధికారాన్ని, శ్రామిక వర్గానికి ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు కలిగి ఉంటారా? లేక బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు కలిగిఉంటారా? అనేది నిర్ణయించటానికి జరిగిన వర్గ పోరాటం ఇది. చైనా సోషలిస్టు పంథాను కొనసాగించి సోషలిస్టు విప్లవాన్ని అంతిమ లక్ష్యం వరకు తీసుకు వెలుతుందా లేక పెట్టిబడిదారి పంథా కోసం సోషలిస్టు పంథాను వదిలి పెడుతుందా అనేది నిర్ణయించడం కోసం జరుగుతున్న పోరాటం అది. అందుకే ఆ పోరాటం అంత తీవ్రంగా ఉంది'. హింటన్, సాంస్కృతిక విప్లవం అంటే అరాచకం కాదు సోషలిజంలో వర్గ పోరాటం అని చెప్పాడు. హింటన్, చైనా వెనకకు పోవడం గురించి 'ద గ్రేట్ రివర్సల్' అనే పుస్తం కుడా రాసాడు.

భూమి ప్రభుత్వ ఆస్తి : ఈ విషయంలోకి వెళ్లేముందు ఒక కత్తిరింపు గురించి చెప్పాలి. నేను చెప్పింది ఏమిటంటే, 'వంశపారంపర్య హక్కుతో సహా భూమిని వ్యక్తిగతంగా పంపకం చేసిన తరువాత కూడా, భూమి ప్రభుత్వ ఆస్తిగానే ఉందని చెప్పడం అవకాశవాదం తప్ప మరేమీ కాదు' అని. కాని కృష్ణ పై రెండు ముఖ్యమైన వాక్యాలను కత్తిరించి, 'చైనాలో భూమి ప్రభుత్వ ఆస్థిగా ఉందని చెప్పడం అవకాశవాదం తప్ప మరేమీ కాదు అని నేను రాసినట్లుగా చెప్పాడు. అసలు అర్థాన్నిచ్చే వాక్యాలను కత్తిరించి చర్చించడం కూడా అవకాశవాదం తప్ప మరేమి కాదు. భూమి పేరుకే అయినా సరే ప్రభుత్వ ఆస్తిగా ఉంటే చాలు అది సోషలిజమే అనుకుంటే చిన్నపిల్లల అమాకయత్వమే అవుతుందని, ఉత్పత్తి సంబంధాల గురించి వివరించి రాశాను. దానికి జవాబు చెప్పలేక, 'పాపిరెడ్డి ఏమేమో రాశాడు' అని తప్పించుకున్నాడు. చిన్నపిల్లల అమాయకత్వం అన్నందుకు పెద్ద పిల్లగాన్ని సమీర్ అమీన్‌ను మద్దతుగా తెచ్చుకున్నాడు. కాని ఇద్దరు చెప్పిన దాంట్లో మౌలిక తేడా ఏమిలేదు. అమీన్ ఎంత పెద్ద వయసు వాడు అయినా కావచ్చు, కాని వారు చెప్పేది మార్క్సిజం ప్రకారం చెప్పుతున్నాడా లేదా అనేదే చూస్తారు మార్క్సిస్టులెవరైనా, మూఢ భక్తులు తప్ప. ఆర్థికవ్యవస్థ వేరు నిర్వహణ పద్దతి వేరు, సంస్కరించింది నిర్వహణ పద్ధతినే అని చెప్పిన కృష్ణకు, చిన్న ఆస్తిని, చిన్న స్థాయిలో ఉత్పత్తిని వేరుచేసి చూడాలి, భూమి సరుకుగా మారడం పైన్నే పెట్టుబడిదారీ విధానం ఆధారపడి (అసలు పిడివాదం) ఉంటుందని చెప్పే అమీన్‌కు మార్క్సిస్టు ఉత్పత్తి సంబంధాల గురించి కనీస అవగాహన లేదు. ఆయన రాసినది జవాబు కాదు, మార్క్సిజానికి వక్రీకరణ. ఇక కమ్యూన్‌లు ఎందుకు రద్దు చేశారనే దానికి కూడ కృష్ణ విచిత్రమైన జవాబు ఇచ్చారు. ఈ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడానికి. లేకపోతే పెరుగుతున్న జనాభాకీ, వారి కోరికలకు సరిపోయేవి కావు' కనుక రద్దు చేశారు. అంటే జనాభా తగ్గి, ప్రజల అవసరాలు తగ్గితేనే సోషలిజం సాధ్యం అన్న మాట. సరుకుల ఉత్పత్తి వ్యవస్థలో అవసరాలు ఎప్పుడూ తగ్గవు. మావో కాలం నాటి విధానాలు నిర్మాణాలు ఏ అభివృద్ధికి ఎలా ఆటంకం అయ్యాయి? అనేది ఏది వివరించ లేదు కృష్ణ గారు, అని గత వ్యాసంలోనూ ప్రశ్నించాను. దానికి జవాబు చెప్ప లేదు. ఇది మర్క్సిజం కాదు. పెట్టుబడిదారీ డెంగ్ ఇజం మాత్రమే.

సిద్ధాంతం-ఆచరణ: సిద్ధాంతం ఆచరణ గురించి నిజంగా చాలా గొప్ప విషయం చెప్పారు కృష్ణగారు. కొందరు కాగితాల మీదనే ఉద్యమాలు నడుపుతున్నారు. కాగితాల మీదనే ఆచరణ' సృష్టించి, ఆ ఆచరణ నుండే సిద్ధాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నారు. అయితే వర్గ పోరాటంతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని సంబంధం లేకపోతే అసలు మార్క్సిజం సరిగా అర్థం కాదనే విషయం వాళ్లకు తెలవదు. కృష్ణ ఏ పార్టీకి ఏ ఇస్టులకు ప్రాతినిధ్యం వహిస్తాడో, లేదో కూడా నాకు తెలవదు కాని ఏ ఉద్యమాల ఆచరణ గానం నుండి మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. అవును మన దేశంలో కొందరు కొండ మొదట్లోనే కూర్చుని కొత్త కొత్త సిద్ధాంతాలు అల్లుతుంటారు. కొండ ఎలాగూ ఎక్కేది లేదు కావున ఏదో ఉద్యమం చేసినట్లు కనిపించాలి కావున చైనా సోషలిస్టు దేశమే లాంటి పండిత చర్చలలో ఉద్యమాలు చేస్తుంటారు. ఈ పరిస్థితి మారాలని కోరుకుందాం. వీ

చైనా సోషలిస్టు దేశమే

- సత్యనారాయణ రెడ్డి

మా సంస్థ తరపున మేం 2012లో ప్రచురించిన 'చైనా వంద ప్రశ్నలు-జవాబులు' అనే పుస్తకంలోని విషయాలను విమర్శిస్తూ లంకా పాపిరెడ్డి గారు వీక్షణం మార్చ్ సంచికలో ఒక వ్యాసం రాశారు. దానిలో ఆయన నేడు చైనాలో అమలు జరుగుతున్నది సోషలిజం కాదని, అది పెట్టుబడిదారీ విధానమేనని పేర్కొన్నారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు మార్క్సిజం మూలసూత్రాలను రూపొందించారు. వాటిని ఆచరణలో పెడ్తున్న క్రమంలో లెనిన్, స్టాలిన్, మావోలు ఆ సిద్ధాంతాలను అభివృద్ధి చేసి మార్క్సిజాన్ని సుసంపన్నం చేశారు. మార్క్స్, ఎంగెల్స్‌లు చెప్పిన వాటి వద్దే ఆగిపోయి, ఆ సిద్ధాంతాలనే యథాతథంగా అమలు జరపడానికి వారు ప్రయత్నించి ఉంటే రష్యా, చైనా దేశాల్లో విప్లవాలే వచ్చి ఉండేవికావు. మార్క్స్ బాగా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లోనే అది ఒకేసారి కొన్ని దేశాల్లో విప్లవం వస్తుందని భావించాడు.

మార్క్సిజం విప్లవాల సాధన క్రమంలో మాత్రమే అభివృద్ధి కాలేదు. సోషలిజాన్ని నిర్మించే క్రమంలో కూడా అది బాగా అభివృద్ధి చేయబడింది. కమ్యూనిజపు మొదటిదశ అయిన సోషలిజం 'ఇంకా న్యాయాన్ని, సమానత్వాన్ని సాధించలేదనీ, తేడాలు సంపదలో అసమానతలనేవి ఇంకా కొనసాగుతాయనీ' మార్క్స్ పేర్కొన్నాడు. ఆ విషయంలో, ఆ సమయంలో దానికి సంబంధించిన అనుభవాలు లేనందుననే మార్క్స్‌కు దానిపైన అంతకంటే ఎక్కువ వివరించడం సాధ్యం కాలేదు. సోషలిజాన్ని నిర్మించడం అనేది రష్యాలో లెనిన్ ముందుకు వచ్చిన ఆచరణాత్మక సమస్య. ఆయన ఆ సమస్యలను చేపట్టి వాటికి సరైన పరిష్కార మార్గాలను రూపొందించాడు.

సాపేక్షికంగా వెనకబడిన సోవియట్ యూనియన్‌లో ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి విదేశీ పెట్టుబడులను అనుమతించక తప్పదని సూత్రీకరించి దాన్ని లెనిన్ అమలు పర్చాడు. 1921 ఏప్రిల్ 25న జరిగిన ఒక పార్టీ శ్రేణుల సమావేశంలో 'రాయితీలపైన' ఆయన వివరించాడు. (వి.ఐ. లెనిన్ సంకలిత రచనలు 32వ సంకలనంలో అది ముద్రించబడింది.) చైనాలో సోషలిస్టు నిర్మాణంలో ఈనాడు జరుగుతున్న ప్రయోగాలను, పరిణామాలను అర్థం చేసుకోవడానికి లెనిన్ ఆ వివరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. దానిలోని కొన్ని ముఖ్యమైన భాగాలు ఈ విధంగా ఉన్నాయి.

రష్యన్ భూస్వాములను, పెట్టుబడిదారులను తొలగించి వేసిన తర్వాత, సోవియట్ ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదార్లను ఆహ్వానించడం అనేది సరైన చర్యగా ఉంటుందా? అవును ఉంటుంది. ఎందుకంటే ఇతర దేశాల్లోని కార్మికవర్గ విప్లవాలు ఆలస్యం అవుతున్నాయనేది గమనించిన తర్వాత కార్మికులు, రైతుల పరిస్థితుల్లో వేగవంతమైన, తక్షణ మెరుగుదలను సాధించడం కోసం మనం కొన్ని త్యాగాలను చేయాల్సి ఉంటుంది. అనేక సంవత్సరాల పాటు మనం కోట్లాది విలువైన ఉత్పత్తులను పెట్టుబడిదార్లకు ఇచ్చివేయవలసి ఉంటుంది..... కార్మికుల, రైతుల పరిస్థితిని వెంటనే మెరుగుపర్చే అవకాశాలను వదులుకొనే హక్కు మనకులేదు. మన ఈ త్యాగాలు వినాశనాన్ని కొని తెచ్చేవికావు.

అయితే, పెట్టుబడిదారీ విధానాన్ని ఆహ్వానించడం ప్రమాదకరమైనది కాదా? పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి అందులో ఇమిడి ఉంటుంది. అధికారం కార్మికుల, రైతుల చేతుల్లోనే ఉంటుంది కాబట్టి, అది ప్రమాదకరమైనదేమీ కాదు.

పెట్టుబడిదారులతో చేసుకొనే కాంట్రాక్టులు మనకు ప్రయోజనకరంగా ఉండేట్లుగానూ, దాని ఫలితంగా కార్మికుల, రైతుల పరిస్థితి మెరుగుపడేట్లు గానూ, పెట్టుబడిదారీ కౌలుదారుడు ఒప్పందపు షరతులకు కట్టుబడి ఉండేట్లుగానూ సోవియట్ ప్రభుత్వం చూసుకొంటుంది. ఈ షరతులపైన పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి ప్రమాదకరమైనదేమీ కాలిదు. భారీ పరిమాణంలో ఉత్పత్తులను పొందడం ద్వారా కార్మికులు, రైతులు లాభపడుతారు.

ఆ ఉపన్యాసంలోనే ఈ సమస్యను లెనిన్ ఇంకా ఈ విధంగా వివరించాడు. పెట్టుబడిదారులకు మనం ఇచ్చే రాయితీలనేవి ఆర్థిక రంగంలో యుద్ధపు కొనసాగింపే అనే దాన్ని నేను పునరుద్ఘాటిస్తున్నాను. అయితే, ఇక్కడ మనం ఉత్పత్తి శక్తులను నాశనం చేసుకోకుండా వాటిని అభివృద్ధి పరుస్తాం. మన చట్టాలను పక్కన బెట్టడానికి, మనలను మోసం చేయడానికి వారు ప్రయత్నిస్తారనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. అయితే, ఈ సమస్య పట్ల తగిన విధంగా వ్యవహరించడానికి మనకు అఖిల రష్యా చికా, మాస్కో చికా, గుబర్నియా చికా లాంటి యంత్రాంగాలున్నాయి. అందువలన మనం తప్పక విజయం సాధిస్తామని నమ్మకంగా ఉండవచ్చు. సుదీర్ఘమైన లెనిన్‌పై వివరణల్లో విషయాలు చాలా స్పష్టంగానే ఉన్నాయి. చైనాలోకంటే పూర్వమే లెనిన్‌పై అవగాహనకు అనుగుణంగా రష్యాలో సోషలిజం నిర్మాణానికి చర్యలు తీసుకున్నాడనే విషయం ఏ విధమైన సందిగ్ధతకు అవకాశం లేకుండా స్పష్టం అవుతున్నది. చైనా విషయంలో ఈనాడు 'ఉత్పత్తి శక్తుల అభివృద్ధి' కోసం ఆ ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలన్నీ పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణలో ఒక భాగమేననీ లంకా పాపిరెడ్డి గారి లాంటి విమర్శకులు అంటున్నారు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి విధానాన్ని మొదట ప్రవేశపెట్టింది లెనిన్ అనే విషయాన్ని వారు పరిగణనలోకి తీసుకొని ఆలోచించాల్సిన అవసరం ఉంది.

లెనిన్‌పైన వివరించిన అభిప్రాయాల నేపథ్యంలో లంకా పాపిరెడ్డి గారు తన వ్యాసాల్లో లేవనెత్తిన కొన్ని సమస్యలను గురించి చర్చిద్దాం. ఆ చర్చను మొదటి చైనా సమాజంలోని ప్రస్తుత ప్రధాన వైరుధ్యం సమస్యతో ప్రారంభిద్దాం. నేడు చైనాలో ప్రధాన వైరుధ్యం పెట్టుబడిదారీ వర్గానికి, కార్మిక వర్గానికి మధ్యన ఉంటుందన్న మావో అభిప్రాయాన్ని చైనా ప్రస్తుత నాయకత్వం తిరగదోడి ఉత్పత్తి శక్తుల అభివృద్ధి పేరు చాటున పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పడమే వారి అసలు లక్ష్యంగా ఉన్నదని పాపిరెడ్డి గారు పేర్కొన్నారు.

రష్యా, చైనా విప్లవాల మధ్యన అనేక తేడాలున్నాయి. రష్యాలో 1917 అక్టోబర్ విప్లవం తర్వాత, భీకరమైన అంతర్ యుద్ధం ద్వారా దోపిడి వర్గాలను పూర్తిగా అణచివేయబడినాయి. కానీ, చైనాలో 1949లో విప్లవం విజయవంతం అయ్యేనాటికి ఆ దోపిడి వర్గాలను తొలగించి వేశారు. ఇక అప్పుడు మిగిలినది జాతీయ బూర్జువా వర్గమే. చైనాలో జాతీయ బూర్జువా వర్గాన్ని బలప్రయోగం ద్వారా కాకుండా శిక్షణ ఇచ్చి మల్చుకొనే విధానం ద్వారా మావో నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ

జాతీయ బూర్జువా వర్గం ఒక వర్గంగా తొలగించబడిన దాకా చైనాలో దానితో శత్రుపూరితం కాని సంబంధాలే కొనసాగాయి. శిక్షణ ఇచ్చి మల్చుకొనే విధానాన్ని జాతీయ బూర్జువా వర్గం కూడా ఆమోదించింది.

సోషలిస్టు సమాజంలోని వైరుధ్యాల గురించి మావో ఈ కింది విధంగా పేర్కొన్నాడు – 'సోషలిస్టు సమాజంలో వైరుధ్యాల విషయం పూర్తిగా భిన్నమైనది. అవి శత్రుపూరితమైనవి కావు. సోషలిస్టు వ్యవస్థనే వాటిని ఎడతెగకుండా పరిష్కరిస్తుంది'.

'సోషలిస్టు సమాజంలో ఉత్పత్తి సంబంధాలు – ఉత్పత్తి శక్తుల మధ్య, ఉపరితలం – ఆర్థిక పునాది మధ్యన ఉన్నవే మౌలిక వైరుధ్యాలు. సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు పాతకాలపు ఉత్పత్తి సంబంధాల కన్నా ఉత్పత్తి శక్తుల స్వభావానికి హెచ్చుగా అనుగుణంగా ఉంటాయని చెప్తున్నామంటే దానర్థం– ఉత్పత్తి నిలకడగా పెరిగి, ఎడతెగకుండా అభివృద్ధి పొందుతున్న ప్రజల అవసరాలను ఇతోధికంగా తీర్చగలగడానికి వీలుగా ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తులను పాత సమాజంలో అందుకోలేనంత హెచ్చు వేగంతో అభివృద్ధి పొందనిస్తాయన్న మాట'. (ప్రజల మధ్య వైరుధ్యాల పట్ల సరిగా వ్యవహరించడం గురించి – మావో)

పై సూత్రీకరణలను వివరించడానికి చైనా అనుభవాల నుండి మావో ఉదాహరణలు ఇచ్చాడు. మావో పై వివరణ ఏమి స్పష్టం చేస్తున్నది? చైనా సోషలిస్టు సమాజంలో మౌలిక వైరుధ్యం ఉత్పత్తి సంబంధాలకు, ఉత్పత్తి శక్తులకు మధ్యనే ఉన్నదనీ, ఈ వైరుధ్యాలు శత్రుపూరితమైనవి కావనీ, వాటిని ప్రజల మధ్య వైరుధ్యాలుగానే పరిష్కరించుకోవచ్చుననే.

సోషలిస్టు సమాజంలో కూడా వర్గాలు ఉంటాయి కాబట్టి వర్గ పోరాటాలు కూడా ఉంటాయని చెప్పే మావో ఆ పోరాటాల స్వభావం గురించి కింది విధంగా పేర్కొన్నాడు.

'ప్రజా బాహుళ్యం పెద్దఎత్తున సాగించే కల్లోలపూరితమైన వర్గ పోరాటాలు – అవి విప్లవకాలపు ప్రత్యేక లక్షణాలు ప్రధానంగా ముగిసి నప్పటికీ వర్గపోరాటం ఎంతమాత్రం పూర్తికాలేదు.'

దాన్ని మరింత వివరిస్తూ ఆయన ఈ విధంగా అన్నారు – 'మరో విధంగా చెప్పాలంటే మన సోషలిస్టు వ్యవస్థ సుస్థిరమై పటిష్టం కావడానికి, కొత్త వ్యవస్థకి ప్రజానీకం అలవాటు పడడానికి, ప్రభుత్వ సిబ్బంది నేర్చుకొని అనుభవం గడించడానికి ఇంకా సమయం అవసరమవుతుంది'. (మావో పైన పేర్కొన్న రచన నుండి)

చైనాలోని దోపిడీవర్గాలని – అంటే జాతీయ బూర్జువా వర్గం, ధనిక రైతాంగాన్ని – శిక్షణ ఇచ్చి మలుచుకొనే విధానాన్ని చైనా కమ్యూనిస్టు పార్టీ, మావో విజయవంతంగా అమలు జరిపారు. శత్రు పూరితంకాని రూపంలో వర్గపోరాటం అన్న విధానమది. ఈ విధానానికి లొంగని వారు కూడా ఉండినారు, అమల్లో ఉన్న చట్టాల ప్రకారం వారి పట్ల వ్యవహరించారు. దీని కొరకు కల్లోలపూరితమైన వర్గపోరాటాన్ని నిర్వహించాల్సిన అవసరమేమీ ఏర్పడలేదు చైనాలో.

మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ పై విధానాన్ని 1957 వరకు విజయవంతంగా అమలు జరిపింది. మావో తాను రూపొందించి అమలు జరిపిన పై విధానాన్నుండి 1957 తర్వాత ముఖ్యంగా 1966–76 సంవత్సరాల మధ్య కాలంలో సాగిన సాంస్కృతిక విప్లవం కాలంలో వైదొలగి దానికి పూర్తిగా విరుద్ధమైన సూత్రీకరణలు ముందుకు తెచ్చి అమలు జరిపించాడు.

అంతకు ముందు ఉత్పత్తిశక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్యన ప్రధాన వైరుధ్యంగా పేర్కొన్న ఆయనే అది పెట్టుబడిదారులకు – కార్మికుల మధ్య ఉంటుందన్నాడు. పార్టీలో కొందరు పెట్టుబడిదారీ మార్గీయులు ప్రవేశించి చైనాను పెట్టుబడిదారి మార్గంలోకి తీసుకవెళ్తున్నారనీ, అలాంటి వారికి వ్యతిరేకంగా సాంస్కృతిక విప్లవానికి పిలుపునిచ్చాడు. అంతకు ముందు విప్లవ కాలంలో, ఆ తర్వాత కాలంలో మావో సాంస్కృతిక విప్లవం గురించి చెప్పిన అర్థం వేరు. సాంస్కృతిక విప్లవం సామ్రాజ్యవాద ఫ్యూడల్ సంస్కృతిక వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిన విప్లవం లోబడే ఉంటుంది. సోషలిస్టు విప్లవ దశలో అది బూర్జువా సంస్కృతికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినది. సోషలిస్టు విప్లవంలో అది ఒక అంతర్భాగం. దానికి లోబడి ఉంటుంది. అంతకు ముందు సాంస్కృతిక విప్లవం గురించిన మావో అభిప్రాయాలు పై విధంగా ఉండేవి. సాంస్కృతిక విప్లవంపైన మావో పేర్కొన్న పై అభిప్రాయాలు మార్క్సిజం లెనినిజానికి పూర్తిగా అనుగుణంగా ఉన్నాయి.

అయితే, 1966లో మావో ప్రారంభించిన సాంస్కృతిక విప్లవం వైరుధ్యాలు, వర్గ పోరాటం గురించి ఆయన అంతకు ముందు ప్రకటించిన సిద్ధాంతాలతో ఏ విధంగానూ పొసగనివి. వాటికి తోడు చైనా కమ్యూనిస్టు పార్టీ ఆంతరంగిక పరిస్థితి పట్ల అంచనాల్లో కూడా మావో పొరపాట్లు చేశాడు. పార్టీలోకి కొందరు పెట్టుబడిదారీ మార్గీయులు చొరబడి పెట్టుబడిదారీ మార్గాన్ని ప్రబోధిస్తున్నారనీ, అలాంటి వారితో కూడిన పార్టీ కేంద్ర హెడ్క్వార్టర్లను బద్దలు కొట్టండని ఒక తిరుగుబాటుకు పిలుపునిచ్చాడు. దానితో, అదొక రాజకీయ విప్లవంగా, హింసాయుత పద్ధతుల్లో పది సంవత్సరాల సుదీర్ఘకాలం కొనసాగి పార్టీకీ, సోషలిజానికి తీవ్రమైన నష్టాలను కలిగించింది. మావో పెట్టుబడిదారీ మార్గీయులంటూ విమర్శించిన లీషావోషీ డెంగ్, సియావోపింగ్ తదితరులు కొత్తగా పార్టీలో ప్రవేశించిన వారేమీ కాదు. చైనా విప్లవంలో ప్రారంభం నుండి చివరి దాకా మావో తర్వాత అత్యంత కీలకమైన పాత్రను నిర్వహించిన వారు.

సాంస్కృతిక విప్లవ కాలంలో మావో అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాడు. 1969లో జరిగిన పార్టీ తొమ్మిదవ మహాసభలో లిన్–పియావోను తన తదనంతర వారసుడిగా ప్రకటించి దాన్ని ఏకంగా పార్టీ నిబంధనావళిలోనే చేర్పించాడు. ఆ తర్వాత కాలంలో ఆ లిన్ పియావోనే మావోను హత్య చేయడానికి కుట్ర పన్నాడు. అది బయట పడడంతో పారిపోయే ప్రయత్నంలో విమాన ప్రమాదంలో మరణించాడు. ఇక మావో భార్యకు విప్లవ కాలంలో నిర్వహించిన పాత్ర అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. ఆమె ఒక సినిమా నటి. మావో బలపర్చిన 'నలుగిరి ముఠా'లో మిగిలిన ముగ్గురికి కూడా విప్లవంలో పెద్ద పాత్ర ఏమీ లేదు (వారిలో ఒకరు ఆ సమయంలో పిల్లవాడు) పైవిధంగా అనుభవజ్ఞులైన, విప్లవంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన నాయకులను పక్కన బెట్టి, పదవి వ్యామోహపరులైన నలుగురి ముఠాను, లిన్ పియావోను బలపర్చాడు. సాంస్కృతిక విప్లవపు ఒక దశలో వారి పాత్రపై సందేహంలో పడి, ఎక్కడో ఉన్న డోంగ్ సియావో పింగ్‌కు పునరావాసం కల్పించి ప్రభుత్వంలో ఉప ప్రధానిని చేశాడు మావో. (ఆ సమయంలో చే ఎన్ లై అనారోగ్యం మూలంగా దాదాపు ప్రధానిగా బాధ్యతలు నిర్వహించాడు). కొంతకాలం తర్వాత మళ్లీ డెంగ్‌ను ఆ పదవి నుండి తప్పించాడు. సాంస్కృతిక విప్లవ కాలంలో ఇలాంటి అనేక పరిణామాలు జరిగాయి. సోవియట్ యూనియన్‌లోని కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వాలు పూర్తిగా గాడితప్పి పెట్టుబడిదారీ మార్గాన్ని చేపట్టడం మావోను ఆందోళనకు లోను చేశాయి. నలుగురి ముఠాకు, లిన్ పియావోకు పదవి వ్యామోహాలు, దురుద్దేశాలున్నట్లుగా స్పష్టంగా బయటపడింది. మావో మాత్రం చైనా సోవియట్ యూనియన్ లాగా తయారు కావద్దనే ఆలోచనలతోనే పై విధమైన తప్పులకు పాల్పడినాడు. ఆయన చివరి దశలో చేసిన పై తప్పులు అవి ఎంత తీవ్రమైనవయినా కూడా మావో తన జీవితకాలంలో నిర్వహించిన పాత్ర ప్రాధాన్యత పోల్చుకొన్నప్పుడు

అవి రెండవ స్థాయికి చెందినవే. కొన్ని తప్పులు చేసినా మావో ఒక గొప్ప మార్క్సిస్టు–లెనినిస్టు. మార్క్సిజాన్ని మరింత అభివృద్ధి చేయడంలో ఆయన ఎంతో సానుకూల పాత్రను నిర్వహించాడు. ప్రస్తుత చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కూడా మావోను చైనా విముక్తి ప్రధాత గానూ, డెంగ్‌ను నవ చైనా నిర్మాతగానూ భావిస్తున్నది.

కమ్యూన్‌లను రద్దు చేయడం సోషలిస్టు చర్య ఎట్లా అవుతుందని అది స్పష్టంగా పెట్టుబడిదారీ చర్యనే అని పాపిరెడ్డి గారు దాని పైన కొంత వివరించారు. 'శ్రమకు తగ్గ ఫలితం' అనేది సోషలిస్టు ఆర్థిక సూత్రం. కమ్యూన్‌ల నిర్మాణం ద్వారా ఆ సూత్రాన్ని పక్కన బెట్టి సర్వ సమానత్వం అమలు జరుపబడింది. ప్రజల్లో ఎక్కువ శ్రమ చేయగలిగిన వారు, ఎక్కువ శక్తి, సామర్థ్యాలున్న వారు అవి తక్కువ ఉన్నవారు ఉంటారు. వారు చేసే, చేయగలిగిన శ్రమకు తగిన విధంగా వారు ఫలితాన్ని పొందాల్సి ఉంటుంది. సోషలిజంలో వర్గాలు కొనసాగడానికి అది కూడా ఒక కారణం. సోషలిజం ప్రారంభంలోనే కమ్యూన్‌లను ఏర్పాటు చేయడమనేది సోషలిస్టు ఆర్థిక సూత్రానికి (శ్రమకు తగ్గ ఫలితం) అనుగుణంగా లేదు. అందువలన వాటిని తర్వాత కాలంలో రద్దు చేయడం అనేది సోషలిస్టు ఆర్థిక సూత్రాలకు అనుగుణంగా తీసుకొన్న చర్యనే అవుతుంది. కమ్యూనిజంలో మాత్రమే పూర్తి సమానత్వం వుంటుందనేది మార్క్సిజాన్ని నమ్మేవారందరికి తెలిసిన విషయమే. పాపిరెడ్డి గారు దాన్ని విస్మరించినారా? కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో మార్క్స్ ఎంగెల్స్ ఎప్పుడో చెప్పారనడం పై సమస్యకు సరైన సమాధానం కాదు.

'పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలు కూడా బ్రహ్మాండంగానే అభివృద్ధి చెందుతాయనీ, చైనాలో ఉత్పత్తి పెరుగుదలనే సోషలిజం అనడం సరైంది కాదం'టారు పాపిరెడ్డి గారు.

1949లో విప్లవం పూర్తయిన తర్వాత 30 సంవత్సరాలకు కూడా (1978లో) చైనాలో అత్యధిక భాగం ప్రజలు పేదలుగానే ఉన్నారు.

గత 40 సంవత్సరాల కాలంలో 75 కోట్ల మందికి పైగా ప్రజలను చైనా ప్రభుత్వం పేదరికం నుండి బయట పడవేసింది. సోషలిస్టు పంథాను అనుసరించడం ద్వారానే విద్య, వైద్యం తదితర ప్రజాజీవితానికి సంబంధించిన అన్ని రంగాల్లోనూ అద్భుతమైన ఫలితాలను సాధించింది. పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాల్లో అభివృద్ధి స్వభావం వేరు. తమ దేశాల్లోని కార్మికులతో పాటుగా, ప్రపంచంలోని అనేక దేశాల్లోని వనరులను, ప్రజల్లోని కార్మికులతో పాటుగా, ప్రపంచంలోని అనేక దేశాల్లోని వనరులను, ప్రజలే శ్రమశక్తిని కొల్లగొట్టడం ద్వారానే వారు ఆ అభివృద్ధిని సాధిస్తున్నారు. అనేక దశాబ్దాలు, శతాబ్దాలకు కూడా విస్తరించబడిన సుదీర్ఘకాలంలో జరిగిన అభివృద్ధి అది. చైనా అభివృద్ధి స్వభావం పూర్తిగా వేరు. అది ప్రధానంగా చైనా ప్రజల కష్టం ద్వారా సాధించబడుతున్న అభివృద్ధి. చైనాలో జరిగిన జరుగుతున్న అభివృద్ధిని, దాని ఫలితాలను భారతదేశం లాంటి దేశాలతో పోల్చుకున్నప్పుడే దాని విశిష్టత అర్థం అవుతుంది.

'ఉత్పత్తి శక్తులు బాగా అభివృద్ధి చెందాయని అందరికి తెలుసు. మరి ఇప్పుడు చైనా నాయకత్వం సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలను నెలకొల్పబోతున్నదా' అని పాపిరెడ్డి గారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు చైనాలో అమలులో ఉన్నవి మౌలికంగా సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలే. వాటికి లోబడి, వాటికి అనుబంధంగానే వ్యక్తిగత ఉత్పత్తి విధానాన్ని అనుమతించడం జరుగుతన్నదనే విషయాన్ని పాపిరెడ్డిగారు గుర్తించడం లేదు. అవి మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలుగానే వారు భావిస్తున్నారు. సమస్య మూలాలు ఇక్కడ ఉన్నాయి. సోషలిజం సిద్ధాంతం, ఆచరణలో మార్క్స్ తర్వాత లెనిన్ కాలంలో ఆ తర్వాత చైనాలో వచ్చిన మార్పు, అభివృద్ధిని వారు గుర్తించదల్చుకోలేదు. ఇంతకుముందే వివరించి నట్లు విభేదాలకు మూలాలు ఇక్కడ సిద్ధాంత స్థాయిలోనే ఉన్నాయి.

ఇక చివరగా చైనా పెట్టుబడిదారీ దేశంగానే కాకుండా అది ఒక సామ్రాజ్యవాద దేశంగా కూడా మారిపోయిందనే పాపిరెడ్డి గారి విమర్శ పైన కొంత వివరిస్తాను. అది నిరాధారమైన విమర్శ అని కింది వివరణ స్పష్టం చేస్తుంది.

1. చైనా గత 70 సంవత్సరాల కాలంలో, గతంలో సోవియట్ యూనియన్ లాగా ఏ దేశంపైనా కూడా దురాక్రమణకు పాల్పడలేదు.

2. తనకు పొరుగున ఉన్న దేశాలతో ఉన్న సరిహద్దు, ఇతర సమస్యల్లోను అత్యధిక భాగాన్ని చర్చల ద్వారా, శాంతియుతంగా పరిష్కరించుకొన్నది.

3. చైనా ఏ దేశం పైనా కూడా ఏకపక్షంగా అసమాన ఒప్పందాలను రుద్దలేదు. బాండుంగ్ సమావేశంలో రూపొందించబడిన పంచశీల సూత్రాల ప్రాతిపదికపైననే ప్రపంచంలోని అత్యధిక దేశాలతో స్నేహ, సహకార సంబంధాలను నెలకొల్పుకున్నది. సామ్రాజ్యవాద, అగ్రరాజ్యాల తోనూ కూడా సాధారణ దౌత్య సంబంధాలను కొనసాగిస్తున్నది.

4. ప్రపంచంలో యుద్ధాలను నివారించడానికి, ప్రపంచంలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పడానికి చైనా తన వంతు కృషిని చిత్తశుద్ధితో కొనసాగిస్తున్నది. అమెరికా – ఉత్తర కొరియాల మధ్య ఇటీవల జరిగిన చర్చల్లో చైనా చొరవ, పాత్ర అందరూ గుర్తిస్తున్నదే. ఇటీవల భారత–పాకిస్థాన్ దేశాల మధ్య ఏర్పడిన ఉద్రిక్తలను తగ్గించడానికి చైనా తటస్థ వైఖరితో చేసిన, చేస్తున్న ప్రయత్నాలు కూడా అందరి దృష్టిలోకి వచ్చినవే.

5. చైనా ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ ఇప్పుడే కాదు ఇక ముందు కూడా ఆధిపత్యాన్ని కోరుకోదని చైనా కమ్యూనిస్టు పార్టీ, అక్కడి ప్రభుత్వాలు పదే పదే ప్రకటిస్తున్నాయి.

6. చైనా సైన్యాలు చైనా బయట ఏ దేశంలోనూ లేవు. (పాకిస్థాన్ గుండా నిర్మిస్తున్న కారిడార్ నిర్మాణాన్ని టెర్రరిస్టుల దాడి నుండి కాపాడటానికి మాత్రమే పాకిస్థాన్‌లో అవి ఉన్నాయి తప్ప మరే దేశంలోనూ లేవు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో తప్ప.)

7. అగ్రరాజ్యాల ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా బహుళ ధృవ (మల్టీ పోలార్) ప్రపంచం ఏర్పాటు కోసం చైనా కృషి చేస్తున్నది. బ్రిక్స్, ఎస్‌సిఒ, బిఎఫ్ఎ తదితర ప్రాంతీయ, అంతర్జాతీయ కూటముల ద్వారా ప్రపంచంపై అమెరికా ఆధిపత్య విధానాలను అడ్డుకోవడానికి అన్ని విధాలా చైనా తన శాయశక్తుల కృషి చేస్తున్నది.

8. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచంలోని ఇతర దేశాలతో కలిసి పారిస్ ఒప్పందం అమలు కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది.

9. ఒక సోషలిస్టు దేశంగా మూడవ ప్రపంచ దేశాలకు ముఖ్యంగా బాగా వెనకబడిన ఆఫ్రికన్ దేశాలకు తనవంతు సహాయాన్ని అందిస్తున్నది.

10. తమ దేశంలో ఇతరులు పెడుతున్న పెట్టుబడుల విషయంలో గానీ, తాము ఇతర దేశాల్లో పెట్టున్న పెట్టుబడుల విషయంలో కానీ చైనా పరస్పర ప్రయోజన్, సమానత్వం అనే సూత్రాల ప్రకారమే జరుగుతున్నది.

11. తమ దేశంలో ఒక భాగమైన తైవాన్‌ను యుద్ధం ద్వారా కాకుండా శాంతియుతంగా, చర్చల ద్వారానే పరిష్కరించుకోవడానికి ఇప్పటిదాకా ప్రయత్నిస్తున్నది. (దాని కోసం ఒక దేశం – రెండు వ్యవస్థలు అనే రాజీ సూత్రాన్ని కూడా ముందు పెట్టున్నది.)

వీటికి మరికొన్ని కలుపవచ్చును కూడా. చైనా పైన లోతైన చర్చకు, పరస్పర విరుద్ధమైన, భిన్నమైన అభిప్రాయాలను ప్రకటించడానికి అవకాశం కల్పిస్తున్న వీక్షణం నిర్వాహకులకు అభివందనాలు. వీ

సయ్యద్ సలీముద్దీన్ మృతి

టిఎన్‌జిఒ మాజీ రాష్ట్ర నేత సయ్యద్ సలీముద్దీన్ మార్చ్ 7న గుండెపోటుతో మరణించారు. ఆయన అర్థ గణాంక శాఖలో కింది స్థాయి నుండి మొదలై అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ పొందారు. సలీముద్దీన్ ఉద్యోగుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేశారు. టిఎన్‌జిఒ సంఘంలో, అర్థగణాంకశాఖ టెస్సా వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉద్యోగ సంఘాల నాయకుడిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన అనేక నివేదికల్లో శాస్త్రీయ అవగాహనతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపారు. తెలంగాణ ఉద్యమంలో, ఉద్యోగుల హక్కుల సాధన ఉద్యమంలో అంకిత భావంతో పనిచేశారు.

రుణాల పేరుతో మోసం

రైతులకు ఇచ్చే రుణాల మంజూరులో కెనరా బ్యాంకు అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్‌లోని హైదర్‌గూడ బ్యాంకు సర్కిల్ కార్యాలయం ముందు రైతులు మార్చ్ 18న ధర్నా చేశారు. తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరాం, ప్రజాసంఘాల నేతలు రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోదండరాం, మానవ హక్కుల వేదిక జీవన్‌కుమార్ మాట్లాడుతూ నేషనల్ హార్టికల్చర్ బోర్డు రైతుల కోసం పాలీ హౌజ్‌లు నిర్మించేందుకు అనుమతిచ్చిందని రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన రైతులు రుణాలు తీసుకున్నారని తెలిపారు. రుణాల మంజూరు విషయంలో కెనరా బ్యాంకు అధికారులు మధ్య దళారులతో కుమ్మక్కై రైతులను మోసం చేశారన్నారు. రుణంగా చూపిస్తున్న మొత్తంలో సగం వరకు కాజేశారని ఆరోపించారు. ఇప్పటికైనా కెనరా బ్యాంకు అధికారుల మోసాలపై విచారణ చేపట్టాలన్నారు.

పోలీసుల కాల్పుల్లో ఇద్దరు గిరిజనుల మృతి

విశాఖ ఏజెన్సీలోని పాడేరు-పెదబయలు మండలాల సరిహద్దు ప్రాంతంలో మార్చ్ 16న మవోయిస్టుల గాలింపు కోసం వెళ్లిన పోలీసులకు అడవి జంతువుల వేటకు వెళ్లిన గిరిజనులు తారసపడ్డారు. ఎవరని ప్రశ్నించడంతో భయంతో పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు మావోయిస్టులుగా భావించి గిరిజనులపై కాల్పులు జరపడంతో వారు మృతిచెందారు. గిరిజనులను కాల్చిచంపడం దారుణమని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, కాల్పులు జరిపిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిజనిర్ధారణ చేసిన పౌరహక్కుల నాయకులు ఆదివాసులను కాల్చిచంపిన పోలీసులపై హత్య కేసు నమోదు చేసి, న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మార్చ్ 23న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.

న్యూడెమోక్రసీ నాయకులు రమేష్ మృతి

సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు బచ్చల రమేష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ హాస్పత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించడంతో రాజమండ్రిలోని పార్టీ కార్యాలయంలో మార్చి 17న మృతి చెందారు. రమేష్ వరంగల్ జిల్లా పందెం గ్రామంలో ఆదివాసీ పేదరైతు కుటుంబంలో జన్మించారు. 1971 ప్రాంతంలో వరంగల్ జిల్లాలో అమాయకులైన ఆదివాసీల మీద దాడిచేసి చిత్రహింసలకు గురిచేస్తున్న పోలీసులపై పోరాడారు. 1972లో రహస్య జీవితంలోకి వెళ్లారు. 37 సంవత్సరాలుగా అజ్ఞాత వాసంలో ఉండి ఆదివాసులకు భూమి, నివాస హక్కుల కోసం పోరాడారు.

మూలధ్వని వాయిద్యాల సమ్మేళనం

తెలంగాణ రచయితల వేదిక, సంఘటిత వేదిక, గుంజాల గోండి అధ్యయన వేదిక ఆధ్వర్యంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తెలుగు, ఇంగ్లీష్, జర్నలిజం, సోషాలజీ విభాగాల సహకారంతో సంగీతానికి సమ్మేళనమైన 'మూలధ్వని' కార్యక్రమం మార్చ్ 17, 18 తేదీలలో ఓయులోని ఠాగూరు ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రీక్ పరిశోధకుడు డేనియల్ కాన్‌స్టాంటెన్ మాట్లాడుతూ ఒకే వేదికపై విభిన్న వాయిద్యాలతో ప్రదర్శన ఇవ్వడం అపూర్వం, అమోఘమని, అలాగే ఒకేసారి ఒకే వేదికపైన 170 మంది కళాకారులు తమ కళను ప్రదర్శించడం అద్భుతమన్నారు. ప్రాచీన సంగీత వాయిద్యాలను కాపాడుకోవాలని ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర ఎస్ చౌహాన్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి మూలధ్వని డైరెక్టర్ జయదీర్ తిరుమలరావు మాట్లాడుతూ సంగీతానికి అంటరానితనం, వెనుకబాటుతనం ఉన్నాయన్నారు. ఒకే వేదికపై కళాకారుల నృత్యం, డప్పు వాయిద్యాలతో ఒకే రాగం, ఒకే తాళంతో 170 మంది కళాకారులు ప్రదర్శన ఇచ్చారు.

తెనాలి అవగాహన సాంస్కృతిక సంస్థ మహాసభ

గుంటూరు జిల్లా తెనాలిలో 'తెనాలి అవగాహన సాంస్కృతిక సంస్థ' ఆధ్వర్యంలో కామ్రేడ్ భగత్‌సింగ్ 88వ వర్ధంతి సందర్భంగా మార్చ్ 23న సభ జరిగింది. ఈ సభలో పి. కృష్ణమూర్తి రచించిన భగత్‌సింగ్ పై వ్యాసం, గేయం వినిపించాడు. అలాగే జి. కోటేశ్వరరావు రచించిన పాటవౌలె వెలుగెత్తవలె, గొంతెత్తవలె గేయాన్ని పాడారు. ఈ సభలో పాల్గొన్న వక్తలు భగత్‌సింగ్ జీవితం గురించి, వారి త్యాగం గురించి కొనియాడారు. అనేక మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

పార్లమెంట్ ఎన్నికల వేదికపై ఎర్రజొన్న పసుపు రైతుల నిరసన

నిజామాబాద్‌లోని లోక్‌సభ స్థానానికి ఆర్మూర్, కొరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లోని ఎర్రజొన్న, పసుపు రైతులు 245 మంది నామినేషన్ దాఖలు చేశారు. గత రెండు నెలలుగా రైతులు గిట్టుబాటు ధరల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తూ వచ్చారు. అయినా ప్రభుత్వం స్పంధించకపోవడంతో పార్లమెంట్ ఎన్నికల పోటీకోసం మార్చ్ 25 నామినేషన్ వేసి తమ నిరసనను వ్యక్తంచేశారు. గతంలో నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ 1996లో నల్గొండ లోక్‌సభ స్థానానికి 480 మంది నామినేషన్ దాఖలు చేసి చివరి వరకు పోటీలో నిలిచి తమ నిరసనను దేశానికి తెలియజేశారు.

ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా కాగడాల ప్రదర్శన

హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 88వ వర్ధంతి సందర్భంగా మార్చ్ 23న హిందూ ఫాసిస్టు దాడి వ్యతిరేక వేదిక; డి.వై.ఎఫ్.ఐ; ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద కాగడాల ప్రదర్శన చేశారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో మతోన్మాదం, పితృస్వామ్యం, కులతత్వం, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. వారు చిరుప్రాయంలోనే దేశం ప్రజల కోసం, భవిష్యత్ తరాలకోసం ఉరికంబమెక్కారని అన్నారు. వారి త్యాగాల ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యాన్ని అధికారంలోకి వచ్చిన పాలకులు వారి ఆశయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు.

వరవరరావు విడుదల కోసం సుప్రీంకోర్టు సిజెకు లేఖ

భీమా కోరేగాం కేసులో అరెస్టయిన విరసం రచయిత వరవరరావు విడుదల కోరుతూ ఆయన సహచరి హేమలత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతిని మార్చ్ 26న హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ భీమా కోరేగాం హింసాకాండ కేసును నేరపూరిత కుట్ర కేసుగా, అనంతరం చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కేసుగా మార్చాయన్నారు. అలాగే ప్రజల హక్కుల కోసం పోరాడే వారిపై పాలక వర్గాలు చట్టాలను దుర్వినియోగం చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త చుక్కా రామయ్య, ప్రొ. హరగోపాల్, వసంత కన్నాబిరాన్, సీనియర్ పాత్రికేయులైన పొత్తూరి వెంకటేశ్వరరావు, దేవిప్రియ, దేవులపల్లి అమర్‌లతో పాటు ఇతరులు పాల్గొన్నారు. వీ

లోక్‌సభ ఎన్నికలు

పదిహేడో లోక్‌సభకు ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) నిర్ణయించింది. మే 23న దేశవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ఉంటుందని ప్రకటించింది. ఈ మేరకు మార్చి 10న ఎన్నికల కమిషనర్లు అశోక్ లావాసా, సుశీల్ చంద్రలతో కలసి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోడా నోటిఫికేషన్ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికలతో పాటు, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించడంలేదని తెలిపింది.

గోవా ముఖ్యమంత్రిగా సావంత్

గోవా ముఖ్యమంత్రి పారికర్ మరణించడంతో కొత్త ముఖ్యమంత్రిగా బిజెపి ఎంఎల్ఏ ప్రమోద్ సావంత్(46) మార్చి 19న అర్ధరాత్రి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో సావంత్‌తో గవర్నర్ మృదులాసిన్హా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు 11 మంది మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

సుప్రీం కోర్టు తీర్పుకు నిరసనగా బంద్

ఆదివాసీలను అడవుల నుంచి తరలించాలని ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆదివాసి, దళిత సంఘాలు మార్చి 5న బంద్ నిర్వహించాయి. ఫిబ్రవరి 13 నాటి తీర్పుపై అనంతరం సుప్రీంకోర్టు స్టే విధించింది. అటవీ హక్కుల చట్టాన్ని పునరుద్ధరించాలని ఆదివాసీలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, కాలేజీలు, వర్సిటీలు, ఇతర ప్రభుత్వ సంస్థల ఉద్యోగ నియామకాల్లో 13 పాయింట్ల రోస్టర్ వ్యవస్థను రద్దు చేయాలనీ కోరారు. ఆదివాసీల అటవీ హక్కులను పరిరక్షించేలా ఆర్డినెన్స్ తీసుకురావాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేయగా, 13 పాయింట్ల రోస్టర్ విధానానికి వ్యతిరేకంగా ఆర్డినెన్స్ ప్రవేశపెట్టాలని దళిత సంఘాలు కోరాయి.

ఆదివాసీల ఎన్‌కౌంటర్‌పై బస్తర్‌లో ఆందోళన

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా భైరాంగఢ్ తెహసిల్, తాడిపెల్ల గ్రామంలో ఫిబ్రవరి 7న ఎన్‌కౌంటర్‌లో మరణించింది ఆదివాసీలని, ప్రభుత్వం చెప్పే అబద్ధాలని ఎత్తిచూపి బాధితులకు న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తూ బస్తర్ రీజియన్ గ్రామాల ప్రజలు మార్చి 5న ఆందోళన చేశారు. గ్రామంలో గుమిగూడిన ఆదివాసీలపై పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, ఇందులో ఒక చిన్నారి కూడా మరణించాడని ఆదివాసీ కార్యకర్త లింగారం కొడోపి తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని చింతల్‌నార్–జేగురుగుడా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మార్చి 26న జరిగిన సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాల కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు.

జెకెఎల్ఎఫ్‌పై నిషేధం

జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జెకెఎల్ఎఫ్)ను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం, ఉగ్రవాదులతో సన్నిహితంగా ఉంటున్నారనే ఆరోపణలపై పార్టీని ఐదేండ్ల పాటు నిషేధిస్తున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రకటించింది. దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని, నాయకత్వం కూడా ఉగ్రవాదం వైపు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోందని తెలిపింది. 'చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం–1967లోని సెక్షన్ 3(1) కింద జెకెఎల్ఎఫ్ పై ప్రభుత్వం నిషేధం విధించింది. అంతకు నెల ముందు ఫిబ్రవరి 22న ఆ పార్టీ నేత యాసిన్ మాలిక్‌ను పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ కింద అరెస్టు చేశారు.

తొలి లోక్‌పాల్

భారతదేశంలో కొత్త రాజ్యాంగ వ్యవస్థ తొలి లోక్‌పాల్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ మార్చి 23న ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జస్టిస్ పినాకి చంద్రఘోష్‌చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ లోక్‌పాల్‌లో జ్యుడిషల్ సభ్యులుగా జస్టిస్ దిలీప్ బాబా సాహెబ్ భోసలే, జస్టిస్ ప్రదీప్‌కుమార్ మొహంతి, జస్టిస్ అభిలాష కుమారి, జస్టిస్ అజయ్‌కుమార్ త్రిపాఠీ, నాన్ జ్యుడిషియల్ సభ్యులుగా దినేష్‌కుమార్ జైన్, అర్చనా రామసుందరం, మహేందర్ సింగ్, ఇంద్రజిత్ ప్రసాద్ గౌతం నియమితులయ్యారు. లోక్‌పాల్ కేంద్ర ప్రభుత్వంలోని ప్రజాసేవకులపై వచ్చే అవినీతి ఆరోపణలపై విచారణ జరుపుతుంది.

సంఝౌతా కేసులో అసీమానంద్ నిర్దోషి

సంఝౌతా ఎక్స్‌ప్రెస్ బాంబు పేలుడు కేసులో స్వామి అసీమానంద్‌తో పాటు మరో ముగ్గురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ పంచకులలోని ప్రత్యేక కోర్టు మార్చి 20న తీర్పు ఇచ్చింది. 2007 ఫిబ్రవరి 18 రాత్రి భారత్–పాకిస్తాన్‌ల మధ్య నడిచే సంఝౌతా ఎక్స్‌ప్రెస్ హరియాణలోని పానిపత్ వద్ద రెండు బోగీల్లో శక్తిమంతమైన బాంబులు పేలడంతో 68 మంది మరణించారు. ఈ కేసులో నిందితులైన నవకుమార్ సర్కార్ అలియాస్ స్వామి అసీమానంద్, లోకేశ్ శర్మ, కమల్ చౌహాన్, రాజిందర్ చౌదరీలను నిర్దోషులుగా ప్రకటిస్తూ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జడ్జి జగ్దీప్ సింగ్ తీర్పు ఇచ్చారు. కాగా, సంఝౌతా కేసులో అసీమానంద్ నిర్దోషిగా బయటపడడంతో ఆయనకు అన్ని కేసుల నుంచి విముక్తి లభించినట్లే. గతంలో హైదరాబాద్ మక్కా మసీదు బాంబు పేలుడు, అజ్మీర్ దర్గా బాంబు పేలుడు కేసుల్లోనూ స్వామిని కోర్టులు నిర్దోషిగా ప్రకటించాయి.

భీం ఆర్మీ నాయకుని అరెస్ట్

దళిత నాయకుడు, భీం ఆర్మీ నేత చంద్రశేఖర్ ఆజాద్‌ను కాశీంపుర గ్రామంలో పోలీసులు అరెస్టు చేశారు. మార్చి 15న బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి కార్యక్రమంలో పాల్గొనడానికి ఆయన వెళ్తున్నప్పుడు అరెస్టు చేశారు. ఆజాద్ అరెస్టుకు నిరసనగా భీం ఆర్మీ కార్యకర్తలు ముజఫర్‌నగర్ – సాహరన్‌పూర్ హైవేపై పోలీసు వాహనాలను ఆపి ఆందోళన చేసారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంతకు ముందు ఆజాద్ ఎన్నికలలో నరేంద్ర మోదీ, స్మృతి ఇరానీలకు వ్యతిరేకంగా పోటీ చేస్తున్న వారికి తన మద్దతు తెలిపాడు. అలాగే సమాజ్‌వాదీ పార్టీకి కూడా ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్‌లపై స్పష్టత ఇవ్వనంత వరకు తన మద్దతు ఉండదని తెలిపాడు.

దళితుల, మైనారిటీల ఓట్లు గల్లంతు

బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల, ముస్లింల ఓట్లను గల్లంతు చేసిందని బొంబై హైకోర్టు మాజీ జడ్జి కొల్సే పాటిల్ ఆరోపించారు. మొత్తం 39,27,882 మంది పౌరుల పేర్లు ఓటర్ల లిస్టులో లేవని, ఇందులో 17 లక్షల దళితులవి, 10 లక్షల ముస్లింలవి అని తెలిపారు. బిజెపి పార్టీ దురుద్దేశపూరితంగానే ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని అన్నారు.

జర్నలిస్టుల అరెస్టు, హత్యలు

ది షిల్లాంగ్ టైమ్స్ ఎడిటర్ పాట్రిక ముఖీమ్, పబ్లిషర్ శోభా చౌదరీని కోర్టు ధిక్కారణ (కాంటెంప్ట్ ఆఫ్ కోర్టు) కింద కేసు నమోదు చేశారు. రిటైర్డ్ జడ్జీలు, వారి కుటుంబ సభ్యులకు ఇచ్చే ప్రోత్సాహకాలు, సదుపాయాలపై ఆమె షిల్లాంగ్ టైమ్స్‌లో రెండు వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలు కోర్టు ధిక్కారణ కిందికి వస్తాయంటూ మేఘాలయ హైకోర్టు న్యాయమూర్తులు చీఫ్ జస్టిస్ ఎం.వై. మీర్, జస్టిస్ ఎస్.ఆర్. సేన్ కు నోటీసులు పంపించారు. అహ్మదాబాద్‌కు చెందిన ఆర్‌టిఐ కార్యకర్త, టివి9 కాపీ ఎడిటర్ చిరాగ్ పటేల్ మార్చి 16న గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఆయన కాలిపోయిన శరీరం అహ్మదాబాద్‌లోని శివారుల్లో లభించింది. ఆయన తరచుగా స్థానిక అభివృద్ధి పథకాల కింద పార్లమెంట్ సభ్యులకు వచ్చే నిధుల ఉపయోగం గురించి సమాచారం సేకరించడం కోసం ఆర్‌టిఐ చట్టం కింద అర్జీలు పెట్టేవారు. వీ

ఇజ్రాయెల్ ప్రధానిపై అభిశంసన

ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహుపై అటార్నీ జనరల్ అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మూడు కేసుల్లో ముడుపులు తీసుకున్నందుకు, అవకతవకలకు పాల్పడినందుకు, విశ్వాస ఉల్లంఘనలకు పాల్పడినందుకు గాను ఆయనపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇజ్రాయెల్ దేశ ప్రధాని ఇలా అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కోవడం ఇదే మొదటిసారి.

క్యూబా రాజ్యాంగానికి ఆమోదం

క్యూబా కొత్త రాజ్యాంగానికి ప్రజలు ఆమోదం తెలిపారు. ఫిబ్రవరి 24న కొత్త రాజ్యాంగంపై ఓటింగ్ జరపగా 78 లక్షల మంది ఓటు వేశారు. ఇందులో 68.16 లక్షల (91 శాతం) మంది కొత్త రాజ్యాంగానికి తమ మద్దతును తెలిపారు. 150 సంవత్సరాల పోరాట చరిత్ర కలిగిన క్యూబా అంతర్జాతీయ ఒత్తిళ్లకు, సామ్రాజ్యవాదానికి లొంగిపోవడానికి ఏ మాత్రం సిద్ధంగా లేమని తెలిపారు. ఐక్యత, చైతన్యం, చట్టబద్ధమైన సంస్కృతి, విప్లవ పునరుద్ధాటన, రాజ్యాంగ సంస్కరణల క్రమంలో నెలకొని ఉన్న ప్రతి ఒక్క అంశం, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉండేలా చట్టాలను సరిదిద్దేందుకు ప్రజలు తమ ఆమోదాన్ని తెలిపారు.

కెనడాలో రాజకీయ సంక్షోభం

కెనడాలో పెరిగిపోతున్న రాజకీయ కుంభకోణాలకు నిరసనగా క్యాబినేట్ మంత్రులు రాజీనామా చేశారు. కెనడాకు చెందిన బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా ఉన్న క్రిమినల్ కేసును నీరుగార్చేందుకు లిబియా ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని ఆరోపిస్తూ ట్రెజరీ బోర్డు అధ్యక్ష పదవికి జేన్ ఫిల్‌పాట్ మార్చ్ 4న రాజీనామా చేశారు. ఇదే విషయంలో ఇంతకు ముందు న్యాయశాఖ మంత్రిగా ఉన్న విల్సన్ రేబోల్డ్ కూడా తన పదవికి రాజీనామా చేశారు.

ఇథియోపియాలో విమాన ప్రమాదం

ఇథియోపియాలో విమాన ప్రమాదం జరిగింది. మార్చ్ 10న రాజధాని అడీస్ అబాబా నుంచి కెన్యా రాజధానికి నైరోబీకి బయలుదేరిన ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్–737 ప్యాసింజర్ విమానం 149 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బందితో బయలుదేరింది. అడీస్ అబాబా విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే 50 కిలోమీటర్ల దూరంలో బిషోఫ్టు ప్రాంతంలో కూలిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, సిబ్బంది మొత్తం 157 మంది చనిపోయారు.

పెరూ ప్రధానిగా సాల్వడార్ డెల్

పెరూ ప్రధానమంత్రిగా సాల్వడార్ డెల్ సోలార్ ఎన్నికయ్యారు. మార్చ్ 11న అధ్యక్షుడు మార్టిన్ విజ్కార్ ఆయనతో ప్రమాణం చేయించారు. సాల్వడార్ డెల్ న్యాయవాదిగా పనిచేసి ప్రజలకు సేవలందించారు. 2016–17లో పెరూ సాంస్కృతిక మంత్రిగా ఉన్నారు. 2016లో నాటి అధ్యక్షుడు అల్బెర్టో ఫ్యుజియామా హక్కుల ఉల్లంఘనకు పాల్పడి నరమేధం సృష్టించాడు. ఆయనకు ఉరిశిక్ష విధించాలని డెల్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతతో మంత్రి పదవికి రాజీనామా చేశారు.

థెరెస్సా మే ముసాయిదా తిరస్కరణ

యూరోపియన్ యూనియన్ (ఇయు) నుంచి మార్చ్ 29 లోపు బ్రిటన్ వైదొలగాల్సి ఉంది (బ్రెగ్జిట్). అయితే ఇందుకు సంబంధించి బ్రిటన్ ప్రధాని థెరెసా మే రూపొందించిన ముసాయిదాను మార్చ్ 12న బ్రిటన్ పార్లమెంట్ తిరస్కరించింది. ఇయు సభ్య దేశమైన ఐర్లాండ్‌కు, బ్రిటన్‌లో ఒక భాగమైన ఉత్తర ఐర్లాండ్‌ల మధ్య భౌతిక సరిహద్దుల లేకుండా నివారించే ఏర్పాట్ల విషయంలో ఇయుతో చర్చలు జరిపి చట్టబద్ధంగా ఉండే హామీలు పొందిన థెరెసా మె ఈ ఒప్పందానికి మద్దతు తెలపాలని పార్లమెంట్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఓటింగ్‌లో అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎంపిలు 75 మందితో సహా మొత్తం 391 మంది ఒప్పందానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. అనుకూలంగా 242 ఓట్లు వచ్చాయి.

ఫ్రాన్స్‌లో ఆందోళనల నిరోధక బిల్లు

ఫ్రాన్స్ ప్రభుత్వం ఆందోళనలను నిరోధించేందుకు బిల్లును ప్రవేశపెట్టింది. మార్చ్ 13న సుదీర్ఘ చర్చల అనంతరం ఈ బిల్లుపై ఓటింగ్ జరగగా 215–210 ఓట్ల తేడాతో పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ఆందోళనలను నియంత్రించడానికి పోలీసులకు విస్తృతాధికారాలు కల్పిస్తుంది. ఈ బిల్లు పౌరహక్కులను కాలరాస్తుందని హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ బిల్లును 'లిబర్టి సైడ్' (హక్కులను కాలరాసేది) అని ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. గత కొద్ది నెలలుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఎల్లో వెస్ట్స్' నిరసన ప్రదర్శన కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ బిల్లుకు చట్టరూపం కల్పించడంతో ఇది మరింత వివాదంగా మారింది. అయితే ఇది చట్టపరిధిలో ఆందోళన కొనసాగించేవారికి, హింసాత్మక దాడులకు పాల్పడే వారికి మధ్య తేడాను గుర్తిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. హక్కుల సంఘాలు, ఇతర వామపక్షాలు పౌరుల స్వేచ్ఛకు ఈ బిల్లు భంగం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశార.

న్యూజిలాండ్ మసీదులో కాల్పులు

న్యూజిలాండ్‌లోని క్రైస్టచర్చ్ నగరంలోని రెండు మసీదుల్లో కాల్పులు జరిగాయి. మార్చ్ 15న శుక్రవారం నమాజ్ చేసేందుకు వచ్చిన వారిని లక్ష్యంగా చేసుకొని ఒక దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో 51 మంది మరణించారు. మరో యాభై మందికి పైగా గాయపడ్డారు. జాత్యహంకారి అయిన ఆస్ట్రేలియాకు చెందిన బ్రెంటెన్ హారిసన్ ఈ కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల నేపథ్యంలో ప్రధాని జసిండా ఆర్డెర్న్ న్యూజిలాండ్‌లో తుపాకుల అమ్మకాలపై ఆంక్షలు జారీచేసింది. బహిరంగ మార్కెట్లో తుపాకుల అమ్మకాలపై పూర్తి నిషేధాన్ని విధించింది.

ఆఫ్రికాలో వరదల బీభత్సం

ఆఫ్రికాలోని మొజాంబిక్, జింబాబ్వే, మలావి దేశాలలో ఇదాయ్ తుఫాను బీభత్సం సృష్టించింది. మార్చ్ రెండవ వారంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మూడు దేశాల్లో దాదాపు వెయ్యి మందికి పైగా మరణించారు. వందలాది మంది గల్లంతయ్యారు. దాదాపు పదిహేను లక్షల మంది నిర్వాసితులయ్యారు. ఇండ్లు, స్కూళ్లు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రజలు కొండలు, పర్వత ప్రాంతాలకు చేరుకున్నారు.

హైతీలో ఆందోళనలు

హైతీలో తీవ్రస్థాయిలో సామాజిక, రాజకీయ సంక్షోభాలు నెలకొన్నాయి. హైతీ అధ్యక్షుడు జోవెనెల్ మోయిన్ తీవ్ర అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నాడు. దేశ ఇంధన, విద్య, మౌలిక సదుపాయాలు, ఆరోగ్య అవసరాలను చూసే ఇంధన సహకార సంస్థ పెట్రోకరైబ్ నిధులను దుర్వినియోగం చేశాడని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మార్చ్ 7న వేలాది మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. అధ్యక్షుడు మోయిస్ తక్షణమే రాజీనామా చేయాలని, తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నేషనల్ కాన్ఫరెన్స్ స్థాపించాలని, మౌలిక ఉత్పత్తుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు ఆందోళన చేశారు. ఆందోళనల నేపథ్యంలో అధ్యక్షుడు మోయిస్ చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించు కుందామని, చర్చల క్రమాన్ని కొనసాగించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తానని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వంతో చర్చలు జరిపేది లేదని, ఆందోళనలు ఇంకా తీవ్రతరం చేస్తామని ప్రతిపక్షాలు తెలిపాయి. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(ఫిబ్రవరి 1 నుండి ఫిబ్రవరి 28, 2019 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (935), ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో (738) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1673)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	2	–	17	19	9	12	4	3	3	2	1	1	3	32	29	–	–	–	3	1
హైదరాబాద్	–	–	–	11	12	3	7	3	3	6	6	9	2	4	22	12	–	–	–	–	–
కరీంనగర్	–	3	1	8	7	4	3	1	2	3	2	4	3	6	23	26	–	–	–	–	2
ఖమ్మం	–	2	–	5	13	1	3	2	–	2	1	1	6	–	36	13	–	–	1	–	–
మహబూబ్‌నగర్	–	–	2	2	1	5	3	2	2	1	3	2	1	2	37	2	–	–	–	–	–
మెదక్	1	9	6	4	3	2	4	2	1	4	6	4	5	11	17	21	–	–	–	2	4
నల్గొండ	–	4	–	6	8	4	7	3	2	4	2	4	4	6	28	23	–	–	–	–	4
నిజామాబాద్	–	2	–	5	7	3	4	2	2	3	2	3	–	4	18	13	–	–	–	–	2
వరంగల్	–	2	–	3	2	3	6	–	3	4	1	3	2	9	14	19	–	–	–	2	1
వికారాబాద్	–	3	–	3	5	3	4	2	1	2	3	5	6	5	23	18	–	–	–	–	2
తెలంగాణ	**2**	**27**	**9**	**64**	**77**	**37**	**53**	**21**	**19**	**32**	**28**	**36**	**30**	**50**	**250**	**176**	**-**	**-**	**1**	**7**	**16**
అనంతపురం	–	4	–	15	17	1	2	1	1	1	2	1	7	5	24	2	–	–	–	–	–
చిత్తూరు	–	2	–	3	5	3	7	–	1	3	4	8	6	1	18	4	–	–	–	–	5
కడప	–	–	1	1	2	–	–	–	–	–	–	–	–	1	4	4	–	–	–	–	–
గుంటూరు	–	–	–	4	6	3	5	2	2	2	3	4	–	4	17	15	–	–	–	–	3
కృష్ణా	–	–	–	3	5	2	4	1	2	4	2	4	2	3	16	18	–	–	–	–	2
కర్నూలు	–	–	–	4	6	2	4	1	1	2	3	4	1	4	17	11	–	–	–	–	–
తూర్పు గోదావరి	–	1	–	2	7	2	3	–	2	4	–	–	2	–	31	13	1	–	–	–	–
ప్రకాశం	–	–	–	4	6	2	2	1	2	3	2	3	2	3	18	14	–	–	–	–	1
శ్రీకాకుళం											విపరాలు అందలేదు										
పశ్చిమ గోదావరి	–	1	–	3	4	2	3	1	1	2	3	2	–	2	15	11	–	–	–	–	–
నెల్లూరు	–	–	–	6	5	2	3	–	3	4	2	4	–	4	22	17	–	–	–	–	2
విజయనగరం	–	–	–	4	4	2	4	1	2	3	1	2	–	3	12	9	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	–	4	12	1	3	–	1	1	3	–	3	–	22	19	–	–	–	3	–
ఆంధ్రప్రదేశ్	**-**	**8**	**1**	**53**	**79**	**22**	**40**	**8**	**18**	**29**	**25**	**32**	**23**	**30**	**216**	**137**	**1**	**-**	**-**	**3**	**13**

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం


మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	నామ్‌దేవ్‌వాడ, నిజామాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	సుందరయ్య భవన్ నల్గొండ	...
నవ తెలంగాణ బుక్ హౌస్	జగ్‌జీవన్‌నగర్, న్యూ బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	బాప్టిస్ట్ చర్చ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, హనుమకొండ	...
నవ తెలంగాణ బుక్ హౌస్	పాత సిపిఐ (ఎం) ఆఫీస్, బాలాజీనగర్, ఖమ్మం	...
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్‌స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీథి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 213 - April 2019 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/3/2019 ● Postal Regn. No. HD/1100/2017-19

Date of Posting : 29th, 30th

కెవిఆర్, శారదాంబ స్మారక కమిటీ ప్రచురణలు



మానధనులు

హోవర్డ్ ఫాస్ట్ నవల


అనువాదం: **కెవిఆర్**

పేజీలు: 210

వెల: రు. 150

మా జ్ఞాపకాల్లో
కెవిఆర్

వకుళాభరణం లలిత
రామకృష్ణ



పేజీలు: 96

వెల: రు. 80

ప్రతులకు: **డా. ఎస్. రామకృష్ణ,** శాంతి నర్సింగ్ హోం, నిర్మలా కాన్వెంట్ ఎదురుగా,
పటమట, విజయవాడ – 520 010; ఫోన్: 98490 83137

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

Advt.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao